సకలతపస్సాధనల ఫలమే శ్రీసీతారామలక్ష్మణుల దర్శనము. వారి దర్శన ఫలస్వరూపమే నీ దర్శనము. ఈ ప్రయాగతో పాటు మేమును భాగ్యశాలురమైతిమి. భరతా! నీవు ధన్యుడవు. నీ కీర్తి ప్రభావముచే నీవు సమస్త జగత్తును జయించితివి." ఈ విధముగా పలికి మునీశ్వరుడు భరతప్రేమలో మగ్నుడాయెను. ముని వచనములను విని, సభాసదులెల్లరును ప్రసన్నచిత్తులైరి. 'బాగు,బాగు' అనుచు దేవతలు విరులవాన కురిసిరి. ఆకాశమునందును, ప్రయాగలోను 'ధన్యుడు, ధన్యుడు' అను మాటలను విని, భరతుడు అనురాగ మగ్నుడాయెను. (చౌ॥ 1-4)

అతని శరీరము పులకించెను. హృదయమున శ్రీ సీతారాములు నిలిచిరి. కమలముల వంటి నేత్రములు ఆనందాశ్రుపూర్ణములాయెను. మునులకు నమస్కరించి, భరతుడు గద్గదస్వరముతో పలికెను. (దో॥ 210)

"మునుల సమూహములో అదియును సర్వతీర్థరాజమైన ప్రయాగలో సత్యము మీద ప్రమాణము చేయుటగూడ ఒక మహాపాపము. ఇట్టి ప్రదేశములో అసత్యమాడినచో దానికి సమానమగు మహాపాపముగాని, నీచకృత్యముగాని మఱియొకటి ఉండదు. నేను విశుద్ధ భావముతో పల్కుచున్నాను. మీరు సర్వజ్ఞులు. శ్రీరామచంద్రుడు అంతర్యామి. అందఱిమనస్సులలోని భావములను గ్రహించువాడు. నా తల్లియైనకైకేయికృత్యములకును నాకు విచారము లేదు. లోకము నన్ను నీచునిగా భావించుననుదుఃఖముగూడ నాకు లేదు. పరలోకగతినిగూర్చిన భయముగూడ నాకులేదు. తండ్రిగారిమృత్యుశోకము గూడ లేదు. ఏలనన వారి కీర్తి పుణ్యములు విశ్వవ్యాప్తములు. శ్రీరామలక్ష్మణులవంటి అనుపమపుత్రరత్నములనుగన్న పుణ్యాత్ముడాయన. శ్రీరామచంద్రునివియోగబాధను భరింపలేక క్షణభంగురమైన పార్థివశరీరమును వదలెను. అట్టి మహా పురుషునకై విచారింపనేల? కాని శ్రీ సీతారామలక్ష్మణులు పాదరక్షలుగూడ లేకుండ ముని వేషములతో వనములలో సంచరించుటయే నాకు విచారమును కలిగించు విషయము. (చౌ॥ 1-4)

వారు అజినములను వల్కలములను ధరించి, కందమూలఫలములనుమాత్రమే భుజించుచు ఆకులలములే శయ్యగా భూమిపై పరుండి చెట్లక్రింద నివసించుచున్నారు. అనుక్షణము వారు శీతవర్షాతపవాతబాధలకు గురియగుచున్నారు. (దో॥ 211)

ఈ దుఃఖతాపము నిత్యము నా హృదయమును దహించివేయుచున్నది. పగలు ఆకలి వేయుటలేదు. రాత్రులయందు నిద్రపట్టుటలేదు. ఎంతగా గాలించినను ఈ భయంకర రోగమునకు ఔషధమే కన్పట్టుటలేదు. నా తల్లి చెడు ఆలోచనలే ఈ పాపకార్యములకు మూలములు. నాకు హితము చేయగోరి, ఆసాకుతో ఆమె ఈ దురాలోచనలను పెంచుకొనినది. నా తల్లి దురాలోచనయే ఈ అనర్థములకు మూలమైన ఒక వడ్రంగి. అతడు నా హితమనెడి 'బాడిస'ను చేసెను. దానితో కలహరూపమనెడి కొయ్యను సిద్ధపఱచి, దానిని 'శ్రీరామ వనవాసము' అను మంత్రమును పఠించుచు అయోధ్యలో నాటెను. (శత్రువులను రూపుమాపుటకై తాంత్రికులు 'శాతబడి' వంటి దుష్ట ప్రయోగములను జేసెదరు. ఈ సందర్భమున అట్టి దుష్ట ప్రయోగములను గూర్చి వామాచార ప్రయోగములను గూర్చి తులసీదాసు వ్రాయుచున్నాడు.) నాకొఱకే ఆమె ఈ కుతంత్రములను పన్ని జగత్తును ఛిన్నాభిన్నము చేసి, చెఱుపు చేసినది. శ్రీరామచంద్రుడు తిరిగివచ్చిననేగాని ఈ ఉపద్రవము చల్లారదు. అప్పుడే అయోధ్య నిలబడును. మఱియొక ఉపాయమేలేదు." భరతుని వచనములకు ముని సంతుష్టుడాయెను. అతనిని పెక్కు విధముల ప్రశంసించెను. భరద్వాజుడు పలికెను. "నాయనా! నీవింత ఎక్కువగా మథనపడవలదు. శ్రీరామచంద్రుని చరణములను దర్శించినంతనే నీ దుఃఖమంతయు చల్లారును. (చౌ॥ 1-4)

# భరతునకు భరద్వాజుని ఆతిథ్యము

ఈ విధముగా అనునయించి, ముని శ్రేష్ఠుడైన భరద్వాజుడు భరతునితో పలికెను. "ఇప్పుడు మీరు అందఱును మాకు ప్రియమైన అతిథులు. మేమిచ్చిన ఈ కందమూల ఫలములు, పూవులు దయతో స్వీకరింపుడు." (దో॥ 212)

ముని వచనములను విని, భరతుడు మనసులోనే అనుకొనెను. "అనవసరముగా ఈ సమస్య వచ్చి పడినది." కాని పెద్దల మాటలు శిరోధార్యములని తలచి, ఆయన పాదములకు నమస్కరించి, అంజలి ఘటించి పలికెను. "ప్రభూ! మీ ఆజ్ఞ శిరోధార్యము. దానిని పాలించుట నాకు పరమధర్మము." భరతుని మాట మునీశ్వరునకు మిక్కిలి ప్రియమును గూర్చెను. అతడు విశ్వాసపాత్రులైన సేవకులను శిష్యులను పిలిచి యిట్లు చెప్పెను. "భరతునకు ఆతిథ్యమును ఇయ్యవలెను. వెళ్ళి కందమూలఫలములను తీసికొని రండు." వారు చిత్తము అని తలలూపి, సంతోషముతో తమపనులను నిర్వర్తించుటకై వెళ్ళిరి. ముని తనమనస్సులో ఆలోచించెను. "నేనొక గొప్ప అతిథిని ఆహ్వానించినాను. అతిథి దేవుని ఔన్నత్య స్థితిని బట్టి అతనికి తగిన మర్యాదలను నెరపవలెను." ముని ఆలోచనలను గ్రహించి, కుబేరుని సేవకులైన ఋద్ధులు, అణిమాది-అష్ట సిద్ధులు ప్రత్యక్షమై "ప్రభూ! మాకు ఆజ్ఞను ఇండు." అని పలికిరి. (చౌ॥ 1-4)

మునివరుడు ప్రసన్నుడై పలికెను. "భరతుడును, అతని సోదరుడైన శత్రుఘ్నుడును వారి పరివారములును శ్రీరాముని విరహమువలన వ్యాకులపాటునకు లోనైరి. వారికి తగిన అతిథి సపర్యలు గావించి వారి శ్రమను తొలగింపుడు. (దో॥ 213)

ఋద్ధులు, సిద్ధులు ముని ఆజ్ఞను 'శిరోధార్యము' గానెంచి, తాము అదృష్టవంతులైనట్లు భావించుకొనిరి. వారు తమలో తాము ఇట్లనుకొనసాగిరి. "శ్రీరామచంద్రుని సోదరుడైన భరతుడు సాటిలేని అరుదైన అతిథి. మునిచరణములను పూజించి, ఈ రాజ సమూహమంతయు తృప్తి పడునట్లు మనము నేడు తగు ఏర్పాట్లు చేయవలెను." ఇట్లు అనుకొని దేవతల ప్రాసాదములను గూడ త్రోసి పుచ్చు గృహములను కల్పించిరి. వాటిలో అనేక భోగైశ్వర్య సామగ్రులను ఉంచిరి. వాటిని జూచి, దేవతలుగూడ వాటిని పొందుటకై ఉబలాటపడిరి. దాస దాసీలు అవసరములగు వస్తువులను అన్నింటిని ప్రసన్న చిత్తములతో సమకూర్చి, ఎవరేది కోరినను దానిని అందించుటకు సిద్ధముగా నిల్చిరి. స్వర్గములో స్వప్నములోగూడ చూడని సుఖములను సిద్ధులు క్షణములో సమకూర్చిరి. మొదట అయోధ్యావాసులందఱికిని వారివారి అభిరుచులకు తగినట్లు సుందరములును, సుఖదములును ఐన నివాసములను కల్పించిరి. (చౌ॥ 1-4)

పిమ్మట భరతునకును, అతనికుటుంబసభ్యులకును అదే విధముగా తగు నివాస స్థానములను ఏర్పఱచిరి. ఏలనన భరద్వాజుని ఆజ్ఞ అట్టిది. మునీశ్వరుని తపోబలమునకు బ్రహ్మ గూడ ఆశ్చర్యపడెను. (దో॥ 214)

ముని ప్రభావము చూచిన భరతునకు లోకపాలకుల వైభవములుగూడ అల్పములని పించెను. వర్ణనాతీతమైన ఆ సుఖ సామగ్రిని చూచి, పరమ జ్ఞానులు గూడ తమ వైరాగ్యములను మఱచెదరు. ఆసనములు, పఱుపులు, సుందరవస్త్రములు గుడారములు, వనములు, ఉపవనములు వివిధ పశుపక్ష్యాదులు, సుగంధ పుష్పములు, రుచిగలఫలములు, నిర్మల జలాశయములు, అమృతతుల్యములైన స్వాదిష్టఖాద్యపదార్థములు ఏర్పఱచబడెను. (వాటిని జూచి కనివిని యెఱుగని ఆ సుఖభోగవస్తువులను తాము అనుభవింపవచ్చునో లేదోయని అయోధ్యా వాసులు సంకోచించుచు విరక్తులవలె నిలిచి పోయిరి.) శ్రీరామ వియోగమువలన అయోధ్యావాసులు వ్రత దీక్షలో ఉన్నందున సంయమమును అవలంబించుచుండిరి. వారు ఈ భోగైశ్వర్యములను పొందుటకు విరక్తులవలె సంకోచించు చుండిరి.

ప్రతి గృహమున కామధేనువు, కల్పతరువు ఉండెను. వాటిని గాంచి ఇంద్రుడును శచీదేవియు ఆశ పడుదురు. వసంత ఋతువునందువలె శీతలమందసుగంధవాయువులు వీచుచుండెను. చతుర్విధ పురుషార్థఫలములు అచట అందుబాటులో ఉన్నట్లుండెను. స్రక్చందనవనితాది భోగ్య వస్తువులను జూచి జనులందఱును హర్ష విస్మయములకు లోనగుచు ఉండిరి. (చౌ॥ 1-4)

ఈ సంపద ఆడుచక్రవాకము వంటిది. భరతుడు మగచక్రవాకము వంటివాడు. ముని ఆజ్ఞ తన లీలలచే వాటిని ఆడించు చుండెను. ఈ రెండును ఆ రాత్రి ఆశ్రమమనెడి పంజరములో బంధింపబడెను. (ఒకే పంజరములో నున్నను రాత్రివేళ స్త్రీ పురుష చక్రవాకములు కలియనట్లు ప్రలోభ పఱచు విలాసవస్తువుల మధ్యనున్నను భరతుని మనస్సు వాటిచే ఆకర్షితము కాలేదు) ఇంతలో ప్రాతఃకాలమాయెను. (దో॥ 215)

(మాసపారాయణము-పందొమ్మిదవ విరామము.)

ప్రాతఃకాలమున భరతుడు తీర్థరాజమైన ప్రయాగలో త్రివేణీ స్నానములను ఆచరించి, సపరివారముగా మునికి నమస్కరించి, ఆయనఆజ్ఞను, ఆశీర్వాదమును పొంది, సవినయముగా సంభాషించెను. పిదప త్రోవలను ఎఱిగిన వారిని, ఇతర జనులను తనతోపాటు వెంటనిడుకొని, భరతుడు చిత్రకూటమున మనస్సును నిలిపి బయలుదేఱెను. సాక్షాత్తు శ్రీరామ ప్రేమయే ఆకృతి దాల్చినదా? అనునట్లు రామసఖుడైనగుహునిచేతిలో చేయివేసి, అతడు నడచుచుండెను. కాళ్లకు పాదరక్షలు లేవు. శిరమునకు అచ్ఛాదనముగా ఛత్రములేదు. అతని ప్రేమ, నియమము, వ్రతము, ధర్మము నిష్కపటములైనవి. శ్రీ సీతారాములేవిధముగా సంచరించినదియు తెల్పుమని అతడు నిషాదరాజును కోరెను. అతడు ఆ విషయములను అన్నింటిని భరతునకు మృదుమధురముగా తెల్పుచు నడచుచుండెను. శ్రీరాముడాగిన స్థలములను, అచటి వృక్షములను జూచి భరతుని హృదయములోని ప్రేమ ఆపినను ఆగకయుండెను. భరతుని ఈ స్థితిని జూచి దేవతలు పూలను వర్షించిరి. పృథ్వి కోమలమాయెను. త్రోవలు సుఖప్రదములుగా నుండెను. (చౌ॥ 1-4)

మేఘములు వారికి నీడనిచ్చెను. వాయువులు హాయినిగొల్పుచుండెను. భరతుని ప్రయాణము శ్రీరాముని ప్రయాణము కంటెను సుఖదాయకముగా నుండెను. (దో॥ 216)

మార్గమున శ్రీరామునిజూచినవి, ఆయనచే జూడబడినవిఐన జడ, చేతన జీవులన్నియును తత్ క్షణమునే మోక్షాధికారమును పొందినవి. కాని ఇప్పుడు భరతుని దర్శనముచే అవి జనన మరణ రూపములైన భవరోగములనుండి ముక్తినందినవి. భరతునకిది గొప్ప విషయముగాదు. ఏలనన శ్రీరాముడే స్వయముగా తన మనస్సున భరతుని స్మరించును. "ఈ ప్రపంచములో ఒక్కసారియైనను 'శ్రీరామ' అని స్మరించినచో ఆ వ్యక్తి తాను తరించుటయే గాక ఇతరులను గూడ తరింపజేయును. భరతుడు అయితే శ్రీరామునకు ప్రీతిపాత్రుడు మాత్రమే గాక అతనికి తమ్ముడు గూడ. అట్టి స్థితిలో ఆతనిమార్గము శుభప్రదమేలగాదు?" అని ఈ విధముగా సిద్ధులు, సాధువులు, మునీశ్వరులును పల్కుచుండిరి. భరతునిజూచి, వారి హృదయములు ఆనందమున ఉప్పొంగుచుండెను. భరతుని ఈ ప్రేమ పారవశ్యములను జూచి (ఈ ప్రేమకు వశమై శ్రీరాముడు తిరిగి అయోధ్యకు మఱలి పోయినచో తమ కార్యము నెఱవేఱదేమోయని) ఇంద్రునకు భయము కలిగెను. ప్రపంచము మంచివారికి మంచిగా చెడ్డ వారికి చెడ్డగా కన్పట్టును. ఇంద్రుడు తమ గురువగు బృహస్పతితో పలికెను. "ప్రభూ! భరతునకు శ్రీరాముని దర్శనమే కలుగకుండ జేయుడు. (చౌ॥ 1-4)

## ఇంద్రుని భయము - బృహస్పతి అభయము

శ్రీరామచంద్రుడు సౌశీల్యము, ప్రేమ కలవాడు. భరతుడు ప్రేమసముద్రుడు. ఇంత వఱకు ఫలించిన మన ప్రయాస వృథా కావచ్చును. కావున ఏదైననొక కపటోపాయమును ఆలోచింపుడు." (దో॥ 217)

ఇంద్రునిమాటలను విని, దేవగురువైన బృహస్పతి చిఱునవ్వుతో "ఇతడు వేయి కన్నులున్నను గ్రుడ్డివాడే" అని భావించుచు ఇట్లనెను. "దేవేంద్రా! మాయాప్రభువైన శ్రీరామచంద్రుని సేవకుని పైననే మాయోపాయములను పన్నినచో అది పన్నినవానినే దెబ్బతీయును. మొదట నేను శ్రీరాముని సంకల్పానుసారమే చేసితిని. ఇప్పుడు దానికి విరుద్ధముగా ఎట్టి పన్నాగమును పన్నినను హాని జరుగును. ఇంద్రా! రఘునాథుని స్వభావమును వినుము. అతడు తన యెడ అపరాధము చేసిన వారినెవ్వరిని కోపగింపడు. కాని ఆయనభక్తుని యెడ అపరాధము చేసిన వాడు శ్రీరామునిక్రోధాగ్నికి ఆహుతి యగును. వేదములలో ప్రస్తావింపబడిన ఈ విషయము. లోకప్రసిద్ధము. దీనిని దుర్వాసుడు బాగుగా ఎఱుగును. (మహా భక్తుడైన అంబరీషుని యెడ అపరాధమొనర్చి, దుర్వాసుడు అనేకకష్టములపాలయ్యెను ఈ కథ సుప్రసిద్ధము.) లోకములన్నియును శ్రీరామ నామమును జపించును. ఆ శ్రీరాముడు భరతుని నామమును స్మరించును. శ్రీరామునకు భరతునితో సమానమైన ప్రీతిపాత్రుడు ఎవ్వడును లేడు. (చౌ॥ 1-4)

కావున ఇంద్రా! రఘుకులశ్రేష్ఠుడైన శ్రీరామచంద్రునిభక్తునకు అహితభావమును ఎప్పుడునూ ఏ రూపముననూ మనస్సునకు రానీయకుము. లేనిచో ఈ లోకములో అపకీర్తి, పరలోకములో దుఃఖము కల్గును. అనుక్షణము శోకము వెంటాడును. (దో॥ 218)

దేవేంద్రా! నా ఉపదేశమును వినుము. శ్రీరామునకు తన భక్తుడు అత్యంత ప్రియుడు. తన భక్తులను సేవించిన వారికి అతడు ప్రసన్నుడగును. తన భక్తులకు ప్రతికూలురైన వారిని శత్రువులుగా భావించును. ప్రభువు సమదృష్టి గలవాడు. ఆయనలో రాగద్వేషములుండవు. ఇతరుల పాపపుణ్యములను గాని, గుణదోషములను గాని, ఆయన గ్రహింపడు. విశ్వమునందు జీవుల సుఖదుఃఖములకు కర్మయే ప్రధానకారణము. ఎవరెట్టి కర్మలను ఆచరింతురో వారు వాటికి తగిన ఫలితములను అనుభవించెదరు. ఐనను భక్తులయెడ సమవ్యవహారమును, భక్తులను బాధించువారియెడ విషమవ్యవహారమును జరుపును. (అతడు భక్తులను ప్రేమతో అక్కున చేర్చుకొనును. తన భక్తులను బాధించు వారిని సంహరించి, మోక్షము ప్రసాదించును.) శ్రీరాముడు త్రిగుణాతీతుడు, నిస్సంగుడు, నిరహంకారి, శాశ్వతుడు. ఐనను భక్తుల ప్రేమకు వశుడై సగుణుడుగాగూడ ఒప్పుచుండును. శ్రీరాముడు ఎల్లప్పుడును తన భక్తుల కోరికలను తీర్చుచుండును. వేద పురాణములు, సాధువులు, దేవతలు దీనికి సాక్ష్యముగా నిలుతురు. దీనిని మనస్సులో గ్రహించి, నీ కుటిలత్వమును మానుము. భరతుని చరణములను బాగుగా ప్రేమించుము. (చౌ॥ 1-4)

ఇంద్రా! రామభక్తులు నిరంతరము ఇతరులహితమునందే నిరతులైయుందురు. ఇతరులు దుఃఖితులైనప్పుడు వారును దుఃఖితులగుదురు. దయజూపుదురు. భరతుడు భక్త శిరోమణి. కావున అతనిని గూర్చి నీవు భయపడవలదు. (దో॥ 219)

ప్రభువు సత్యప్రతిజ్ఞుడు. దేవతలకు హితమునుగూర్చువాడు. భరతుడు శ్రీ రామచంద్రుని ఆజ్ఞనే అనుసరించి, నడచువాడు. నీవు నీ స్వార్థమున మునిగి అనవసరముగా కలవరపడుచున్నావు. ఇందు భరతునిదోషమేమియు లేదు. ఇది నీ అజ్ఞానము మాత్రమే." దేవ గురువైన బృహస్పతి పలికిన హితవచనములను విని, ఇంద్రుని మనస్సు ప్రశాంతత నొందెను. అతని చింత దూరమాయెను. అతడు ప్రసన్న చిత్తుడై, భరతుని స్వభావమును ప్రశంసించుచు పుష్ప వృష్టిని గురిపించెను. భరతుడు దారివెంట భక్తి ప్రపత్తులతో వెళ్లుచుండగా మునులు, సిద్ధులు ఆయనను కొనియాడుచుండిరి. ఆయన నిట్టూర్పులలో గూడ రామ! రామ! అని వినిపించు చుండగా నాలుగుదెసల ప్రేమ పొంగిపొరలుచుండెను. అతని మాటలకు ఱాళ్లు, వజ్రములు గూడ కరిగిపోవుచుండెను. అయోధ్యావాసులకు సీతారాములపై గల ప్రేమ వర్ణింపనలవి కానిది. దారిలో అచ్చటచ్చట బస చేయుచు భరతుడు

యమునాతీరమునకు జేరెను. యమునా నదీ జలములను దర్శింపగనే ఆయన కన్నులు చెమర్చెను. (చౌ॥ 1-4)

శ్రీరామవిరహసముద్రములో మునిగిన భరతుడు, అతని పరివారము శ్యామవర్ణ శోభితములైన యమునానదీ జలములను జూచి, ప్రేమ విహ్వలులైరి. పిమ్మట వారు వివేకమనెడి ఓడనెక్కి, శ్రీరామదర్శనమునకై ఉత్సాహితులైరి. (దో॥ 220)

ఆ దినమున వారు యమునా తీరమున బసచేసిరి. సమయాను కూలముగా వారికి భోజన, వసతి సౌకర్యములు ఏర్పఱచబడెను. నిషాదరాజుఆజ్ఞచే రాత్రికి రాత్రే అన్ని ఘట్టముల యందును అసంఖ్యాకములైన ఓడలు వచ్చి చేరెను. వాటి శోభలు కన్నులకు మిఱుమిట్లు గొలుపు చుండెను. ఉదయమున ఒకే సారి అందఱును నదిని దాటిరి. రామ సఖుడైన గుహుని సేవలకు ఎల్లరును సంతసించిరి. యమునానదిలో స్నానములనాచరించి, ప్రణమిల్లి నిషాద రాజుతో పాటు సోదరులిద్దఱును బయలుదేఱిరి. ముందుగా అందమైన వాహనములలో వసిష్ఠుడు మున్నగు మునీశ్వరులుండిరి, వారి వెంట రాజ పరివారము ఉండెను, వారి వెంట సోదరులిద్దఱును అతిసామాన్యములైన దుస్తులు ధరించి, నడచుచు పోవుచుండిరి. వారి ననుసరించి, సేవకులు, మిత్రులు, మంత్రికుమారులు శ్రీ సీతారామలక్ష్మణులను స్మరించుచు నడుచుచుండిరి. శ్రీరాముడు విశ్రమించిన ప్రదేశములకు భక్తితో ప్రణమిల్లు చుండిరి. (చౌ॥ 1-4)

మార్గముల ప్రక్కన గల గ్రామవాసులు వారి రాకను విని, వెంటనే తమ పనులనన్నింటిని మానుకొని వచ్చి, వారి (భరతాదుల) స్వరూపములను, ప్రేమను చూచి, తమ జన్మలు సఫలములైనవని భావించుచుండిరి. (దో॥ 221)

భరత శత్రుఘ్నులనుజూచి స్త్రీలు ప్రేమపూర్వకముగా తమలోతాము ఇట్లనుకొనుచుండిరి. "చెలీ! వీరు రామలక్ష్మణులా? కాదు. కాని వీరి వయస్సులు శరీర వర్ణములు, రూపములు ఆ విధముగనే యున్నవి. వీరి శీల స్నేహములు గూడ అట్లే యున్నవి. వీరి నడకలుగూడ ఆ తీరువనే యున్నవి. కాని వీరి వేషములట్లు లేవు. వీరు మునుల వలె వల్కలధారులై లేరు. సీతాదేవియు తోడుగా లేదు. "వీరి ముందు చతురంగబలములు నడచుచున్నవి. వీరి ముఖములు ప్రసన్నములుగా లేవు. మనస్సులలో విచారమున్నది. ఈ వ్యత్యాసములవలన సందేహములు కలుగుచున్నవి." వీరి సహేతుకములైన సంభాషణలు తదితర స్త్రీలకును నిజమనిపించెను. వారు ఒక వనితతో ఇట్లనిరి. "నీ వంటి బుద్ధిమంతురాలు ఎవ్వరును లేరు." ఆమెను పొగడుచు, 'నీ మాటలు నిజము' అని పల్కుచు ఆమెతో మధురవచనములను నుడివిరి. శ్రీరాముని రాజ్యపట్టాభిషేకము భంగమైన రీతిని, దానికి సంబంధించిన పూర్తివృత్తాంతమును వారు సంభాషించు కొనుచు, భరతుని స్నేహశీలములను, సౌభాగ్యమును ప్రశంసించిరి. (చౌ॥ 1-4)

చూడుము. తండ్రిగారు ఇచ్చిన రాజ్యమునుగూడ వదలిపెట్టి వీరు కందమూలములను భుజించుచు కాలినడకన వచ్చుచున్నారు. 'మఱల అయోధ్యకు రమ్ము' అని శ్రీరాముని వేడుకొనుటకు భరతుడు ఏతెంచుచున్నాడు. ఇట్టి భరతునకు సాటిరాగలవారెవ్వరు? (దో॥ 222)

భరతునిభ్రాతృభావము, అతని భక్తిఆచరణలను కీర్తించుటవలన, వినుటవలన దుఃఖములు, దోషములు అంతరించును. చెల్లీ! ఈ విషయమున ఎంత చెప్పినను తక్కువయే. అతడు శ్రీరామచంద్రుని సోదరుడుగదా! ఇట్టి మహత్త్వసంపన్నుడగుటలో ఆశ్చర్యమేమున్నది? తమ్మునితోగూడియున్న భరతునిజూచి మనమందఱము ధన్యురాండ్రమైతిమి. భరతుని సద్గుణములను విని, అతని ప్రస్తుత స్థితిని జూచి, స్త్రీలు విచారపడుచు 'కైకేయి వంటి కుటిల మహిళ కడుపున పుట్టవలసినవాడు కాడితడు" అని యనుచుండిరి. మఱొక వనిత "ఇందులో రాణి దోషము

లేదు. ఇది విధాతకల్పితము. ఒక విధముగా ఇట్లు జరుగుట మనఅదృష్టము. లేనిచో లోకమునకును, వేద విధులకును కులగౌరవములకును నిమ్నస్థితిలోనుండి, కుగ్రామములలో నివసించుచున్న మనకు ఈ మహాపుణ్యపురుషుల దర్శనము ఎట్లు లభించును?" అని పలికెను. పల్లె సీమలకు వారి ఆగమనము మఱుభూములలో కల్పవృక్షము వెలసినట్లుండెను. ఇందువలన ప్రతిపల్లెయందును ఆశ్చర్యానందములు వెల్లి విరియుచుండెను. (చౌ॥ 1-4)

సింహళద్వీపవాసులకు దైవయోగముచే తీర్థరాజమైన ప్రయాగయే నడచివచ్చి దర్శనమిచ్చినట్లు దారిప్రక్కనగల పల్లెప్రజలకు పుణ్యపురుషుడైన భరతుడు స్వయముగా దర్శనమిచ్చుటచే వారు తమ భాగ్యములు పండినట్లు మురిసిపోయిరి. (దో॥ 223)

తన గుణములతోపాటు శ్రీరామచంద్రునిగుణప్రశంసలను వినుచు శ్రీరఘునాథుని స్మరించుచు భరతుడు ముందునకు సాగిపోవుచుండెను. అతడు తీర్థములలో స్నానములాడుచు, ఋష్యాశ్రమములను, దైవమందిరములను దర్శించుచు వినమ్రుడై ప్రణమిల్లుచుండెను. శ్రీరామచంద్రుని చరణకమలములపై నిరంతరము తనభక్తి చెక్కుచెదరకుండునట్లు వరమును ప్రసాదింపుమని భరతుడు ప్రార్థించు చుండెను. దారిలో ఆయనను కోలులు, కిరాతులు మున్నగు వనవాసులును, వానప్రస్థులును సన్న్యాసులును, బ్రహ్మచారులును, విరాగులును కలిసికొనుచుండిరి. వారికి ప్రణమిల్లి, శ్రీ సీతారామలక్ష్మణులు ఏవనములో ఉన్నారు? అని అడుగుచుండెను. వారు ప్రభువుల సమాచారములను తెలుపుచుండిరి. భరతుని దర్శనముచే జన్మసాఫల్యములను పొందుచుండిరి. 'సీతారామలక్ష్మణులను క్షేమముగా దర్శించినాము' అని తెలిపిన వారిని భరతుడు రామలక్ష్మణులతో సమానులుగా భావించు చుండెను. ఈ విధముగా శ్రీరాముని వనవాస విశేషములను గూర్చి వినుచు భరతాదులు ముందునకు సాగుచుండిరి. (చౌ॥ 1-4)

ఆనాడు అక్కడ ఆగి, మఱునాటి ఉదయముననే రాముని స్మరించుచు వారు బయలుదేఱిరి. భరతునివెంటనున్న వారందఱును అతనివలెనే శ్రీరామ దర్శనోత్సుకులై యుండిరి. (దో॥ 224)

అందఱికిని శుభ శకునములు కనబడెను. పురుషులకు, స్త్రీలకు క్రమముగా కుడి, ఎడమ నేత్రములు, భుజములు అదరినవి. భరతుడు, అతనిపరివారము 'శ్రీరాముని దర్శనము అగును, మన దుఃఖదాహము తీరును' అని భావించిరి. హృదయములోని భావములకు అనుగుణముగనే కోరికలు కలుగు చుండును. అందఱును స్నేహ మదిరామత్తులైయుండిరి. వారి తనువులు ప్రేమ విహ్వలములై యుండెను. కాళ్ళు తడబడుచుండెను. మాటలు అస్పష్టములై యుండెను. అదే సమయమున రామసఖుడైన నిషాదరాజు సహజసుందరమై, పర్వత శిరోమణియైన 'కామదగిరి'ని వారికి చూపించెను. 'దానికి సమీపముననే పయస్విని నదీతీరమున సీతాలక్ష్మణులతో గూడి శ్రీరాముడు నివసించుచున్నాడు' అని తెలిపెను. ఆ పర్వతమును చూడగానే అందఱును జానకీజీవనశ్రీరామప్రభువునకు జయము' అనుచు సాష్టాంగదండ ప్రణామములను ఆచరించిరి. అప్పుడు వారు 'శ్రీ రఘునాథుడు అయోధ్యకు తిరిగి వచ్చినంతగా' ఆనందించిరి. (చౌ॥ 1-4)

ఆ సమయమున భరతుడు పొందిన భక్తిపారవశ్యములను ఆ ఆదిశేషుడుగూడ వర్ణింప జాలడు. అహంకార మమకారములతో మలిన హృదయులైన వారికి బ్రహ్మానందముఅగమ్యమైనట్లు కవులకు భరతుని ప్రేమ పారవశ్యస్థితిని వర్ణించుట అసాధ్యము. (దో॥ 225)

శ్రీరామ భక్తి పారవశ్యములతో విహ్వలులై యున్నందున ఆ దినమంతయును అందఱును రెండుక్రోసులదూరముమాత్రమే నడువ గలిగిరి. ఇంతలో సూర్యుడు అస్తమించెను. జలస్థల వసతులను జూచి, ఆ రాత్రి అచటనే (నిరాహారముగా) బసచేసిరి. ప్రాతఃకాలమున రామభక్తుడైన భరతుడు ముందుగా ప్రయాణము

సాగించెను. అక్కడ శ్రీరామచంద్రుడు వేకువ జాముననే మేల్కొనెను. సపరివారముగా భరతుడు వచ్చినట్లు కలగన్న సీతాదేవి తనస్వప్నమును శ్రీరామునకు వివరించుచుండెను. "ప్రభువు యొక్క వియోగాగ్నిలో భరతునితనువు తప్తమైనది. అతని అనుయాయులందఱును దైన్యదుఃఖములతో విచారగ్రస్తులై యుండిరి. అత్తగార్ల స్వరూపములు పూర్తిగా మాఱిపోయినవి." సీతాదేవి స్వప్న వృత్తాంతమును విని, శ్రీరాముని కన్నులలో నీరునిండెను. అందఱిని శోకమునుండి విముక్తులను జేయు ప్రభువే శోకమగ్నుడాయెను. శ్రీరాముడు "ఈ స్వప్నము మంచిది గాదు. ఏదో అశుభవార్తను వినబోవుచున్నాము" అని పలికి, తమ్మునితోపాటు స్నానమాచరించి, మహాదేవుని పూజించి, సాధువులను సమ్మానించెను. (చౌ॥ 1-4)

దేవతలను పూజించి, మునులకు వందనములొనర్చి, శ్రీరామచంద్రుడు ఆసీనుడై ఉత్తర దిశకు చూడసాగెను. ఆకాశము ధూళి దూసరితమై యుండెను పశుపక్ష్యాదులు వ్యాకులపాటుతో పరుగెత్తుకొని ఆశ్రమమువైపునకు వచ్చుట చూచెను. శ్రీరాముడు లేచి నిలబడి 'దీనికి కారణము ఏమైయుండును?' అని ఆలోచింపసాగెను. మనస్సు ఆశ్చర్యచకితమగుచుండగా, కోలులు, కిరాతులు భరతుని ఆగమన సమాచారమును పూర్తిగా దెలిపిరి- అని తులసీదాసు పలుకుచున్నాడు. (ఛం)

# భరతుడు చిత్రకూటమునకు చేరుట

ఆహ్లాదకరములైన మంగళవచనములను వినగానే శ్రీరాముని మనస్సు సంతసించెను, తనువు పులకరించెను. అయన యొక్క కమలములవంటి కన్నులలో నీరునిండెను- అని తులసీదాసు నుడువుచున్నాడు. (సో॥ 226)

"భరతునిరాకకు కారణమేమి?" శ్రీరాముడు ఆలోచనలో మునిగెను. మఱియొకరువచ్చి, "అయనవెంట చతురంగబలములు గూడ ఉన్నవి" అని తెలిపిరి. ఇది వినగానే శ్రీరాముడు మిక్కిలి విచారపడెను. ఒకవైపు తండ్రియాజ్ఞ, మఱియొకవైపు సోదరునియెడ ప్రేమ. భరతుని స్వభావమును బాగుగాఎఱిగిన శ్రీరామచంద్రునిమనస్సునకు నిలకడ చిక్కలేదు. (భరతుని స్వభావమును, అతనికి తనపైగల భక్తి విశ్వాసములను పూర్తిగా తెలిసినవాడు గావున ఒక వేళ భరతుడు తండ్రిగారి ఆజ్ఞను త్రోసి రాజని రాజ్యమును చేపట్టక పోయినచో ఏమి చేయవలెను? అని ప్రభువు ఆలోచింపసాగెను) 'భరతుడు సాధుస్వభావుడు, బుద్ధిమంతుడు, నామాట మీఱడు' అని ఆలోచించి, మనస్సును కుదుటబఱచుకొనెను. అప్పుడు లక్ష్మణుడు ప్రభుహృదయము క్షోభపడుచుండుట చూచి, సమయానుకూలముగా, నీతియుక్తముగా ఇట్లు పలికెను. "స్వామీ! మీరు అడుగకయున్నను నేనొక విషయమును చెప్పెదను. సేవకుడు సాహసించి పలికినచో హద్దుమీఱినట్లు అగునేమో? ఐనను సందర్భమును అనుసరించి దృఢముగా నుడువుచున్నాను. నాచొరవను మన్నింపగలరు. ప్రభూ! మీరు సర్వజ్ఞులు. ఐనను నేను నా మనసులోని మాటను తెల్పుచున్నాను. (చౌ॥ 1-4)

ప్రభూ! మీరు అవ్యాజకరుణామయులు. సరళస్వభావులు. స్నేహసౌశీల్యసముద్రులు. మీరు అందఱిని సమానముగా ప్రేమించెదరు, విశ్వసించెదరు. అందఱును మీ వలెనే యుందురని భావించెదరు. (దో॥ 227)

కాని మూఢులు, విషయలోలురైనవారు రాజ్యాధికారమును పొందినచో వారు మోహపరవశులగుదురు. అప్పుడు వారినిజస్వరూపములు బయటపడుచుండును. భరతుడు నీతి పరాయణుడు, సాధువు, సమర్థుడు, మీపై అమితప్రేమగలవాడు. ఇది లోకవిదితము. కాని నేడు ఆ భరతుడే మీ రాజ్యాధికారమును పొంది, ధర్మ మార్గమును వీడి, వచ్చుచున్నాడు. కుటిలుడైన భరతుడు ఈ సమయమును ఎన్నుకొనినాడు. మీరు వనవాసములో ఒంటరిగా ఉన్నారు. అతడు దుర్బుద్ధితో తనసైన్యమును వెంటబెట్టుకొని రాజ్యమును నిష్కంటక మొనర్చుకొనుటకై వచ్చుచున్నాడు. ఈ సోదరులు పెక్కు కుటిలోపాయములను పన్ని, సేనలను సమీకరించుకొని వచ్చుచున్నారు. వారిలో ఎట్టి దురుద్దేశ్యములు లేనిచో రథములను, ఏనుగులను, గుఱ్ఱములను కాల్బలములను వెంటదీసికొని

రావలసిన పనియేమి? భరతుని నిందించి లాభమేమి? జగత్తులో రాజ్యాధికారము ఎట్టివారినైనను మదోన్మత్తులనుగా జేయును. (చౌ॥ 1-4)

చంద్రుడు గురుపత్నిగామియయ్యెను. నహుషుడు మహర్షులచే బ్రహ్మరథమును మోయించుకొనెను. లోకమునకును వేదములకును విరుద్ధముగా ప్రవర్తించిన వేనరాజువంటి అధముడు లోకములో ఎవ్వడును ఉండడు. (దో॥ 228)

సహస్రబాహువు, ఇంద్రుడు, త్రిశంకుడు మొదలగు వారినందరిని రాజ్యాధికారమదము కళంకితులనుగా జేసెను. శత్రుశేషమును, ఋణశేషమును ఏమాత్రమూ మిగులనీయరాదని భరతుడీయుపాయమును పన్నియుండవచ్చును. కాని మీకు సహాయపడువారు ఎవ్వరును లేరని తలచియే కాబోలు నిరాదరముతో ఈ పనికి పూనుకొనుట భరతునివంటివానికి ఎంతమాత్రమూ తగదు. నేడు సమరములో మీరోషపరాక్రమములను రుచిచూచి అతడు తన తప్పును తెలిసికొనగలడు." -ఈ విధముగా పలికి, లక్ష్మణుడు ఔచిత్యమును మఱచెను. అతనివీరరసవృక్షము వెంటనే పుష్పించెను. ప్రభుచరణములకు ప్రణమిల్లి, ఆయన పాదధూళిని శిరమున దాల్చి, అతడు తన సహజమైన ఆవేశముతో పలికెను. "స్వామీ! నేను చెప్పెడి విషయమును అనుచితమని భావింపవలదు. భరతునివలన మనకు తక్కువ హాని జరుగలేదు. ఈ దుష్కృత్యములను మనమెంతవఱకు సహింప గలము? ప్రభువు నా సమీపముననే ఉన్నప్పుడు, ధనుస్సు చేతిలో ఉన్నప్పుడు నా మనస్సు ఎట్లు ఓర్చుకొనును? (చౌ॥ 1-4)

నేను క్షత్రియుడను, రఘువంశమున జన్మించినవాడను. శ్రీరాముని అనుసరించు సేవకుడను. ఇది లోకవిదితము. ధూళికంటెను నీచమైనదేది? కాని అదికూడ కాలితో తన్నినచో పైకిలేచి శిరముపై వ్రాలును. (దో॥ 229)

ఈ విధముగా పలికి, లక్ష్మణుడు నిలబడి అంజలిఘటించి, భరతుని ఎదుర్కొనుటకై ఆజ్ఞను ఇమ్మని ప్రార్థించెను. నిద్రించిన వీరరసము మేల్కొనినదా? అన్నట్లు అతడుండెను. శిరస్సున జడలను కొప్పుగా జేసికొని, నడుమునకు తూణీరమును కట్టుకొని, చేతులలో ధనుర్బాణములను ధరించి, ఇట్లనెను. "నేడు నేను శ్రీరామునిసేవకుడను - అను కీర్తిని పొందెదను. భరతునకు గుణపాఠమును నేర్పెదను. శ్రీరాముని అవమానించిన నేరమునకు భరత శత్రుఘ్నులు ఇద్దఱును రణరంగమున భూశయ్యపై పరుండెదరు. పరివారములన్నియు ఒకేసారి వచ్చుట మంచిదే ఐనది. నాలోదాగియున్న క్రోధమును నేడు ప్రకటించెదను. సింహము గజయూధములను చీల్చి చెండాడినట్లు, డేగ తన గోళ్లతో పిట్టలను పట్టినట్లు, భరతుని ఆయన సేనలతో సహా, సోదరునితో గూడ యుద్ధభూమిలో పరాజితులను గావించెదను. శ్రీరామునిపై ప్రమాణముచేసి చెప్పుచున్నాను. శంకరుడే అతనికి సహాయపడినను రణభూమిలో భరతుని మట్టి కఱపించెదను. (చౌ॥ 1-4)

లక్ష్మణుడు క్రోధాగ్నితో మండి పడుటను జూచి, ఆతడు చేసిన ప్రతిజ్ఞను విని లోకములు కంపించెను. లోకపాలకులు తమలోకములను వీడి భయముతో పాఱిపోవుచుండిరి. (దో॥ 230)

జగత్తంతయు భయముతో గడగడవణకెను. అప్పుడు లక్ష్మణుని అపార బాహుబలమును ప్రశంసించుచు ఆకాశవాణిపలికెను. "నాయనా! నీ ప్రతాపప్రభావములను ప్రశంసించుటకు ఎవరికి సాధ్యము? నీబలసామర్థ్యములను ఎవరెఱుంగగలరు? కాని ఏకార్యమునైనను ఉచితానుచితములను బాగుగా పరిశీలించి చేయవలెను. అపుడందఱును మెచ్చుకొందురు. అనాలోచితముగా తొందరపాటుతో ఏదైననొక పనిచేసి, తరువాత పశ్చాత్తాపపడుట బుద్ధిమంతుల లక్షణముకాదని వేదములు, బుధులు నొక్కిపల్కుచున్నారు. "ఈ దివ్య వచనములను విని, లక్ష్మణుడు పునరాలోచనలో పడెను. శ్రీరాముడును సీతాదేవియు ప్రేమాదరములతో ఇట్లు పలికిరి. "నాయనా! నీవు పల్కినది

లోకసహజమే. రాజ్యమదము ఎవ్వరినైనను ఉన్మత్తులనుగా జేయును. సాధుపుంగవులను సేవింపనివారు రాజ్యాధికారమదిరచే ఉన్మత్తులయ్యెదరు. కాని! లక్ష్మణా! వినుము. బ్రహ్మ సృష్టిలో ఇంతవఱకును భరతునివంటి ఉత్తముని కని,విని, ఎఱుగము. (చౌ॥ 1-4)

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులపదవులు లభించినను భరతుడు రాజ్యమదమునకు లోనుకాడు. ఇంక అయోధ్యరాజ్యాధికారము అనగా ఎంత? అనగా పుల్లనిగంజిబొట్లు కొన్నింటిని చిలకరించినంత మాత్రమున పాల సముద్రము విఱిగి పోవునా? (దో॥ 231)

మధ్యాహ్న సూర్యుని అంధకారము కబళించుగాక, అనంతాకాశము మేఘములలో పూర్తిగా విలీనమైపోవుగాక, సముద్రమును ఆపోశనము పట్టిన అగస్త్యుడు గోష్పాదమంత నీటిలో మునుగు గాక, పృథ్వి తనసహజసహనశీలమును గోల్పోవును గాక, దోమల నిట్టూర్పులకు మేరు పర్వతము ఎగిరిపోవును గాక, సోదరా! భరతునకు రాజ్యమదము ఎన్నటికిని కలుగదు. లక్ష్మణా! నీ మీద, తండ్రిగారి మీద ప్రమాణము చేసి చెప్పుచున్నాను. భరతునివంటి సర్వశ్రేష్ఠుడైన సోదరుడు ఎక్కడను దొరకడు. నాయనా! సద్గుణములుగల పాలను, దుర్గుణములుగల నీటిని గలిపి, బ్రహ్మ ఈ జగత్తును సృష్టించెను. కాని సూర్యవంశమనెడి సరస్సులో భరతుడను హంస జన్మించి, నీరక్షీరములను అనగా గుణదోషములను వేర్వేఱు చేసెను. సద్గుణరూపమైన పాలను గ్రహించి, దుర్గుణరూపమైన నీటిని త్యజించి, అతడు తనయశమును ప్రపంచమున ప్రకాశింపజేసెను." భరతుని గుణశీలస్వభావములను వర్ణించుచు శ్రీరాముడు ప్రేమసాగరమున మునిగి పోయెను. (చౌ॥ 1-4)

శ్రీరామచంద్రుని పలుకులను విని, భరతునిపై ఆయనకు గల ప్రేమను జూచి, దేవతలు ఆయనను శ్లాఘించిరి. శ్రీరామునివంటి దయామయుడైన ప్రభువు ఎవరు? అని పొగడిరి. (దో॥ 232)

"ప్రపంచములో భరతుడు జన్మించనిచో భూమిపై ధర్మమును నిలబెట్టెడి వారెవ్వరు? రఘునాథా! కవులకు గూడ ఊహలకందని భరతునిగుణములనుగూర్చి నీవుతప్ప ఇతరులు ఎవ్వరెఱుగుదురు?" శ్రీ సీతారామలక్ష్మణులు ఈ దివ్యవాణిని విని, అంతులేని ఆనందమును పొందిరి. ఇక్కడ భరతుడు తనపరివారములతోగూడి పవిత్రమందాకినిలో స్నానములను ఆచరించెను. అందఱినీ మందాకినీతీరమున ఉంచి, తల్లుల యొక్క, గురువుల యొక్క, మంత్రుల యొక్క ఆజ్ఞలను పొంది, నిషాదరాజును శత్రుఘ్నుని తన వెంటబెట్టుకొని, భరతుడు శ్రీ సీతారాములున్న చోటికి బయలు దేఱెను. అతడు తనతల్లి కైకేయి చేసిన కృత్యములను దలచుకొని 'శ్రీ సీతారామలక్ష్మణులు నా రాకను వినగానే ఆ స్థలమును వదలి వేఱే ప్రదేశమునకు వెళ్లుదురేమో?' యను జంకుతో-ఆలోచనలో పడెను. (చౌ॥ 1-4)

వారు నన్ను 'మాతృపక్షమువాడనని' భావించి, ఏమైనను చేయవచ్చును. కాని వారట్లు చేయరు. వారు తమసహజస్వభావమునుబట్టి నా పాపములను, అవగుణములను పరిగణింపక మన్నించి, నన్ను తప్పక ఆదరింపగలరు. (దో॥ 233)

నన్ను మలినమనస్కునిగా భావించి, త్యజించునుగాక. లేక సేవకుడనని నన్ను ఆదరించునుగాక. (ఏమైనను చేయనిమ్ము) నాకు శ్రీరామునిపాదుకలే శరణ్యములు. శ్రీరాముడు గొప్ప ప్రభువు. ఈ దాసుడే నిజముగా దోషి. ప్రపంచములో చాతక పక్షులు, చేపలు యశమునకు పాత్రములు. ఏలనన అవి తమ నియమములను, ప్రేమను నిత్యనూతనముగా చేసికొనుటలో సమర్థములు." ఇట్లు ఆలోచించుచు భరతుడు వారినివాసప్రదేశమును సమీపించుచుండెను. సంకోచముచే, ప్రేమపారవశ్యములచే అతడు విహ్వలస్థితిని అనుభవించుచుండెను. తల్లి దుష్కృత్యములవలన మనస్సు అతనిని వెనుకకు లాగుచుండెను. కాని భక్తి, ధైర్యము అను ఎద్దులు అతనిని

ముందుకు తీసికొని పోవుచుండెను. శ్రీరాముని స్వభావమును స్మరించినంతనే మార్గమున అతనికాళ్లు త్వరత్వరగా నడువసాగెను. ఆ సమయమున అతని స్థితి నీటి ప్రవాహమున కొట్టుకొని పోవు నీటి తుమ్మెదవలె నుండెను. భరతుని ఆందోళనను, ప్రేమను జూచి నిషాదరాజు తన్ను తాను మఱచి పోయెను. (చౌ॥ 1-4)

ఇంతలో శుభశకునములాయెను. వాటిని గమనించి, నిషాదరాజు పలికెను. "విచారము పోవును, సంతోషము కలుగును. కాని ఫలితము మాత్రము దుఃఖకరమేయగును- (దో॥ 234)

భరతుడు భక్తుడైనగుహుడుపల్కిన ప్రతివచనమును సత్యమని నమ్మెను. వారు ఆశ్రమమును సమీపించిరి. భరతుడు అక్కడి వనములను పర్వత శ్రేణులను జూచి, ఆకలి గొన్నవాడు రుచికరమైన ఆహారము పొందినంతగా సంతోషించెను. పంటలకు నష్టము కలిగించు ఈతిబాధలభయముచేతను, ఆధ్యాత్మిక-ఆధిదైవిక-ఆధిభౌతిక, తాపత్రయములచేతను, దుష్టగ్రహములచేతను, వ్యాధులచేతను పీడింపబడుజనులు మఱియొక సుందరమైన సుభిక్షదేశమునకు వెళ్లి, సంతోషించినట్లు భరతుడు ఆనందించెను. మంచిరాజుపాలనలో ప్రజలవలె శ్రీరాముడు నివసించు వనసంపద శోభాయమానమై యుండెను. ఆ మనోహరవనమే పవిత్రరాజ్యము. వివేకమేదానికి రాజు. వైర్యాగము మంత్రి. యమ(అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము) నియమములు. (శౌచసంతోష తపస్స్వాధ్యాయ- ఈశ్వర ప్రణిధానములు) ఆ రాజ్యమునకు యోధులు. పర్వతమే రాజధాని. శాంతి సుబుద్ధులు అనునవి రాణులు. శ్రేష్ఠుడైన వివేకమనెడి రాజు సర్వరాజ్యాంగములచే సుసంపన్నుడు. శ్రీరాముని చరణ కమలములను ఆశ్రయించుటచే అతని చిత్తము ఆనందోత్సాహములతో నిండియుండెను. (చౌ॥ 1-4)

వివేకమను ఆ రాజు మోహమనెడి శత్రురాజును తనదళముచే, బలముచే జయించి, రాజ్యమును నిష్కంటకముగా చేయుచుండెను. అతని రాజ్యము సుఖసంపదలతో తులతూగుచు సుభిక్షముగా నుండెను. (దో॥ 235)

ఆ వన ప్రాంతమున గల ముని ఆశ్రమములే నగరములు, పట్టణములు, గ్రామములు, పల్లెలు. అనేక చిత్ర విచిత్రములైన పశుపక్ష్యాదులే అక్కడి ప్రజలు, అచటి ఖడ్గ మృగములు, ఏనుగులు, సింహములు, పులులు, అడవిపందులు, ఎద్దులు మొదలగునవి చతురంగ బలములు. అవి పరస్పర వైరములను మాని అన్యోన్యముగా నుండెను. అచటి నీటి ప్రవాహముల ధ్వనులు, మదపుటేనుగులఘీంకారములు నగారాల మ్రోతలవలెనుండెను. చక్రవాకచకోరములు, చాతకములు, కోయిలలు, చిలుకలు, హంసలు ప్రసన్నచిత్తములతో మధురముగా కూయుచుండెను. తుమ్మెదలు 'ఝుం' అని రొదచేయుచుండిరి. నెమళ్ళు పురులువిప్పి నాట్యమాడుచుండెను. ఆ రాజ్యములో అంతయు మంగళ ప్రదమే. అచట లతలు, వృక్షములు, తృణములు, ఫలములు, పుష్పములు పుష్కలముగా నున్నవి. ఈ విధముగా ఆ రాజ్యము ఆనందమయమై సుఖశాంతులతో అలరారుచుండెను. (చౌ॥ 1-4)

శ్రీరాముడు వసించు చిత్రకూటపర్వతమును జూచిన భరతుని హృదయము తాపసి నియమదీక్షానంతరము తన తపఃఫలములను పొందినట్లు, అత్యంతానందమును పొందెను. (దో॥ 236)

(మాస పారాయణము - ఇఱువదియవ విరామము)

(నవాహ్నిక పారాయణము - ఐదవ విరామము)

అప్పుడు గుహుడు పరుగుపరుగున బోయి, ఒక ఎత్తైన ప్రదేశమున నిలిచి, రెండు చేతులను చాచి, భరతునితో పలికెను. "ప్రభూ! వచ్చి చూడుడు. ఇచ్చట జువ్వి, నేరేడు, మామిడి, తమాల వృక్షములున్నవి. ఈ తరువరముల మధ్య ఒక సుందరవిశాలవటవృక్షము గలదు. దానిని జూచినమనస్సు ముగ్ధమగును. దానిదట్టమైన

పచ్చనిఆకులు, ఎఱ్ఱనిపండ్లు చూడముచ్చటగా ఉన్నవి. దాని చల్లనినీడ అన్ని ఋతువుల యందును ఆహ్లాదకరముగా నుండును. విధాత దట్టమైన ఆకులనీలిమ అనెడి అంధకారమును, బాగుగా పండినపండ్ల ఎఱ్ఱదనమును ఒకే చోటచేర్చి, సర్వ శోభలను కేంద్రీకృతము చేసినాడా? అనునట్లున్నవి. ఈ వృక్షములు నదీతీరమునకుసమీపమున గలవు. అచటనే శ్రీరాముని పర్ణకుటీరము శోభిల్లుచున్నది. అక్కడ పెక్కురకములైన తులసిమొక్కలు గలవు. కొన్ని సీతాదేవిచేతను, మఱికొన్ని లక్ష్మణుని చేతను నాటబడెను. ఈ వటవృక్షచ్ఛాయలోనే సీతాదేవి స్వయముగా తన కరకమలములతో ఒక అందమైన వేదికను సిద్ధపఱచినది. (చౌ॥ 1-4)

## శ్రీరామ భరతుల సమాగమము

ఆ వేదికపైన కూర్చొని జ్ఞానస్వరూపుడైన శ్రీరామచంద్రుడు మునులద్వారా వేదశాస్త్ర పురాణములను, ఇతిహాసములను వినుచున్నాడు. (దో॥ 237)

సఖుడైన నిషాదరాజుమాటలను విని, ఆ వటవృక్షమును గాంచి, భరతుని నేత్రములనుండి ఆనందబాష్పములు స్రవించెను. సోదరు(భరత శత్రుఘ్ను)లిద్దఱును నమస్కరించుచు ఆశ్రమ సమీపమునకు చేరిరి. వారి ప్రేమలను వాగ్దేవియు వర్ణింపజాలదు. శ్రీరామచంద్రుని పాదచిహ్నములను జూచి, వారు నిరుపేదకు పరుసవేది లభించినంత ఆనందమును పొందిరి. ఆయన పాదధూళిని కన్నులకద్దుకొని, శిరములదాల్చి శ్రీరామచంద్రుని కలిసినంత ఆనందమును అనుభవించిరి. భరతుని ఈ అనిర్వచనీయస్థితినిజూచి, వనములోని పశుపక్ష్యాదులు, జడచేతనములును ప్రేమపరవశములాయెను. ప్రేమ పారవశ్యమున నిషాదరాజు మార్గమును మఱచెను. అపుడు దేవతలు మార్గమును దెలిపి పుష్పవృష్టిని కురిపించిరి. భరతుని సహజప్రేమను జూచి, సిద్ధులు, సాధకులు అనురాగములో మునిగిరి. వారు అతనిని కొనియాడుచు "భరతుడీ భువిపై జన్మించనిచో చేతనములు అచేతనములుగను, అచేతనములు చేతనములుగను ఎట్లు మాఱెడివి?" అని యనుకొనుచుండిరి. (చౌ॥ 1-4)

రామ ప్రేమయే అమృతము. శ్రీరామవిరహమే మందరాచలమనెడి కవ్వము. భరతుడే అగాధమైన క్షీరసముద్రము. కృపానిధియైన శ్రీరామచంద్రుడు సజ్జనులైన రామభక్తులనెడి దేవతల హితార్థము స్వయముగా (భరతుడనెడి క్షీరసముద్రమును విరహమనెడి మందరా చలనమును కవ్వముతో) చిలికి, భరతునిలోగుప్తమైయున్న రామప్రేమామృతమును వెలికి దీసెను. (దానిని సజ్జనులకు పంచగా వారు ఆ ప్రేమామృతమును గ్రోలి పరవశులగుచున్నారు.) (దో॥ 238)

దట్టమైన వనచ్ఛాయలలో నిషాదరాజుతోగూడిన భరతశత్రుఘ్నులను లక్ష్మణుడు చూడజాలక పోయెను. కాని భరతుడుమాత్రము సమస్తశుభములకును ఆకరమైన శ్రీరామచంద్రునిసుందరపవిత్రాశ్రమమును చూడగల్గెను. భరతుడు ఆశ్రమములో ప్రవేశింపగనే అతనిదుఃఖతాపము చల్లారెను. యోగికి పరమాత్ముడు లభించినంతగా అతడానందించెను. లక్ష్మణుడు ప్రభువునెదుట బద్ధాంజలియై నిలబడియుండెను. ప్రభువు అడిగిన దానికి లక్ష్మణుడు వినయముతో సమాధానమునిచ్చుటను భరతుడు చూచెను. అతడు శిరస్సున జటాజూటమును, నడుమునకు వల్కలమును ధరించియుండెను. వీపున తూణీరమును, చేతిలో బాణమును భుజముపైన ధనుస్సును కలిగియుండెను. వేదికపై మునులు, సాధువులతోడను సీతాదేవితోనుగూడి శ్రీరామచంద్రుడు విరాజిల్లుచుండెను. శ్రీరాముడును జటావల్కలములను ధరించియుండెను. శ్యామలశరీరముతో శ్రీరాముడును, సీతాదేవియు రతీమన్మథులే మునివేషధారులైయున్నట్లు ఉండిరి. శ్రీరామచంద్రుడు ధనుర్బాణములను లీలగాత్రిప్పుచున్నట్లుండెను. ఆయనచిఱునవ్వుతో చూచినవారిహృదయవేదనలు మాయమై, వారికి పరిపూర్ణానందము కలుగుచుండెను. (చౌ॥ 1-4)

జ్ఞాన సభలో సాక్షాత్తుగా భక్తి, సచ్చిదానందములే ఆకృతి దాల్చినట్లు మునీశ్వరుల మధ్య సీతారాములు విరాజిల్లుచుండిరి. (దో॥ 239)

భరతశత్రుఘ్నులు, నిషాదరాజైన గుహుడు అది చూచి భక్తి పరవశులైరి. వారిహర్ష శోకములు, సుఖ దుఃఖములు అన్నియును మాయమాయెను. "ప్రభూ! నన్ను రక్షింపుము రక్షింపుము" అనుచు భరతుడు ఒక కఱ్ఱ (దండము) వలె నేలపై వ్రాలెను. అతని ప్రేమ పూరితములైన మాటలను విని, భరతుడు ప్రణమిల్లుచున్నాడని లక్ష్మణుడు గ్రహించెను. ఒకవైపు భరతునియందలి సరసమైన సోదరపరమప్రేమ, మఱియొకవైపు స్వామిసేవాపారవశ్యము. ఇట్లు లక్ష్మణుడు భరతునితో కలియనూలేడు- స్వామి సేవను ఆపనూలేడు. అప్పటి లక్ష్మణుని డోలాయమానమానసికస్థితిని ఒక మహాకవియే వర్ణింపగలడు. ఆకాశములో పైకెగిరిన గాలిపటమును వెనుకులాగినట్లు, భరతుని వైపు మొగ్గిన తనమనోవృత్తిని వెనుకకులాగి, లక్ష్మణుడు దానిని శ్రీరామసేవయందే లగ్నమొనర్చెను. వెంటనే అతడు తలను నేలకానించి, "రఘునాథా! భరతుడు ప్రణమిల్లుచున్నాడు" అని నుడివెను. ఈ మాటలు వినగానే శ్రీరామచంద్రుడు ప్రేమపరవశుడై, తటాలున లేచెను. ఉత్తరీయము, అంబులపొది, ధనుర్బాణములు ఇటునటు పడిపోయెను. (చౌ॥ 1-4)

దయాసాగరుడైన శ్రీరామచంద్రుడు బలవంతముగా భరతుని లేవనెత్తి హృదయమునకు హత్తుకొనెను. శ్రీరామభరతులకలయికను వీక్షించి, అందఱును తమను తాము మఱచిపోయిరి. (దో॥ 240)

ఈ దివ్య సమాగమమును ఎట్లు వర్ణింపగలము? కవుల మనోవాక్కర్మలకుగూడ అది అగోచరము. సోదరులిద్దఱును మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములను (అంతఃకరణ చతుష్టయమును) మఱచి పూర్తిగా పారవశ్యములో మునిగిరి. ఈ దివ్యప్రేమను వర్ణింపనెవరితరము? కవిబుద్ధి ఏ ఛాయను అనుసరించును? కవి శబ్దార్థములను అనుసరించియే వర్ణింపగలడు. నర్తకుడు తాళగతిని అనుసరించి ఆడును. శ్రీరామభరతుల ప్రేమ అగమ్యము. బ్రహ్మ విష్ణు మహేశ్వరులకును అది అగ్రాహ్యము. మందబుద్ధినైన నేను ఆప్రేమను ప్రకటింపగలనా? గడ్డిపరకలచే కట్టబడిన వాద్యముపై మధుర సంగీతము సాధ్యమా? ఆ యిరువురి సమాగమ దృశ్యమును జూచి, దేవతలు భయపడిరి. వారి గుండెలలో 'దడ' పుట్టెను. బృహస్పతి సమాధానపఱచిన పిదప వారి అజ్ఞానము నశించెను. వారు పుష్ప వృష్టిని గురిపించి ప్రశంసించిరి. (చౌ॥ 1-4)

శత్రుఘ్నుని గూడ ప్రేమతో కౌగిలించుకొనిన పిమ్మట శ్రీరామచంద్రుడు నిషాదరాజైన గుహుని ఆదరించెను. లక్ష్మణుడు తనకు ప్రణమిల్లుటను చూచి, భరతుడు అతనిని గాఢాలింగనముతో గౌరవించెను. (దో॥ 241)

పిమ్మట లక్ష్మణుడు తన తమ్ముడైన శత్రుఘ్నుని పట్టలేని ఆనందముతో కౌగిలించుకొనెను. నిషాదరాజైన గుహుని తనహృదయమునకు హత్తుకొనెను. భరత శత్రుఘ్నులిద్దఱును మునులకు నమస్కరించిరి, మనోవాంఛలు నెఱవేఱునట్లు వారి ఆశీస్సులను పొందిరి. వారిద్దఱును భక్తి ప్రపత్తులతో సీతాదేవిపాదధూళిని తలదాల్చి ఆమె చరణ కమలములకు పదేపదే ప్రణమిల్లిరి. సీతాదేవి తన కరకమలములతో వారి శిరస్సులను స్పృశించి, వారిని కూర్చుండ బెట్టెను. మనస్సులోనే వారికి దీవెనలను ఇచ్చెను. వాత్సల్య పారవశ్యమున ఆమె తనను తాను మఱచిపోయెను. ప్రసన్నురాలైన సీతాదేవిని గాంచి, భరతుడు శోకరహితుడాయెను. అతని మనస్సులోని కల్పిత భయాందోళనలు తొలగిపోయెను. ప్రేమాతిరేకముచే ఎవ్వరినోటను మాటరాలేదు. అందఱి మనస్సులు ప్రేమ పూర్ణములగుటవలన తమను తాము మఱచిపోయిరి. కడకు గుహుడు ధైర్యము వహించి, చేతులు జోడించి, ప్రణమిల్లి, ఇట్లు వినతి చేసెను. (చౌ॥ 1-4)

"ప్రభూ! ముని శ్రేష్ఠుడైన వసిష్ఠుడు, తల్లులు, పురజనులు సేవకులు, సేనాపతులు, మంత్రులు- అందఱును మీ వియోగముచే వ్యాకుల చిత్తులై ఇచటికి విచ్చేసినారు." (దో॥ 242)

గురువైన వసిష్ఠునిఆగమనవార్తను విని, సౌశీల్యసాగరుడైన శ్రీరామచంద్రుడు సీతాదేవియొద్ద శత్రుఘ్నునిఉంచెను. పరమధీరుడు, ధర్మ ధురంధురుడు, దీన దయాళువు ఐన శ్రీరాముడు వెంటనే త్వరత్వరగా వెళ్లెను. లక్ష్మణసహితుడై గురువుగారిని దర్శించి అతడు ప్రేమవిహ్వలుడయ్యెను. ఆయనకు దండ ప్రణాములను ఆచరింపబూనెను. ఇంతలో వసిష్ఠుడు వేగముగా ముందునకు వచ్చి, వారిని అక్కున చేర్చుకొని, ఆదరించెను. ప్రేమచే పులకితుడైన గుహుడు తన పేరు తెలుపుకొని వసిష్ఠునకు కొంతదూరమునుండి, దండప్రణామములను ఆచరించెను. ఋషి అతడు రామసఖుడు అని యెఱింగి, భూమిపై బడిన స్నేహమును సేకరించినట్లు అతనిని లేపి, తన హృదయమునకు హత్తుకొనెను. "శ్రీరామునిపై భక్తియే సర్వ శుభములకును మూలము. అని ప్రశంసించుచు దేవతలు పూలవానను కురిపించిరి. "ప్రపంచములో వసిష్ఠమహర్షి శ్రేష్ఠులలోనెల్ల శ్రేష్ఠుడు. గుహుడో అతి సామాన్యుడు. (చౌ॥ 1-4)

ఐనప్పటికిని మునీశ్వరుడు అతనిని ఆలింగనము చేసికొని, లక్ష్మణుని కంటెను ఎక్కువ ప్రేమతో ఆదరించెను. ఇదియంతయును శ్రీ సీతారాములపై అతనికి గల భక్తి ప్రభావము, సేవా మహత్త్వము. (దో॥ 243)

కరుణానిధియు, జ్ఞానస్వరూపుడును ఐన శ్రీరాముడు ప్రజలందఱును దుఃఖితులనియెఱింగి, వారి యభిలాషలననుసరించి, వారిని ఆదరించెను. ఒక్క క్షణములో సలక్ష్మణుడైన శ్రీరాముడు వారి నందఱిని కలిసి తన మృదుమధురవచనములతో వారి విరహాగ్నిని చల్లార్చెను. అనేకకోట్లఘటములయందు ఒకేసమయమున సూర్యుడు ప్రతిబింబములుగా భాసించునట్లు శ్రీరాముడు ఒక్క క్షణములో అందఱితో కలిసెను. సర్వసమర్థుడైన శ్రీరామచంద్రప్రభువునకు ఇది సామాన్యవిషయము. అయోధ్య వాసులందఱును ప్రేమపూర్వకముగా నిషాదరాజును కౌగిలించుకొని, అతని అదృష్టమును కొనియాడిరి. మంచుతాకిడికి లోనైన లతలవలె ఒప్పుచు శోక విహ్వలలైయున్న తల్లులను శ్రీరాముడు దర్శించెను. మొదట కైకేయికి ప్రణమిల్లి, తన సరళ స్వభావమును, ప్రకటించి, భక్తిప్రత్తులతో ఆమెమనోవ్యథను చల్లార్చెను. ఆమెను ఊరడించెను. కాల, కర్మ, విధి వైపరీత్యములను దోషులుగా పేర్కొనెను. (చౌ॥ 1-4)

శ్రీ రఘునాథుడు తల్లులందఱికిని ప్రణమిల్లి, వారిని ఓదార్చెను. "తల్లులారా! ఈ జగత్తంతయు ఈశ్వరాధీనము. జరిగిన సంఘటనలకు ఎవ్వరును దోషులు కారు, (దో॥ 244)

పిదప రామలక్ష్మణులిద్దఱును గురుపత్నియైన అరుంధతీ చరణకమలములకును, ఆమెతో గూడియున్న బ్రాహ్మణ స్త్రీలకును నమస్కరించిరి. వారిని గంగాగౌరీదేవతలతో సమానముగా భావించిరి. వారందఱును ప్రసన్నచిత్తలై, ఆ ఇరువురిని ఆశీర్వదించిరి. సోదరులిద్దఱును సుమిత్రాదేవి పాదములకు నమస్కరించి, నిఱుపేదకు నిధి లభించినట్లు ఆనందించిరి. పిమ్మట కౌసల్యామాతచరణములకు ప్రణమిల్లిరి. ఆమె ప్రేమానురాగములతో వారిని హృదయమునకు హత్తుకొని, తన కన్నీటితో తడిసెను. ఆసమయమునందలి వారి హర్ష విషాదములను కవి యెట్లు వర్ణింపగలడు? తాను తిన్న మధురపదార్థములరుచులను మూగవాడు ఎట్లు ప్రకటింపగలడు? కౌసల్యాదేవిని దర్శించిన పిదప సోదరులిద్దఱును తమ ఆశ్రమమునకు రావలసినదని గురువైన వసిష్ఠుని ప్రార్థించిరి. వసిష్ఠముని ఆజ్ఞతో అయోధ్యావాసులు జలస్థల సౌకర్యములను జూచుకొని అచట వసించిరి. (చౌ॥ 1-4)

బ్రాహ్మణులు, మంత్రులు తల్లులు గురువు మున్నగు ముఖ్యులను వెంటనిడుకొని శ్రీరామలక్ష్మణభరతులు ఆశ్రమము జేరిరి. (దో॥ 245)

సీతాదేవి వసిష్ఠ మహర్షి పాదములకు ప్రణమిల్లెను. అతడు ఆమె మనోరథము తీరునట్లు ఆశీర్వదించెను. పిమ్మట ఆమె మునిపత్నులతోనున్న అరుంధతీదేవిని అమితప్రేమతో ఆదరించెను. వారి పరస్పరానురాగములు

వర్ణనాతీతములు. ఆమె అందఱికిని నమస్కరించి, తనమనోవాంఛానుగుణముగ ఆశీర్వాదములను పొందెను. తన అత్తగార్లను చూడగానే ఆ సుకుమారి భయముతో కన్నులు మూసికొనెను. ఆమెకు వారు వేటగానివలలో చిక్కుకొనిన హంసలవలె గోచరించిరి. అత్తగార్ల దుస్థితిని జూచి, ఆమె దుఃఖించి, విధాత వారికి ఎంత దుర్దశను తెచ్చిపెట్టెను? అని చింతించెను." వారును ఆమెను జూచి దుఃఖించుచు విధిని అనుభవింపక తప్పదు" అని పలికిరి. పిదప జనకసుత ధైర్యము తెచ్చుకొని, నల్లకలువలబోలు తన కన్నులలో నీరు నింపుకొని, అత్తలను కలిసికొనెను. ఆ సమయమున పృథ్వి కరుణామయమయ్యెను. (చౌ॥ 1-4)

సీతాదేవి వరుసగా అత్తగార్లకు పాదాభివందనమాచరించెను. అందఱూ ప్రేమపూర్వకముగా "నీవు సర్వదా సుమంగళివిగా ఉండుము.' అని తమ మనస్సులలోనే ఆమెను ఆశీర్వదించిరి. (దో॥ 246)

సీతాదేవియు, రాజమాతలును ప్రేమాతిరేకకారణముగా వ్యాకులపాటుతో నుండుట జూచి, గురువైన వసిష్ఠుడు "కూర్చుండుడు" అని అందఱిని ఆదేశించెను. పిదప మునీశ్వరుడు మాయామేయము, నశ్వరము అగు జగత్తును గూర్చిన వేదాంత రహస్యమును దెల్పెను. పిదప దశరథ మహారాజు స్వర్గస్థుడైన వార్తను గూడ దెల్పెను. దానిని విని శ్రీరాముడు దుస్సహమైన వేదనకు గురియయ్యెను. తనమీది ప్రేమకారణముగనే రాజు అసువులు వీడెనని తెలిసికొని, ధీరోదాత్తుడైన శ్రీరాముడుగూడ మిక్కిలి వ్యాకులచిత్తుడయ్యెను. పిడుగుపాటు వంటి భయంకర వార్తను విని, లక్ష్మణుడును, సీతాదేవియు విలపించిరి. రాణులందరును రోదించిరి. ఆదినముననే దశరథుడు ప్రాణములను త్యజించెనా? అన్నట్లు అందఱును శోకసముద్రమున మునిగిరి. వసిష్ఠుడు శ్రీరామునకు ధైర్యము చెప్పి ఓదార్చెను. రామాదులు పరివారములతో మందాకినిలో స్నానములను ఆచరించిరి. ఆదినమున ప్రభువు 'నిర్జలవ్రతము'ను పూనెను. ముని ఎంతగా చెప్పినను ఎవ్వరునూ జలములను కూడ గ్రహింపలేదు. (చౌ॥ 1-4)

మఱునాడు ప్రాతఃకాలమున మునియాదేశానుసారము శ్రీరామచంద్రుడు సర్వకార్యములను శ్రద్ధాభక్తులతో నిర్వర్తించెను. (దో॥ 247)

శ్రీరామచంద్రుడు వేదోక్తముగా తనతండ్రిగారిశ్రాద్ధకర్మలను నిర్వర్తించెను. పాపములనెడి నిబిడాంధకారములకు సూర్యుడైన శ్రీరాముడు పితృ-ఋణమును దీర్చుకొని పవిత్రుడాయెను. ఎవనినామస్మరణము పాపములనెడిప్రత్తికి అగ్నితో సమానమో, సమస్తమంగళములకు నిలయమో, అట్టి శుద్ధస్వరూపుడు శ్రీరాముడు పరిశుద్ధుడాయెను. ఇది తీర్థములసంపర్కములచే గంగానది పవిత్రమైనట్లుగా ఉన్నదని మునులు భావించిరి. రెండు దినములు గడచినపిమ్మట శ్రీరాముడు ప్రియముగా గురువుతో పలికెను. "ప్రభూ! కందమూలఫలములను, నీటిని ఆహారముగా గొని జనులందఱును దుఃఖితులుగా ఉన్నారు. భరతశత్రుఘ్నులను, మంత్రులను, తల్లులను జూచి, నాకు క్షణమొక యుగముగా తోచుచున్నది. (శ్రీరామచంద్రుడు తన క్లేశములకు విచారపడుట లేదు. అతడు తన ఆత్మీయులకై పరితపించుచున్నాడు. కావున వారు క్షణమైన అక్కడ ఉండుట ఉచితముగాదని భావించుచున్నాడు) కనుక మీరు అందఱును సపరివారముగా అయోధ్యకు చేరుటయుక్తమని నా ప్రార్థన. మీరు ఇక్కడ, తండ్రి స్వర్గములో, మఱి అయోధ్య శూన్యమైనది గదా! ఈ విషయమున నా సాహసమును మన్నించి, మీకు ఉచితమనిపించిన రీతిగా చేయుడు." (చౌ॥ 1-4)

గురువు గారు ఇట్లు పలికిరి "రామా! నీవు ధర్మమునకు వంతెనవంటి వాడవు. కరుణాధాముడవు. నీవు ఇట్లు పలుకుటలో ఆశ్చర్యము లేదు. ప్రజలు దుఃఖితులైనను నీ దర్శనభాగ్యముచే వారిని కొన్ని దినములు ఇచట సుఖశాంతులతో ఉండనిమ్ము. (దో॥ 248)

పైన చెప్పబడిన శ్రీరామునివచనములను విని ప్రజలందఱును మొదట భయపడిరి. సముద్రముమధ్యలో నావ మునిగిపోవుచున్నట్లు వారు భావించిరి. కాని పిదప వసిష్ఠుని మంగళకరవచనములను విని, నావను తీరమునకు చేర్చు

అనుకూలవాయువులు వీచినంత హాయిని అనుభవించిరి. వారు ప్రతిదినము సకలపాపహారిణియైన పయస్వినీ(మందాకినీ) నదియందు మూడేసి సార్లు స్నానమాచరించుచుండిరి. మంగళమూర్తియైన శ్రీరామచంద్రునకు దండప్రణామములొనర్చుచు, నేత్రానందకరముగా ఆయనను దర్శించుకొనుచుండిరి. అయోధ్యావాసులందఱును శ్రీరాముడున్న చిత్రకూటమునందలి కామదగిరి పర్వతమును, వనములను చూచివచ్చుచుండిరి. అచట అన్ని సుఖములును గలవు. దుఃఖమను మాటయే లేదు. అక్కడి సెలయేర్లు, అమృతజలములతో ప్రవహించుచుండెను. శీతలమందసుగంధపవనములు వారి దైహిక, దైవిక, భౌతిక తాపత్రయములను హరించివేయుచుండెను. వృక్షములు, లతలు, తృణములు, వివిధ ఫల పుష్పములు, పల్లవములు సమృద్ధిగానుండెను. సుందరశిలలు, వృక్షచ్ఛాయలు సుఖదాయకములై యుండెను. ఆ వన శోభలను వర్ణించుట కెవరితరము. (చౌ॥ 1-4)

సరోవరములయందు కమలములు వికసించుచుండెను. జలపక్షులకూజితములు, తుమ్మెదల ఝంకారములు, చిత్రవిచిత్రములైన పక్షులకిలకిలారావములు ఆహ్లాదకరముగా నుండెను. పశుపక్ష్యాదులు వైరములు మాని యథేచ్ఛగా విహరించుచుండెను. (దో॥ 249)

## అయోధ్యావాసులకు కోలుల భిల్లుల ఆతిథ్యము

కోలులు, కిరాతులు, భిల్లులు మొదలగు ఆటవికులు స్వచ్ఛమైన అమృతతుల్య మధువులను చక్కని దొన్నెలలో తెచ్చియిచ్చుచుండిరి. అట్లే కందమూలఫలములను దెచ్చి, వినయముతో సమర్పించి, వాటి రుచులను, గుణ విశేషములను గూర్చి అందఱికిని వివరించు చుండిరి. ప్రజలు వాటికి మూల్యమును చెల్లింపబోగా వారు స్వీకరింపకుండిరి. "మూల్యము గ్రహింపనిచో మేము వీటిని స్వీకరింపము." అని పలుకుచు ప్రజలువాటిని తిరిగి ఇచ్చివేయుచుండిరి. అప్పుడు వనవాసులు "వీటిని మీరు తిరిగిఇచ్చినచో రామునిపై ఆన" అని అనుచుండిరి. "ప్రేమతో మేము ఇచ్చిన దానిని సాధు జనులు అంగీకరించెదరు. (మీరు సాధు పురుషులు. మేము ప్రేమతో ఇచ్చిన దానికి ధర కట్టినను లేదా తిరిగి ఇచ్చినను మా ప్రేమను అవమానపఱచినట్లే) మీ వంటి పుణ్యాత్ములెక్కడ? మావంటి అల్పులెక్కడ? శ్రీరాముని కృపవలననే మాకు మీ దర్శనభాగ్యము గలినది. మరుభూములకు గంగానదివలె మాకు మీ దర్శనము అతి దుర్లభము. కృపాళువైన శ్రీరామునకు నిషాదునిపై ఎంత కృప? రాజు వలెనే అతని కుటుంబము, ప్రజలు కూడా ఉండవలెను. అనగా మీరును మాపై కృపజూప వలెను. (చౌ॥ 1-4)

కావున మనస్సులలో సంకోచమును వదలి, మా ప్రేమను ఆదరించి, దయచేసి, మేమిచ్చిన కందమూలఫలములను, అంకురములను గ్రహించి, మమ్ము కృతార్థులనుగా జేయుడు. (దో॥ 250)

పవిత్రులైన మీరు మావనములకు అతిథులుగా వచ్చితిరి. సామాన్యముగా మీకు సేవచేయు భాగ్యము, యోగ్యతలు మాకు లేవు. స్వామీ! మీకు మేము ఏమి ఈయగలము? ఆటవికుల మైత్రి ఇంధనములు(కట్టెలు) పత్రములకే(ఆకులవఱకే) పరిమితము. మేము మీ వస్త్రములను, పాత్రలను దొంగలింపకుండుటయే మావలన మీకు లభించు గొప్ప సేవ. మేము పామరులము. జీవహింస చేయువారము. కుటిలురము, దుష్టబుద్ధులము, నిమ్నజాతుల వారము మా జీవితములు రేయింబవళ్ళు పాపకార్యములను చేయుటలోనే గడిచిపోవుచున్నవి. ఐనను ఒంటిపై బట్ట, తిమటకు తిండి కఱవైనవి. కావున కలలోనైనను ధర్మబుద్ధి యెట్లు కలుగును? ఇదియంతయును శ్రీరామచంద్రునిదర్శనప్రభావమే. ప్రభువుయొక్క పాదపద్మములను దర్శించినప్పుడే మా దుఃఖములును, దోషములును తొలగిపోయినవి"- వనవాసుల వచనములను విని, అయోధ్య వాసులు ప్రేమమగ్నులై వారి భాగ్యమును ప్రశంసించిరి. (చౌ॥ 1-4)

అందఱును వారి భాగ్యమును ప్రశంసించిరి, అనురాగ వచనములను పలికిరి. వారి మాటల తీరును, వ్యవహార సరళిని, శ్రీ సీతారాములపై వారికి గల భక్తి శ్రద్ధలను జూచి ఎల్లరును ఆనందించిరి. ఆ కోలుల, భిల్లులమాటలను విన్నతరువాత స్త్రీ, పురుషులందఱును సీతారాములపై తమకుగలప్రేమ అత్యల్పమని భావించిరి. తులసీదాసు చెప్పుచున్నాడు రఘువంశమణియైన శ్రీరామచంద్రునికృపాప్రభావమున ఇనుము తనపై లావుతుంబను మోయుచున్నది. ఇనుము సహజముగా నీటిలో తాను మునుగును, తనను ఆశ్రయించిన వారిని గూడ ముంచును. కాని లావుతుంబ (ఎండు సొఱకాయ) నీటిలో తాను తేలుచుండును, తనను ఆశ్రయించిన వారిని గూడ నీటిపైన తేలియుండునట్లుగా జేయును.

అటవికులైన భిల్లులు, కోలులు ఇనుమువంటివారు. నాగరికులైన అయోధ్యావాసులు లావుతుంబ (ఎండు సొరకాయ) వంటివారు

భిల్లులు, కోలులు భక్తితో నిరంతరము రాముని సేవించుచు రామానుగ్రహమునకు పాత్రులగుచుండిరి. రామభక్తి తత్పరులైన (ఇనుమువంటి) భిల్లుల కోలుల రామభక్తి నేడు లావుతుంబ (ఎండు సొరకాయ)వంటి అయోధ్యా వాసులకు ఆదర్శప్రాయమైనది. రామభక్తులు తాము తరింతురు. ఇతరులను తరింపజేయుదురు. (ఛం)

గ్రీష్మతపముచే విలవిలాడుచున్న కప్పలు, నెమళ్లు తొలకరి వానలతో ఆనందముగా ఎగిరెగిరి, గంతులు వేయును, నాట్యములాడును, అట్లే శ్రీరామవిరహతాపమున శుష్కించిన అయోధ్యావాసులు చిత్రకూటమున శ్రీరామ ప్రేమవర్షమున తడిసి, ఆనందముతో వనమున నలుదెసల విహరించుచుండిరి. (సో॥ 251)

అయోధ్యావాసులైన స్త్రీ పురుషులు అత్యంత ప్రేమమగ్నులై దినమొక క్షణముగా గడుపుచుండిరి. సీతాదేవి తన అత్తలందఱికిని ఒక్కొక్కరికి ఒక్కొక్క రూపములో సాదరముగా సేవలు చేయుచుండెను. ఈ రహస్యము శ్రీరామునకు దప్ప ఇతరులకెవ్వరికిని దెలియదు. ఏలనన సీతాదేవి పరాశక్తి, మాయా స్వరూపిణి. ఆమె తన సేవల ద్వారా అత్తగార్లను సంతృప్తి పఱచెను. వారు ఆమెకు ఉపదేశములను, ఆశీస్సులను ఇచ్చిరి. సీతారామలక్ష్మణుల శాంత స్వభావములను జూచి, కుటిల స్వభావురాలైన కైకేయి మిక్కిలి పశ్చాత్తాపపడెను. "ఈ భూమిపగిలి, నన్నేల కబళింపదు? విధాత ఏల నాకు చావును ప్రసాదింపదు?" అని ఆమె పృథ్విని, యముని ప్రార్థించు చుండెను. "శ్రీరామునకు విముఖులైన వారికి నరకములోగూడ స్థానము ఉండదు"- అని వేదములలలో ప్రస్తావింపబడిన మాట లోకవిదితము. శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చునా? రాడా? అని ప్రతివ్యక్తిమనస్సులో సందేహము కలుగుచుండెను. (చౌ॥ 1-4)

భరతుడు ఆకలి దప్పులను మఱచెను. అతనికి రాత్రులయందును నిద్రపట్టుట లేదు. కొద్దిగా నీరున్నమడుగులో బురదలోనున్న చేపవలె భరతుడు మిగుల విలవిలలాడు చుండెను. (దో॥ 252)

భరతుడు ఆలోచింపసాగెను. "బాగుగా పండి, కోతకువచ్చిన పంట ఈతిబాధలవలన చేతికి అందక, పాడైపోయినట్లు రాముడు రాజ్యాభిషిక్తుడగు సమయమున సర్వమూ భగ్నమైనది. తల్లినెపమున విధికుతంత్రమును పన్నెను. ఇక శ్రీరామచంద్రుని పట్టాభిషేకము జరుగుటయెట్లు? నాకు ఏ ఉపాయమూ తోచుట లేదు. గురువు గారి ఆజ్ఞ మేరకు శ్రీరాముడు తప్పక తిరిగిరాగలడు. కాని వసిష్ఠ మహాముని శ్రీరామచంద్రుని మనస్సును గుర్తించియే తగిన విధముగా వచించును. కౌసల్యామాత చెప్పినచో శ్రీరఘునాథుడు మఱలి రాగలడు. కాని ఆమె శ్రీరామునిగన్నతల్లి, ఆయనను బలవంతము చేయునా? నేను అతని దాసుడను, లెక్కలోనికే రాను. నాకు కాలముగూడ అనుకూలము గాలేదు. విధాతయు ప్రతికూలముగా ఉన్నాడు. అనాలోచనతో నేను పట్టుబట్టినచో అది అధర్మమే యగును. ఏలనన సేవకుని ధర్మము పర్వతముకంటెను గురుతరము." ఇంతకును అతనికి ఏ

ఉపాయమూ తట్టలేదు. భరతుడు ఇట్లు ఆలోచించుచుండగానే తెల్లవాటెను. ప్రాతఃకాలమున భరతుడు స్నానాదికములను ముగించుకొని, శ్రీరామచంద్రునకు శిరసా ప్రణమిల్లి, కూర్చొనియుండగా వసిష్ఠుడు అతనిని పిలువనంపెను. (చౌ॥ 1-4)

## వసిష్ఠ భరతుల సమాలోచనలు

గురువుగారిపాదపద్మములకు ప్రణమిల్లి, ఆయన ఆజ్ఞను బడసి భరతుడు కూర్చుండెను. అదే సమయమున విప్రులు, మహాజనులు, మంత్రులు సభా సదులందఱును అచట సమావేశమైరి. (దో॥ 253)

మునిశ్రేష్ఠుడైన వసిష్ఠుడు సందర్భానుసారముగా ఇట్లు పలికెను. "భరతా! సభాసదులారా! వినుడు శ్రీరామచంద్రుడు సర్వస్వతంత్రుడు ధర్మపరిరక్షకుడు, భగవంతుడు. సూర్యవంశమునకే సూర్యుడు. ఆయన సత్యసంధుడు, వేదమర్యాదలను కాపాడెడివాడు. శ్రీరామునిఅవతారము జగత్కల్యాణమునకై జరిగినది. ఆయన గురువుఆజ్ఞను, తలిదండ్రుల మాటను మీఱడు. దుష్టులను హతమార్చును. దేవతలను రక్షించును. నీతి, ప్రీతి, స్వార్థము, పరమార్థము అను వాటి యథార్థములను రామునివలె ఎవ్వరును ఎఱుగరు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, సూర్యచంద్రులు, దిక్పాలకులు, మాయా జీవకాల కర్మలు, సర్పరాజు, పృథ్వీపతి మొదలగు వారిలోను, ప్రభుత్వము, యోగ సిద్ధులు, వేదశాస్త్ర విషయములు మున్నగువాటిలోను శ్రీరాముని ఆజ్ఞయే విలసిల్లుచున్నది. శ్రీరాముడు సర్వలోకములకును ప్రభువు. (చౌ॥ 1-4)

కావున శ్రీరాముని ఆజ్ఞను పాలించుటలోను, మనోభీష్టములను గౌరవించుటలోను మనకు మేలుగలదు. ఈ తత్త్వ రహస్యమును ఎఱింగి యోగ్యులైన మీరు, మీకు సమ్మతమైన సూచనలను చేయుడు. (దో॥ 254)

శ్రీరాముని పట్టాభిషేకము అందఱికిని సుఖప్రదము. అదియే మంగళకరము, ఆనందదాయకము. శ్రీరామచంద్రుడు అయోధ్యకు మఱలివచ్చు మార్గమును ఆలోచింపుడు. అందఱును ఆలోచించి, సూచించిన ఉపాయమునే అనుసరింతము." నీతిని, పరమార్థమును, లోకహితమును గోరి, ముని పల్కిన వాక్యములను అందఱును ఆదరముతో వినిరి. కాని ఎవ్వరి నుండియు, ఎట్టి సమాధానమూ రాలేదు. అందఱును మూగనోము పట్టిరి. అప్పుడు భరతుడు ప్రణమిల్లి, అంజలి ఘటించి పల్కెను. "సూర్యవంశమున పెక్కుమంది రాజులు ఉద్భవించిరి. వారు ఒకరికంటె మఱియొకరు గొప్పవారు. వారి జన్మలకు కారకులు తల్లిదండ్రులు. కాని వారి శుభాశుభకర్మ ఫలములను విధాత పంచియిచ్చును. ఐనను మీ ఆశీర్వచనము సమస్త దుఃఖములను రూపుమాపి, శుభములను చేకూర్చును. ఇది లోకవిదితము. స్వామీ! విధాతనిర్ణయమును మార్చగల వారు మీరొక్కరే. మీ నిర్ణయమును ఎవ్వరునూ త్రోసిపుచ్చలేరు. (చౌ॥ 1-4)

"ఐననూ మీరే మా అభిప్రాయమును అడుగుచున్నారు. ఇది నా దురదృష్టము" భరతుని వినమ్రవచనములను విని, వసిష్ఠుని హృదయమున ప్రేమ పొంగిపొరలెను. (దో॥ 255)

గురువు పలికెను. "నాయనా! నీ మాటలు సత్యమే. కాని దానికి శ్రీరామచంద్రుని కృపయే కారణము. శ్రీరామునియెడ విముఖతగలవానికి స్వప్నములోగూడ కార్యసిద్ధి గలుగదు. ఒక్క ఉపాయముతోచుచున్నది. దానిని చెప్పుటకు సంకోచముగానున్నది. సర్వస్వము నష్టపోవుచున్నప్పుడు బుద్ధిమంతులు సగమును త్యాగము చేయుటకు సిద్ధపడెదరు. కావున మీరు ఇద్దఱును (భరత శత్రుఘ్నులు) వనవాసము చేయుడు. సీతారామలక్ష్మణులను మఱల అయోధ్యకు రానిండు." ఈ మంచి, మాటలను విని, సోదరులిద్దఱును ఆనంద పరవశులైరి. వారి దేహములు హర్షపులకితములాయెను. వారి మనస్సులు ప్రసన్నములై, శరీరములు తేజోవంతములాయెను. దశరథుడు

బ్రతికినట్లును, శ్రీరాముడు రాజైనంతగా సంతోషపడిరి. ఇందు హాని స్వల్పముగా లాభమధికముగా ఉన్నట్లు తోచెను. కాని రాణులకు మాత్రము సుఖదుఃఖములు సమానమనిపించెను. కావున వారు విలపింపసాగిరి. భరతుడు పలికెను. "మునీశ్వరుని ఆజ్ఞను నెఱవేర్చుటవలన జగత్తులోని సమస్త జీవుల మనోరథములీడేరును. పదునాలుగు సంవత్సరములేయేల? నేను జీవితాంతమూ వనవాసము చేయగలను. ఇంతకంటె నాకు ఆనందమును గూర్చునదియేమున్నది? (చౌ॥ 1-4)

శ్రీ సీతారాములిద్దఱును అంతర్యాములు. మీరు సర్వజ్ఞులు, జ్ఞానులు. మీరు ఈ మాటలను హృదయ పూర్వకముగా చెప్పుచున్నచో స్వామీ! ఈ ప్రతిపాదనను మార్చబోమని నిశ్చయముగా పలుకుడు." (దో॥ 256)

భరతుని పలుకులను విని, వసిష్ఠుడును, సభాసదులును అతని భక్తిని మెచ్చుకొని, పరమానంద భరితులైరి. భరతునిమహిమ ఒక మహాసముద్రమైనచో మునీశ్వరుని బుద్ధి ఆసాగరతీరమున నిలబడిన ఒక నిస్సహాయురాలైన స్త్రీతో సమానము. ఆమె ఆ మహిమా సముద్రమును దాటగోరెను. ఆమె అందులకై ఉపాయమును ఎంతగానో వెదకెను. కాని నావగాని, ఓడగాని, పడవగాని, లేక కనీసము ఒక ఊతగాని దొరక లేదు. భరతుని గొప్పదనమును ఎవరు గ్రహింపగలరు? సముద్రమును ఒక గుంటలోని ఆలిచిప్పలో ఇముడ్చగలమా? వసిష్ఠుని దృష్టిలో భరతుడు అత్యంత మహిమాన్వితుడాయెను. ఆయన సపరివారముగా శ్రీరాముని కడకు వచ్చెను. శ్రీరామచంద్ర ప్రభువు ఆయనకు నమస్కరించి, సుఖాసీనుని గావించెను. ముని ఆజ్ఞతో అందఱును కూర్చొనిరి. పిదప దేశకాలసందర్భములకు తగినట్లు ముని వచించెను. "సర్వజ్ఞా! రామా! నీవు ధర్మనీతి, గుణ, జ్ఞానములకు నిధివి. వినుము. (చౌ॥ 1-4)

నీవు అందఱి హృదయములలో అంతర్యామిగా ఉందువు. వారిమంచి చెడు భావములనుగూడ ఎఱుంగుదువు. పురవాసులకును, తల్లులకును, భరతునకును ఏది శుభ ప్రదమో ఆ ఉపాయమును తెల్పుము. (దో॥ 257)

ఆర్తులైనవారు ఎప్పుడును ఆలోచించి మాట్లాడరు. జూదరులు తమఎత్తుగడలనే చూతురు-" మునీశ్వరుని మాటలను విని, రఘునాథుడు పలికెను. " మునీశ్వరా! ఉపాయమును మీరే తెల్పవలెను. మీ కోరికను నెఱవేర్చుచు, మీ ఆజ్ఞను పాలించుటలోనే అందఱికిని మేలుచేకూరును. మీ నిర్ణయమును నేను శిరసావహించెదను. ఓ గురవరా! ఎల్లరును మీ ఆజ్ఞనే తప్పక తలదాల్చెదరు." మునినుడివెను. రామా! నీవు సత్యము పలికితివి. భరతుని భక్తి ముందు నా స్వీయాలోచనకు చోటులేదు. కావున నా బుద్ధి భరతునిభక్తికి తలయొగ్గినది. భరతుడపేక్షించిన దానినే చేయుట మంచిదని నా అభిప్రాయము. శంకరుడే దీనికి సాక్షి. (చౌ॥ 1-4)

మొదట భరతుని అభ్యర్థనను సావధానముగా వినుడు. దానిని గూర్చి బాగుగా ఆలోచింపుడు. పిమ్మట లోక మర్యాదను, సజ్జనుల అభిప్రాయములను, రాజనీతిని, వేదోక్త విధిని వడపోసి, ఆ విధముగా నిర్ణయింపుడు. (దో॥ 258)

భరతునిపై గురువునకు గల అపారమైన అనురాగమును జూచి, శ్రీరాముని హృదయము మిగుల ఆనందించెను. ఆతడు భరతుని ధర్మపరిరక్షకునిగా, త్రికరణ శుద్ధిగల తనభక్తునిగా గుర్తించెను. గురువుగారి ఆజ్ఞను అనుసరించి, శ్రీరాముడు మనోహరములైన, మంగళకరములైన మృదుమధురవచనములను పలికెను. "స్వామీ! మీమీద, మా తండ్రిగారిపాదములమీద, ప్రమాణముచేసి చెప్పుచున్నాను. భరతునితో సమానుడైన సోదరుడు ఎప్పుడును లేడు. గురుచరణకమలములను ప్రేమించు వానిని లోకము, వేదములును భాగ్యవంతునిగా గౌరవించును, ఇంతేగాక మీ అనురాగమునకు నోచుకొనిన భరతునిభాగ్యమును ఎవరు కొనియాడగలరు? అతడు

నాతమ్ముడగుటవలన అతనియెదుట అతనిని పొగడుటకు నేను సంకోచపడుచున్నాను. భరతుని అభిప్రాయమును మన్నించుటయే శ్రేయస్కరము"- ఈ విధముగానుడివి శ్రీరామచంద్రుడు మౌనము వహించెను. (చౌ॥ 1-4)

అపుడు వసిష్ఠమహాముని భరతునితో పలికెను. "నాయనా! భరతా! సంకోచమును వీడి, దయానిధియు, నీకు ప్రియమైన అన్నయు ఐన శ్రీరామచంద్రునకు నీ మనసులోని మాటను తెలుపుము. (దో॥ 259)

ముని వచనములను విని, శ్రీరామచంద్రుని అభిప్రాయమును గ్రహించి, వారి అనుకూల వైఖరికి భరతుడు ఆనందించెను. కాని భారమంతయును తనపై బడుటచే ఏమియు పలుక లేక ఆలోచనలలో పడెను. అతని శరీరము పులకితమయ్యెను. సభలో లేచినిలుచుండెను. కమలములవంటి ఆయననేత్రములు కన్నీటివరదలాయెను. భరతుడు అంజలి ఘటించి, ఇట్లు పలికెను. "నేను చెప్పవలసిన విషయమును మునీశ్వరులే సెలవిచ్చిరి. ఇంతకంటెను ఎక్కువగా నేనేమితెలుపగలను? నేను నా స్వామిస్వభావమును ఎఱుగుదును. ఆయన అపరాధులను గూడ కోపగింపరు. ఆయనకు నాపైగల ప్రేమ, కృప, అపారములు. ఆటలలో గూడ ఆయనను నేను అప్రసన్నునిగా చూడలేదు. బాల్యము నుండియు ఆయనను నేను విడిచియుండలేదు. ఆయన గూడ నా మనస్సునకు ప్రతికూలముగా ఏమియును చేయలేదు. నేను ప్రభుకృపను తనివితీర అనుభవించితిని. ఆటలలో నేను ఓడిపోవుచుండగా నన్ను గెలిపించుచుండెడి వాడు. (చౌ॥ 1-4)

నేను గూడ స్నేహ సంకోచముల కారణముగా ఎదుట నిలిచి, ఎన్నడును మాట్లాడియుండలేదు. ప్రేమ పిపాసగల నా కన్నులకు ప్రభువును ఎంతగా దర్శించినను తనివి తీరుట లేదు. (దో॥ 260)

కాని విధాత రామునకు నాపై గల వాత్సల్యమును జూచి సహింపలేకపోయెను. అల్పబుద్ధిగల నా తల్లిద్వారా ఆవిధి మా ఇద్దఱి మధ్య ఒక అగాధమును ఏర్పఱచెను. ఇట్లు చెప్పుటయునాకు తగదు. ఏలనన ఎవరైనను తమను తాము సాధువులుగా తలంచుకొనినంత మాత్రములో వారు సాధువులగుదురా? కాబట్టి ఇతరులచే సాధువులుగా, పవిత్రులుగా భావింపబడువారే నిజమైన సాధువులు. నా తల్లి దుష్టురాలనియు, నేను సదాచారుడను, సాధువును అనిభావించుటయే మహాపాపము. అరికె బియ్యపు కంకులనుండి సన్న బియ్యము వచ్చునా? నల్లని ఆలిచిప్పలనుండి ముత్యములు లభించునా? (వేప చెట్టునకు మామిడి పండ్లు కాయునా?) కలలోగూడ ఎవ్వరినీ దోషిగా తలంపరాదు. నిజముగా నా దౌర్భాగ్యమే ఒక అగాధ సముద్రము. ఇది నా పాపఫలము - అని తెలిసికొనకుండగనే నేను నా తల్లిని కఠిన వచనములతో నొప్పించితిని. నా పాపపరిహారమునకు ఏ ఉపాయమూ తోచకున్నది. ఒకే ఉపాయముచే నాకు మేలు కలిగితీరును. గురువులు సర్వసమర్థులు, శ్రీ సీతారాములే నాకు యజమానులు, ఇష్టదేవతలు. కావున ఫలితము శుభప్రదమనియే నేను భావించెదను. (చౌ॥ 1-4)

సజ్జనులున్న ఈ సభలో గురువుల, ప్రభువుల ఎదుట, పరమపవిత్రక్షేత్రమైన ఈ చిత్రకూటమున నేను సద్భావముతో పలుకుచున్నాను. ఇది ప్రేమయా? కపటమా? సత్యమా? అసత్యమా? అనునది వసిష్ఠమహర్షియు, శ్రీరామచంద్రుడే ఎఱుగుదురు. (గురువుగారు సర్వజ్ఞులు, శ్రీరామచంద్రుడు అంతర్యామి. కావున వారికడ దాచగలిగినది ఏమియు లేదు.) (దో॥ 261)

రామునిపైగల ప్రేమకారణముగా మాతండ్రిగారు మరణించుటను, నా తల్లి దుర్బుద్ధిని ప్రపంచమంతయును చూచినది. ఇప్పుడు మా తల్లులవ్యాకులపాటును చూడలేము. అయోధ్యలోని పౌరులందఱును దుస్సహమైన తాపముచే సతమతమగుచున్నారు. ఈ అనర్థములకన్నింటికిని మూలమునేనే. అని తెలిసికొని దుఃఖములనన్నింటిని సహించినాను. మునివేషమును స్వీకరించి, సీతాలక్ష్మణుల వెంటనిడుకొని, శ్రీరామచంద్రుడు పాదరక్షలు గూడ లేకుండ కాలినడకన వనములకు వచ్చినాడు. ఈ విషయమును ఎఱింగియు ఇంకను నేను బ్రతికియే యున్నాను.

శంకరుడే దీనికి సాక్షి. నిషాదరాజైన గుహునిస్నేహమును జూచియు వజ్రసమానమైన ఈ హృదయము పగులలేదు. ఇక్కడికి వచ్చి, ఇప్పుడు అన్నింటిని ప్రత్యక్షముగా చూచితిని. జడత్వము ఆవరించిన ఈ జీవుడు అన్నింటికినీ తట్టుకొన గలడు. మహిమాన్వితులైన సీతారామలక్ష్మణులను జూచి త్రోవలో గల సర్పములును, తేళ్ళును తమ ప్రమాదకర విషమును, తీవ్ర క్రోధమును త్యజించినవి. (చౌ॥ 1-4)

అట్టి సీతారామలక్ష్మణులు కైకేయి దృష్టిలో శత్రువులైరి. ఆ కైకేయి పుత్రుడనైన నాకు దప్ప ఈ దుస్సహవేదనను విధాత ఎవ్వరికి విధించును? (దో॥ 262)

ఆర్తి, ప్రేమ, నీతి, వినయములతో నిండిన భరతునివ్యాకులితహృదయమునుండి వెలువడిన ఈ సముచితవచనములను ఎల్లరును వినిరి. మంచుదెబ్బకు గురియైన కమలవనమువలె ఆ సమయమున సదస్యులెల్లరును శోకించుచు దుఃఖమగ్నులైయుండిరి. అంతట జ్ఞానియైన వసిష్ఠుడు పెక్కు పౌరాణికగాథలను వినిపించి, భరతుని ఊరడించెను. సూర్యవంశమనెడి కలువసమూహమునకు చంద్రుడైన శ్రీరాముడుగూడ యుక్తి యుక్తముగా ఇట్లు పలికెను. "నాయనా! జీవునిగతి ఈశ్వరుని అధీనమని తెలిసియు, నీవు వ్యర్థముగా బాధపడుచున్నావు. ముల్లోకములలో త్రికాలములయందును నీవంటి 'యశస్వి' లేడని నా ఉద్దేశ్యము. పుణ్య శ్లోకులెల్లరును నీ తరువాతి వారే. నీపై కుటిలత్వమును ఆపాదించువారికి ఇహపరములు దక్కవు. గురువులను, సజ్జనులను సేవింపనివారే తల్లి కైకేయిని దోషిగా తలంతురు. (చౌ॥ 1-4)

భరతా! నీ నామస్మరణమాత్రముననే సమస్తపాపములును, అజ్ఞానమూ అశుభములూ, అన్నియు తొలగి పోవును. ఈలోకమున కీర్తి, పరలోకమున సద్గతి ప్రాప్తించును. (దో॥ 263)

భరతా! పరమశివుని సాక్షిగా నేను సత్యమును పలుకుచున్నాను. నీ రక్షణపైననే పృథ్వి ఆధారపడి యున్నది. (మహారాజుగారి ఆజ్ఞాపాలనము నీ మీదనే ఆధారపడియున్నది. అట్లుపాలించుటవలననే పృథ్వి సురక్షితముగా ఉండును. మునులక్లేశములు తొలగును.) కావున సోదరా!వ్యర్థముగా కుతర్కము చేయవలదు. ప్రేమ, వైరము దాచినను దాగవు. చూడుము, పశుపక్ష్యాదులు మునుల సమీపమున నిర్భయముగా తిరుగుచుండును. కాని హింసాపరుడైన వేటగానిని అల్లంత దూరమున చూడగానే పాఱిపోవును. పశుపక్ష్యాదులే శత్రువులను, మిత్రులను గుర్తింపగలిగినప్పుడు మానవజన్మను పొంది, సద్గుణములను, జ్ఞానమును కలిగినవారు ఏలగుర్తింపలేరు. నాయనా! నిన్ను నేను బాగుగా ఎఱుగుదును. కాని నేనేమి చేయగలను? నా మనస్సు అయోమయస్థితికిలోనైనది. రాజుగారు సత్యమును పరిరక్షించుటకొఱకై నన్ను త్యజించిరి. నాపైగల ప్రేమకారణముగా ప్రాణములనే త్యజించిరి. అట్టి తండ్రిగారి మాటను జవదాటినచో మనస్సు బాధపడును. అన్నిటికంటెను ఎక్కువగా నా మనస్సులో నీ గుఱించియే చింతగలదు. వీటన్నింటికంటెను ముఖ్యమైనది గురువుగారి ఆజ్ఞ. కావున నీవేది చెప్పినను దానిని తప్పక చేయుదును. (చౌ॥ 1-4)

ప్రశాంత చిత్తుడవై సంకోచమును వీడి, నేనేమి చేయవలెనో తెల్పుము. దానిని నేను నెఱవేర్చెదను. సత్యసంధుడైన శ్రీరాముని మాటలను విని, సభాసదులు ప్రసన్నచిత్తులైరి. (దో॥ 264)

స్వర్గమున ఇంద్రాదిదేవతలు 'ఇప్పుడింక అనర్థములు జరుగబోవుచున్నవి' అని భయపడి విచారించిరి. వారికి ఏ ఉపాయమూ తోచలేదు. మనస్సులోనే శ్రీరామచంద్రుని శరణుజొచ్చిరి. శ్రీ రఘునాథుడు భక్తపరాధీనుడని వారిలో వారు తర్కించుకొనిరి. అంబరీషదుర్వాసుల గాథలను తలచి, ఇంద్రుడు, దేవతలు, పూర్తిగా నిస్పృహలకు లోనైరి. (కావున పరమ భక్తుడైన భరతునకు విరుద్ధముగా ఆలోచించుటకంటె భరతుని వేడుకొనుటయే మంచిదని వారు తలంచిరి) ఇంతకుముందుగూడ దేవతలు పెక్కు సంవత్సరములు కష్టములకు ఓర్చుకొనిరి. అప్పుడు ప్రహ్లాదుడు

నృసింహస్వామిని ప్రకటింపజేసెను. దేవతలందఱును తలలు బాదుకొనుచు "ఇప్పుడు భరతుడు మాత్రమే మనలను ఆదుకొనగల్గును." అని ఒకరి చెవిలో మఱియొకరు చెప్పికొనసాగిరి. పిదప వారిలోవారు ఇట్లు తర్కించుకొనిరి. "దేవతలారా! మఱియొక ఉపాయము ఏదియును లేదు. శ్రీరాముడు తన అనన్యభక్తులప్రేమను ఎఱుగును. (తన భక్తులను సేవించువారిని ప్రభువు కటాక్షించును) కావున తనగుణశీలములచే శ్రీరాముని వశపఱచుకొనిన 'భరతుని' మనమందఱము ప్రేమానురాగములతో స్మరింతము". (చౌ॥ 1-4)

దేవతల ఆలోచనలను విని బృహస్పతి ఇట్లనెను. " ఈ ఆలోచన మంచిది. భరతుని చరణములపై భక్తిని నిలుపుట - మంగళప్రదము, మీకు సౌభాగ్యకరము. (దో॥ 265)

సీతాపతియైన శ్రీరామునిదాసులసేవ వందకామధేనువులతో సమానము, ఉత్తమోత్తమము. మీ మనసులలో భరతునిపై ప్రేమ అంకురించినది. ఇక విచారము మానుడు. విధాత మీ పనిని నెఱవేర్చును. ఇంద్రా! భరతుని మహిమను జూడుము. అతని సరళస్వభావమునకు శ్రీరామచంద్రుడే పూర్తిగా వశుడాయెను. దేవతలారా! భరతుని శ్రీరాముని ఛాయగా భావించి, మీ మనస్సులను పదిలపఱచుకొనుడు, భయపడకుడు". దేవగురువైన బృహస్పతి భావనలను, దేవతల ఆలోచనలను సర్వాంతర్యామియైన శ్రీరామచంద్రుడు విని, విచారపడెను. ఇచ్చట భరతుని వ్యాకులపాటును జూచి, ఆయన సంకోచమునకు లోనయ్యెను. పూర్తిగా భారము తనపై బడినదని భావించి, అప్పుడు భరతుడు పరిపరి విధములుగా చింతితుడయ్యెను. బాగుగా ఆలోచించిన పిమ్మట అతడు శ్రీరాముని ఆజ్ఞను పాలించుటయే తనకు శ్రేయస్కరమని నిశ్చయించుకొనెను. ప్రభువు నిర్ణయ బాధ్యతను తనపై ఉంచుకొనక నాపై బెట్టెను. ఆ విధముగా నాపై అపరిమితప్రేమ చూపెను. ఇది ఆయనకు నాపైగల అపార కృపకు నిదర్శనము. (చౌ॥ 1-4)

"శ్రీ జానకీరామునకు నాపై మిక్కిలి ప్రేమగలదు. ఇట్లు ఆలోచించి, భరతుడు ప్రణమిల్లి అంజలిఘటించి పలికెను. (దో॥ 266)

"స్వామీ! కరుణాసాగరా! అంతర్యామీ! ఇప్పుడు నేనేమి చెప్పగలను. మీతో ఏమి చెప్పింపగలను? గురువుగారి ప్రసన్నత, మీ అనుకూల్యము మలినమైన నా మనస్సునందలి కల్పితవ్యధను తుడిచివేసినవి. నా భయము నిరాధారమైనది. ఎవ్వడైనను మార్గమును మఱచినచో అందు సూర్యుని దోషములేదు. నా దౌర్భాగ్యము, నా తల్లి కుటిలత్వము, విధి ప్రాతికూల్యము, కాలవైపరీత్యము- ఇవి అన్నియును నాకు వ్యతిరేకముగా కుట్రపన్నినవి. కాని శరణాగతవత్సలుడవగు నీ ప్రతిజ్ఞ నన్ను రక్షించినది. ఇది నీకు క్రొత్తగాదు. లోకములో వేదములలో, ఇది ప్రసిద్ధమైనది. ప్రభూ! ప్రపంచమంతయు ప్రతికూలమైనను మీరు మంచివారైనప్పుడు మీద్వారా తప్ప వేరెవరి ద్వారానైనను ఎవరికి మేలు ఎట్లు జరుగును? అనగా మీ మంచితనమువలననే అందఱికిని మేలు జరుగును. మీ కృపయున్నచో సమస్త ప్రపంచమూ వ్యతిరేకమైననేమి? దేవా! మీ స్వభావము కల్పవృక్షముతో సమానము. అది అందఱికిని అండదండగానుండును. ఎవ్వరికినీ అనుకూలమూగాదు, ప్రతికూలమూ గాదు. (చౌ॥ 1-4)

ఆ కల్పవృక్షమును గుర్తించి, సమీపించినచో దానిఛాయయే చింతలనన్నింటిని రూపుమాపును. ప్రభువైనను, పేదవాడైనను, సుజనుడైనను, దుర్జనుడైనను ప్రపంచమున ఎవ్వరైనను వారిమనోరథములను ఆ వృక్షము నెఱవేర్చును. (దో॥ 267)

గురువుగారునూ సర్వవిధముల నాపై జూపిన ప్రేమానురాగముల ప్రభావమున నా దుఃఖము తొలగిపోయినది. ఇప్పుడు నా మనస్సునందు ఎట్టి సందేహమూ లేదు. ఓ కరుణామూర్తీ! మీ మనస్సునకు ఎట్టి ఇబ్బందిని కలిగింపని

దానిని నిస్సంకోచముగా చేయుడు. తనస్వామిని సందిగ్ధావస్థలో పడవేసి, తనక్షేమమునే కోరుకొను సేవకుని బుద్ధి అల్పమైనది. తన సుఖములను, లోభములను త్యజించి, స్వామిని సేవించుటలోనే సేవకునకు నిజమైన హితముకలదు. స్వామీ! మిమ్ము అయోధ్యకు తిరిగి రమ్మనుట మా అందఱి స్వార్థమే. మఱియు మీ ఆజ్ఞను పాటించుటలోనే అనంతశుభములు గలవు. ఇదియే స్వార్థపరమార్థసారము, సమస్తపుణ్యముల ఫలము, సద్గతులభూషణము. దేవా! నా ప్రార్థనను ఆలకించి, మీకు ఉచితమనిపించినరీతి చేయుడు. రాజ్యాభిషేకమునకు వలసిన సామగ్రియంతయు తీసికొని రాబడినది. మీ మనస్సు అంగీకరించినచో ఇచటనే రాజ్యపట్టాభిషేకమును జరుపుకొని, దయతో ఆ సామగ్రికి సార్థకతను చేకూర్పుడు. (చౌ॥ 1-4)

నన్ను, శత్రుఘ్నుని వనములకు పంపుడు. మీరు అయోధ్యకు వెళ్లి, అందఱినీ ఆదుకొనుడు. లేనిచో ఏదో ఒక విధముగా ఒప్పించి, లక్ష్మణుని శత్రుఘ్నుని అయోధ్యకు పంపుడు. నేను మీకు సేవలొనర్చుచు మీ వెంటనే ఉండగలను. (దో॥ 268)

అట్లు కానిచో మేము ముగ్గురు సోదరులము వనవాసము చేసెదము మీరు సీతాదేవితో గూడి అయోధ్యకు దయచేయుడు. కృపానిధీ! మీ మనస్సునకు ప్రసన్నతను చేకూర్చు కార్యమును నడుపుడు. ప్రభూ! పూర్తి బాధ్యతను మీరు నాపై ఉంచితిరి. నాకు రాజనీతిగాని, ధర్మముగాని తెలియదు. నేను స్వార్థముతోడనే అన్ని విషయములను నుడువుచున్నాను. ఆర్తుడైన వాడు వివేకమును కోల్పోవును. స్వామిఆజ్ఞకు ఎదురు పల్కుసేవకుని జూచి, లజ్జయు సిగ్గుపడును. నేను అన్ని అవగుణములకును ఆలవాలమైన వాడను. కాని స్వామి నన్ను ప్రేమతో 'సాధువు' అని పేర్కొని నన్ను ఆదరించిరి. కృపాళూ! స్వామిమనస్సును సంకోచములో పడవేయని ఏ యుపాయమైనను నాకు మంచిదేయనిపించును. ప్రభుపాదములపై ప్రమాణము చేసి సత్యమునే పలుకుచున్నాను. లోకకల్యాణమునకు ఇదియే ఏకైకమార్గము. (చౌ॥ 1-4)

ప్రభూ! మీరు ప్రసన్నచిత్తులై, సంకోచములనుమాని, మీరిచ్చెడి ఆజ్ఞలను అందఱును తలదాల్చెదరు. అన్ని ఉపద్రవములును, బాధలును తొలగి పోవును." (దో॥ 269)

## జనకుని ఆగమనము

భరతుని పవిత్ర వచనములను విని, దేవతలు హర్షితులై 'బాగు బాగు' అని ప్రశంసించుచు అతనిపై పుష్పవృష్టి గురిపించిరి. ఆ సమయమున (శ్రీరాముడు ఇప్పుడు ఏమినుడువునోయని) అయోధ్యావాసులు సందిగ్ధావస్థలోనుండిరి. కాని తపోధనులు, వనవాసులు మాత్రము (శ్రీరాముడు వనములలోనే ఉండునని ఆసించి) ప్రసన్న మనస్కులైరి. శ్రీరాముడు మాత్రము సంకోచముతో మౌనముగా ఉండిపోయెను. ప్రభుస్థితిని జూచి సదస్యులెల్లరును ఉత్కంఠతో ఎదురు చూడసాగిరి. ఇంతలో జనకమహారాజుదూతలు అచటికి వచ్చిరి. వారి ఆగమనవార్తను విని, వసిష్ఠుడు వెంటనే వారిని పిలిపించెను. వారు వచ్చి నమస్కరించి, ముని వేషముననున్న శ్రీరాముని జూచి విచారపడిరి. జనక మహారాజులకు కుశలమా? అని వసిష్ఠుడు వారిని అడిగెను. వారు ప్రణమిల్లి, వినయముతో "స్వామీ! మీరు సాదరముగా కుశల ప్రశ్నలు వేయుటయే మాకు శుభంకరము" అనియనిరి. (చౌ॥ 1-4)

"స్వామీ! కుశలమంతయును కోసలనాథుడైన దశరథునితోడనే పోయినది. అందువలన జగత్తంతయుఅనాథయైనది, అయోధ్యా మిథిలానగరములు విశేషముగా దిక్కులేనివైనవి. (దో॥ 270)

(జనకుని దూతలు వసిష్ఠునకు పూర్వ వృత్తాంతమును దెల్పుచున్నారు)

కోసలాధిపతియైన దశరథుడు స్వర్గస్థుడైన వార్తను విని, జనకపురవాసులందఱును శోకసంతప్తులై, స్పృహను కోల్పోయిరి. ఆ సమయమున విదేహప్రభువుదుఃఖమును జూచిన వారెవ్వరును నిజముగా 'అతడు విదేహుడు' అని

నమ్మలేదు. (నిజముగా విదేహుడేయైనచో ఇట్లు శోకాతురుడు కాడు గదా!) రాణియైన కైకేయి సన్నాగమును వినగానే మణిని గోల్పోయిన సర్పమువలె జనక మహారాజు దిక్కుతోచనివాడాయెను. 'భరతునకు రాజ్యాభిషేకము, శ్రీరామునకు వనవాసము'- ఈ మాటలను విని, జనకుని హృదయము చింతావ్యాకులమయ్యెను. పండితులను మంత్రులను పిలిపించి, రాజు వారితో 'బాగుగా ఆలోచించి చెప్పుడు. ఇప్పుడు కర్తవ్యమేమి?'- అనియడిగెను. అయోధ్యపరిస్థితిని దెలిసికొని, (అయోధ్యకు వెళ్లుటయా? మానుటయా? అని రెండు విధముల) వారు సందిగ్ధావస్థకులోనై, ఏమియు చెప్పలేకపోయిరి. అపుడు రాజు నిబ్బరము పూని, సమర్థులైన నలుగురు గూఢచారులను అయోధ్యకు పంపెను. వారిని ఇట్లు ఆజ్ఞాపించెను. "మీరు వెళ్లి, భరతునకు శ్రీరామునియెడ సద్భావముగలదా? లేక దుర్భావమా? కనుగొనిరండు. కాని ఎవ్వరికినిగూడ మీరు ఎవ్వరో తెలియకూడదు. జాగ్రతసుమా!" అని వారిని పంపివైచెను. (చౌ॥ 1-4)

ఆ నలుగురు గూఢచారులును అయోధ్యకు వెడలి, భరతుని వైఖరిని గూర్చి తెలిసికొనిరి. భరతుడు చిత్రకూటమునకు తరలిరాగానే వారు మిథిలకు మఱలివచ్చిరి. (దో॥ 271)

ఆ గూఢచారులు వచ్చి జనకమహారాజసభలో భరతునిసద్భావమును, కార్యదీక్షను, యథాశక్తి వివరించిరి. అది విన్న గురువులు, పౌరులు, మంత్రులు, రాజుగారు అందఱును, విచారముతో, ప్రేమతో వ్యాకులపాటుకులోనైరి. అపుడు జనకుడు ధైర్యము వహించి భరతుని శ్లాఘించి, రథాశ్వగజపాలకులను, యోధులను, సేనాపతులను పిలిపించెను. దేశమును, నగరమును, రాజభవనమును రక్షకుల రక్షణలో నుంచి, తాను శుభముహూర్తమును ఎన్నుకొని, రథాశ్వగజాదిబలములతో, రెండుగడియలలో బయలుదేఱెను. త్రోవలో ఎక్కడా ఆగకుండ వారు ఈ దినము ఉదయముననే ప్రయాగకు చేరిరి. అక్కడ స్నానములనాచరించి, బయలుదేఱి, పరివారములతో యమునను దాటిరి. ఈ వార్తను మీకు తెలుపుటకై ముందుగా మమ్ములను పంపిరి"- వారు ఈ విధముగా పలికి ప్రణామములనాచరించిరి. వసిష్ఠుడు వారికి ఆఱేడుమంది భిల్లులను తోడుగా నిచ్చిపంపెను. (చౌ॥ 1-4)

జనక మహారాజు యొక్క ఆగమనవార్తను విని, అయోధ్యాపౌరులు సంతోషభరితులైరి. శ్రీరాముడు సంకోచమునకు లోనయ్యెను. దేవరాజైన ఇంద్రుడు మిక్కిలి చింతాక్రాంతుడయ్యెను. (దో॥ 272)

కుటిలమతియైన కైకేయి బాధతో కుమిలి పోవుచుండెను. ఆమె తన మనోవ్యథను ఎవరికి చెప్పికొనగలదు? ఎవరిని దోషిగా నిలుపవలెను? అయోధ్యపౌరులు అందఱును జనకుని రాకవలన ఇంకను కొన్ని దినములు అక్కడ ఉండవచ్చును అని అనుకొనుచు సంతసించిరి. ఈ విధముగా ఆ దినము గడిచెను. మఱునాడుదయమున వారందఱును స్నానములనాచరించి, గణేశుని, గౌరీదేవిని, త్రిపురారిని, సూర్యుని ఆరాధించిరి. పిమ్మట పురుషులు చేతులు జోడించి, స్త్రీలు తమ కొంగులను బట్టుకొని, విష్ణువును ప్రార్థించిరి. "శ్రీరాముడు రాజుగా, సీతమ్మ రాణిగా అయోధ్యానగరము ఆనందముతో అలరారుగాక. సమాజము సుఖశాంతులతో వర్ధిల్లుగాక. శ్రీరాముడు భరతుని యువరాజుగా చేయునుగాక. ఈ ఆనందామృతాబ్ధిలో మునిగి ప్రతి వ్యక్తియు తన జన్మను సఫలమొనర్చుకొనును గాక. (చౌ॥ 1-4)

గురువు, సమాజము, సోదరులతో గూడి అయోధ్య రామరాజ్యముగా విలసిల్లుగాక. శ్రీరాముడు రాజుగానున్నప్పుడే మేము అయోధ్యలో అసువులను వీడుదుము గాక" ఈ విధముగా అందఱును కోరుకొనిరి. (దో॥ 273)

అయోధ్యావాసుల స్నేహమయవాక్కులను విని, జ్ఞానులైన మునీశ్వరులును వారి ముందు తమ యోగవైరాగ్యములను తక్కువగా భావించిరి. ఈ విధముగా నిత్యకర్మానుష్ఠానములను ఆచరించి, అయోధ్యావాసులు

పులకితగాత్రులై, శ్రీరామునిముందు సాగిలపడిరి. ఉచ్చనిమ్న మధ్య జాతుల వారందఱును తమ తమ యోగ్యతలకు అనుగుణముగా శ్రీరాముని దర్శించిరి. శ్రీరాముడు సావధానముగా వారివారి యోగ్యతలను అనుసరించి, అందఱిని సమ్మానించెను. అందఱును కృపాళువైన శ్రీరాముని ఇట్లు ప్రశంసించిరి. "బాల్యము నుండియు అబ్బిన అలవాటు ప్రకారము శ్రీరాముడు వారివారి ప్రేమాదరములను గుర్తించి, ప్రజలయెడ తగిన రీతిగా మసలుకొనును, శ్రీరఘునాథుడు సౌశీల్యవినయసంపన్నుడు. సుందరముఖనేత్రములు గలవాడు. సరళస్వభావుడు." శ్రీరాముని అనంత సుగుణగణములను కొనియాడుచు ప్రజలు ప్రేమమగ్నులైరి. తమభాగ్యములకు పొంగిపోయిరి. శ్రీరామునిచే ఆత్మీయులుగా భావింపబడు తమవంటి అదృష్టవంతులు జగత్తులో అరుదుగా ఉందురు. అని అనుకొనుచుండిరి. (చౌ॥ 1-4)

ఆసమయమున మిథిలాధిపతియైన జనకమహారాజు వచ్చుచున్నాడని విని, అందఱును ఆనందించుచుండిరి. సూర్యవంశ భాస్కరుడగు శ్రీరామచంద్రుడు అందఱితో గూడి, తానును గౌరవభావముతో నిలబడెను. (దో॥ 274)

జనకుని ఆహ్వానించుటకు శ్రీరఘునాథుడు తనసోదరులతో, మంత్రులతో, గురువులతో, పురజనులతో ముందునకు నడచెను. జనకుడు పర్వతరాజమైన 'కామదగిరి'ని చూడగానే ప్రణమిల్లి, రథమునుండి క్రిందికి దిగెను. శ్రీరాముని దర్శించు కాంక్షతో ఉండుటచే వారందఱును అలసటక్లేశముల మాటనే మఱచిరి. వారి మనస్సులన్నియును సీతారాములపైననే లగ్నమైయున్నవి. మనస్సు లేకుండా శరీరముపై ధ్యాస ఎవరికి ఉండును? సుఖదుఃఖములను గూర్చి ఎవరికి పట్టును? ఇట్లు జనకుడును, ఆయన పరివారములును శ్రీరాముని ప్రేమలో నిమగ్నులైరి. శ్రీరాముని సమీపింపగనే మిక్కిలి ప్రేమాదరములతో పరస్పరము గౌరవించుకొనిరి. జనకుడు వసిష్ఠాదిమహర్షులకు నమస్కరించెను. శ్రీరఘునాథుడును శతానందాది మహామునులకు ప్రణమిల్లెను. పిమ్మట సోదరులతోగూడి శ్రీరాముడు జనకుని గలిసి, ఆయనను సపరివారముగా తన ఆశ్రమమునకు సాదరముగా ఆహ్వానించి, తీసికొనివచ్చెను. (చౌ॥ 1-4)

శ్రీరామునిఆశ్రమము ఒక సాగరము. అది శాంతరసమనెడి పవిత్రజలములచే పరిపూర్ణమైయున్నది. జనకుని పరివారము ఒక కరుణారసవాహిని. దానిని ఆశ్రమసాగరమున గలుపుటకు శ్రీరాముడు తీసికొని వచ్చుచున్నాడు. (దో॥ 275)

ఈ కరుణానది జ్ఞానవైరాగ్యములనెడి తీరములను ఒరసికొనుచు వచ్చుచున్నది. శోకభరిత వచనములనెడి ఉపనదులు, కాల్వలు ఈ నదిలో కలియుచున్నవి. విచారమనెడి దీర్ఘ నిఃశ్వాసములగాలులకు ఇందలి అలలు లేచి, నదీతీరములయందుగల ధైర్యమనెడి వృక్షములను పెకలించి వేయుచున్నవి. ప్రచండవిషాదమే ఈ నదీవేగప్రవాహము, భయము, భ్రమ అనునవి ఇందలిభయంకరములైన సుడిగుండములు. పండితులు నావికులు, విద్యయే గొప్పనావ. కాని వారు ఆ నావలను నడపలేరు. (వారి విద్య ఇచట నిరుపయోగమైనది.) దానిని నడుపు ఉపాయము ఎవ్వరును ఎఱుగరు. వనములలో సంచరించు కోలులు కిరాతులు ప్రయాణికులు. వారు ఈ నదీప్రవాహమును జూచి, మానసికముగా స్తబ్ధులైరి. ఈ కరుణానది ఆశ్రమములో గలిసినప్పుడు ఆ ఆశ్రమసముద్రమంతయును కల్లోలితమైనది. ఉభయరాజపరివారములును శోకవిహ్వలములైనవి. జ్ఞానము, ధైర్యము, లజ్జ అనునవి అదృశ్యమాయెను. దశరథరాజు యొక్క రూపగుణ శీలములను ప్రస్తుతించుచు అందఱును శోకసముద్రమున మునిగిరి. (చౌ॥ 1-4)

శోకసాగరమున మగ్నులైన స్త్రీపురుషులెల్లరును అతివ్యాకులపాటుతో విచారపడుచుండిరి. "విధాత ఎంత క్రూరకార్యము నొనరించినాడు?" అని అందఱును దూషించుచుండిరి. తులసీదాసు చెప్పుచున్నాడు. దేవతలు,

సిద్ధులు, తాపసులు, యోగులు, మునులు మొదలగు వారందఱును ఆ సమయమున జనకరాజు పరిస్థితిని జూచి, స్నేహరూపనదిని దాటుటకు సమర్థులు కాకపోయిరి. కావున అందఱును శోకమగ్నులైరి. (ఛం)

అక్కడక్కడ మునులు జనులకు అనేకవిధములుగా ఉపదేశములను ఇచ్చుచుండిరి. వసిష్ఠ మహర్షిజనకునితో పలికెను. "రాజా! ధైర్యము వహింపుము." (సో॥ 276)

జనక మహారాజుయొక్క జ్ఞాన భాస్కరుడు జనన మరణ రూపమైన రాత్రిని పటాపంచలు చేయును. ఆయన వచనకిరణములు మునుల హృదయకమలములను వికసింప జేయును. అట్టి జనకమహారాజును మోహమమకారములావరించుట నిజముగా శ్రీరామప్రేమప్రభావ ఫలితమే. విషయలోలురు, సాధకులు, జ్ఞానులు అని జీవులను వేదములు మూడు విధములుగా పేర్కొనినవి. శ్రీరాముని స్నేహసరస్సులో నిమగ్నమైన చిత్తములుగలవారిని సజ్జనసమాజము మిక్కిలి గౌరవించును. కర్ణధారుడులేనినావవలె శ్రీరామభక్తి లేని జ్ఞానము శోభింపదు. వసిష్ఠుడు జనకుని పెక్కురీతుల అనునయించెను. అందఱును శ్రీరామస్నానఘట్టమున మునుకలువేసిరి. స్త్రీపురుషులెల్లరును శోకభరితులైరి. ఆ దినమంతయు ఎవ్వరును నీటిని గూడ త్రాగలేదు. పశుపక్షిమృగాదులు సైతము ఆహారమును త్యజించినప్పుడు. ఇక పరిజనుల మాట చెప్పనేల? (చౌ॥ 1-4)

మఱునాడు ప్రాతఃకాలముననే నిమివంశజుడైన జనకుని పరివారము, రఘు వంశమణియైన రామునిపరివారము స్నానములాచరించి, వటవృక్షచ్ఛాయలో ఆసీనులైరి. అందఱి మనస్సులు ఉదాసీనములై శరీరములు శుష్కించి యుండెను. (దో॥ 277)

అయోధ్యామిథిలానగరములబ్రాహ్మణులు అచట ఉండిరి. లోకాభ్యుదయము, పరమార్థతత్త్వములను కూలంకషముగా ఎఱిగిన వసిష్ఠ శతానంద విశ్వామిత్రులుగూడ అచటనే యుండిరి.[1] ధర్మ, నీతి, వైరాగ్య, వివేక విషయములను వారు పెక్కు విధముల బోధించిరి. విశ్వామిత్రుడు సదస్యులకు పెక్కు పౌరాణికగాథలను వినిపించెను. పిమ్మట రఘునాథుడు విశ్వామిత్రునితో "స్వామీ! నిన్న ఎవ్వరును నీరుకూడముట్టలేదు". అనియనెను. ఆ మహర్షి "శ్రీరఘునాథుడు లెస్స పలికెను. నేడును అపరాహ్ణమైనది." అని నుడివెను. ఋషి ముఖములోని భావమును గమనించి, జనకుడు పలికెను. "ఇచట వండిన (పక్వ) ఆహారమును భుజించుట ఉచితముగాదు." రాజుగారిమాట అందఱికిని రుచించెను. ఋషీశ్వరుని ఆజ్ఞతో అందఱును మాధ్యాహ్నిక కృత్యములకు దిగిరి. (చౌ॥ 1-4)

ఇంతలో వనవాసులైన కోలులు, భిల్లులు వివిధఫలములను, పూవులను, ఆకులను, కందమూలములను గంపలలో నింపుకొని, వరుసలు గట్టి కావళ్ళల్లో తెచ్చిరి. (దో॥ 278)

శ్రీరామచంద్రునిఅనుగ్రహమువలన ఆ "కామదగిరి" అందరికిని కోరిన వస్తువులనన్నింటిని ప్రసాదించుచుండెను. వాటిని చూచినంతనే దుఃఖములన్నియును మాయమగుచుండెను. అచటి నదీతటాకములు, వనభూములు, ఆనందానురాగములతో వర్ధిల్లుచుండెను. వృక్షములు, లతలు ఫలపుష్పములతో కలకలలాడుచుండెను. పశుపక్షులు, భ్రమరములు మనోహరముగా పాడుచుండెను. ఆ సమయమున వనమునందు ఉత్సాహాతిరేకములు వెల్లువుకుచుండెను. శీతలమందసుగంధవాయువులు అందఱికిని ఆహ్లాదమును గొల్పుచుండెను. ఆ వనరామణీయకము వర్ణనాతీతము. పృథ్వి జనకునకు ఆతిథ్యమిచ్చుచున్నట్లుండెను.

1. అయోధ్యామిథిలానగరములను రెండింటిని కలిపినట్టి బ్రహ్మర్షి విశ్వామిత్రుని ఆగమనమును, రాజర్షియైన జనకమహారాజు ఆగమనమును ఈ ప్రకరణమున వర్ణించుట తులసీదాసు మహాకవి యొక్క ప్రత్యేకత.

మిథిలానగరవాసులు జనక, శ్రీరామ, వసిష్ఠుల ఆజ్ఞలను గైకొని వృక్ష సౌందర్యములచే ఆకర్షితులై హాయిగా విహరించుచుండిరి. పవిత్రములు, సుందరములు, అమృతతుల్యములగు ఫలములను, ఆకులను, కందమూలములను. (చౌ॥ 1-4)

శ్రీరామునిగురువగు వసిష్ఠుడు సాదరముగా జనకపరివారములకు పుష్కలముగా పంపెను. పితరులను, దేవతలను, అతిథులను, గురువులను పూజించిన పిమ్మట అచట ఉన్నవారు అందఱును ఆ ఫలములను ఆరగించిరి. (దో॥ 279)

ఈ విధముగా నాలుగు (కొన్ని) దినములు గడిచినవి. శ్రీరామచంద్రుని జూచి ఎల్లరును సుఖులైరి. సీతారాములులేకుండ తిరిగిపోవుట ఉచితముగాదని ఉభయపరివారములును తలంచుచుండెను. వారికి సీతారాములతోపాటు వనవాసముగూడ కోటిస్వర్గములతో సమానముగా సుఖదాయకమై యున్నది. విధి వక్రించిన వాడే సీతారామలక్ష్మణులను వీడి ఇంటికై ఆరాటపడును. దైవము అనుకూలించినప్పుడే శ్రీరామునితోగూడి నివసించుభాగ్యము కలుగును. మందాకినీనదిలో నిత్యమూ మూడుసార్లు స్నానములు, ఆనందశుభలక్షణ సంపన్నుడైన శ్రీరామునిదర్శనము, శ్రీరామపర్వతమునకు (కామదగిరికి) ప్రదక్షిణములు వనములలో తపోభూములయందు విహారములు, అమృతతుల్యములైన కందమూలఫలములను భుజించుట -ఈ విధమైన ఆనందదాయకమైన జీవితము ఈరేడు (పదునాలుగు) సంవత్సరములైనను ఒక్క క్షణమువలె మనకు తెలియకుండగనే గడచి పోవును. (చౌ॥ 1-4)

మేము ఇంతటి సుఖములకు అర్హులముకాము. మాకు ఇట్టి భాగ్యము ఎట్లబ్బెను? - అని అందఱును నుడువుచుండిరి. ఇఱుపక్షములవారును శ్రీరామునిచరణములపై సహజమైన సంపూర్ణ ప్రేమను కలిగి యుండిరి (దో॥ 280)

## ఉభయ పక్షముల గౌరవ మర్యాదలు, చర్చలు

అందఱును ప్రేమ భరితములైన తమ మనోవాంఛలను ఇట్లు ప్రకటించుచుండిరి. వారి భక్తిభరిత వచనములు విన్నవారిమనస్సులను దోచుచుండెను. ఇంతలో సీతాదేవి తల్లియగు సునయనాదేవిచే కౌసల్యాది రాణులయొద్దకు పంపబడిన దాసీలు వచ్చిరి. ఆ దాసీల ద్వారా సీతాదేవి అత్తగార్లు ఆ సమయమున తీరికగా ఉన్నట్లు తెలిసికొని, జనకరాజుయొక్క రాణివాసస్త్రీలు వారిని కలిసికొనుటకు వెళ్ళిరి. కౌసల్యాదేవి వారిని సాదరముగా ఆహ్వానించి, ఉచితాసనములపై కూర్చుండజేసెను. ఆ ఉభయపక్షములవారి అన్యోన్యానురాగములను, సౌశీల్యములను శోకవిచారములను చూచినచో, విన్నచో వజ్రములు గూడ ద్రవించి తీరును. వారి తనువులు పులకరించెను. కన్నుల నీరునిండెను. అందఱును విచారగ్రస్తులై తమ కాలిగోళ్లతో నేలను రాయుచు ఆలోచించుచుండిరి. సీతాదేవి అత్తగార్లందఱును సీతారాములప్రేమమూర్తులుగా కనబడిరి. కరుణరసమే అనేకరూపములలో విలపించుచున్నదా? అనునట్లు వారుండిరి. సీతాదేవిజననియైన సునయనాదేవి పలికెను. "విధాతబుద్ధి వక్రమైనది. పాలమీగడలవలె మృదువైన వస్తువులను కఠోరవజ్రములచే ఛేదించుచున్నాడు. (అనగా మీరు మిక్కిలి కోమలులు, నిర్దోషులు. కాని మీకు ఆపదపై ఆపద వచ్చుచున్నది. (చౌ॥ 1-4)

"అమృతము అను పేరును (పదమును) మాత్రము వినుచుందుము. కాని అది ప్రత్యక్షముగా లభింపదు. ఐతే విషముమాత్రము అక్కడక్కడ ప్రత్యక్షముగా చూడబడుచుండును. ఇట్లు విధాత కృత్యములన్నియును భయంకరములే. కాకులు గ్రుడ్లగూబలు కొంగలు అంతటను కనబడుచుండును. కాని హంసలు మాత్రము కేవలము మానస సరోవరమునందే ఉండును." (దో॥ 281)

సునయునాదేవి వచించిన ఈ మాటలను విని, సుమిత్రాదేవి విచారముతో పలికెను. "విధాతరీతి విచిత్రము, విపరీతము. జగత్తును సృష్టించి, పాలించువాడే సంహారమును గూడ చేయును. విధాతబుద్ధి బాలురక్రీడలవలె లీలావినోదాత్మకము." పిదప కౌసల్యపలికెను. "ఇందులో దోషమెవ్వరిదీలేదు. సుఖదుఃఖములు, మేలుకీడులు కర్మాధీనములు. కర్మగతి దుర్విజ్ఞేయము. దానిని విధాతయే యెఱుగును. అతడే మన కర్మలకు శుభాశుభఫలములనిచ్చును. ఉత్పత్తి స్థితిలయములును, అట్లే అమృతము, విషముగూడ ఈశ్వరాధీనములే. అతని ఆజ్ఞ అనుల్లంఘనీయము. దేవీ! మోహవశమున విచారించుట వృథా. బ్రహ్మ సృజించిన భవజాలము అచలము, అనాది. సఖీ! మహారాజుగారి జీవితమును మరణమును తలచి, దుఃఖించుటకు కారణము కేవలము మన స్వార్థమే. ఇట్టి సంఘటనలు లోకమున సహజమే". తరువాత సునయనాదేవి పలికెను. "మీరు పలికిన మాటలు సత్యములు. శ్రేష్ఠములు. మీరు పుణ్యపురుషుడైన అయోధ్యాధిపతి దశరథునిరాణులుగదా!" (చౌ॥ 1-4)

కౌసల్యాదేవి శోకసంతప్తహృదయయై పలికెను. "శ్రీరాముడు, లక్ష్మణుడు సీతాదేవి వనములకు వెళ్లుటవలన మంచియే జరుగవచ్చును. హానిమాత్రము జరుగదు. కాని నాకు భరతుని గూర్చియే చింత. (దో॥ 282)

ఈశ్వరుని కృపవలన మీ ఆశీర్వాదములవలన నా నలుగురు కుమారులును, కోడండ్లును గంగాజలముల వలె పవిత్రమైనవారు. సఖీ! నేనెప్పుడును శ్రీరామునిపై ప్రమాణము చేయలేదు. కాని నేడు శ్రీరామునిపై 'ఒట్టు' పెట్టుకొని, నిజము పల్కుచున్నాను. భరతుని శీలము, గుణము, వినయము, ఔదార్యము, సౌభ్రాతృత్వము, భక్తివిశ్వాసములు, మంచితనము మున్నగువానిని గూర్చి, వాగ్దేవియు వర్ణింపజాలదు. ఒక ముత్యపుచిప్పతో సముద్రజలములను తోడిపోయగలమా? నేను ఎల్లప్పుడును భరతుడే మా కులదీపకుడని భావించుచుంటిని. మహారాజుగారుకూడ ఎల్లప్పుడును నాతో ఈ మాటనే చెప్పెడివారు. బంగారమును ఆకుజాతిపై రుద్దినప్పుడే, రత్నము కమసాలివానిచేత చిక్కినప్పుడే వాటినాణ్యత తెలియును. అట్లే వ్యక్తుల స్వభావములు సమయము వచ్చినప్పుడే ప్రకటితములగును. కాని నేడు ఈ విధముగా నేను పలుకుట అనుచితము. శోకస్నేహములలో వివేకము లోపించును" (ప్రేమ కారణముగ భరతుని పొగడుచున్నట్లు జనులు భావింతురు) గంగవలె పవిత్రమైన కౌసల్యాదేవివాణిని విని, రాణులందఱును స్నేహవికలలైరి. (చౌ॥ 1-4)

కౌసల్య మఱల ధైర్యము వహించి, పల్కెను. "ఓమిథిలేశ్వరీ! మీరు వివేకనిధులైన జనక మహారాజుగారి ధర్మపత్నులు. మీకు ఉపదేశమును ఇయ్యగలవారు ఎవరు? (దో॥ 283)

ఓ రాణీ! అవకాశము లభించినప్పుడు లక్ష్మణుడు అయోధ్యలో నుండునట్లును, శ్రీరాముని సేవించుటకై భరతుడు వనవాసము చేయునట్లును మీమాటగా రాజుగారికి సూచించి, నచ్చజెప్పుడు. ఈ సూచన రాజుగారికి తృప్తికరమగుచో ఆలోచించి, ప్రయత్నము చేయుమనుడు. నాకు భరతుని గూర్చిన చింతపెద్దది. భరతునకు శ్రీరామునిపై అపారమైనప్రేమ గలదు. అతడు అయోధ్యలో ఉండుట సముచితముగా కన్పట్టదు." (అయోధ్యలో ఉన్నచో ప్రేమ వశమున అతడుగూడ ప్రాణత్యాగము చేయవచ్చును.) కౌసల్యాదేవికి భరతునిపైగల ప్రేమాతిరేకస్థితిని గమనించి, ఆమెపలికిన నిష్కపటవచనములను విని, రాణులందఱును కరుణరసములో మునిగిరి. ఆకాశమునుండి పూలవానతో పాటు "ధన్య, ధన్య" అని జయధ్వానములు వినిపించెను. సిద్ధులు, యోగులు, మునులు రామప్రేమపరవశులైరి. ఈ పరిస్థితినంతయు జూచి, రాణివాసము స్తబ్ధమాయెను. ధైర్యము వహించి, సుమిత్రాదేవి పలికెను. "రాత్రి రెండు గడియలు గడచినవి" ఈ మాటవినగానే కౌసల్యాదేవి అటమండి లేచెను. (చౌ॥ 1-4)

కౌసల్య స్నేహముతో సద్భావముతో పలికెను. "ఇంక మనగుడారములకు వెళ్లుదము. ఇప్పుడు భగవంతుడే మనకు దిక్కు. మిథిలేశ్వరుడు మనకు సహాయకుడు. (దో॥ 284)

కౌసల్యాదేవిస్నేహమునుజూచి, ఆమెయొక్క వినమ్రవచనములనువిని, సునయనాదేవి ఆమెపవిత్ర పాదములను పట్టుకొని పలికెను. "దేవీ! నీవు దశరథమహారాజునకు ధర్మపత్నివి, శ్రీరామునకు తల్లివి. నీకీనమ్రత సహజమే. గొప్పవారు తమకంటె అల్పులనుగూడ ఆదరింతురు. అగ్ని పొగను, పర్వతములు గడ్డిని తలపై వహించును. మారాజుగారు త్రికరణశుద్ధిగా మీకు సేవకులు. సర్వదా అందఱికిని తోడుగా ఉండువారు ఆ పార్వతీపరమేశ్వరులే. జగత్తులో మీకు సహాయపడగలయోగ్యత ఎవరికి గలదు? దీపము సూర్యునకు సహాయకారి కాగల్గునా? శ్రీరామచంద్రుడు వనములకు వెళ్లి, దైవకార్యములను నెఱవేర్చి, తిరిగి వచ్చి, అయోధ్యను పరిపాలించును. శ్రీరాముని బాహుబలమువలన దేవతలు నాగులు మనుజులు తమతమ లోకములలో సుఖముగా నుందురు. ఈ విషయమును యాజ్ఞవల్క్యముని ఇంతకుముందే నుడివియుండిరి. దేవీ! మునివచనములు అసత్యములు కానేరవు.
(చౌ॥ 1-4)

ఈ విధముగా పలికి, సునయనాదేవి భక్తితో కౌసల్యాదేవిపాదములకు ప్రణమిల్లి, సీతాదేవిని తనతో తీసికొని పోవుటకు ప్రార్థించెను. అనుజ్ఞను పొంది, ఆమె సీతాదేవితోగూడి తన గుడారమునకు వెళ్లెను. (దో॥ 285)

విదేహనందన సీతాదేవి తన కుటుంబ సభ్యులతో పెద్దవారినుండి చిన్నవారి వఱకును క్రమముగా అందఱిని కలిసెను. ఆమె వల్కలములను ధరించి యుండుటను జూచి, వారు శోక విహ్వలులైరి. శ్రీరాముని గురువగు వసిష్ఠుని ఆజ్ఞతో జనకుడు ఆమెయున్న గుడారమునకు వెళ్ళి, అచట సీతాదేవిని చూచెను. తనప్రాణములకంటెను మిన్నయైన సీతాదేవిని అక్కున జేర్చుకొనెను. అతని హృదయమున అనురాగసముద్రము ఉప్పొంగెను. జనకరాజుమనస్సు ఒక ప్రయాగవలెనుండెను. అందు సీతాదేవిప్రేమ అను ఒక అక్షయవటము పెఱుగుచున్నట్లు అతడు చూచెను. శ్రీరామప్రేమయనెడి బాలముకుందుడు ఆ వటపత్రమున శోభిల్లుచుండెను. జనకుడను జ్ఞానరూపుడైన మార్కండేయ-ఋషి వ్యాకులుడై, ప్రేమసాగరములో మునుగుచు ఆ శ్రీరామప్రేమ అనెడి బాలముకుందుని ఆలంబనముగా పొందెను. విదేహునిబుద్ధి వస్తుతః మోహవశముగాదు. ఇది సీతారాములయెడ ఆయనకు గల ప్రేమ ప్రభావము.
(చౌ॥ 1-4)

తల్లి దండ్రులపై తనకుగల ప్రేమప్రభావమున సీతాదేవి తనను తాను నిగ్రహించుకొనలేక పోయెను. కాని భూసుత యగుటవలన సమయసందర్భములను గమనించి, ధైర్యము వహించెను. (దో॥ 286)

తపస్విని వేషములోనున్న సీతాదేవినిజూచి, జనకునకు మిక్కిలి ప్రేమానందములు గలిగెను. పిదప ఇట్లు పలికెను. " బిడ్డా! నీవు ఉభయవంశములను పావనమొనర్చితివి. నీ కీర్తి లోకమునకే వెలుగులనిచ్చుచున్నది. అని అందఱును భావించుచున్నారు. గంగానదికంటెను పవిత్రమైన నీ కీర్తినది అనేకబ్రహ్మాండములలో ప్రవహించుచున్నది. గంగానది కేవలము క్షేత్రత్రయమును (హరిద్వారము, ప్రయాగ, గంగాసాగరము) పవిత్ర తీర్థ స్థానములుగా మార్చినది. కాని నీ కీర్తినది అనేకసజ్జనసమాజములను తీర్థస్థానములుగా మార్చినది." అని పలికిన జనకుని ప్రేమసిక్తమైన వాణిని విని, జానకి సిగ్గుదొంతరలలో మునిగెను. తల్లిదండ్రులు మఱల ఆమెను హృదయమునకు హత్తుకొనిరి, హితోక్తులను పలికిరి, ఆశీర్వాదములనిచ్చిరి. రాత్రివేళ అత్తగార్ల సేవలకు దూరముగా ఇచటనుండుట ఉచితముగాదని తెల్పుటకు సీతాదేవి వెనుకాడుచుండెను. సునయనాదేవి కూతురిముఖకవళికలను గ్రహించి, జనక రాజునకు తెలిపెను. ఇద్దఱును తమ మనస్సులలో ఆమెగుణశీలస్వభావములను మెచ్చుకొనిరి.
(చౌ॥ 1-4)

వారు మాటిమాటికిని సీతాదేవిని అక్కున జేర్చుకొనుచుండిరి. పిదప కొంతసేపటికి వారు ఆమెను గుడారములకు సాదరముగా పంపిరి. సమయస్ఫూర్తి గలిగిన సునయనాదేవి ఈ సదవకాశమును గమనించి, తన భర్తకు భరతుని స్థితిని గూర్చి వివరింపసాగెను. (దో॥ 287)

బంగారమునకు తావివలె చంద్రునిలో అమృతమువలెనున్న భరతుని సౌశీల్యమును విని, జనకుడు ఆనందాశ్రువులతోనిండిన తనకన్నులను మూసికొనెను. అనగా భరతునిప్రేమ ధ్యాసలో మునిగిపోయెను. ఆయనతనువు పులకరించెను. మనస్సులోనే భరతుని సౌశీల్యమును గూర్చి మెచ్చుకొనుచు ఇట్లు పలికెను. "ఓ సుముఖీ! సునయనా! సావధానముగా వినుము. భరతుని కథాశ్రవణము భవబంధవిమోచకము. ధర్మము, రాజనీతి, బ్రహ్మవిచారములను గూర్చి బుద్ధిబలము మేరకు నేనును కొంత యెఱుగుదును. వీటిలో నాకు కొంత ప్రవేశమున్నను భరతుని గొప్పదనము యొక్క నీడను గూడ తాకుటకు నేను అశక్తుడను. ఇక దానిని వర్ణించుట ఎట్లు సాధ్యము? కవులు, జ్ఞానులు, పండితులు, ఇతర బుద్ధిమంతులు మున్నగువారికి మాత్రమేగాక శేషుడు, సరస్వతి, శివుడు, బ్రహ్మ, గణపతి ప్రభృతి దేవతలందఱికిని, భరతుని చరిత్ర, కీర్తి, ప్రవర్తన, ధర్మశీలగుణములు అతనినిర్మలఐశ్వర్యముల శ్రవణము మిక్కిలి ఆనందదాయకము. ఇవి పరమపవిత్రమైన గంగకంటెను మిక్కిలి పునీతమైనవి. అమృతము కంటెను మధురమైనవి. (చౌ॥ 1-4)

భరతునిగుణములు అనంతములు. అతనిచరితము నిరుపమానమైనది. అతనికి అతడేసాటి. అతనిని ఎవరితో పోల్చుటకు యత్నించినను కవులబుద్ధులు కుంఠితములగును. సుమేరు పర్వతమును మనత్రాసులో తూచుట సాధ్యమా? (దో॥ 288)

ఓ సుందరీ! నీరులేనినేలపై చేప ముందుకు పోవుటకు అసాధ్యమైనట్లు భరతుని మహిమను వర్ణించుటయు అంత అసాధ్యము. రాణీ! భరతుని అపారమహిమను శ్రీరాముడు మాత్రమే యెఱుగును. కాని ఆయనయు వర్ణింపజాలడు." ఈ విధముగా భరతుని ప్రభావమును వర్ణించుచు తన భార్యమనస్సును దెలిసికొని, జనక మహారాజు పలికెను." లక్ష్మణుడు అయోధ్యకు చేరుటయు, భరతుడు వనములలో శ్రీరాముని అనుసరించుటయు యుక్తమని నీవు పల్కుచుంటివి. అందఱి మనస్సులలో ఉన్న ఆలోచనయు ఇదియే. కాని దేవీ! శ్రీరామభరతుల మధ్యగల ప్రేమవిశ్వాసములు మన బుద్ధికి అగ్రాహ్యములు. శ్రీరామచంద్రుడు 'సమత్వము'నకు సీమ. భరతుడు మమతాప్రేమలకు పరాకాష్ఠ. భరతుడు ఎన్నడును. రామప్రేమనుతప్ప స్వార్థపరమార్థములనుగాని, ఇతరసుఖములనుగాని కలలోగూడ కోరడు. శ్రీరాముని పాదములయెడ నిరంతరభక్తియే అతనిఏకైకసాధనము, లక్ష్యము. ఇదియే భరతునిసిద్ధాంతమని నాకు తోచుచున్నది. (చౌ॥ 1-4)

రాజు ప్రేమవిహ్వలుడై పలికెను. "భరతుడు పొరపాటునగూడ శ్రీరామచంద్రునిఆజ్ఞను మీఱడు. కావున వాత్సల్యవశమున నీవు ఆందోళనపడవలదు. (దో॥ 289)

ఈ విధముగ శ్రీరామభరతులగుణప్రశంసలతో వారికి ఆ రాత్రియంతయు ఒక్క క్షణమువలె గడచెను. అయోధ్యామిథిలావాసులు ప్రాతఃకాలముననే మేల్కొని, స్నానాదికములనాచరించి, ఇష్టదైవములను ఆరాధించిరి. శ్రీరాముడు స్నానాదికములను ముగించుకొని, వసిష్ఠమహామునికడకు వెళ్లెను. ఆయన పాదములకు ప్రణమిల్లి, ఆ ముని ఇంగితమును ఎఱింగి, ఇట్లు పలికెను. మునీశ్వరా! భరతుడు, అయోధ్యావాసులు, తల్లులు వనవాసదుఃఖితులై వ్యాకులపాటునకు లోనైయున్నారు. మిథిలాధిపతి జనకుడుగూడ సపరివారముగా క్లేశములను అనుభవించుచున్నాడు. చాలా దినములు గడిచినవి. కావున ఓ మునీశ్వరా! మీకు ఉచితమని తోచిన దానిని చేయుడు. అందఱి హితమూ మీ చేతులలోనే యున్నది" - అని పలికి శ్రీరాముడు మౌనము వహించెను. రామునిశీలస్వభావములకు వసిష్ఠుడు పులకితగాత్రుడాయెను. పిదప మునిపల్కెను. "రామా! నీవు లేకుండ ఈ ఉభయబృందములవారికిని (అయోధ్యావాసులకును, మిథిలావాసులకును) ఇల్లు, వాకిలి, ఇతర సుఖములు నరకప్రాయములు. (చౌ॥ 1-4)

రామా! నీవు అందఱికిని ప్రాణములకు ప్రాణమైనవాడవు. జీవులకు జీవుడవు. సుఖములకు సుఖస్వరూపుడవు. నాయనా! నిన్ను వీడి ఐహికసుఖములను కోరుకొనువాడు దైవోపహతుడు. (దో॥ 290)

శ్రీరాముని చరణకమలములపై భక్తిలేనివాని సుఖములు, కర్మలు, ధర్మములు కాల్పనా? శ్రీరామునిపై భక్తిలేని యోగము యోగమేగాదు, అది దుర్యోగము, జ్ఞానము జ్ఞానమేగాదు, అది అజ్ఞానము. అందఱి సుఖములకును నీవే కారణము.[1,2] నీవు దూరమైనచో వారికి మిగులునవి దుఃఖములే. అందఱి మనస్సులలోని భావములను నీవు ఎఱుగుదువు. నీ ఆజ్ఞయే అందఱికిని శిరోధార్యము. నీవు కృపాళుడవు. అందఱిగతియు నీకు పూర్తిగా తెలియును. ప్రస్తుతమునకు నీవు ఆశ్రమమునకు వెళ్లుము." ఇట్లు పలికి వసిష్ఠుడు స్నేహపరవశుడాయెను. అంతట శ్రీరాముడు మునికి ప్రణమిల్లి, అచ్చటినుండి వెడలిపోయెను. వసిష్ఠుడు ధైర్యము వహించి, జనకునికడకు ఏతెంచెను. గురువు శ్రీరామచంద్రుని స్నేహశీలయుక్తములైన వచనములను రాజునకు వినిపించి ఇట్లు పలికెను. "రాజా! అందఱికిని హితమును గూర్చు ధర్మయుక్తమైనఉపాయమును సూచింపుడు. (చౌ॥ 1-4)

మహారాజా! మీరు విజ్ఞాననిధులు, సుజనులు, పవిత్రులు, ధర్మనిష్ఠాపరులు. ఈ ధర్మసంకట పరిస్థితిని పరిష్కరించుటకు మీరే సమర్థులు. (దో॥ 291)

వసిష్ఠుని వచనములను విని, జనకుడు ప్రేమపరపరవశుడాయెను. ఆయనస్థితిని జూచి, జ్ఞానవైరాగ్యములకును వైరాగ్యము అబ్బెను. "మేము ఇచ్చటికి వచ్చుట సముచితముగా కన్పట్టుట లేదు". అని స్నేహాతిరేకముచే అతడు తన మనస్సులో తలపోసెను. " దశరథ మహారాజు శ్రీరాముని వనములకు పొమ్మని చెప్పి, పుత్ర విరహమును భరింపజాలక అసువులను వీడి, రామునిపై తనకుగల అపారప్రేమను నిరూపించుకొనెను. కాని ఇప్పుడు మనము ఆయనను ఈ వనములనుండి గహనారణ్యములకు పంపి, మనతెలివితేటలకు సంతోషపడుచు ఇండ్లకు మఱలెదము". రాజుగారి ఈ స్థితిని జూచి, మాటలను విని, తాపసులు, మునులు బ్రాహ్మణులు ప్రేమవిహ్వలులైరి. అనువగు సమయమును జూచుకొని, జనక మహారాజు ధైర్యమును బూని, తన పరివారములతో భరతుని యొద్దకు వెళ్లెను. భరతుడు సాదరముగా ఎదురేగి, ఆయనకు స్వాగతము పలికెను. ఉచితాసనముపై ఆసీనుని గావించెను. జనకుడు ఇట్లు పలికెను. "నాయనా! శ్రీరాముని స్వభావము నీకు సుపరిచితమే. (చౌ॥ 1-4)

శ్రీరాముడు సత్యవ్రతుడు, ధర్మపరాయణుడు. ఆయనహృదయమున అందఱియెడ ప్రేమాదరములు గలవు. కావున ఎటుచెప్పుటకును వలనుపడక అతడు సంకటపరిస్థితిని ఎదుర్కొనుచున్నాడు. నీ ఆశయమును దెల్పుము. దానిని ఆయనకు తెల్పెదను." (దో॥ 292)

ఈ మాటలను విని, భరతునితనువు పులకరించెను. నేత్రములు అశ్రుపూరితములాయెను. అతడు ధైర్యమువహించి పలికెను. "ప్రభూ! మీరు మాకు పితృతుల్యులు. మాకు ప్రీతి పాత్రులు, పూజ్యులు. మాకులగురువైన వసిష్ఠుడు మా తలిదండ్రుల కంటెను మాకు హితమును గూర్చువాడు. విశ్వామిత్రుడు మొదలగు మహర్షులును, మంత్రులును, ఇక్కడనే కలరు. జ్ఞానసాగరులైన మీరును ఇచట కలరు. ప్రభూ! నన్ను బాలునిగా, మీ ఆజ్ఞలను తలదాల్చు సేవకునిగా భావించి, ఉపదేశమును ఇండు. ఇట్టి పవిత్ర స్థలమున, సజ్జనుల మధ్య, జ్ఞానులును పూజ్యులును ఐన మీరు నన్ను అడుగుట! దానికి నేను మౌనముగా ఉన్నచో మలిన మనస్కునిగా భావింపబడుదును. ఒకవేళ ఏదైనను చెప్పినచో నేను పిచ్చివాడనే అగుదును. పిట్ట కొంచెము, కూత ఘనము అన్నట్లు ఉన్నది- నేను చిన్నవానినైనను పెద్దవానివలె మాట్లాడుచున్నాను. విధివైపరీత్యమును గమనించి, నన్ను క్షమింపుడు. 'సేవాధర్మము

1. సున్నాలెన్నియున్నను వాటికి ముందు ఒకటిని (ఒక అంకెను) చేర్చినప్పుడే ఆ సున్నాలకు (ఆ సంఖ్యకు) విలువ ఏర్పడును.
2. ఏమి చేసితేనేమి? శ్రీరామ స్వామికరుణలేని వారిలలో ॥ ఏమి ॥
   కామమోహదాసులై శ్రీరాముని కట్టు తెలియని వారిలలో ॥ ఏమి ॥ (త్యాగరాజ)

చాల క్లిష్టమైనది'- అని వేదశాస్త్ర పురాణములునుడువు చున్నవి. స్వామి ధర్మము, స్వార్థము ఒక చోట ఇముడజాలవు. స్వామిధర్మమున కర్తవ్యపరాయణత్వము ముఖ్యము. స్వార్థము దానికి విరుద్ధము. (నేను ప్రేమవశమున పల్కినను లేక స్వార్థముతో నుడివినను అందు దోషమే గోచరించును.) (చౌ॥ 1-4)

కావున నన్ను అస్వతంత్రునిగా భావించి, శ్రీరామచంద్రుని ఇష్టమును, ధర్మపరాయణత్వమును, సత్యపాలనమును గౌరవించి, ఆయనయెడల అందఱి ప్రేమానురాగములను గుర్తించి, అందఱికిని సమ్మతము, శుభప్రదము ఐన దానిని నిర్ణయింపుడు. (దో॥ 293)

భరతుని వచనములను విని, ఆతని సౌశీల్యమునకు ముగ్ధుడై జనకరాజు పరివారముతో గూడి ఆయనను ప్రశంసించెను. విజ్ఞుడైన భరతునిమాటలు సుగమములైనను గంభీరములు, మృదు మధురములైనను కఠినములు, సంక్షిప్తములేయైనను వాటి అర్థములు అపారములు, అగాధములు, అద్దములోని ప్రతిబింబమువలె భరతుని వాణి అగ్రాహ్యము. (పట్టుకొనుటకు దొరకనిది) పిమ్మట దేవతలనెడి కుముదములను వికసింపజేయు శ్రీరామచంద్రుని కడకు జనక మహారాజు, భరతుడు, వసిష్ఠ మహర్షి వెళ్లిరి. ఈ విషయమును ఎఱింగి, శ్రీరాముని నిర్ణయము ఎట్లుండునో? అను ఆందోళనతో 'వర్షఋతు ఆరంభమున క్రొత్తనీటిలో విలవిలలాడు చేపవలె' ప్రజలెల్లరును వ్యాకులతనొందిరి. దేవతలు మొదట వసిష్ఠుని స్థితిని, పిదప జనకుని విశిష్టప్రేమను, కడకు రామభక్తిలో మునింగిన భరతుని జూచిరి. అపుడు స్వార్థపరులైన దేవతలు తమ కార్యము సిద్ధింపదేమోయని భయపడి, నిరాశకు లోనైరి. అందఱును శ్రీరామభక్తిపరవశులై యుండుట జూచి, వారు అంతులేని విచారమునకు లోనైరి. (చౌ॥ 1-4)

దేవేంద్రుడు చింతాక్రాంతుడై, "శ్రీరామచంద్రుడు భరతాదుల ప్రేమానురాగములకు వశుడైయున్నాడు. కావున మనమందఱము కలిసి, ఏదైననొక యుక్తిని పన్నవలెను. లేనిచో మన పని చెడిపోవును" అని పలికెను. (దో॥ 294)

ఆసమయమున దేవతలు సరస్వతీదేవిని స్మరించి, స్తుతించి, ప్రార్థించిరి. "దేవీ! దేవతలందఱును నీ శరణుజొచ్చినారు. మమ్ము రక్షింపుము. నీ మాయా ప్రభావముచే భరతుని బుద్ధిని మార్చుము. ఏదైన నొక కపటోపాయముపన్ని దేవతలను కాపాడుము." దేవతల ప్రార్థనలను ఆలకించిన సరస్వతీ దేవి "వీరు స్వార్థ పరత్వముచే వివేకశూన్యులైనారు." అని భావించి, దేవేంద్రునితో ఇట్లు పలికెను. "భరతుని బుద్ధిని మార్చవలసినదిగా నన్ను అడుగుచుంటివి. వేయికన్నులున్నను నీకు మేరు పర్వతము కనబడుట లేదా? బ్రహ్మ విష్ణు మహేశ్వరులమాయ మిక్కిలి ప్రబలమైనది. అదియును భరతుని బుద్ధివైపు చూచుటకు సమర్థము గాదు. భరతునిబుద్ధి వైభవము అట్టిది. అట్టి దానిని మార్చుటకు శక్యమా? ప్రచండ కిరణములుగల సూర్యుని (సూర్యతాపమును) వెన్నెల అపహరింపగలదా? భరతుని హృదయములో శ్రీసీతారాములు నిండి యున్నారు. సూర్యుడున్నచోట చీకటి ఉండగలదా?" అని పలికి సరస్వతి బ్రహ్మలోకమునకు వెళ్లిపోయెను. రాత్రులయందు చక్రవాక పక్షులవలె దేవతలు వ్యాకులులైరి. (చౌ॥ 1-4)

దేవతలు స్వార్థపరులై, మలిన మనస్కులై కుతంత్రములను పన్నిరి. తమ ప్రబల మాయాజాలమును పఱచి, అయోధ్యప్రజలలో భయము, భ్రమ, విరక్తి, ఉద్వేగములను వ్యాపింపచేసిరి. (దో॥ 295)

ఈ కుతంత్రములకు పాల్పడియు, ఇంద్రుడు తనప్రయత్నము యొక్క 'జయాపజయములు' భరతుని మీదనే ఆధారపడియున్నవని భావించెను. ఇక్కడ జనకుడు వసిష్ఠాదిమునులతో గూడి, శ్రీ రఘునాథుని యొద్దకు వచ్చెను. సూర్యవంశదీపకుడైన శ్రీరాముడు అందఱిని గౌరవించెను. అప్పుడు వసిష్ఠుడు సమయసమాజధర్మములకు

అనుగుణమైన వచనములను పలికెను. మొదట జనకభరతుల సంవాదమును వినిపించి,పిదప భరతుని కథనమును తెలిపెను. అనంతరము "నాయనా! రామా! అందఱును నీ ఆజ్ఞను తలదాల్చెదరు. ఇది నా అభిప్రాయము" అని పలికెను. రఘునాథుడు చేతులు జోడించి, మృదుమధురముగా సత్యమును వచించెను." మీరును, మిథిలేశ్వరుడును ఉండగా మీ సమక్షమున నేను పలుకుట అన్ని విధములుగా అనుచితము. మీరు, మహారాజు గారు ఇచ్చెడి ఆజ్ఞ అందఱికిని శిరోధార్యము. దానిని నేను తప్పక పాటింతునని శపథము చేయుచున్నాను." (చౌ॥ 1-4)

శ్రీరాముని శపథమును విని, మునీశ్వరుడు, జనక మహారాజు, సభాసదులు, అందఱును సందిగ్ధావస్థలో పడిరి. ఎవ్వరును పెదవి విప్పలేదు. అందఱును భరతుని వైపుచూడసాగిరి. (దో॥ 296)

సదస్యుల ధోరణిని గమనించి, భరతుడు మిక్కిలి ధైర్యము వహించెను. పెఱుగుచున్న వింధ్యాచలమును అగస్త్యుడు అదుపు చేసినట్లు భరతుడు నిబ్బరముతో తన ప్రేమోద్రేకములను నిరోధించెను. శోకమనెడి హిరణ్యాక్షుడు సభాసదుల బుద్ధియనెడి పృథ్విని హరించి వేసెను. ఆ బుద్ధి విమలసద్గుణసమూహములనెడి జగత్తును ఉత్పన్నము చేయునట్టిది. ఆసమయముననే భరతుని వివేకమనెడి ప్రబలవరాహము శోకరూప హిరణ్యాక్షుని తుదముట్టించి, బుద్ధియనెడి పృథ్విని అవలీలగా కాపాడెను. భరతుడు అంజలి ఘటించి, అందఱికిని నమస్కరించెను. శ్రీరామచంద్రునకును, జనకమహారాజునకును, గురువైన వసిష్ఠునకును, సాధుపురుషులకును ఇట్లు విన్నవించెను. "నేటి నా సాహసవచనములను మన్నింపుడు. నా నోట కఠినములైన మాటలు వెలువడుచున్నవి." అతడు వాగ్దేవిని స్మరించెను. వెంటనే ఆమె అతని మనస్సనెడి మానససరోవరమునుండి ఆతని ముఖకమలమున విరాజిల్లెను. నిర్మలవివేకము, ధర్మము, నీతి సమ్మిళితమైన భరతుని వాణియనెడి హంస ధర్మాధర్మములనెడి నీరక్షీరములను విభజించెను. (చౌ॥ 1-4)

భరతుడు తన వివేక దృష్టితో ప్రేమపరవశులైన సదస్యులను జూచి, వారికి ప్రణమిల్లి, శ్రీ సీతారాములను స్మరించి, యిట్లు పలికెను. (దో॥ 297)

"ప్రభూ! నాకు తల్లి, తండ్రి, మిత్రుడు, గురువు, స్వామి, హితకారి, అంతర్యామి, అన్నియు మీరే. మీరు సరళహృదయులు, నాకు యజమానులు, పూజ్యులు, గుణశీలనిధులు, శరణాగతవత్సలురు, సర్వజ్ఞులు, ఉదారులు, సమర్థులు, శరణుజొచ్చిన వారికి హితైషులు, గుణగ్రాహులు, దోషములను, పాపములను హరించువారు. స్వామీ! నేను ప్రమాణముచేసి చెప్పుచున్నాను. మీ వంటి ప్రభువు మీరే. నావంటి అపరాధి మఱియొకడు ఉండడు. తండ్రిగారి ఆజ్ఞను ఉల్లంఘించి, మోహవశమున ప్రజలతోగూడి ఇచటికి వచ్చితిని. ప్రభూ! ప్రపంచమున మంచి-చెడు, గొప్ప-బీద, అమృతము-విషము, అమరత్వము-మృత్యువు మొదలగు పరస్పరవైరుధ్యముగలవి పెక్కుగలవు. కాని మీకు మాత్రము విరోధులెవ్వరును లేరు. శ్రీరామచంద్రుని ఆజ్ఞను మనస్సునందైనను వ్యతిరేకించు వానిని, నేను ఎచ్చటను ఇంత వఱకు కని, విని యెఱుగను. నేను అన్ని విధముల ధృష్టత్వముననే పాల్పడితిని. కాని మీరు దీనిని గూడ సేవాస్నేహములుగనే భావించితిరి. (చౌ॥ 1-4)

స్వామీ! మీకృపాసౌజన్యములవలన నాకు అంతయు మేలే జరిగినది. నా దోషములుగూడ భూషణములైనవి. నలుదిక్కులయందును నా కీర్తి వ్యాపించినది. (దో॥ 298)

ప్రభూ! మీరీతియు, కారుణ్య స్వభావమూ జగత్ప్రసిద్ధములు. ఇవి వేదశాస్త్రముల యందును వర్ణింపబడినవి. క్రూరులు, కుటిలురు, దుష్టులు, దుర్బుద్ధులు, కళంకితులు, నీచులు, దుశ్శీలురు, నాస్తికులు, నీతిమాలిన వారు- ఇట్టి వారు అందఱును మీ శరణుజొచ్చి, మీకు ఒక్కసారి ప్రణమిల్లిన మాత్రముననే వెంటనే వారిని అక్కున జేర్చుకొని, ఆత్మీయులుగా ఆదరించితిరి. ఆ శరణాగతులదోషములను ఏ మాత్రమూ మనస్సునకు రానీయనేలేదు.

పైగా వారి గుణములను మాత్రమే గ్రహించి, వారిని సాధుజనసమక్షమున కొనియాడినారు. సేవకులయోగక్షేమములసమస్తభారమును వహించునట్టి మీ వంటి కృపాళువులు ఎక్కడ ఉందురు? తాముచేసిన మేలును ఏ మాత్రము తలపక, ఆశ్రితుల చింతలను, కడగండ్లను తొలగించుటయే గాక, వారిఆపదలనుజూచి వగచు స్వామి ఎక్కడ నుండును? చేతులెత్తి, నమస్కరించి, ప్రతిజ్ఞాపూర్వకముగ పలుకుచున్నాను. మీవంటి ప్రభువు మఱియొకరు లేనేలేరు. శిక్షణతో కోతులు, ఎలుగుబంట్లు నాట్యమాడును, చెప్పిన పాఠములను చిలుకలు వల్లించును. కాని చిలుకలపలుకులు, జంతువులవిన్యాసములు వాటికి శిక్షణను ఇచ్చిన వానిపై ఆధారపడును.

(చౌ॥ 1-4)

అట్లే భంగపఱచబడిన సేవకులకార్యములను సంస్కరించి, మీరు వారిని సమాదరించి, సజ్జనశిరోమణులను గావించినారు. కృపానిధులైన మీకుదప్ప ఇట్టికీర్తి ప్రతిష్ఠలు మఱియెవ్వరికబ్బును? కనుక ఈ విషయమున మీకు మీరే సాటి. (దో॥ 299)

శోకమున మునింగి, మీ ప్రేమకు వశుడనై బాల్యచాపల్యముచే మీ ఆజ్ఞను ప్రక్కనబెట్టి, నేను మీ పదసన్నిధికి చేరితిని. ఐనను కృపతో నా అపరాధమును మన్నించి, నన్ను చేరదీసి అక్కునజేర్చుకొనినారు. సర్వశుభములకును మూలమైన మీ చరణములను దర్శించితిని. స్వాభావికముగనే మీరు నాయందు అనురక్తులని గ్రహించితిని. దయామయులైన మీరు మీ కృపాకటాక్షములను నాపై అపారముగా ప్రసరింపజేసితిరి. స్వామీ! మీ సౌశీల్య సౌజన్య స్వభావములచే నన్నెంతో లాలించితిరి. నా కారణముగ క్షమార్హము గాని గొప్ప తప్పిదమే జరిగినను మీరు నాపై అపరిమితమైన అనురాగమును ప్రదర్శించితిరి. ప్రభూ! మీ యెదుట, సదస్యుల సమక్షమున నిస్సంకోచముగా, ఇష్టమువచ్చినట్లు, సవినయముగానో లేక తద్విరుద్ధముగనో పల్కితిని. నా ఈ అపరాధమును క్షమింపుడు.

(చౌ॥ 1-4)

దేవా! సుహృదులు, జ్ఞానులు, శ్రేష్ఠులు ఐన ప్రభువుల యెదుట ఎక్కువగా మాట్లాడుటయు దోషమే. మీరు నా కోరికలనన్నింటిని నెఱవేర్చితిరి. కావున దయతో నా కర్తవ్యమును ఆదేశింపుడు. మీ ఆజ్ఞాపాలనతోడనే అన్నియు చక్కబడును. (దో॥ 300)

సత్యపుణ్యసుఖప్రదములైన ప్రభుపాదపద్మపరాగములపై ప్రతినబూని, నా మనస్సులోని కోరికను ప్రకటించుచున్నాను. జాగత్స్వప్నసుషుప్త్యవస్థలలోగూడ స్వార్థకపటములను, చతుర్విధ పురుషార్థములను వీడి, స్వామిసేవలొనర్చుటయే నా అభిలాష. సత్ప్రభువుల ఆజ్ఞలను తలదాల్చుటకంటె గొప్పసేవ యేముండును? దేవా! అట్టి ఆజ్ఞారూపమైన అనుగ్రహమును ఈ సేవకునిపై చూపుడు" ఇట్లు పలికి భరతుడు ప్రేమపరవశుడాయెను, పులకిత గాత్రుడాయెను, ఆనందాశ్రుపూర్ణనేత్రుడాయెను. అతడు వ్యాకులుడై, ప్రభుచరణకమలములపై వ్రాలెను. ఆ సమయమునందలి వారి ప్రేమాతిరేకములు వర్ణనాతీతములు. కృపాసింధువైన శ్రీరామచంద్రుడు మనోహరములైన పలుకులతో భరతుని లాలించెను. అతనిని స్వయముగా తన యొద్దకూర్చుండబెట్టుకొనెను. భరతుని విన్నపమును ఆలకించి, అతని స్వభావమును గమనించి, సభాసదులును, శ్రీరామచంద్రుడును ప్రేమ విహ్వలులైరి. (చౌ॥ 1-4)

శ్రీరఘురాముడు, వసిష్ఠమహర్షి, మిథిలాధిపతి జనకుడు, సాధుజనులు, మున్నగు వారు భరతుని ఉదాత్త వచనములకు పరవశులైరి. అందఱును అతని భ్రాతృభావమును, అపారభక్తిమహిమను పొగడసాగిరి. దేవతలు మోహావిష్టహృదయములతో అతనిని ప్రశంసించుచు పుష్పవృష్టిని గురిపించిరి. తులసీదాసు చెప్పుచున్నాడు- అందఱును భరతునిభాషణమును విన్న పిమ్మట రాబోవు పరిణామములకు వ్యాకులత చెందుచుండిరి. రాత్రిరాకతో కమలములవలె వారు నిస్తేజనిరాశలకు లోనైరి. (ఛం)

ఇరుపక్షములయందలి ప్రజలదైన్యదుఃఖములను గాంచి, మహామలినమనస్కుడైన ఇంద్రుడు చచ్చిన వారిని ఇంకను చంపి, తాను లాభపడదలచెను. (సో॥ 301)

సురరాజు ఇంద్రుడు కపటమునకు, వంచనకు పెట్టిందిపేరు. ఇతరులపనులను భంగపఱచి, తనపబ్బము గడుపుకొనుటయే అతని నైజము. అతడు కాకివలె ప్రవర్తించును. అతడు మోసకారి, మనోమాలిన్యము గలవాడు, ఎవరినీ విశ్వసింపడు. ఇంద్రుడు మొదట దురాలోచనాపరుడై కుట్ర నడిపి, దాని ఫలితమైన వ్యామోహమును అందఱిపై రుద్దెను. ఈ దేవతలమాయవలన అందఱును మిక్కిలి మోహితులైరి. కాని శ్రీరామచంద్రునిపై గలప్రేమవలన వారు అంతగా తొణక లేదు. ఎవరి మనస్సుల యందును విరక్తి, ఔదాసీన్యము స్థిరముగా లేకుండెను. ఒక క్షణములో వనములలో నుండనిచ్ఛగింతురు. మఱుక్షణముననే ఇంటిపైకి ధ్యాసను మఱలింతురు. నదీసముద్రసంగమస్థానమున జలములవలెవారి మనస్సులు సందిగ్ధావస్థకు గురియయ్యెను. అస్థిరచిత్తులైనందున వారికి మనశ్శాంతి దూరమగుచుండెను. తమమనస్సులలోని మాటలను ఇతరులకు చెప్పుటకును వెనుకాడుచుండిరి. వారి ఈ దశను జూచి, కృపానిధియైన శ్రీరామచంద్రుడు నవ్వుచు మనస్సులో ఇట్లనుకొనెను. కుక్క, ఇంద్రుడు, నవయువకుడు ఒకే (కామ) స్వభావము గలవారు. (విషయలౌల్యములో ముగ్గురును సమానులే) పాణినీయ వ్యాకరణమునను సరించి, శ్వన్, యువన్, మఘవన్ అను మూడు శబ్దముల రూపములు వరుసగా శ్వా, యువా, మఘవా, అను రీతిలో ఒకే విధముగా ఉండును. (చౌ॥ 1-4)

భరతుడు, జనకుడు, మునులు, మంత్రులు, జ్ఞానులైన మహాత్ములును తప్ప. అందఱును వారివారిస్వభావములననుసరించి దేవతలమాయలలో పడిపోయిరి. (దో॥ 302)

కరుణాసాగరుడైన శ్రీరామచంద్రుడు ఇంద్రమాయచే దుఃఖితులైన తనప్రజల స్థితిని చూచెను. సభాసదులు, జనకుడు, గురువు, బ్రాహ్మణులు, మంత్రులు మొదలగువారందఱును భరతుని భక్తికి వశులై, ఏమియు మాట్లాడుటకును, చేయుటకును తోచనివారైరి. అందఱును చిత్తరువులవలె శ్రీరామచంద్రునివైపు రెప్పలార్పక చూచుచుండిరి. వల్లించిన మాటలవలె సంకోచముతో చిలుక పలుకులు పలుకుచుండిరి. భరతుని ప్రీతి, నమ్రత, వినయము, మహిమ వినుటకు సుఖదములు. కాని వర్ణించుట అసాధ్యము. అతని భక్తిని అణుమాత్రము చూచినను, మునులు, మిథిలేశ్వరుడైన జనకుడు ప్రేమమగ్నులైరి. అట్టి భరతుని మహిమను తులసీదాసు ఎట్లు వర్ణింపగలడు. అతని భక్తి ప్రపత్తులు కవిహృదయములలో సద్బుద్ధిని ఉదాత్తభావములను రేకెత్తింపజేయును. 'కాని నా బుద్ధి చిన్నది, భరతునిభక్తిమహిమ గొప్పది' అని తెలిసికొని, కవికులమర్యాదను పాటించుచు వాటిని వర్ణించుటకు నేను సాహసింపలేదు. ఆయన గుణములను వర్ణింపవలెనను ఆసక్తి మెండుగాగలదు- కాని వానిని తెల్పుటకు నాకు శక్తి చాలదు. నా బుద్ధిబలము బాలకులమాటలవలెనైనది. మనస్సున భావమున్నది. దానిని మాటలలో ప్రకటించుటకు అశక్తుడను. (చౌ॥ 1-4)

భరతుని విమలయశస్సు ఒకనిర్మలచంద్రుడు. కవి సుబుద్ధి ఒక చకోరము. భక్తుల హృదయములనెడి నిర్మల- ఆకాశమున అది ఆ కీర్తి చంద్రుని కన్నులార్పక చూచును. కాని వర్ణింపలేదు. (దో॥ 303)

భరతుని స్వభావమును వేదములు గూడ సులభముగా వర్ణింపజాలవు. కావున కవీశ్వరులు నా మందబుద్ధి చాపల్యమును క్షమింతురు గాక. భరతుని సద్భావమును చెప్పినను వినినను శ్రీరామచంద్రుని చరణములయందు అనురక్తుడు కానివాడెవ్వడు? భరతుని స్మరించినను శ్రీరామునియందు భక్తి కలుగనివాడు నిజముగా దురదృష్టవంతుడు. దయాళువైన శ్రీరాముడు అచటనున్నవారిస్థితిని జూచి, భరతునిమనస్సులోని ఆంతర్యమును గ్రహించెను. ధర్మధురంధరుడు, ధీరుడు, నీతికోవిదుడు, సత్యస్నేహశీలసుఖసాగరుడు, నీతిని, ప్రీతిని పాలించువాడైన శ్రీరామచంద్రుడు దేశకాల-అవసరములను, సమాజమును పరిశీలించి, పలికిన వచనములు వాణీ సర్వస్వములై, శుభప్రదములై, అమృతతుల్యములై యుండెను. "సోదరా! భరతా! నీవు ధర్మపరాయణుడవు. లోకాచారములను, వేదపరంపరలను ఎఱిగినవాడవు. ప్రేమ స్వరూపుడవు. (చౌ॥ 1-4)

# భరతునకు శ్రీరాముని ఆదేశము

నాయనా! మనో వాక్కాయకర్మలపవిత్రతకు నీకు నీవే సాటి. గురుజనుల సమక్షమున, తగని సమయమున నా తమ్ముని గుణములను ఎట్లు ప్రశంసింతును? (దో॥ 304)

నాయనా! నీవు సూర్యవంశమర్యాదను, సత్యసంధుడైన తండ్రిగారి కీర్తిప్రతిష్ఠలను, ఆయన ప్రేమను, సమయసందర్భములను, సమాజమునందును, గురువులయందును పాటింప వలసిన మర్యాదను, ఉదాసీనుల మిత్ర, శత్రుమనస్సులనుగూడ ఎఱుగుదువు. అందఱి కర్తవ్యమును, నీకును నాకును హితమును గూర్చు ధర్మమును బాగుగా తెలిసినవాడవు. నీపై నాకు పూర్తిగా విశ్వాసము గలదు. ఐనను సమయసందర్భములకు అనువుగా ఒక మాట చెప్పెదను వినుము. నాయనా! తండ్రిగారు లేని సమయమున కేవలము గురువుగారి కృపయే మనలను రక్షించినది. లేనిచో మనకును, మనపరివారములకును మనప్రజలకును దుర్దశ ప్రాప్తించియుండెడిది. సమయమునకు ముందుగానే సూర్యుడస్తమించినచో ఎవనికి క్లేశము గలుగదు? తండ్రిగారి అకాలమరణమువలన విధాత మనకు అట్టి అనర్థమునే కలుగజేసెను. కాని గురునైన వసిష్ఠులవారు, జనకమహారాజుగారు అందఱిని రక్షించిరి. (చౌ॥ 1-4)

రాజకార్యములే గాక మనవంశగౌరవప్రతిష్ఠలు, ధర్మము, పృథ్వి, ధనము, కుటుంబము- అన్నియును గురువుగారి ప్రభావముననే రక్షింపబడును. పరిణామమున అంతయు శుభమేయగును. (దో॥ 305)

గురువుగారి అనుగ్రహమే నిన్ను, నన్ను, మన సమాజమును ఇంటిలో ఉన్నను వనములో ఉన్నను రక్షించును. శేషుడు భూభారమును వహించునట్లు మాతాపితృగురుప్రభువుల ఆజ్ఞలను ఔదలదాల్పవలెను. అదియే అత్యుత్తమమైన ధర్మము. కావున నాయనా! నీవు వారి ఆజ్ఞను పాలింపుము, నన్ను గూడ పాలింపనిమ్ము. సూర్యవంశ పాలకుడవు, రక్షకుడవుకమ్ము. (ఈ విషయమును 264వ దోహాకు ముందుగల మొదటి చౌపాయిలో శ్రీరాముడు ఇంతకు ముందే తెలిపియున్నాడు.) వారి ఆజ్ఞాపాలనయే సాధకులకు సిద్ధులను ప్రసాదించును. అది కీర్తి, సద్గతి, ఐశ్వర్యములను అనుగ్రహించు త్రివేణీ సంగమము వంటిది. ఇట్లు యోచించి దుర్భర కష్టములను సైతము సహించుచు ప్రజలకును పరివారములకును సుఖశాంతులను గూర్చుము. సోదరా! నా కష్టములను మీరు అందఱును పంచుకొనినారు. కాని నావనవాస కాలము ముగియు వఱకు అమితమైన బరువు బాధ్యతలు నీపైననే ఉండును. నీవు మెత్తని మనస్సుకలవాడవేయని తెలిసినను, నేను కఠినవచనములను పల్కుచున్నాను. ఇది తగని సమయమని తెలిసియునేనిట్లు పలుకుట అనుచితము కాబోదు. ఏలనన వజ్ర ప్రహారమును ఆపుటకు చేతిని ఉపయోగించినట్లు కష్టకాలమునందు ఉత్తముడైన సోదరుడే సహాయపడును. (చౌ॥ 1-4)

సేవకులు కాలుసేతులతో నేత్రములతో సమానులు. ప్రభువు నోరు(ముఖము) వంటివాడు. స్వామి సేవక-అనుబంధరీతులను విని కవులు వారిని ప్రశంసించెదరు.[1] అని తులసీదాసు చెప్పుచున్నాడు. (దో॥ 306)

ప్రేమసముద్రమును చిలికినపుడు వెలువడిన అమృతమువంటి రఘునాథుని వచనములను విని అందఱును ప్రేమపరవశులైరి. ఈ దశను జూచి సరస్వతీ దేవియు మూగనోము పట్టెను. స్వామి అనుగ్రహించుటవలన భరతునిదుఃఖమూ, దోషమూ దూరమాయెను. అతనికి సంతోషము కలిగెను. ముఖము ప్రసన్నమయ్యెను.(సరస్వతీ కటాక్షముచే) మూగవానికి మాటలు వచ్చినట్లు అయ్యెను. పిమ్మట భరతుడు భక్తితో ప్రణమిల్లి, కరకమలములు

1. కాలుసేతులు శ్రమించి, నోటికి ఆహారమును అందించును. ఈ ఆహారమువలన కలుగు బలము శక్తి ముఖమునకు (నోటికి) మాత్రమే గాక శరీరాంగములన్నింటికిని సమానముగనే లభించును. అట్లే ప్రజలొనర్చు సేవల ప్రయోజనములను రాజేగాక ప్రజలందఱును సమానముగా అనుభవింపవలెను.

జోడించి పల్కెను. "స్వామీ! వనమునకు మీతోగూడివచ్చు సుఖముగూడ నాకు లభించినది. నా జన్మ సఫలమైనది. కృపాళూ! మీ ఆజ్ఞ ఏదైనప్పటికినీ నేను దానిని సాదరముగా శిరసావహింతును. ఈ వనవాసకాలమునందు సేవచేయుటకై ఏదైననొక ఆలంబనమును ఒసంగుడు. (చౌ॥ 1-4)

## సర్వతీర్థనిమజ్జనము - భరతకూప మహత్త్యము

దేవా! గురువుగారి ఆజ్ఞతో పట్టాభిషేకమునకై సర్వతీర్థములనుండి జలములను తీసికొని వచ్చినాను. దానికి మీ ఆజ్ఞ ఏమి? (దో॥ 307)

"నా మనస్సులో ఒక గొప్ప అభిలాష కలదు. భయసంకోచములవలన చెప్పలేకపోవుచున్నాను." శ్రీరామచంద్రుడు 'సోదరా! నీ అభిలాషను తెలుపుము' అని పలికెను. ప్రభునాజ్ఞను పొంది, భరతుడు భక్తితో పలికెను. "మీఆజ్ఞయైనచో చిత్రకూటమునందలి ఋష్యాశ్రమములను, తీర్థములను, వనములను, పశుపక్షులను, నదీ తటాకములను, సెలయేర్లను, పర్వతసమూహములను, విశేషముగా ప్రభుపాదముద్రలుగల భూములను చూచెదను." శ్రీరామచంద్రుడు పలికెను. "నాయనా! అవశ్యముగా అత్రి మహాముని ఆజ్ఞను బడసి, నీవు నిర్భయముగా సంచరింపుము. ఆ మహర్షి అనుగ్రహమువలన వనము శుభప్రదము, పరమపవిత్రము, అతి మనోహరము ఐనది. ఆ ఋషిపుంగవుడు చెప్పిన స్థానములోనే తీర్థ జలములను ఉంచుము." ప్రభు వచనములను విని భరతుడు మిక్కిలి సంతసించెను. అత్రి మహాముని చరణములకడ ప్రసన్నమనస్కుడై ప్రణమిల్లెను. (చౌ॥ 1-4)

సకల శుభములకును మూలమైన శ్రీరామభరతసంవాదములను విని, స్వకార్యసిద్ధికై నిరీక్షించుచున్న దేవతలు రఘువంశమును ప్రశంసించుచు కల్పతరుప్రసూనములను కురిపించిరి. (దో॥ 308)

"భరతుడు ధన్యుడు. శ్రీరామచంద్ర ప్రభువునకు జయము" అని పల్కుచు దేవతలు ఒక్కసారిగా ఆనందాబ్ధిలో ఓలలాడిరి. భరతుని మాటలకు వసిష్ఠమహర్షి, మిథిలాధిపతి జనకమహారాజు, సభాసదులు, అందఱును సంతోషపడిరి. జనకుడు పులకితగాత్రుడై శ్రీరామభరతుల గుణములను వారిప్రేమానురాగములను ప్రశంసించెను. స్వామిసేవకులస్వభావములు ఉదాత్తములు. వారి నియమములు, అన్యోన్యములు, పవిత్రతను గూడ పవిత్రమొనర్చు చుండెను. మంత్రులును, సదస్యులును ప్రేమ పరవశులై, తమకుతోచినరీతిగా వారిఅనురాగములను పొగడుచుండిరి. శ్రీరామభరతులసంవాదమును విని, ఇరుపక్షములవారిమనస్సులలో హర్షవిషాదములు ముప్పిరిగొనెను. శ్రీరామునితల్లియైన కౌసల్యాదేవి సుఖదుఃఖములను సమానముగా భావించెను. శ్రీరాముని గుణములను వర్ణించి, ఇతరరాణులను ఓదార్చెను. కొందఱు శ్రీరాముని గొప్పదనమును, మఱి కొందఱు భరతుని మంచితనమును కొనియాడుచుండిరి. (చౌ॥ 1-4)

అప్పుడు అత్రి మహాముని భరతునితో పలికెను. "ఈ పర్వత సమీపమున ఒక అందమైన బావిగలదు. నిరుపమానమైన అమృతమువంటి ఈ పవిత్ర తీర్థజలములను అందుంచుము." (దో॥ 309)

అత్రి మహాముని ఆజ్ఞననుసరించి, భరతుడు ఆ తీర్థజలపాత్రలను సేవకులద్వారా ముందుగా పంపెను. సోదరుడైన శత్రుఘ్నునితోడను, అత్రిమహామునితోడను, ఇతర సాధుసజ్జనులు మొదలగు వారితోడను గూడి, తాను ఆ అగాధకూపము కడకు వెళ్లెను. ఆ పావన జలములను ఆ పుణ్య స్థలమునందుంచెను. అత్రి మహాముని ప్రసన్నుడై పలికెను. "ఈ స్థానము అనాదియైన సిద్ధక్షేత్రము. కాలక్రమమున మఱుగునబడినది. కావున దీనినిగూర్చి ఎవ్వరికిని అంతగా తెలియదు." అప్పుడు అత్రిమహాముని శిష్యులు ఆ స్థలమునుజూచి, అచట ఒకవిశిష్టమైన బావిని నిర్మించిరి. దైవయోగమువలన సమస్త ప్రపంచమునకును శుభము చేకూరెను. అన్ని తీర్థములను ఒకే చోట సేవించుట ఇంతవఱకును అసాధ్యముగా ఉండెను. అది ఇప్పుడు ఇచట సాధ్యమైనది. ఈ కూప ప్రభావమున గహనప్రాయమైన సకలతీర్థ సేవన ధర్మాచరణము మిక్కిలి సులభమైనది. అప్పటి నుండియు ఇది ('భరతుని బావి') భరతకూపము అని వాసికెక్కెను. సకల తీర్థముల జలములచే ఆ బావి మిక్కిలి పునీతమయ్యెను. ఆ బావి యందు భక్తితో స్నానమాడినవారు ఎల్లరును త్రికరణశుద్ధిగా పునీతులగుదురు. (చౌ॥ 1-4)

ఆ బావి మహిమను కొనియాడుచు జనులందఱును శ్రీరాముని ఆశ్రమమునకు చేరిరి. అత్రిముని శ్రీరామునకు ఆ పుణ్యతీర్థ ప్రభావమును వివరించెను. (దో॥ 310)

సంతృప్తికరమైన ధార్మికచర్చలతో ఆరాత్రి గడిచెను. తెల్లవాఱగనే భరతశత్రుఘ్నులిద్దఱును తమనిత్యకృత్యములను దీర్చుకొని, శ్రీరామ-అత్రి, వసిష్ఠుల ఆజ్ఞలను గైకొని, సపరివారముగా పాదచారులై సాధారణ వేషములతో రామవనమున తిరుగుటకై బయలు దేఱిరి. వారిచరణములు మిక్కిలి కోమలములైనవి. పాదరక్షలు సైతము లేకుండ వారు తిరుగుటను జూచి, భూమియే మెత్తబడెను. గడ్డి, ముండ్లు, గులకఱాళ్లు మొదలగు బాధాకరములైన వస్తువులను తనలోదాచుకొని, భూదేవి వారి మార్గమును సుగమముగా కోమలముగా జేసెను. శీతల మందసుగంధపవనములు హాయిని గూర్చుచు వీచెను. దారిలో దేవతలు పుష్పములను వర్షించిరి. మేఘములు నీడలనిచ్చెను. వృక్షములు పుష్పఫలభరితములాయెను. తృణములు కోమలత్వము వహించి, మార్గమును సుఖ ప్రదము గావించెను. మృగములు తమచూపుల తోడను, పక్షులు తమమృదుమధురకూజితములచేతను వారిని ఆహ్లాదపఱచెను. ప్రాణులన్నియు భరతుడు శ్రీరామచంద్రునకు అత్యంతప్రీతిపాత్రుడని గుర్తించి సేవలొనర్చెను. (చౌ॥ 1-4)

ఒక సామాన్యవ్యక్తియు ఆవులించునప్పుడు రామనామమును ఉచ్చరించినచో సకల సిద్ధులను పొందగలిగినప్పుడు శ్రీరామచంద్రునకు ప్రాణతుల్యుడైన భరతునకు ఇట్టి శుభములు కలుగుట ఆశ్చర్యకరము గాదు. (దో॥ 311)

ఈ విధముగా భరతుడు వనములో విహరించెను. అతని నియమములను, భక్తిని జూచి, మునులే సిగ్గుపడిరి. విశేషసౌందర్యశోభితములైన పవిత్రజలాశయములను, భూఖండములను, పశుపక్షులను, వృక్షతృణములను, పర్వతములను, వన-ఉపవనములను గాంచి, భరతుడు వాటి పవిత్రతకును, దివ్యత్వమునకును అబ్బురపడెను. భరతుడడుగగా అత్రిమహాముని ప్రసన్నచిత్తుడై, వాటి పేర్లను, గుణములను, పుణ్య ప్రభావములను తత్కారణములను చక్కగా వివరించెను. భరతుడు ఒకచోట స్నానమాడును, మఱియొక చోట ప్రణమిల్లును. మనోహర దృశ్యములను దర్శించును. అతడక్కడక్కడ అత్రిమునిఆజ్ఞను బడసి కూర్చొని, శ్రీ సీతారామలక్ష్మణులను స్మరించును. అతని స్వభావమును ప్రేమానురాగ పూరితసేవాభావమును జూచి వనదేవతలు ప్రసన్నులై ఆశీర్వదించిరి. మూడవజాము సగముగడిచినపిదప భరతుడు తిరిగివచ్చి ప్రభుపాదపద్మములను దర్శించుచుండెను. (చౌ॥ 1-4)

ఈ విధముగా భరతుడు అన్నితీర్థస్థానములను ఐదుదినములు దర్శించెను. హరిహరులనిర్మలదివ్యగాథలను వర్ణించుచు, వినుచు ఐదవదినము గూడ గడిచెను. ఇంతలో సాయంకాలమాయెను. (దో॥ 312)

## శ్రీరామ పాదుకా ప్రదానము

మఱునాడు ఉదయముననే స్నానాదికములనొనర్చి, భరతుడు, జనకమహారాజు, బ్రాహ్మణులు, ఇతర పరివారములు సమావేశమైరి. ఆ దినము యాత్రకు చాల మంచిదని తెలిసియు, చెప్పుటకు శ్రీరాముడు సంకోచించెను. వసిష్ఠుని, జనకుని, భరతుని, సభాసదులందఱిని జూచి, శ్రీరాముడు సంకోచముతో భూమివైపు చూడసాగెను. అతని ఔదార్యమును జూచి, శ్రీరామచంద్రునివంటి ఉదారస్వభావుడు ఎవ్వరూ లేరని అందఱును అనుకొనసాగిరి. జ్ఞానియైన భరతుడు శ్రీరాముని మనస్సులోని భావమును గుర్తించి, ధైర్యము వహించి, సాష్టాంగప్రణామములనాచరించి, అంజలి ఘటించి పలికెను. "ప్రభూ! మీరు నా కోరికలనన్నింటిని తీర్చితిరి. నా కారణమున వీరందఱును క్లేశములకు గురియైరి. మీరు గూడ చాల ఇబ్బంది పడినారు. స్వామీ! ఇప్పుడు అయోధ్యకు తిరిగిపోయి మీరు వచ్చు వఱకు మీ సేవ చేయుటకు నాకు అనుజ్ఞఇండు. (చౌ॥ 1-4)

ఓ దీనబంధూ! కోసలాధీశా! మీ వనవాసము ముగియువఱకు ఈ సేవకుడు మీ చరణములను దర్శించు ఉపాయమును సెలవిండు. (దో॥ 313)

ప్రభూ! ఇంతకాలము అయోధ్యావాసులు, పరిజనులు, బంధువులు మున్నగువారందఱును మీ ప్రేమలో మునిగి తేలుచుండుటవలన పవిత్రులై పరమానందమును అనుభవించినారు. మీకొఱకై జననమరణక్లేశములను అనుభవించుటయు మాకు శ్రేయస్కరమే. కాని మీరులేని పరమపదముగూడ వ్యర్థమే. స్వామీ! మీ స్వభావములు అత్యున్నతములు, మీరు అందఱిహృదయములను ఎఱుగుదురు. ఈ సేవకుని అభిరుచిని, లాలసను, ప్రవర్తనను చక్కగా తెలిసిన వారు. శరణాగతవత్సలా! మీరు అందఱిని పాలించువారు. (చివరి వఱకును మాపై మీ కృపను ప్రసరింపజేయుచు, మమ్ము పరిపాలించుచుండగలరు.) ఇది నా సంపూర్ణ విశ్వాసము. ప్రభుకృప నా దైన్యమును పోగొట్టి, నాకు ధైర్యమును ప్రసాదించినది. ఇక నాకే మాత్రమూ విచారము లేదు. నాదోషములను మన్నించి, నిస్సంకోచముగా నన్ను మీ అనుచరునిగా భావించి, ఉపదేశమునిండు" హంసవలె పాలను నీళ్లను వేఱుచేయు భరతుని యొక్క విన్నపమును విని, అందఱును అతనిని శ్లాఘించిరి. (చౌ॥ 1-4)

దీనజనరక్షకుడు, జ్ఞాన స్వరూపుడునైన శ్రీరామచంద్రుడు భరతుని నిష్కపటదీనవచనములను విని, దేశకాలావసరములను గమనించి పల్కెను. (దో॥ 314)

"నాయనా! మనము ఇంటిలోనున్నను వనమునన్నున్నను మనలను గూర్చిన, మన కుటుంబ పరివారములగుఱించిన చింత గురువులైన వసిష్ఠులను, జనకమహారాజును స్పృశించుచునే యుండును. వసిష్ఠ విశ్వామిత్రులును, (వామదేవ, జాబాలి మున్నగువారును) జనకమహారాజుగారును మనకు రక్షకులైయుండగా నీకును, నాకును స్వప్నములోగూడ క్లేశములుండవు. మన స్వప్రయోజనములును, పురుషార్థములును, యశస్సూ, ధర్మములును, పరమార్థమూ తండ్రి గారిఆజ్ఞలను పాలించుటవలననే సిద్ధించును. దానివలన తండ్రిగారి ఆజ్ఞను నెఱవేర్చినట్లగును. వేదశాస్త్రలోకమర్యాదలను నిల్పినట్లుగును. దానివలన రాజునకు మేలు కలుగును. గురువుల, తలిదండ్రుల, ప్రభువుల ఆజ్ఞలను పాలించుటకై ఆపద్ధర్మమునకు పాల్పడుటకైనను(అపమార్గమును అనుసరింపవలసివచ్చినను) వెనుకాడరాదు. ఇట్లు ఆలోచించి, విచారము మాని, నా వనవాసకాలము ముగియువఱకు నీవు అయోధ్యను పాలింపుము. మన దేశము, కోశాగారము, ప్రజలు, పరివారము- అందఱి బరువు బాధ్యతలను గురువుగారి చరణములపైనుంచుము. వసిష్ఠముని, మంత్రులు, వీరి ఉపదేశానుసారము ప్రజలను, రాజధానిని, రాజ్యమును పరిపాలింపుము. (చౌ॥ 1-4)

తులసీదాసు చెప్పుచున్నాడు. అధికారి- నోరువంటివాడు. నోరుమాత్రమే అన్నపానాదులను స్వీకరించును. కాని వివేకముతో శరీరము నందలి అన్ని భాగములను అది పోషించును. అట్లే రాజు ప్రజలందఱి యోగక్షేమములకై పాటుపడవలెను. (దో॥ 315)

రాజధర్మతత్త్వసారమిదియే. సమస్త కోరికలూ మనస్సునందే గుప్తములై యున్నట్లు రాజ ధర్మములన్నియును ఇందులోనే ఇమిడియున్నవి. శ్రీరఘునాథుడు సోదరుడైన భరతునకు అనేక విధముల నచ్చజెప్పెను. కాని ప్రత్యక్షముగా ఒక ఆలంబనము లేనిదే భరతుని మనస్సున సుఖశాంతులు కుదురుకొనలేదు. గురుజనులు, మంత్రులు, ఇతర సదస్యులు ఆసీనులైయున్న నిండుసభలో భరతునిస్నేహసౌశీల్యములకు వశుడై శ్రీ రఘునాథుడు ఎట్టి నిర్ణయమును తీసికొనజాలక స్నేహసంకోచములకు లోనయ్యెను. కడకు శ్రీరామచంద్రప్రభువు కృపతో భరతునకు తనపాదుకలను అనుగ్రహించెను. భరతుడు వాటిని భక్తితో తన శిరముపై నుంచు కొనెను. దయానిధియైన శ్రీరామచంద్రుని ఆ పాదుకలు ప్రజలప్రాణములను కాపాడు రక్షకుల వంటివి. భరతుని అపారప్రేమరత్నములకు అవి భద్రపేటికలు. జీవులనుద్ధరించు 'రామ' అను అక్షరద్వయమునకు అవి ప్రతీకలు. అవి రఘువంశమునకు రక్షకకవాటములు. శుభకార్య నిర్వహణలో అవి దివ్యహస్తములు.అవి పరమధర్మప్రదర్శకములైన నేత్రములు. ఈ ఆలంబనములను (పాదుకలను)పొంది, భరతుడు పరమానందభరితుడాయెను. పాదుకలు లభించుటచే శ్రీసీతారాములు అయోధ్యకు మఱలివచ్చుచున్నంతసౌఖ్యమును భరతుడనుభవించెను. (చౌ॥ 1-4)

భరతుడు శ్రీరామచంద్రునకు ప్రణమిల్లి, అయోధ్య ప్రయాణమునకు అనుజ్ఞను గోరెను. శ్రీరాముడు భరతుని తనఅక్కున జేర్చుకొనెను. కుటిలుడైన దేవేంద్రుడు అదను జూచుకొని ప్రజల మనస్సులలో మఱల ఆందోళనను రేకెత్తింప జేసెను. (దో॥ 316)

అతనిసన్నాగముగూడ అయోధ్యావాసులకు హితకరమే ఆయెను. వనవాసకాలము ముగియువఱకు ప్రాణములను నిలుపుకొనుటకు అదియు వారిపాలిటి సంజీవని అయ్యెను. లేనిచో శ్రీ సీతారామలక్ష్మణులవిరహముతో హాహాకారములనొనర్చుచు వారందఱును అసువులను బాసెడివారు. శ్రీరామునికృపవలన ఆపదలన్నియు తొలగిపోయెను. కొల్ల గొట్టుటకువచ్చిన దేవతాసైనికులే రక్షకులైరి. శ్రీరాముడు భరతుని గాఢాలింగన మొనర్చుకొనెను. ఆయిరువురి ప్రేమానందానుభవములు వర్ణనాతీతములు. భరతుని మనోవాక్కాయములలో ప్రేమ పొంగిపొరలెను. ధీరోదాత్తుడైన శ్రీరామునకును ధైర్యము సడలెను. అతని నయనకమలములు అశ్రుపూరితములయ్యెను. ఆయనస్థితినిగాంచిన దేవతలకును కన్నులు చెమ్మగిల్లెను. జనకమహారాజు, వసిష్ఠాది మహర్షులును మహామహితాత్ములు. వారి బంగారు మనస్సులు జ్ఞానాగ్నిలో తప్తములైనవి. బ్రహ్మయొక్క నిర్మలసృష్టికి వారు ప్రతీకలు, మాయా జగత్తనెడినీట జన్మించినను వారు తామరాకు వలె విరక్తులు. అట్టి ధీరులు కూడ- (చౌ॥ 1-4)

శ్రీరామభరతుల అనుపమ-అపార పరస్పర ప్రేమానురాగములను దర్శించిన పిమ్మట వారి వైరాగ్యవివేకములు , మనోవాక్కాయములు ప్రేమవాహినిలో మునకలు వేసినవి. (దో॥ 317)

జనక వసిష్ఠాదులబుద్ధులనుగూడ కుంఠితమొనర్చిన ఆ దివ్యప్రేమను ప్రాకృతికము, లౌకికము- అని చెప్పుట కేవలము అవివేకము. శ్రీరామభరతుల వియోగావస్థను వర్ణించు కవిని లోకులు కఠినాత్ముడని భావింతురు. ఒకరినొకరు విడిచిపోలేని ఆయిరువురి స్థితిని వర్ణించుటకు మాటలు చాలవు. కావుననే కవియొక్క మనోహరవాణియు ఆ సందర్భమున వారి ప్రేమను స్మరించి, మిన్నకుండెను. శ్రీ రఘునాథుడు భరతుని కౌగిలించుకొని ఊరటగూర్చెను. పిమ్మట ఆయన ప్రసన్నచిత్తుడై శత్రుఘ్నుని తనహృదయమునకు హత్తుకొనెను. భరతుని అనుజ్ఞనుగొని, సేవకులు, మంత్రులు తమ తమ పనులలో నిమగ్నులైరి. తిరుగు ప్రయాణముల మాట చెవిన బడినంతనే ఉభయ పక్షముల వారును మిక్కిలి దుఃఖితులైరి. పిమ్మట వారు ప్రయాణములకు సన్నద్ధులైరి. శ్రీరామచంద్ర ప్రభుచరణకమలములకు వందనములనాచరించి, ఆయన ఆజ్ఞను శిరసావహించి, భరతశత్రుఘ్నులు మునులకును, తపోధనులకును, వనదేవతలకును వినతులను సమర్పించి ఆదరసమ్మానములను గావించి, బయలుదేఱిరి. (చౌ॥ 1-4)

## భరతుడు అయోధ్యకు మఱలుట - పాదుకా పట్టాభిషేకము

పిదప లక్ష్మణుని భరతుడు ఆలింగనముతో, శత్రుఘ్నుడు ప్రణతులతో గౌరవించిరి. వారు సీతాదేవి పాదధూళిని శిరస్సున దాల్చి, ఆమెశుభాశీస్సులతో ప్రయాణమైరి. (దో॥ 318)

శ్రీరాముడు లక్ష్మణునితో గూడి జనక మహారాజునకు ప్రణమిల్లెను, ఆయనను పెక్కురీతుల ప్రస్తుతించి ఇట్లు పలికెను. "మీరు దయతో సపరివారముగా వనములకు విచ్చేసి, అనేకక్లేశములను సహించితిరి. మమ్ములను ఆశీర్వదించి, నగరమునకు బయలుదేఱుడు" జనకమహారాజు మనస్సును దిటవుచేసికొని, సపరివారముగా బయలుదేఱెను. శ్రీరామచంద్రుడు మునులను, బ్రాహ్మణులను, సాధుజనులను హరిహరులతో సమానముగా భావించి, సాదరముగా వీడ్కొలిపెను. పిమ్మట సోదరులిద్దఱును అత్తగారైన సునయనాదేవి యొద్దకు వెళ్లి, ఆమె చరణములకు మ్రొక్కి ఆశీర్వాదములను గైకొనిరి. అనంతరము విశ్వామిత్ర వామదేవ జాబాలి ప్రభృతి మహర్షులకును, పరిజనులకును, పురజనులకును, మంత్రులకును యథార్థముగా వినయ వచన ప్రణామములను

ఆచరించి, వారిని వీడ్కొలిపిరి. కృపానిధియైన శ్రీరామచంద్రుడు చిన్న, పెద్ద, మధ్య వయస్కులైన స్త్రీ పురుషులందఱిని సాదరముగా పంపివైచెను. (చౌ॥ 1-4)

శ్రీరామచంద్రుడు తల్లి కైకేయిదేవి చరణములకు వందనమాచరించి, ప్రీతితో కౌగిలించుకొని, ఆమెశోకసంకోచములను తుడిచి వైచెను. అలంకృతమైన పల్లకీలో కూర్చుండజేసి, ఆమెను వీడ్కొలిపెను. (దో॥ 319)

ప్రాణనాథుడైన శ్రీరామునకు ప్రీతిపాత్రురాలైన సీతాదేవి తల్లిదండ్రులను, తన పరిచారికలను కలిసి, వీడ్కోలు చెప్పి, మఱల భర్తయొద్దకు వచ్చెను. అత్తలందఱిని కౌగిలించుకొని, వారికి పాదాభివందనమాచరించెను. ఆ శోకపరిప్లుతమైన దృశ్యమును వర్ణించుట ఎవరి తరము? సీతాదేవి వారిఉపదేశములను విని, తన మనోవాంఛితములీడేరునట్లు ఆశీర్వచనములను పొందెను. శ్రీరామచంద్రుడు తల్లులను అనునయించి, అందమైన పల్లకీలలో వారిని ఆసీనలను గావించెను. సోదరులిద్దఱును వారిని పదే పదే కౌగిలించుకొనుచు కొంత దూరము సాగనంపిరి. జనకుని పరివారములు, భరతునిఅనుయాయిగణములు, వారి వారి రథాశ్వగజపదాతిబలములతో బయలుదేఱిరి. తమతమ హృదయములలో శ్రీ సీతారామలక్ష్మణులనే స్మరించుకొనుచు జనులెల్లరును అచేతనస్థితిలో (అప్రయత్నముగనే) ముందునకు సాగిపోవుచుండిరి. ఎద్దులు, గుఱ్ఱములు, ఏనుగులు మున్నగు జంతువులు గూడ ప్రేమ పారవశ్యములతో దుఃఖాశ్రువులను రాల్చుచు ఇంటి ముఖముగా అడుగులిడుచున్నవి. (చౌ॥ 1-4)

పిమ్మట శ్రీ రామచంద్రుడు సీతాలక్ష్మణులతో గూడి గురువైన వసిష్ఠునకును, గురుపత్నియైన అరుంధతీదేవికిని పాదాభివందనములనాచరించి, వారి అనుజ్ఞ గైకొని, హర్ష విషాదములతో తమ పర్ణకుటీరమునకు ఏతెంచెను. (దో॥ 320)

పిమ్మట శ్రీరాముడు నిషాదరాజైన గుహుని సగౌరవముగా వీడ్కొలిపెను. అతడు తన హృదయములో తీవ్రవిరహావేదనను అనుభవించుచు గృహోన్ముఖుడయ్యెను. కోలులు, కిరాతులు, భిల్లులు మొదలగు వనవాసులను శ్రీరాముడు సాగనంపెను. వారు పదే పదే శ్రీ సీతారామలక్ష్మణులకు నమస్కరించుచు ఇండ్లకు మఱలిరి. శ్రీ సీతారామలక్ష్మణులు వటవృక్షచ్ఛాయలో గూర్చొని, ఆత్మీయులైన తమకుటుంబసభ్యులఎడబాటునకు దుఃఖితులైరి. భరతుని ప్రేమను, స్వభావమును, మృదుమధురవచనములను కొనియాడుచు శ్రీరాముడు సీతాలక్ష్మణులతో ముచ్చటించెను. ప్రేమపరవశుడై శ్రీరాముడు త్రికరణశుద్ధిగల భరతుని ప్రేమానురాగములను స్వయముగా వర్ణించెను. ఆ సమయమున చిత్రకూటమునందలి పశువులు, పక్షులు, జలచరములు మున్నగు చరాచర ప్రాణులన్నియును చెప్పలేనంతగా దిగులునకు లోనయ్యెను. శ్రీరాముని ప్రేమముగ్ధదశను పరికించి, దేవతలు పుష్పములను వర్షించి, తమ ఆవేదనను ఆయనకు నివేదించుకొనిరి. ప్రభువు వారికి నమస్కరించి, అభయప్రదానము చేసెను. వారు ప్రసన్నమనస్కులై నిర్భయముగా వెళ్లిపోయిరి. (చౌ॥ 1-4)

పర్ణకుటీరమున శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణులతోగూడి, భక్తిజ్ఞానవైరాగ్యములు మూర్తీభవించినట్లు శోభాయమానుడై విరాజిల్లెను. (దో॥ 321)

మునులు, బ్రాహ్మణులు, వసిష్ఠమహర్షి, జనకమహారాజు ఇతరపరివారములు శ్రీరామవిరహముచే వ్యాకులతనొందిరి. వారు మనస్సున ప్రభుగుణగణములను స్మరించుచు మౌనముగా నడచుచుండిరి. మొదటిదినమున యమునానదిని దాటి ఉపవసించిరి. రెండవ దినమున గంగానదిని దాటి, శృంగబేరపురమున బసచేసిరి. అక్కడ శ్రీరామసుఖుడైన నిషాదరాజు వారికి అన్ని ఏర్పాట్లు కావించెను. మూడవదినమున 'సయీనది'ని దాటి, గోమతీ నదీజలములలో స్నానముల నాచరించిరి. నాల్గవదినమున అందఱును అయోధ్యకు చేరిరి. జనకుడు కొన్నిదినములు అయోధ్యలో నుండెను. అతడు రాజకార్యములు, సంభారములు చక్కదిద్ది, మంత్రులకును, వసిష్ఠునకును, భరతునకును రాజ్యభారమును అప్పగించి, పూర్తియేర్పాట్లు గావించిన పిమ్మట తనరాజధానియైన మిథిలకు చేరెను. అయోధ్యానగరమునందలి పౌరులు గురువుల ఉపదేశములను అనుసరించుచు సుఖముగా ఉండిరి. (చౌ॥ 1-4)

శ్రీరామచంద్రుని దర్శననిరీక్షణలతో అందఱును నియమములను, వ్రతములను పాటించుచుండిరి. వారు భూషణములను భోగవిలాసవస్తువులను వదలిపెట్టి, వనవాసకాలావధి ముగియుటకై ఎదురుతెన్నులుచూచుచు జీవించుచుండిరి. (దో॥ 322)

భరతుడు మంత్రులకును, విశ్వాసపాత్రులైన సేవకులకును తగినఆదేశముల నిచ్చెను. వారు ఆయనఆజ్ఞలను చక్కగా నెఱవేర్చుచుండిరి. తమ్ముడైన శత్రుఘ్నునకు తల్లుల సేవాబాధ్యతలను అప్పగించెను. బ్రాహ్మణులను పిలిపించి, వారికి నమస్కరించి, "మీరు చిన్న, పెద్ద, కార్యమేదైననుసరే నిస్సంకోచముగా నాకు ఆజ్ఞలను ఇందు." అని నమ్రతతో విన్నవించెను. పిమ్మట పరిజనులను, నగర వాసులను, ప్రముఖులను పిలిపించి, వారిని సమాధాన పఱచి, వలసిన వసతులను ఏర్పాటు చేయించెను. సోదరుడైన శత్రుఘ్నునితోగూడి భరతుడు గురువుకడకు వెళ్లి, దండప్రణామములనాచరించి, పలికెను. "గురుదేవా! మీ ఆజ్ఞలనుపొంది, నియమనిష్ఠలను పాటించెదను."- దీనికి వసిష్ఠుడు పులకితుడై ప్రీతితో పలికెను. "భరతా! నీవేమి యోచించినను, చెప్పినను, ఆచరించినను అదియే ధర్మ సారమగును." (చౌ॥ 1-4)

ఈ మాటలను విని, భరతుడు గురువు గారి ఉపదేశములను, ఆశీస్సులను పొంది, జ్యోతిషపండితులను రప్పించెను. శుభముహూర్తమును నిర్ణయించి, శ్రీరామచంద్రప్రభు పాదుకలను అయోధ్యా సింహాసనముపై ప్రతిష్ఠించెను. (దో॥ 323)

శ్రీరామజననియైన కౌసల్యాదేవికిని, గురువైన వసిష్ఠునకును శిరసా ప్రణమిల్లి, ప్రభుచరణపాదుకలఆజ్ఞలను బడసి, ధర్మశ్రేష్ఠుడు, ధీరుడైన భరతుడు నందిగ్రామమున ఒక పర్ణకుటీరమును నిర్మించుకొని, అందు నివసింపసాగెను. శిరమున జటాజూటమును, మునులవలె వల్కలములను ధరించెను. నేలను త్రవ్వి, దానిపై కుశాసనమును ఏర్పఱచెను. భోజనము, వస్త్రములు, పాత్రలు, వ్రతనియమములు మొదలగు విషయములలో ఋషీశ్వరుల కఠిన ధర్మములనే ప్రీతితో పాటించెను. ఆభరణములను, రాజోచిత వస్త్రములను సమస్త సుఖభోగములను త్రికరణశుద్ధిగా తృణప్రాయముగా భావించి త్యజించెను. అత్యున్నత వైభవ సంపదలతో తులతూగుచున్న అయోధ్యా రాజ్యమును జూచి ఇంద్రుడుగూడ అసూయాగ్రస్తుడగుచుండెను. దశరథునిసంపదలను విని, కుబేరుడు గూడ సిగ్గుపడుచుండెను. అట్టి అయోధ్యయందు భరతుడు సంపెంగ పుష్పవనములో భ్రమరము వలె అనాసక్తముగా నివసించుచుండెను. శ్రీరామచంద్రుని పరమభక్తులు లక్ష్మీదేవి ప్రసాదించు భోగభాగ్యములన్నింటిని కన్నెత్తియైనను చూడకుండిరి. (చౌ॥ 1-4)

చాతకము తానెంతగా దప్పిగొన్నను అది మేఘజలముకొఱకే నిరీక్షించుచుండును. నిష్ఠతో నిరీక్షించు గుణము దానికి సహజము. అందువలన అది శ్లాఘనీయము.

నీరక్షీరములను వేఱుచేయగలశక్తి హంస ప్రత్యేకత. అట్టి వివేకశక్తివలన అది ప్రశంసా పాత్రమైనది. చాతకమునందలి నియమనిష్ఠలును, హంసయొక్క వివేచనాశక్తియు భరతునకు సహజముగా అబ్బినగుణములు. ఏలనన శ్రీరాముని పునరాగమనమునకై నియమనిష్ఠలతో భరతుడు ఎదురు చూచెను. ధర్మాధర్మములను వేఱుచేసి, స్పష్టముగా చూడగలవాడు భరతుడు. ఈ విశిష్ట గుణములను కలిగి యుండుటయేగాక శ్రీరామునియెడ అనన్యభక్తి తత్పరతలు కలిగియుండుటయు, శ్రీరామునకు ప్రీతిపాత్రుడగుటయు ఆయన వైశిష్ట్యములు. అందువలననే భరతుడు అత్యంత శ్లాఘనీయుడు. (దో॥ 324)

భరతుని తనువు దినదినమునకును శుష్కింపసాగెను. కాని అతని ఆత్మబలము, తేజస్సు, ముఖవర్చస్సు దినదినాభివృద్ధి చెందుచుండెను. శ్రీరామునిపై అపారమైన ఆతనిభక్తి నిత్య నూతనముగా పరిపుష్టమగుచుండెను. ధర్మనిష్ఠలు నిరంతరము అభివృద్ధి యగుచుండెను. మనస్సు ప్రసన్నమై విలసిల్లుచుండెను. శరదృతువునందు సరోవరములు నిర్మలములైన జలములతో స్వచ్ఛముగా విరాజిల్లుచుండును. ఆకాశముగూడ నిర్మలముగా ప్రకాశించును. కమలములు చక్కగా వికసించి, శోభిల్లుచుండును. అట్లే భరతుని హృదయమనెడి నిర్మలాకాశము శమ, దమ, సంయమ, నియమ-ఉపవాసాదులనెడి నక్షత్రములచే విరాజిల్లుచుండెను. భరతుని హృదయాకాశము

నందు 'రాముడు తప్పక తిరిగివచ్చును' అని దృఢ విశ్వాసమే ధ్రువతారగా, పదునాల్గు సంవత్సరముల 'అవధి'యే పూర్ణచంద్రచంద్రికలుగా, శ్రీరాముని నిరంతరస్మృతియే పాలపుంత (సురవీధి)గా ప్రకాశించుచుండెను. శ్రీరామునిపైగల నిశ్చలభక్తి తరగని చంద్రుడై సుగుణసమూహమనెడి నక్షత్రముల మధ్య విరాజిల్లు చుండెను. భరతుని ప్రవర్తనను, విజ్ఞానమును, కార్యములను, భక్తి వైరాగ్యములను, నిర్మలగుణములను, ఐశ్వర్యమును, వర్ణించుటకు ఉత్తమకవులుసైతము తటపటాయించెదరు. ఏలనన శేషుడు, గణేశుడు, వాగ్దేవియు వాటిని స్పృశింపలేరు. (చౌ॥ 1-4)

భరతుడు నిత్యము శ్రీరామునిపాదుకలను పూజించి, పొంగిపొరలుచున్న ప్రేమభావముతో వాటిఆజ్ఞతో రాజ్యకార్యములను నిర్వహించుచుండెను. (దో॥ 325)

భరతుని హృదయమున సర్వదా శ్రీ సీతారాములు వసించుచుండిరి. అతనినాలుకపై రామనామజపము సాగుచునే యుండెను. దానిచే తనువు పులకరించుచుండెను. నేత్రములు ఆనందాశ్రుపూర్ణములగుచుండెను. శ్రీ సీతారామలక్ష్మణులు వనములలో నివసించుచుండిరి. కాని భరతుడు ఇంటిలోనే తపస్సు చేయుచు శరీరమును శుష్కింపజేయుచుండెను. ఆ ఉభయుల (శ్రీరామ-భరతుల) పరిస్థితులను మనస్సునకు దెచ్చుకొని, ప్రజలు 'భరతుడు అన్నివిధముల శ్లాఘనీయుడు' అనియనుచుండిరి. అతని నియమవ్రతములను విని, సాధుపుంగవులు సిగ్గుపడుచుండిరి. అతని ప్రేమనిష్ఠను జూచి మునులు గూడ లజ్జతో తలలు వంచుకొనుచుండిరి. భరతునిఆచరణము పరమపవిత్రము, మధురము, మనోహరము, ఆనందప్రదము. అది కలియుగ పాపములను, క్లేశములను తొలగించునది, మహామోహమనెడి చిమ్మచీకట్లను పటాపంచలు చేయుటలో సూర్యునివంటిది. అతనిజీవనవిధానము పాపసమూహములనెడు ఏనుగుల పాలిటి సింహము. అది సర్వసంతాపహరము, భక్తులకు ఆనంద దాయకము, సంసారబంధములనుండి ముక్తిని ప్రసాదించును. అది శ్రీరామచంద్రభక్తిరసామృతప్లావితము. (చౌ॥ 1-4)

నిరంతరము శ్రీసీతారామచంద్రుల ప్రేమామృతముతో నిండియుండువాడు భరతుడు. అతడు జన్మింపకున్నచో మునుల మనస్సులకును అగమ్యమైన ఈయమనియమములను, శమదమాదిక కఠినవ్రతములను అభ్యసింపగలవారెవరు? అట్లే దుఃఖము, సంతాపము, దారిద్ర్యము, దంభము మొదలగు దోషములను హరింపజేసెడి యశో మూర్తులెవరు? అంతే గాక తులసీదాసు వంటి పాపాత్ములను శ్రీరాముని సమ్ముఖమునకు తీసికొని పోజాలెడి వారెవరు? (ఛం)

తులసీదాసు పలుకుచున్నాడు. అయోధ్యాకాండమునకు భరతుని చరితమే పట్టుగొమ్మ. దానిని సాదరముగా నియమ నిష్ఠలతో వినెడి వారికి శ్రీ సీతారామచంద్రుల చరణములపై భక్తి అవశ్యముగా కలుగును, సాంసారిక విషయములయందు విరక్తియు జనించును. (సో॥ 326)

(మాసపారాయణము - ఇరువది యొకటవ విరామము)

*కలియుగ పాపములనన్నింటిని రూపుమాపు శ్రీరామచరిత మానసమునందలి*

*రెండవ సోపానము సమాప్తము.*

**- అయోధ్యా కాండము సమాప్తము -**

# శ్రీ రామచరిత మానసము

## తృతీయ సోపానము - అరణ్యకాండము

## భగవత్ప్రార్థన

ధర్మమనెడి వృక్షమునకు మూలమైనవాడును, వివేకమనెడి సాగరమునకు ఆనందమును గూర్చు చంద్రుడును, వైరాగ్యమనెడి కమలమును వికసింపజేసెడి సూర్యుడును, పాపములనెడి ఘోరాంధ కారములను నిశ్చయముగా రూపుమాపువాడును, తాపత్రయములను (దైహిక, దైవిక, భౌతిక తాపములను) హరించువాడును, మోహములనెడి మేఘసమూహములను చెల్లాచెదరు చేయుటలో ఆకాశమున ఉత్పన్నమైన వాయువు వంటివాడును, పరబ్రహ్మస్వరూపుడును, కళంకములను పాఱద్రోలువాడును, శ్రీరామచంద్ర ప్రభువునకు ఇష్టదైవమైనవాడును అగు శ్రీ శంకరునకు వందనమాచరింతును- (1)

శ్రీరామచంద్రప్రభువు పరమానంద స్వరూపుడు. (అతడు) సజలమేఘ శ్యామసుందరుడు. మనోహర పీతవల్కలధారి, కరకమలములయందు ధనుర్బాణములను ధరించినవాడు, నడుమున అక్షయతూణీరశోభితుడు, విశాలకమలనేత్రుడు, శిరమున జటాజూటములతో శోభిల్లుచున్నవాడు, సీతాలక్ష్మణసమేతుడై వనపథములలో సాగిపోవుచున్నవాడు, సర్వ శ్రేష్ఠుడు, నయనాభిరాముడును ఐన ఆ రఘువరుని నేను భజింతును. (2)

ఓ ఉమా! శ్రీరామునిగుణములు గూఢములైనవి. అవి పండితులకును, మునులకును పరమవైరాగ్యమును ప్రసాదించును. కాని శ్రీహరియెడ విముఖులును, ధర్మానురక్తిలేనివారును అగు మూర్ఖులు మోహగ్రస్తులగు చుందురు. (సోరఠ)

## జయంతుని గర్వభంగము

అయోధ్యా పౌరుల భక్తి ప్రపత్తులను, అనన్యభక్తిభరితుడైన భరతునిప్రేమానురాగములను గూర్చి యథాశక్తి వర్ణించితిని. దేవతలను మునులను మనుష్యులను సర్వదా సంతసింపజేయు శ్రీరామచంద్రుడు వనవాసకాలమున ప్రదర్శించిన పవిత్రలీలావిలాసములను వినుడు. ఒకానొకనాడు శ్రీరాముడు సుందర కుసుమములను సేకరించి, సీతాసమేతుడై నిర్మలస్ఫటిక శిలపై కూర్చొనియుండెను. తాను స్వయముగా సిద్ధపఱచిన పుష్పభూషణములతో ఆమెను అలంకరించెను. ఆ సమయమున దేవేంద్రునికుమారుడును మందబుద్ధియునైన జయంతుడు కాకి రూపమును ధరించి, శ్రీరాముని మహిమలను పరీక్షింపదలచెను. అతని ప్రయత్నము చీమ సముద్రపులోతులను చూడదలచినట్లుండెను. ఈ కారణమున ఆ మందబుద్ధి కాకి రూపమును ధరించి సీతాదేవి పాదములను తన ముక్కుతో పొడిచి పాఱిపోయెను. ముక్కుతో పొడువబడిన ఆ గాయమునుండి రక్తము స్రవించు చుండుట చూచిన శ్రీరాముడు ఒక గడ్డి పోచను బాణముగా చేసి, ప్రయోగించెను. (చౌపాఈ॥ 1-4)

శ్రీరఘునాథుడు అత్యంత కృపాళువు. దీనజనబాంధవుడు. అట్టి రామునకే మూర్ఖుడైన జయంతుడు వంచనతో కీడు తలపెట్టెను. (దోహా॥ 1)

మంత్రచోదితమైన ఆ బ్రహ్మాస్త్రము ఆ కాకిని వెంటాడసాగెను. భయభ్రాంతమై ఆ కాకి పరుగెత్తసాగెను. తన నిజస్వరూపముతో జయంతుడు ఇంద్రుని కడకు పోయెను. శ్రీరామ విరోధిగా ఎఱింగి ఇంద్రుడతనిని రక్షించుటకు పూనుకొనలేదు. అప్పుడు ఆ జయంతుడు విష్ణు చక్రమునకు దుర్వాసుడు భయపడినట్లు నిరాశతో భయకంపితుడయ్యెను. భయము, అలసట, దుఃఖములతో వ్యాకులుడై, అతడు బ్రహ్మలోకమునకును, శివలోకమునకును, తదితర లోకములకును వెళ్లెను. కాని ఎవ్వరును అతనిని రక్షింపకపోగా కనీసము కూర్చుండుమనియు అనలేదు. శ్రీరామునకు ద్రోహము తలపెట్టిన వానిని ఎవరు రక్షింపగలరు? (కాక భుశుండి పలుకుచున్నాడు) ఓ గరుడుడా! వినుము. అట్టి వానికి తల్లి మృత్యువుతో సమానము. తండ్రి యముని వంటివాడు. అమృతము విష ప్రాయమగును. శ్రీరామద్రోహికి మిత్రులును శత్రువులే యగుదురు. దేవనది గంగ వానికి వైతరణిగా అగును. సోదరా! వినుము. శ్రీరామునకు విముఖుడైన వానిని ప్రపంచము కార్చిచ్చు వలె భస్మమొనర్చును. నారదుడు ఆపదపాలైన జయంతుని జూచి జాలిపడెను. సాధుజనులచిత్తములు కోమలములు గదా! నారదుడు జయంతునితో "నీవు వెంటనే శ్రీరాముని యొద్దకు వెళ్లి, 'ఓ శరణాగత వత్సలా! పాహి పాహి' అని ప్రార్థించుము" అని హితము పలికెను. జయంతుడు వెంటనే శ్రీరామునికడకు వచ్చి నారదుడు చెప్పినట్లు 'ఓ శరణాగత వత్సలా! నన్ను రక్షింపుము"- అని ప్రార్థించెను. భయకంపితుడైన జయంతుడు ఆతురతతో శ్రీరామునిపాదములపైబడి వేడుకొనెను. "ఓ దీనదయాళూ! రక్షింపుము రక్షింపుము. నేను మీ అపారబలమహత్త్వములను గుర్తింపజాలని మందబుద్ధిని. నేను జేసిన కర్మఫలమును అనుభవించితిని. ప్రభూ! నన్ను కాపాడుము. మిమ్ము శరణుజొచ్చితిని." (శివుడు పల్కుచున్నాడు) ఓ పార్వతీ! కృపానిధియైన శ్రీ రఘునాథుడు ఆ దుఃఖితుని గోడు విని, ఒక కంటిని తొలగించి, వానిని క్షమించి విడిచిపెట్టెను. (అప్పటి నుండియు కాకి వంశమే 'ఏకాక్షి' అయినట్లు ప్రసిద్ధి). (చౌ॥ 1-4)

జయంతుడు మోహవశమున వైరము పూని, శ్రీరామునకు కీడు తలపెట్టెను. చంపదగిన వాడేయైనను ప్రభువు వానిని దయదలచి వదలిపెట్టెను. శ్రీరామచంద్రునితో తులతూగగల దయామయు డెవ్వడుండును? (సో॥ 2)

శ్రీ రఘునాథుడు చిత్రకూటమున అద్భుతలీలావిలాసములను అనేకమొనర్చెను. అవి శ్రవణపేయములు. ఒకనాడు శ్రీరాముడు ఇట్లు ఆలోచించెను. "నేను ఇచ్చట ఉన్న విషయమును అందఱును ఎఱుగుదురు. కావున ఎల్లరును ఇక్కడ చేరుచుందురు" ఇట్లు తలంచి, సోదరులు ఇద్దఱును మునులఆజ్ఞలను గైకొని, సీతాదేవితోగూడి ముందునకు సాగిరి.

## శ్రీరాముడు అత్రిమహర్షిని దర్శించుట

అత్రిముని ఆశ్రమమును చేరగానే ప్రభువురాకకు ఆమహాముని మిక్కిలి సంతోషించెను. అత్రి పులకితగాత్రుడై లేచి ఎదురుగా వచ్చుచుండెను. పరుగుపరుగున వచ్చుచున్న మునిని జూచి శ్రీరాముడును వేగముగా ముందుకు నడచెను. దండప్రణామముల నాచరించిన శ్రీరాముని ఆ మహర్షి లేవనెత్తి, హృదయమునకు హత్తుకొనెను. సోదరులిద్దఱిని ముని తన ఆనందాశ్రువులతో తడిపెను. శ్రీరామునిఅలౌకికసౌందర్యమును అతడు తనవితీర గాంచెను. అతని నేత్రములు చల్లబడెను. సాదరముగా తనఆశ్రమమునకు గొనిపోయెను. వారిని భక్తితో పూజించి, మధుర వచనములను పలికి వారికి, కందమూల ఫలములను సమర్పించెను. ప్రభువు వాటిని ప్రీతితో ఆరగించెను. (చౌ॥ 1-4)

ఆసనమును అలంకరించిన ప్రభుశోభ అత్రిమహామునికి కనువిందు గావించెను. పరమ జ్ఞానియైన అత్రి అంజలి ఘటించి, ప్రభువునిట్లు స్తుతింపసాగెను. (సో॥ 3)

ఓ భక్తవత్సలా! పరమదయాళూ! కోమలస్వభావ శీలములు గలవాడా! నిష్కామప్రవృత్తి గల పరమభక్తులకు పరంధామమునొసంగు వాడా! నీకు నమస్కారము. నీ చరణకమలములను సేవింతును. నితాంతశ్యామసుందరా! సంసారసముద్రమును మథించు మందరాచలమా! వికసితపద్మలోచనా! మదాదిదోషములనుండి ముక్తినిప్రసాదించువాడా! ప్రభూ! అజానుబాహుడవైన నీ పరాక్రమము, ఐశ్వర్యము అప్రమేయములు. తూణీరధనుర్బాణములను ధరించిన మీరు లోకత్రయమునకును ప్రభువులు. సూర్యవంశభూషణా! శివధనుర్భంగమును గావించినవాడా! మునీశ్వరులకును, సాధుపుంగవులకును ఆనందదాయకా! అమరారులైన రాక్షసులను రూపుమాపువాడా! కామారియైన శివునిచే పూజింపబడువాడా! బ్రహ్మాదిదేవతలచే సేవింపబడువాడా! విశుద్ధజ్ఞానస్వరూపా! సమస్తదోషములను హరించువాడా! సుఖములకు పెన్నిధియైన వాడా! సజ్జనులకు ఏడుగడయైన వాడా! లక్ష్మీపతీ! నీకు ప్రణమిల్లెదను. నీవు ఉపేంద్రుడవు. ఆదిశక్తియైనసీతాదేవితోడను, సోదరుడైన లక్ష్మణునితోడను గూడియున్న నీకు మ్రొక్కెదను. మత్సరరహితులై నీ చరణములను సేవించువారు తర్కవితర్క రూప సందేహ తరంగములతోగూడిన సంసారసాగరమున బడరు. ఇంద్రియ సుఖములను త్యజించి, సర్వదా పరమానందభరితులై ముక్తికై నిన్ను భజించు ఏకాంతవాసులకు నీవు కైవల్యమును అనుగ్రహించు వాడవు. నీవు నిరుపమానప్రభుడవు. సర్వాద్భుత సమర్థుడవు. ఇచ్ఛారహితుడవు. పరమేశ్వరుడవు. సర్వ వ్యాపకుడవు. జగద్గురుడవు. సనాతనుడవు. త్రిగుణాతీతుడవు. కేవలస్వరూపుడవు. అట్టి నీకు నమస్కారములు. అట్లే భావప్రియుడవు. కుయోగులకు దుర్లభుడవు. భక్తుల పాలిటి 'కల్పవృక్షము' ఐనవాడవు. సముడవు. సుఖ సేవ్యుడవు. అట్టి నిన్ను అనుదినము ఆరాధించెదను. సాటిలేనిరూపము గల ఓ భూపతీ! జానకీనాథా! నీకు ప్రణమిల్లెదను. నా యందు ప్రసన్నుడవు కమ్ము. నీకుప్రణమిల్లుదును. నీ పదాబ్జములపై భక్తిని ప్రసాదింపుము. ఈ స్తుతిని సాదరముగా పఠించు వారు మీ యెడ భక్తి ప్రపత్తులు గలవారై, నిస్సందేహముగా పరమపదమైన వైకుంఠమును పొందెదరు.

(చౌ॥ 1-12)

ఇట్లు ప్రార్థించి, అత్రి మహాముని శిరసా నమస్కరించి, చేతులు జోడించి పలికెను. "ప్రభూ! నా మనస్సెప్పుడును నీ పాదపద్మములను వదలక యుండుగాక." (దో॥ 4)

## సీతాదేవికి అనసూయాదేవి ఉపదేశములు

పిదప సౌశీల్యవతియైన సీతాదేవి అత్రిమహర్షి పత్ని యైన అనసూయాదేవికి వినయముతో పాదాభివందనమాచరించెను. మునిపత్ని మిక్కిలి సంతసించినదై ఆశీర్వదించి, సీతాదేవిని తన ప్రక్కన కూర్చుండబెట్టుకొనెను. పిదప ఆమె సీతాదేవికి నిత్యనూతనములు, నిర్మలములు, మనోహరములైన దివ్యవస్త్రములను ఆభరణములను ధరింపజేసెను. పిమ్మట తనమృదుమధుర వచనములద్వారా స్త్రీధర్మములను వివరింపసాగెను. "రాజకుమారీ! వినుము. తల్లిదండ్రులు, సోదరులు, అందఱును హితమును గూర్చువారే. సహృదయులే కాని వీరందఱును కొంత పరిమితి వఱకే మేలు చేకూర్చగలరు. కాని పతి అపరిమితసుఖములనిచ్చును. అంతేగాదు, మోక్షప్రాప్తికిని తోడ్పడును. కనుక పతికి సేవలొనర్చని సతి నిజముగా అధమురాలు. ఆపదలయందే ధైర్యము, ధర్మము, మిత్రుడు, భార్య వీరికి పరీక్ష జరుగును. వృద్ధుడు, రోగి, మూర్ఖుడు, నిర్ధనుడు, అంధుడు, బధిరుడు, కోపిష్ఠి, అతిదీనుడు- ఐన పతినిగూడ అవమానపఱచు స్త్రీ నానావిధ నరకయాతనలను పొందును. త్రికరణశుద్ధిగా పతిపాదములను సేవించుటయే స్త్రీకి ఏకైక ధర్మము, వ్రతము, నియమము. ప్రపంచమున పతివ్రతలు నాలుగు విధములుగా ఉందురు. తన పతిని దప్ప స్వప్నమున గూడ పరపురుషుని స్మరింపని స్త్రీయే 'ఉత్తమ పతివ్రత' యని వేదములు, పురాణములు సజ్జనులు వక్కాణింతురు.

పరపురుషుని తనసొంతసోదరునివలెను, తండ్రి వలెను, కుమారుని వలెను భావించు స్త్రీ మధ్యమ శ్రేణికి చెందిన పతివ్రత. తన ధర్మమును విచారించి, తన వంశమర్యాదలను పాటించి, మనో నిగ్రహము కలిగియుండు స్త్రీ తృతీయ (అధమ) శ్రేణికి చెందినదిగ వేదములు పేర్కొను చున్నవి. గత్యంతరము లేని కారణమున భయముచే పతివ్రతగా నుండెడి స్త్రీ ప్రపంచమున 'అధమాధమురాలు' అనియెటుంగ వలయును. పతిని మోసగించుచు పరపురుషుని ప్రేమించు స్త్రీ అనేకకల్పములవఱకును రౌరవాది నరకయాతనలకు గురియగును. కోటి జన్మలవఱకును ప్రాప్తించు దుఃఖములనుగూడ సరకుసేయక క్షణికసుఖమునకై కక్కుర్తిపడు స్త్రీ 'కులట' యనబడును. మోసము, కపటములేకుండ పతివ్రతాధర్మములను పాటించు స్త్రీ అనాయాసముగనే పరమపదమును పొందును. పతికి ప్రతికూలముగా సంచరించెడి స్త్రీ మఱు జన్మలో చిన్న వయస్సులోనే వైధవ్యమును పొందును- (చౌ॥ 1-10)

స్త్రీ పతి సేవా పరాయణయై ఆయన సంరక్షణలో ఉన్నచో ఆమె పవిత్రతకు ఏ మాత్రము భంగము వాటిల్లదు. లేనిచో స్త్రీప్రకృతిననుసరించి, ఆమె పవిత్రతను కోల్పోవు ప్రమాదముగలదు. పతి సేవలతో ఆమెకు సద్గతి లభించును. తన పాతివ్రత్య ప్రభావముననే తులసి ఈ నాటికిని శ్రీహరికి అత్యంత ప్రీతి పాత్రమైనది. లోకముచే పూజలను అందుకొనుచున్నది. వేదములు ఆమె కీర్తిని గానము చేయును. సీతా! వినుము. నీ నామమును స్మరించిన స్త్రీ లెల్లరును పాతివ్రత్య ధర్మములను పాటించెదరు. నీవు శ్రీరామునకు ప్రాణప్రియమైన దానవు. ఈ పతివ్రతా ధర్మములను లోక హితార్థమై నీకు తెల్పితిని. (సో॥ 5. క,ఖ)

ఈ ఉపదేశమును విని, జానకీదేవి పరమానందభరితురాలయ్యెను. అనసూయాదేవి పాదములకు మ్రొక్కెను. దయానిధి యైన శ్రీరామచంద్రుడు అత్రిమహామునితో పల్కెను. "మీ ఆజ్ఞయైనచో నేము మఱియొక వనమునకు వెళ్లెదము. మీరు మాపై ఎల్లప్పుడును కృపజూపుచుండుడు. నన్ను మీ సేవకునిగా భావించి, నాపైగల మీప్రేమను వీడకుడు" ధర్మ ప్రభువైన శ్రీరాముని పల్కులను విని, జ్ఞానియైన మునీశ్వరుడు ప్రేమతో ఇట్లు పలికెను "బ్రహ్మ, శివుడు, సనకాది సకలబ్రహ్మజ్ఞానులు మీ కృపను గోరు చుందురు. మీరు ఆ నిష్కాములకు ఇష్టదైవములు. దీన బాంధవులు. ఐనను మీరే ఇట్టి వినయ వచనములను భాషించుచున్నారు. లక్ష్మీదేవి బుద్ధికుశలత నాకు ఇప్పుడర్థమైనది. ఇతర దేవతలను అందఱిని కాదని ఆమెకేవలము మిమ్మే వరించినది. మీవలె సౌశీల్యసంపన్నులు మఱియెవ్వరునూ లేరు. ఇక మీ కంటెనుఅధికులెట్లుందురు? ఈ వినమ్రస్వభావమువలననే అందఱికంటెను మీరు శ్రేష్ఠతములైతిరి. "మీరు పొండు" అని మీతో నేను ఎట్లు చెప్పగలను? తెల్పుడు." ఈ విధముగా పలికి, ధీరుడైన ఆ ముని ప్రభువువైపు చూడసాగెను. ఆయన నేత్రములనుండి ప్రేమాశ్రువులు ప్రవహించుచుండెను. శరీరము రోమాంచితమయ్యెను. (చౌ॥ 1-4)

అత్రిమహాముని తనువు పులకరించెను. ప్రేమలోలుకు చూపులతో అతడు శ్రీరాముని దర్శించు చునేయుండెను. "మనస్సునకును, జ్ఞానమునకును, గుణములకును, ఇంద్రియములకును గోచరముగాని ప్రభుదర్శనము నాకు లభించుటకై నేనొర్చిన జపతపములెవ్వి?" అని ఆతడు లోలోన ఆలోచించుచుండెను. మానవులు జపయోగధర్మములను ఆచరించుచు అనుపమమైన శ్రీరామభక్తిని పొందుచుందురు. అట్టి శ్రీరఘువీరుని పావనచరితమును తులసీదాసు రాత్రింబవళ్లు గానము చేయుచుండును- (ఛంద్)

శ్రీరాముని స్తుతించినవారి కలికల్మషములన్నియును నశించును. మనోవికారములు దూరములగును. రామునియశోగానము సుఖములకు ఉత్పత్తి స్థానము. దీనిని భక్తితత్పరతతో విన్నవారు శ్రీరామునిఅనుగ్రహమునకు పాత్రులగుదురు. కలియుగము మిక్కిలి గడ్డు కాలము. ఇది పాపములకు కూడలి. ఇందు ధర్మ, జ్ఞాన యోగ జపములనాచరించుట మిగుల కష్టము. కావున ఇతర ఆశలన్నింటినీ వదలి అనన్య భక్తితో కేవలము శ్రీరాముని భజించువారు కృతార్థులు, ధన్యాత్ములు. (దో॥ 6.క,ఖ)

దేవతలకును, మునులకును, మానవులకును, ప్రభువైన శ్రీరామచంద్రుడు అత్రిమహామునికి నమస్కరించి, వనములకు బయలుదేఱెను. ముందు శ్రీరాముడు వెనుక లక్ష్మణుడు మునివేషములలోగూడ మిక్కిలి శోభించుచుండిరి. సోదరులిద్దఱినడుమ సీతాదేవి పరబ్రహ్మ జీవులమధ్య మాయవలె శోభిల్లుచుండెను. నదులు, వనములు, పర్వతములు, దుర్గమములైన లోయలు- అన్నియును స్వామిని గుర్తించి, ఆయనకు మార్గమును సుగమమొనర్చెను. శ్రీరామచంద్రుడు వెళ్లునపుడు మేఘములు నీడను ఇచ్చుచుండెను. మార్గమధ్యమున విరాధుడను రాక్షసుడు ఎదురయ్యెను. వానిని శ్రీరాముడు హతమార్చెను. శ్రీరాముని చేతిలో మరణించిన ఆ విరాధునకు వెంటనే దివ్యసుందరరూపము ప్రాప్తించెను. ఆర్తుడైన అతనికి శ్రీరాముడు పరంధామమును ప్రసాదించెను. పిమ్మట ప్రభువు సీతాలక్ష్మణులతోగూడి శరభంగ మహాముని ఆశ్రమమునకు చేరెను. (చౌ॥ 1-4)

## శరభంగమహాముని దర్శనము

శ్రీరామచంద్రుని ముఖకమలమకరందమును ఆ మునివరుని లోచనభృంగములు ఆస్వాదించుచు ఆనందింపసాగెను. శరభంగునిజన్మ ధన్యమాయెను. (దో॥ 7)

శరభంగ మహాముని పలికెను. "కృపాళూ! రఘువీరా! శంకరుని మనస్సనెడి 'మానస సరస్సు'న విహరించు రాజహంసమా! వినుము. నేను బ్రహ్మలోకమునకు చనుచుండుగా ఇచ్చటికి నీ రాకను గూర్చి వింటిని. అప్పటినుండియు నీ ఆగమనమునకై రాత్రింబవళ్లు ఎదురుతెన్నులు చూచుచుంటిని. నేడు నా ప్రభు దర్శనముతో నా హృదయము శాంతించినది. ప్రభూ! నేను యోగసాధనాదులను ఎఱుంగను. ఐనను నన్ను నీ సేవకునిగా మన్నించి, నాపై కృపజూపితివి. వాస్తవముగా ఇది నీవు నాపై ప్రత్యేకముగా చూపిన అనుగ్రహము కాదు, ఇది నీ సహజస్వభావమే. ఓ భక్తమానసచోరా! ఈ విధముగా చేయుటచే నీవు నీ ప్రతిజ్ఞను పాలించితివి. నేను ఈ శరీరమును త్యజించి, నీ ధామమును చేరుదును. అంత వఱకును నా హితముకొఱకై నీవు ఇచటనే యుండుము." ఇట్లు పలికి ఆముని తానొనర్చిన యోగ, యజ్ఞ, జప, తపములన్నియును ప్రభువునకుధారపోసెను, దుర్లభమైన రామభక్తిని వరముగా పొందెను. శరభంగముని చితిని పేర్చి రాగరహితుడై దానిపై కూర్చొని ఇట్లనెను. (చౌ॥ 1-4)

"నీలమేఘశ్యామా! సగుణస్వరూపా! రామా! సీతాలక్ష్మణసహితుడవై నా హృదయమున నివసింపుము."

(దో॥ 8)

ఈ విధముగా పలికి, శరభంగ మహాముని యోగాగ్నికి తనతనువును ఆహుతిగా జేసి, శ్రీరామ కృపచే వైకుంఠమును జేరెను. ముని ముందుగా భేదభక్తిని వరముగా బడసినందున భగవంతునిలో లీనముగాలేదు. మునీశ్వరుడైనశరభంగుని దుర్లభమైనసద్గతిని జూచి, మునులందఱును ప్రసన్నచిత్తులైరి. అందఱును "శరణాగత వత్సలా! కరుణామయా! ప్రభూ! నీకు జయము" అని శ్రీరాముని స్తుతించిరి. పిమ్మట శ్రీరాముడు సీతాలక్ష్మణసమేతుడై మఱియొకవనమునకు బయలుదేఱెను. పెక్కుమంది మునీశ్వరులు ఆయనతోగూడి ప్రయాణము చేసిరి. దారిలో ఎముకలకుప్పను జూచి, మిక్కిలి జాలితో ఇవి యెవరివి? అని శ్రీరాముడు వారిని అడిగెను. మునులు పలికిరి. "స్వామీ! నీవు సర్వజ్ఞుడవు. అంతర్యామివి. తెలిసియు తెలియనివానివలె మమ్ములను అడుగుచుంటివి. రాక్షసులు మునులను భక్షించినారు. ఈ ఎముకలకుప్పలు ఆమునులవి. ఈ మాటలను విని శ్రీరాముని కన్నులు చెమ్మగిల్లెను. (చౌ॥ 1-4)

## ఋషులకు అభయ ప్రదానము - సుతీక్ష్ణుని దర్శనము

అప్పుడు శ్రీరాముడు కరములు సాచి "నేను ఈ నేలపై రాక్షసులు లేకుండ చేసెదను. ఇదియే నా ప్రతిజ్ఞ" అని పలికెను. క్రమముగా మున్యాశ్రమములకు చేరి, వారికి తన దర్శనభాగ్యమును గలిగించి, వారితో మధురసంభాషణములను గావించెను. (దో॥ 9)

సుతీక్ష్ణుడనువాడు అగస్త్య మహామునికి శిష్యుడు. అతడొక పరమ భక్తుడు, జ్ఞాని, త్రికరణ శుద్ధిగా శ్రీరామచరణసేవకుడు. అతడు కలలోగూడ ఇతరదేవతలను స్మరింపడు. ప్రభువు యొక్క రాకను వినగానే దర్శనోత్సుకుడై ఆరాటముతో సంబరపడి, ఎదురేతెంచుచు తనలో ఇట్లనుకొనెను. "విధాతా! దీనబంధువు శ్రీరాముడు నావంటి అల్పులపైగూడ దయజూపునా? రామలక్ష్మణులు నన్ను తమసేవకునిగా స్వీకరించెదరా? అట్లని నాకు దృఢవిశ్వాసము కలుగుటలేదు. భక్తియననేమో నాకు తెలియదు. నేను ఒక అజ్ఞానిని, నాలో వైరాగ్యము సున్న. నాకు సత్సాంగత్యము అబ్బలేదు. నేను యోగజపయజ్ఞాదులు చేయలేదు. నాకు ప్రభుచరణములయందు దృఢమైన అనురాగము కుదురుకొనలేదు. అనన్యభక్తితో కరుణానిధియైన ఆ ప్రభువును ఆశ్రయించినవారు ఆయనకు అత్యంత ప్రియులు. ఇది ఆయనస్వభావము". (ఈ విధముగా భగవంతుని స్వభావమును స్మరించుచు ముని ఆనందమగ్నుడై మఱల ఇట్లనుకొనెను.) "సంసార బంధములనుండి విముక్తిని ప్రసాదించు ప్రభుముఖకమలదర్శనమువలన నేడు నా కన్నులు సార్థకములగును" (శివుడు పలుకుచున్నాడు) భవానీ! జ్ఞానియైన సుతీక్ష్ణముని సంపూర్ణముగా భక్తి పరవశుడాయెను. అతని తన్మయత్వము వర్ణనాతీతము. అతడు దిశలను, మార్గమును మఱచి పోయెను. తానెవరో, తనగమ్యమేమిటో అను విషయము అతనిస్మృతిలో లేదు. ఒక్కొక్కసారి వెనుకకు మఱలి పోవును, మఱల ముందుకు నడచును. మఱియొకతఱి ప్రభుగుణములను కీర్తించుచు నాట్యము చేయును. ముని భక్తి పారవశ్యములో మునిగిపోయెను. శ్రీరామచంద్రుడు ఆ సుతీక్ష్ణుని ప్రేమోన్మత్తదశను ఒక చెట్టు చాటుననుండి గమనించెను. భవభయబంధములను తొలగించు శ్రీరాముడు ఆ మునిప్రేమాతిశయమునకు ముగ్ధుడై అతని హృదయమునందే ప్రకటితుడాయెను. సుతీక్ష్ణుడు ప్రభువును దర్శించి, మార్గమునందే నిశ్చలుడై కూర్చుండెను. అతని తనువు పులకించి, పనసపండువలె కంటకితమాయెను. అప్పుడు శ్రీరాముడు అతని సరసనజేరి, భక్తునిప్రేమవిహ్వలస్థితిని జూచి మిక్కిలి ప్రసన్నుడాయెను. మునిని జాగృతమొనర్చుటకు పెక్కు విధముల ప్రయత్నించెను. కాని అతడు స్పృహలోనికి రాలేదు. ఏలనన అతడు రామప్రభుధ్యానసుఖములో మునిగియుండెను. అపుడు శ్రీరాముడు తనరాజరూపమును మఱుగుపఱచి, చతుర్భుజ రూపమున ప్రకటితుడయ్యెను. తనకు ఆరాధ్యుడైన శ్రీరాముని స్థానమున చతుర్భుజ రూపమును జూచి ముని మణిహీనమైన జాతిసర్పమువలె వ్యాకులుడై లేచెను అంతట ముని తనయెదుట సీతాలక్ష్మణులతో గూడిన శ్యామసుందరుడు, సుఖధాముడు ఐన శ్రీరాముని గాంచెను. మిక్కిలి భాగ్యశాలియైన సుతీక్ష్ణ మునిప్రవరుడు ప్రేమమగ్నుడై దండమువలె శ్రీరాముని చరణములపై బడెను. ఆజానుబాహువైన శ్రీరాముడు అతనిని తనచల్లనిచేతులతో లేవనెత్తి, ప్రేమతో హృదయమునకు హత్తుకొనెను. అప్పుడు ఆ యిరువురును హేమతమాలవృక్షములవలె శోభిల్లిరి. శ్రీరాముని ముఖమును దర్శించుచు ముని నిశ్చలుడై చిత్తరువులోని బొమ్మవలె నిలిచి పోయెను. (చౌ॥ 1-12)

పిమ్మట ఆ ముని ధైర్యముతో పదే పదే ప్రభుపాదములకు ప్రణమిల్లెను. స్వామిని ఆశ్రమమునకు తోడ్కొని వచ్చి, అనేక విధముల పూజించెను. (దో॥ 10)

ముని పల్కెను. "ప్రభూ! నా మనవిని ఆలకింపుడు. నేను నిన్ను ఏవిధముగా స్తుతింప వలెను? నీ మహిమఅపారము. సూర్యప్రభలముందు మినుకు మినుకుమను మిణుగురు పురుగు కాంతివలె నాబుద్ధి స్వల్పము. నీలోత్పలసదృశ్య శ్యామశరీరా! ప్రభూ! శిరమున జటాజూటమును, తనువుపై వల్కలమును ధరించిన ఓ స్వామీ! చేతులలో ధనుర్బాణములను, కటియందు తూణీరమును పూనినవాడా! నిరంతరము నీకు నమస్కరింతును. మోహమనెడి ఘనారణ్యమును దహించుటలో అగ్నివంటివాడా! సజ్జనులనెడి కమలములను వికసింపజేయు భాస్కరుడా! రాక్షసులనెడి గజయూథములను రూపుమాపెడి సింహమా! జననమరణరూపపక్షులను సంహరించు

సంచానఖగమా! సర్వదా నన్ను రక్షింపుము. కెందామరలవంటి కన్నులుగలవాడా! సుందర వేషధారీ! సీతాదేవి నేత్రచకోరములకు చంద్రునివంటివాడా! పరమశివుని స్వాంతమనెడి మానససరోవరమున విహరించు హంసరాజమా! విశాల వక్షఃస్థలము, దీర్ఘబాహువులు గలవాడా! రామా! నీకు ప్రణామములు. సందేహములనెడి సర్పములను తుదముట్టించు గరుడుడా! కఠోర తర్కజనితదుఃఖములను అంతరింపజేయువాడా! పునర్జన్మరాహిత్యమును ప్రసాదించువాడా! దేవతలను ఆనందింపజేయువాడా! దయామయా! నన్ను కాపాడుము. నిర్గుణసగుణవిషమ సమరూపములుగలవాడా! వాగింద్రియ జ్ఞానములకు గోచరింపనివాడా! నిరుపమా! నిర్మలా! సంపూర్ణా! దోషరహితా! అనంతా! భూభారమును తొలగించువాడా! శ్రీరామచంద్రా! నీకు ప్రణమిల్లెదను. భక్తులకు కల్పవృక్షవనమువలె సుఖములనిచ్చువాడా! కామక్రోధలోభ మదములను పాఱద్రోలువాడా! సర్వసమర్థుడా! భవసాగరమును దాటించుటలో 'సేతువు' వంటివాడా! సూర్యవంశ ధ్వజమా! శ్రీరామా! సర్వదా నన్నుబ్రోవుము. అపార భుజబల ప్రతాపములు గలవాడా! పరాక్రమధామా! కలి కల్మష భంజనా! ధర్మరక్షణ కవచమా! గుణములచే ఆనందమును గూర్చువాడా! శ్రీరామా! సర్వదా నాకు శుభములను అనుగ్రహింపుము. నీవు పవిత్ర స్వరూపుడవు, సర్వ వ్యాపివి, శాశ్వతుడవు, సకల హృదయ నివాసివి, ఖరదూషణసంహారా! సీతాలక్ష్మణులతోగూడి వనములలో సంచరించుచున్నవాడా! స్వామీ! నీవు ఈ రూపముననే నా హృదయమున సర్వదా వసింపుము. నీవు సగుణుడవనియు, నిర్గుణుడవనియు, అంతర్యామివనియు- కొందరు భావింతురు. వారిని అట్లే భావింపనిమ్ము. కాని శ్రీరామా! అందఱి హృదయములయందు వసించు నీవు నాహృదయము నందు మాత్రము కమలనేత్రుడైన అయోధ్యాపతివై వసింపుము. 'శ్రీరామచంద్రుడు నా ప్రభువు. నేనాయన సేవకుడను' అను ప్రేమాభిమానము ఎన్నడును నానుండి తొలగకుండుగాక" ముని వచనములకు శ్రీరామచంద్రుడు ప్రసన్నుడై సంతోషముతో ఆ మునిని మఱల తన హృదయమునకు హత్తుకొని పలికెను. "మునివరా! నేను మిక్కిలి ప్రసన్నుడనైతిని. నీవు ఏదైననొకవరమును కోరుకొనుము- ఇచ్చెదను." సుతీక్ష్ణముని వచించెను. "ప్రభూ! నేను ఏనాడును వరములను గూర్చి తలంపనేలేదు. ఏది సత్యమో? ఏది అసత్యమో? నేను ఎఱుగను. దాసులకు సుఖములను అనుగ్రహించు ఓ రామచంద్ర ప్రభూ! నీకు మంచిదని తోచినదానిని నాకు ప్రసాదింపుము"- శ్రీరామచంద్రుడు ఇట్లనెను. "ఓ మునీ! పరమ భక్తివైరాగ్యవిజ్ఞానములకును, సమస్తసద్గుణములకును నీవు నిధివి కాగలవు"- ముని ఇట్లు విన్నవించెను. "ప్రభువిచ్చిన వరమును నేను పొందితిని. ఇప్పుడు నాకు ఇష్టమైన వరమును ప్రసాదింపుము. (చౌ॥ 1-4)

ప్రభూ! శ్రీరామా! శ్రీ సీతాలక్ష్మణులతో గూడి, ధనుర్బాణధారివై, నా నిష్కామహృదయా కాశమున చంద్రునివలె స్థిరముగా శోభిల్లు చుండుము. (నా హృదయమునుండి ఎన్నడును తొలగి పోవలదు.) (దో॥ 11)

# అగస్త్యమహామునితో సమాగమము

"అట్లే కానిమ్ము" అని వచించి, లక్ష్మీనివాసుడైన శ్రీరాముడు ప్రసన్నుడై, అచట నుండి కదలి, అగస్త్యమునికడకు బయలుదేరెను. అప్పుడు సుతీక్ష్ణుడు పలికెను." మా గురువుగారైన అగస్త్య మహర్షులను దర్శించి చాలకాలమైనది. నేను ఎంతోకాలమునుండి ఈ ఆశ్రమమునందే ఉంటిని. కనుక నేనును మీవెంట గురువుగారి కడకు వత్తును. ప్రభూ! ఇది మీరు ప్రత్యేకముగా అనుగ్రహించుట ఏమియు గాదు. ఏలనన మీరు నాహృదయముననందే వసించుచుంటిరి. కనుక మీరు నాకు తోడుగా ఉన్నట్లే." ముని చాతుర్యమునకు నవ్వుచు కృపానిధియైన శ్రీరాముడు ఆయనను తనవెంట నిడుకొనెను. దేవాదిదేవుడైన శ్రీరాముడు అనన్య భక్తినిగూర్చి ఆ మునికి వివరించుచు అగస్త్యముని ఆశ్రమమునకు జేరెను. సుతీక్ష్ణుడు ముందుగా గురువైన అగస్త్యుని కడకు వెళ్లి, దండప్రణామములను ఆచరించి, ఇట్లు వచించెను. "స్వామీ! మీరు అనుదినము స్మరించు చుండెడి ఆ శ్రీరామచంద్రుడు, కోసలాధిపతి

దశరథుని కుమారుడు, జగదాధారుడు, శ్రీ సీతా లక్ష్మణసమేతుడై మీదర్శనమునకై విచ్చేసినాడు." ఇది వినగానే అగస్త్యుడు త్వరత్వరగా ఎదురేతెంచెను. శ్రీరామచంద్రుని చూడగానే అతని నేత్రములు ఆనందాశ్రుపూర్ణములయ్యెను. సోదరులిద్దఱును ఆ మునీశ్వరుని పాదపద్మములకు సాష్టాంగముగా ప్రణమిల్లిరి. ఋషీశ్వరుడు వారిని లేవనెత్తి హృదయమునకు హత్తుకొనెను. జ్ఞానియైన అగస్త్యుడు కుశల సమాచారములను అడిగిన పిమ్మట వారిని తోడ్కొని వచ్చి, సుఖాసీనులను గావించెను. ప్రభువును పరిపరి విధముల పూజించి, "నేడు నా వంటి అదృష్టవంతుడు ఎవ్వడును లేడు" అనెను. అక్కడి మునులందఱును ఆనంద కందుడైన శ్రీరాముని జూచి, హర్షితులైరి. (చౌ॥ 1-4)

మునులసమూహములకు అభిముఖముగా శ్రీరామచంద్రుడు ఆసీనుడైయుండెను. మునులెల్లరును శరత్పూర్ణిమనాటిచంద్రుని చకోరములవలె శ్రీరాముని ముఖచంద్రుని కన్నులార గాంచుచుండిరి. (దో॥ 12)

పిమ్మట శ్రీరామచంద్రుడు అగస్త్యునితో పలికెను. "స్వామీ! మీ దగ్గర దాచవలసిన విషయమేమియు లేదు. నేను ఇచటికి వచ్చిన కారణమును మీరు ఎఱుగుదురు. నేను విపులముగా తెల్పుటలేదు. మునులను బాధించుచున్నరాక్షసులను హతమార్చుటకై తగిన మంత్రమును(సూచనలను) ప్రసాదింపుడు." ప్రభు వచనములను విని, మునీశ్వరుడు నవ్వుచు పలికెను. ప్రభూ! నాకేమితెలియునని మీరు నన్ను ఇట్లు ఎందుకు ప్రశ్నించితిరి? ఓ పాపవినాశా! మిమ్ము భజించుచున్నందున మీ మహిమను కొంచెము ఎఱుగుదును. మీ మాయ ఒక పెద్దమేడి చెట్టు వంటిది. అనేకబ్రహ్మాండములు దానిఫలములు. ఆ ఫలములలో చరాచరములన్నియును పురుగుల వలె నివసించుచుండును. ఆ ప్రాణులు ఆ చిన్నజగత్తును తప్ప మఱేమియు ఎఱుగవు. ఆ ఫలములను కఠినకరాళకాలము తినుచుండును. ఆ కాలముగూడ నిరంతరము మీకు భయపడుచుండును. సమస్త లోకపాలకులకు స్వామివై యుండియు సామాన్య మానవుల వలె మీరు నన్నుఅడుగు చుంటిరి. ఓ దయానిధానా! మీరు సీతాలక్ష్మణసమేతులై సదా నా హృదయమునందు వసింపుడు. అవిరళభక్తి, వైరాగ్యము, సత్సాంగత్యము, మీచరణ కమలములపై అనన్య ప్రేమను నాకు ప్రసాదింపుడు. ఇదియే నేను కోరుకొను ఏకైక వరము. నీవు అఖండుడవు, అనంతుడవు, పరబ్రహ్మవు, అనుభవైకవేద్యుడవు, అని సజ్జనులు సర్వదా నిన్ను సేవింతురు. నీ నిర్గుణ రూపమునుగూడ నేను ఎఱుగుదును. అట్లే వర్ణించెదను. ఐనను దాని నుండి నామనస్సును పూర్తిగా మఱల్చి, సగుణ బ్రహ్మరూపమున శ్రీరామునిగా అవతరించిన నీ సుందరాకారమునే సర్వదా ప్రేమించెదను. నీ వెల్లప్పుడును నీ దాసులను ప్రేమతో ఆదరింతువు. అందు వలననే నీవిట్లు ప్రశ్నించితివి. ప్రభూ! ఇచటికి సమీపమున 'పంచవటి' అను ప్రదేశము గలదు. అది మనోహరమైనది, పవిత్రమైనది. ఈ దండకారణ్యమునందలి పంచవటిని పావన మొనర్చి, దానికి గౌతమమునిభయంకరశాపమునుండి విముక్తి కల్గింపుము. రఘువరా! అచట నివసించి, మునులందఱిపై నీ దయావర్షమును గురిపింపుము." ఈ విధముగా మునియాజ్ఞను బడసి శ్రీరాముడు అచటి నుండి బయలుదేఱి 'పంచవటి'ని చేరెను. (చౌ॥ 1-9)

## శ్రీ సీతారామలక్ష్మణులు పంచవటిలో నివసించుట

అచట శ్రీరాముని గృధ్రరాజైన జటాయువు గలిసెను. శ్రీరాముడు అతనితో అత్యంతమైత్రిని దృఢపఱచి, గోదావరి సమీపమున ఒక పర్ణకుటీరమును నిర్మించుకొని నివసింపసాగెను. (దో॥ 13)

శ్రీరాముడు ఆ పంచవటిలో నివసించుచున్నప్పటినుండియు మునులు భయరహితులై హాయిగా నుండిరి. పర్వతములు, వనములు, నదీ తటాకములు దినదిన ప్రవర్ధమానములై శోభిల్లు చుండెను. పశుపక్షిసమూహములు

ఆనందముగా జీవించుచుండెను. తుమ్మెదల మధుర ఝుంకారములు వీనుల విందుగావించుచుండెను. శ్రీరాముడు విరాజిల్లుచున్న ఆ వనవైభవమును నాగరాజైన ఆదిశేషుడు గూడ వర్ణింపజాలడు. ఒకసారి శ్రీరామచంద్ర ప్రభువు సుఖాసీనుడైయున్న సమయమున లక్ష్మణుడు సరళముగా ఇట్లు పలికెను. "స్వామీ! దేవతలకును, మునులకును, మానవులకును సమస్త చరాచర ప్రాణికోటికిని మీరు ప్రభువులు. నేనును 'మిమ్ము'నా ప్రభువుగా భావించుచున్నాను. అన్నింటిని త్యజించి, మీ పాదధూళినే సేవించుమార్గమును నాకు ఉపదేశింపుడు. జ్ఞానవైరాగ్యమాయాస్వరూపములను వర్ణింపుడు. మీ కృపకు పాత్రుడనగుటకు భక్తి మార్గమును అనుగ్రహింపుడు. (చౌ॥ 1-4)

ప్రభూ! ఈశ్వరునకును జీవునకును గల భేదమును వివరముగా దెల్పుడు. దానివలన మీ చరణములపై నాకుగల భక్తి దృఢమై, శోకము, మోహము, భ్రమ తొలగిపోవును. (దో॥ 14)

శ్రీరాముడు పలికెను. "నాయనా! నేను నీకు సంక్షిప్తముగా అన్ని విషయములను తెల్పుదును. నీవు మనస్సు, బుద్ధి, చిత్తములను స్థిరముగా నుంచి వినుము. నేను, నాది, నీవు, నీది అనుభావనయే మాయ. ఇదియే జీవులను తన వశముననుంచుకొనును. సోదరా! ఇంద్రియములు, ఇంద్రియ విషయములు, మనోగతులు- ఇవి యన్నియును 'మాయా స్వరూపములే' అని గ్రహింపుము. ఈ మాయ రెండువిధములు. ఒకటి విద్య, మఱియొకటి అవిద్య. ఈ రెండింటికిని మధ్య గల భేదమును వినుము. వీటిలో అవిద్య దుష్టమైనది, మిక్కిలి దుఃఖ ప్రదమైనది. దీనికి వశమైన జీవుడు సంసారకూపమున పడును. రెండవది 'విద్య' ఇది త్రిగుణాత్మకమైనది. ప్రభు ప్రేరణచే ఇది జగత్తును సృష్టించును. దీనికి స్వశక్తి యేదియును లేదు. అభిమానము మున్నగు దోషములు ఏ మాత్రమూ లేనిదియు, అందఱిలో సమత్వబుద్ధితో పరమాత్మ రూపమునే చూచునదియు 'జ్ఞానము' అనబడును. సకలసిద్ధులను, మూడు గుణములను గడ్డిపోచ వలె భావించువాడే పరమ 'విరాగి'. (చౌ॥ 1-4)

జీవిడు ఈశ్వరాంశ, కనుక సచ్చిదానంద జ్ఞానస్వరూపుడు. కాని మాయా జనితమైన అవిద్యా (అజ్ఞాన) ప్రభావమున జీవుడు తన స్వరూపమునుగాని, ఈశ్వరునిగాని, మాయనుగాని ఎఱుంగలేకయున్నాడు. కావున వివిధ లౌకిక కర్మాసక్తుడై జీవుడు బంధములలో చిక్కుకొనుచున్నాడు. ఈ బంధముల చిజ్జడగ్రంథి నుండి విముక్తుడై మోక్షమును పొందుటకు సర్వాతీతుడు, మాయా ప్రేరకుడైన పరమేశ్వరుని అనుగ్రహము ఆవశ్యకము. దీనికి భక్తియే సాధన మార్గము. (దో॥ 15)

ధర్మాచరణమువలన వైరాగ్యము, యోగాభ్యాసమువలన జ్ఞానము జనించును. జ్ఞానమువలన మోక్షము లభించును. ఈ విధముగా వేదములలో తెల్పబడినది. సోదరా! నా హృదయమును తర్వగా ద్రవింపజేయునది భక్తి. ఇదియే నా భక్తులకు పరమానందమును పంచియిచ్చును. ఈ భక్తి స్వతంత్రమైనిది. దీనికి ఇతరసాధనములఅవసరము లేదు. జ్ఞానవిజ్ఞానములు దీనికి అధీనములు. నాయందలి భక్తియే నిరుపమానమైనది. ఇది సర్వ సుఖములకును మూలము. కాని సజ్జనసాంగత్యము వలననే ఇది లభించును. ఇప్పుడు భక్తి సాధనరీతులను సవిస్తరముగా వర్ణింతును. ఇది సుగమమైనమార్గము. దీనిని అనుసరించినవారునన్ను అనాయాసముగా పొందుదురు. మొదట బ్రాహ్మణచరణములపై పూర్తిగా భక్తిశ్రద్ధలు కలిగియుండవలెను. వేదోక్తముగా విధులను నిర్వర్తింపవలెను. తత్ప్రభావమున విషయవాంఛలపై విరక్తి యేర్పడును. విరక్తివలన నాధర్మము (పూజ) నందు అనురాగము కల్గును. అప్పుడు శ్రవణాదినవవిధ భక్తి మార్గములయందు మనస్సు దృఢమై యుండును. మనస్సు నా లీలలయందు అనన్య ప్రేమతో నిమగ్నమగును. అట్టి నా భక్తునకు సజ్జనులపాదపద్మములపై అత్యంత ప్రేమయుండును. అతడు త్రికరణ

శుద్ధి గలిగి, నియమపూర్వకముగా నన్ను భజించు చుండును, నన్నే గురువు, తల్లి, తండ్రి, సోదరుడు, పతి, దైవము, అని భావించుచు సేవించుచుండును. నా గుణములను కీర్తించునపుడు అతడు పులకితగాత్రుడగును, అతనికంఠము గద్గదమగును, నేత్రములనుండి ప్రేమాశ్రువులు ప్రవహించుచుండును. అతని యందు కామము, మదము, దంభము మొదలగునవి ఏ మాత్రమూ ఉండవు. అట్టి అనన్య భక్తునకు నేను సర్వదా వశుడనై యుందును. (చౌ॥ 1-6)

మనోవాక్కర్మలయందు సర్వదా నన్నే స్మరించుచు నిష్కాముడై, నన్ను భజించువాని హృదయమే నా నివాసస్థానము. (దో॥ 16)

# శూర్పణఖకు శృంగభంగము

ఈ భక్తి యోగవివరణను విని, లక్ష్మణుడు మిక్కిలి హర్షితుడై ప్రభుచరణములకు ప్రణమిల్లెను. ఈ విధముగా జ్ఞానవైరాగ్యగుణనీతి చర్చలతో కొన్నిదినములు గడచెను. రావణునకు 'శూర్పణఖ' అను చెల్లెలు గలదు. ఆమె దుష్టస్వభావురాలు, నల్లత్రాచువలె భయంకరమైనది. ఆమె ఒకనాడు పంచవటికి వచ్చి, ఆ రాజకుమారులిద్దఱిని జూచి 'కామాతుర' అయ్యెను. (కాక భుశుండి చెప్పుచున్నాడు.) ఓ గరుత్మంతుడా! ధర్మజ్ఞానహీనలై, కామాంధలైన స్త్రీలు సుందర పురుషుని చూడగనే, అతడు సోదరుడు, తండ్రి, పుత్రుడు అనువిచక్షణయే లేక మనోవైకల్యమును పొందుదురు. సూర్యకర స్పర్శతో సూర్యకాంతమణి ద్రవించి పోయినట్లు, వారు తమ మనస్సులను అరికట్టలేరు. ఆమె సుందరరూపమును దాల్చి, ప్రభువును సమీపించెను. చిఱునవ్వుతో మృదు మధురముగా ఇట్లు పలికెను. "నీవంటి పురుషుడుగాని, నావంటి స్త్రీగాని ఈ లోకమున లేరు. బ్రహ్మ బాగుగా ఆలోచించియే మన ఇద్దఱిని సమాగమపఱచెను. ముల్లోకములలో వెదకినను నాకు ఈడుజోడైనవాడు ఎక్కడను కనపడలేదు. అందువలన ఇంతవఱకును నేను అవివాహితగనే యుంటిని. ఇప్పుడు నిన్ను చూచిన పిమ్మట నా మనస్సు కుదుట బడినది". శ్రీరామచంద్ర ప్రభువు సీతాదేవి వైపు చూచుచు (తాను భార్యాసహితుడనని సంకేతమునిచ్చుచు) 'నా తమ్ముడు పడుచువాడు' అని పరిహాసముతో పలికెను. అప్పుడామె లక్ష్మణుని యొద్దకు చేరెను. ఆమె తమ శత్రువైన రావణుని చెల్లెలని యెఱింగి, ప్రభువు వైపు చూచి, లక్ష్మణుడు చిఱునవ్వుతో ఇట్లనెను. "సుందరీ! వినుము. నేను అతని సేవకుడను, అస్వతంత్రుడను. అందువలన నీవు సుఖమును పొందజాలవు. ప్రభువు సమర్థుడు, అయోధ్యకు రాజు. అతడేమి చేసినను చెల్లును. సేవకుడు సుఖమును, దరిద్రుడు గౌరవమును, వ్యసన పరుడు ధనమును, వ్యభిచారి ముక్తిని, లోభి యశమును, దురభిమానియైనదూత దౌత్యమును నెఱపుటను, కోరుట ఆకాశము పిదికి పాలను పొందవచ్చుననుకొనుటవంటిది. (అనగా గగన కుసుమమువలె అసంభవమైనది.) లక్ష్మణుని సమాధానమును విని, ఆమె మఱల శ్రీరాముని కడకు వచ్చెను. ప్రభువు ఆమెను తిరిగి లక్ష్మణునికడకు పంపెను. లక్ష్మణుడు "సిగ్గును తృణ సమానముగా వదలివేసినవాడే (లజ్జావిహీనుడే) నిన్ను వరించును." అని పలికెను. అప్పుడు ఆమె కుపితయై అవమానభారముతో శ్రీరాముని కడకు వెళ్ళి, తన భయంకర రూపమును ప్రకటించెను. సీతాదేవి భయపడుటను జూచి శ్రీరాముడు లక్ష్మణునకు 'సైగ' చేసెను. (చౌ॥ 1-10)

లక్ష్మణుడు మిక్కిలి కౌశలముతో ఆమె ముక్కు చెవులను కోసి, తద్వారా రావణునకు యుద్ధమునకై ఆహ్వానమును పంపినట్లు చేసెను. (దో॥ 17)

# ఖరదూషణ సంహారము

ముక్కు చెవులు తెగిపోయిన ఆ రాక్షసి, ఇంకను కరాళ రూపమును దాల్చెను. తెగిన అంగముల నుండి రక్తము ఒక నల్లని కొండ నుండి గైరికధాతుధారవలె స్రవించెను. ఆమె వెక్కి వెక్కి యేడ్చుచు ఖర దూషణుల యొద్దకు వెళ్ళి

పల్కెను. "సోదరులారా! మీ బల పౌరుషములు వ్యర్థములు." ఖర దూషణులు అడిగిన పిమ్మట శూర్పణఖ విషయము నంతయును వివరించెను. అది వినగానే రాక్షసులు తమ సైన్యములను సిద్ధపఱచిరి. రెక్కలు గల్గిన కాటుకకొండలవలె రాక్షస సైనికులు సర్వ సన్నద్ధులై పరుగుపరుగున వచ్చిరి. వారు అనేక- ఆకృతులు గలవారై పెక్కు వాహనములపై వచ్చిరి. అసంఖ్యాకములైన వివిధాస్త్ర శస్త్రములను ధరించి యుండిరి. ముక్కు చెవులు తెగి, అమంగళ(వికృత) రూపముతో నున్న శూర్పణఖను ముందుంచుకొనివచ్చిరి. ఆసమయమున వారికి ఎన్నియో అపశకునములు పొడసూపెను. కాని చావు మూడియుండుటచే వారెల్లరును వాటిని సరకుగొనలేదు. వారు గ్రేలుచు, పెడబొబ్బలు పెట్టుచు, ఆకసమున ఎగురుచు వచ్చిరి. తమ సైన్యమును చూచుకొని, యోధులు సంబరపడిరి. "సోదరులిద్దఱిని సజీవులుగా బంధింపుడు"- అని ఒకడు పల్కగా మఱియొకడు, "వారిని చంపి, ఆ స్త్రీని తీసికొనిపొండు"-అని అనుచుండెను. ఆకసము ధూళిచే కప్పబడెను. శ్రీరాముడు లక్ష్మణుని వైపుజూచి యిట్లనెను. "భయంకర రాక్షస సైన్యములు వచ్చుచున్నవి. నీవు జానకిని తీసికొని, కొండగుహలోనికి పొమ్ము. జాగరూకతతో నుండుము". ప్రభునాజ్ఞను విని, లక్ష్మణుడు చేతులలో ధనుర్బాణములను దాల్చి, సీతాదేవితోపాటు పోయెను. శత్రుసైన్యము సమీపించుటను జూచి, శ్రీరాముడు నవ్వి, తన కోదండమును ఎక్కుపెట్టెను. (చౌ॥ 1-7)

ఎదురులేని తన కోదండమును ఎక్కుపెట్టి, జటాజూటమును సర్దుకొనుచున్న రామచంద్రుని భుజములు మరకతమణి పర్వతముపై కోట్ల కొలది విద్యుల్లతలతో పోరాడు రెండు సర్పముల వలె శోభిల్లు చుండెను. నడుమునకు తూణీరమును బిగించి, దీర్ఘ బాహువులతో ధనుస్సును పట్టుకొని, బాణమును సంధించి, ఎదురుగా వచ్చుచున్న మదపుటేనుగులను సింహము వలె శ్రీరాముడు ఆ రాక్షస సైన్యములను జూచెను. (ఛం)

గొప్ప రాక్షసయోధులు 'పట్టుకొనుడు, పట్టుకొనుడు' అని కేకలు వేయుచు అతివేగముగా పరుగెత్తుచు ప్రాతఃకాల బాలసూర్యుని ఒంటరిగా చూచి మందేహాది రాక్షసులు చుట్టుముట్టినట్లు వారు శ్రీరామచంద్రుని చుట్టుముట్టిరి.[1,2]

(సో॥ 18)

అతిలోక సుందరుడైన శ్రీరామచంద్రుని జూచి, రాక్షససైనికులు స్తబ్ధులై ముందుకు నడువలేకపోయిరి. వారు ఆయనపై బాణములను ప్రయోగింపలేక పోయిరి. ఖరదూషణులు మంత్రులను పిలిచి ఇట్లు పలికిరి. "ఈ రాజకుమారుడెవరో మానవులలో మణిభూషణము వలెనున్నాడు. సోదరులారా! వినుడు. ఇంతవఱకు నాగులను, అసురులను, దేవతలను, మనుష్యులను, మునులను అందఱిని జయించితిమి, హతమార్చితిమి. కాని ఇట్టి

---

1) మందేహాది రాక్షసులు సూర్యుని బాధించుచుందురు. సంధ్యోపాసన చేయువారు తమ సంధ్యావందన కార్యక్రమమునందు సూర్యునకు మూడు పర్యాయములు అర్ఘ్యములను సమర్పించుచుందురు. ఆ అర్ఘ్యములు బ్రహ్మాస్త్ర, బ్రహ్మదండాస్త్ర, బ్రహ్మశిరోనామకాస్త్రములై ఆ మందేహాది రాక్షసులను పాఱద్రోలును. ఆ విధముగా సూర్యునకు రాక్షసబాధ తొలగును. కనుక ఈ అర్ఘ్య ప్రదాన ప్రభావమును గ్రహించి, సంధ్యోపాసకులు అందఱును తమ సంధ్యావందనములను విధిగా ఆచరించుండవలెను. 'అర్ఘ్య ప్రదాన ప్రభావమును' విస్మరింపరాదు. దానిని ముఖ్య కర్తవ్యముగా భావింపవలెను. లేనిచో సూర్యుని బాధ తమకు బాధాకరముగా మాఱును. ఇది సార్వకాలిక సత్యము. సంధ్యావందనమును ఆచరింపనిచో సూర్య హత్యాపాపము వచ్చును.

2) శ్లో ॥ తస్మాన్నోల్లంఘనం కార్యం, సంధ్యోపాసన కర్మణః ।

సహన్తి సూర్యం సంధ్యాయాం, నోపాస్తిం కురుతే తుయః ॥ విష్ణుపురాణం. 2/8

సౌందర్యమూర్తిని ఎప్పుడును చూడలేదు. నిజముగా మా చెల్లెలిని కురూపిగా జేసినప్పటికిని ఇంతటి అపూర్వ సుందరుడు చంపదగినవాడుకాడు. 'ఓయీ! మానవా! నీవు దాచియుంచిన స్త్రీని మాకప్పగించి, మీరిద్దఱును ప్రాణములతో మీ ఇండ్లకు జేరుడు'అని, అతనికి నా సందేశమును వినిపించి, తిరిగి రండు"- దూతలీసందేశమును శ్రీరామునకు వినిపించిరి. అది వినగానే శ్రీరామచంద్రుడు చిఱునవ్వుతో పలికెను. మేము క్షత్రియులము. అడవులలో వేటాడెదము. మీ వంటి క్రూర మృగములను వెంటాడుచు తిరిగెదము. శత్రువు బలవంతుడైనను మేము వెనుకాడము. మృత్యు దేవత వచ్చినను పోరాడెదము, సంహరించెదము. మేము బాలురమే. కాని దుష్టులను దండింపగలము. మేము మానవులము రాక్షసులను చంపుదుము. మునులను రక్షించుచుందుము. మీకు శక్తిలేనిచో ఇంటిముఖముపట్టుడు. యుద్ధమున పాటిపోవు వానిని నేను చంపను. రణభూమిలో కపటచాతుర్యములను ప్రకటించుట, శత్రువుపై దయజూపుట పిఱికి వాని లక్షణము". దూతలు వెళ్లి ఈ విషయమునంతయును ఖరదూషణులకు తెల్పిరి. వారామాటలను విని క్రోధముతో మండిపడిరి. (చౌ॥ 1-7)

మండిపోవుచున్న హృదయములతో వారు తమరాక్షస వీరులను ఉద్దేశించి, "పట్టుకొనుడు" అని పలికిరి. ఈ మాటను వినినంతనే భయంకరయోధులు ధనుర్బాణములను, తోమర, శక్తి, శూల, కృపాణ, పరిఘ, పరశువులు- మొదలగు ఆయుధములను పూని, రామునిపై దాడికి వెడలిరి. శ్రీరామచంద్రుడు కఠోరము, ఘోరము, భయంకరమైన ధనుష్టంకారమును గావించెను. దానిని వినగానే రాక్షసులు బధిరులై, దిక్కుతోచనివారైరి. ఆ సమయమున వారికి ఏమియు తెలియక పోయెను. (ఛం)

శత్రువు మిక్కిలి బలశాలియని యెఱింగి, అతిజాగరూకతతో ఆ రాక్షసులు శ్రీరామునిపై నానా విధములైన అస్త్రశస్త్రములను కురిపింపసాగిరి. కాని శ్రీరఘువీరుడు ధనుస్సును ఆకర్ణాంతము లాగి, బాణపరంపరను ప్రయోగించి, వాటినన్నింటిని నువ్వుగింజలంతగా ముక్కలు ముక్కలు జేసెను.

(దో॥ 19. క,ఖ)

శ్రీరామచంద్రుని బాణములు భయంకరసర్పములు బుసలుకొట్టుచుపోవుచున్నట్లు శత్రు గణములమీదికి దూసికొనిపోవుచుండెను. శ్రీరామునిలో సమరావేశము పెఱిగినకొలదియు, ఆయనప్రయోగించిన శరములు తీక్ష్ణముగా పోసాగెను. మిక్కిలి పదునుగల ఆ బాణములధాటికి తట్టుకొనలేక రాక్షసయోధులు కాలికి బుద్ధిచెప్పిరి. అప్పుడు ఖరదూషణత్రిశిరులు క్రోధావేశముతో "యుద్ధమున పాటివచ్చిన వారిని మేమే స్వయముగా సంహరించెదము"- అని బిగ్గరగా అఱచిరి. తమకు చావు తప్పదని యెఱింగి, పాటివచ్చిన వారు మఱల యుద్ధభూమికి చేరిరి. ఎదుట నిలిచి శ్రీరామునిపై అనేకవిధములైన ఆయుధములను ప్రయోగించిరి. శత్రువుల క్రోధావేశములను గ్రహించి, ప్రభువు తనధనుస్సునందు శరములను సంధించి, విడువగా పిశాచములవంటి రాక్షసులు వాటికి ఆహుతియైరి. వారి మొండెములు, తలలు, భుజములు, కరములు, కాళ్లు ముక్కలుముక్కలై, చెల్లాచెదరుగా పడిపోయెను. వారు ఆబాణములతాకిడికి తట్టుకొనలేక కేకలు పెట్టుచుండిరి. వారిమొండెములు కొండలవలె నేలగూలుచుండెను. ఆ యోధులశరీరములు ముక్కలగుచున్నను రాక్షసమాయవలన వారు మఱలలేచివచ్చుచుండిరి. ఆకసమున పెక్కు తలలు, భుజములు ఎగురుచుండెను. మొండెములు ఇటునటు పరుగెత్తుచుండెను. మాంసాహారులైన గ్రద్దలు, కాకులు మున్నగు పక్షులు, నక్కలు కూతలు పెట్టుచుండెను. (చౌ॥ 1-7)

నక్కలు కూయుచుండెను. భూతప్రేతపిచశాములు కపాలములలోని రక్తములను పీల్చుచుండెను. వీరబేతాళములు ఆ పుఱ్ఱెలపై మద్దెలలు వాయించుచుండెను. మంత్రగత్తెలు నాట్యములాడు చుండిరి. రఘువీరుని ప్రచండబాణములు యోధులఱొమ్ములను, భుజములను, తలలను తుత్తునియలు గావించెను. వారి శరీరములు నేలకొరిగియు, మఱల లేచివచ్చి పోరాడుచుండెను. 'పట్టుకొనుడు, పట్టుకొనుడు,' అని వారు కేకలు వేయుచుండిరి. రాక్షసుల నరములను రాబందులు తమ కాలిగోళ్లతో పట్టుకొని, ఎగిరిపోవుచుండెను. వాటి ఆవలికొనలను పిశాచములు పట్టుకొని పరుగులు దీయుచుండెను. ఆ దృశ్యము సంగ్రామనగరమున బాలకులు గాలిపటములను

ఎగురవేసినట్లుండెను. శ్రీరామునిబాణములచే అనేకరాక్షసవీరులు మట్టుపెట్టబడిరి. గుండెలు బ్రద్దలైన వారు నేలపై బడి మూలుగుచుండిరి. తమ సైన్యము కకావికలగుట చూచి ఖర, దూషణత్రిశిరులు శ్రీరామునితో స్వయముగా తలపడిరి. కుపితులైన అసంఖ్యాకులైన రాక్షసులు శ్రీ రఘువీరునిపై ఒక్కుమ్మడిగా బాణ, శక్తి, తోమర, త్రిశూల పరశుకృపాణాది అస్త్రములు ప్రయోగించిరి. శ్రీరామచంద్ర ప్రభువు వాటిని ఒక్కక్షణకాలముపాటు ఆపి, తనబాణములను ప్రయోగించెను. ఆ నిశాచరసేనాపతులతొమ్ములలో పదేసిబాణములు గ్రుచ్చుకొనెను. రాక్షస యోధులు నేలకొరిగియు, మఱల లేచి వచ్చి, యుద్ధము చేయుచుండిరి. వారు చావక, అనేకమాయోపాయములను పన్నుచుండిరి. 'పోరుచున్న రాక్షసులు పదునాలుగువేలమంది, ఎదుటి పక్షమున శ్రీరాముడు ఒక్కడు మాత్రమే'-అని దేవతలు భీతిల్లుచుండిరి. దేవతల, మునుల భయమును జూచి, మాయాధీశుడైన ప్రభువు గొప్ప వినోదమును సృష్టించెను. దాని వలన శత్రుసైన్యములో ఒకరికొకరు శ్రీరాముని రూపమున కన్పింపసాగిరి. వారిలో వారే ఒకరినొకరు చంపుకొనిరి. (ఛం॥ 1-4)

రాక్షస సైనికులందఱిని దయానిధి యైన శ్రీరామచంద్రుడు ఒక్క క్షణములో వధించెను. వారు 'రామ రామ' యనుచు మరణించి, మోక్షమును పొందిరి.[1] దేవతలు సంతసించుచు పూలవాన గురిపించిరి. ఆకసమున దుందుభులు మ్రోగెను. శ్రీరాముని స్మరించుచు దేవతలు తమ తమ విమానములలో స్వస్థానములకరిగిరి. (దో॥ 20. క,ఖ)

## శూర్పణఖ రావణునితో మొఱపెట్టుకొనుట

శ్రీరాముడు యుద్ధమున రాక్షసులనందఱిని అంతమొందించి, దేవతలను, మునులను, మనుష్యులను నిర్భయులనుగా జేసెను. అప్పుడు లక్ష్మణుడు సీతాదేవిని రాముని కడకు జేర్చి, ప్రభువు యొక్క చరణములకు నమస్కరించెను. ప్రభువు అతనిని లేవనెత్తి, హృదయమునకు హత్తుకొనెను. శ్రీరామునికోమలశ్యామలశరీరమును సీతాదేవి తదేకదృష్టితో చూడసాగెను. ఎంతగా జూచినను ఆమెకు తనివి తీరకుండెను. (పిదప సంతోషమును పట్టలేక సీతాదేవి మహావీరుడును, తనపతిదేవుడైన శ్రీరామచంద్రుని పదేపదే గాఢాలింగనమొనర్చుకొనెను.)[2] ఈ విధముగా పంచవటిలో నివాసమును కొనసాగించుచు శ్రీరాముడు దేవతలను, మునులను సంతోషపఱచుచు అనేక-అద్భుత లీలావిశేషములను ప్రదర్శించెను.

ఖరదూషణులు వినాశమగుటను జూచిన శూర్పణఖ రావణునియొద్దకు పోయి, మిక్కిలి కోపముతో లబోదిబోయనుచు గగ్గోలు పెట్టసాగెను. "నీ రాజ్యమును, కోశాగారమును, పూర్తిగా విస్మరించితివి. మద్యసేవతో మత్తిల్లి రాత్రింబవళ్లు నిద్రపోవుచుంటివి. శత్రువులు వచ్చి, మీదపడబోవుచున్నదియు నీకు పట్టకుండెను. నీతిలేని రాజ్య పరిపాలన, ధర్మహీనధనసంపాదన, భగవదర్పణముచేయని ఉత్తమ కార్యము, వివేకమును కల్గింపని విద్యయు మొదలగు వానివలన శ్రమయేమిగులును, కాని ఫలితము శూన్యము. 'విషయవాసనలవలన సన్న్యాసియు,

1) రామ రామ యన్న రారాదు పాపంబు,
రామ రామ యన్న రాదు భయము,
రామ రామ యన్న రారాదు మృత్యువు,
రామ రామ యనుము రక్షగొనుము.

2) శ్లో॥ బభూవ హృష్టావైదేహీ, భర్తారం పరిష్వజే ॥
పునః పరిష్వజ్య శశిప్రభాననా!
బభూవ హృష్టా జనకాత్మజా తదా ॥
వాల్మీకిరామాయణము-అరణ్యకాండము 30/40-41

దుర్బోధనలవలన రాజు, దురహంకారముచే గుణవంతుడు పతనముచెందుదురు. దురభిమానముచేజ్ఞానము, మదిరాపానమువలన లజ్జయు, ప్రేమరాహిత్యముచే స్నేహము దెబ్బతినును' అను నీతిని నేను వినియుంటిని. (ఇచట ఒక రాక్షసి నోట సత్కర్మలు, భగవదర్పణోపదేశములు వచ్చుచున్నవి. ఇది తులసీదాసు యొక్క లోకజ్ఞతను ధర్మపారీణ వైశిష్ట్యమును తెలుపు చున్నవి.) (చౌ॥ 1-6)

"శత్రువును, రోగమును, అగ్నిని, పాపమును, ప్రభువును, సర్పమును తక్కువ అంచనావేయరాదు." ఇట్లు చెప్పుచు ఆమె అనేకవిధముల విలపించెను. (సో॥ 21. క)

శూర్పణఖ నిండు సభలో వ్యాకులపడుచు క్రిందపడి యేడ్చుచు రావణునితో పలికెను. ఓరీ! దశాననా! నీవు బ్రతికి యుండగ నేను ఈ స్థితికి గురికాదగునా? (దో॥ 21. ఖ)

ఆమెవిలాపమును విని, సభాసదులు ఉద్విగ్నులై లేచిరి. వారు శూర్పణఖబాహువులను పట్టుకొని పైకి లేపి, నిలుచుండబెట్టి సమాధాన పఱచిరి. లంకేశుడైన రావణుడు ముందుగా "నీ విషయమును తెల్పుము. నీ ముక్కు చెవులను కోసినదెవరు?" అని పలికెను. ఆమెయిట్లు ప్రత్యుత్తరము నిచ్చెను. "అయోధ్యాపతియైన దశరథుని కుమారులు, పురుష సింహులు వేటాడుటకై వనములకు వచ్చిరి. నేను వారిఉద్దేశ్యములను గ్రహించితిని. వారు భూమిపైగల రాక్షసజాతిని మట్టు బెట్టనెంచినారు. రావణా! వారి భుజ బలమును జూచి, మునులు వనములలో నిర్భయముగా మసలుకొనుచున్నారు. వారు చూచుటకు బాలకులే యైనను కాలునితో సమానులు. మహావీరులు, ధనుర్ధారులు, ఉత్తమగుణసంపన్నులు. ఆయిరువురు సోదరులబలప్రతాపములు అపారములు. వారు దుష్టులను రూపుమాపి, దేవతలను, ఋషులను కాపాడనెంచినారు. ఆ యిరువురిలో రాముడు అతిలోకసుందరుడు ఆయనతో పాటు ఒక సుందరియు గలదు. బ్రహ్మ సౌందర్యము నంతయును ఒక కుప్పగాజేసి, ఆమెను సృష్టించెను రతీదేవులు ఎందఱైనను ఆమె సౌందర్యమునకు సాటిరారు. అతని తమ్ముడు నా ముక్కు చెవులను కోసినాడు. నేను నీ సోదరినని తెలియగనే వారు నన్ను పరిహసింపసాగిరి. ఖర, దూషణులు నా ఆక్రందనను విని, వారితో పోరాడిరి. కాని వారిసమస్తసైన్యములను ఆ రాముడు ఒక్కడే ఒక్షణములో హతమార్చెను." ఖర దూషణత్రిశిరులసంహారములను విని, రావణుని శరీరము కోపముతో ఉడికి పోయెను. (చౌ॥ 1-6)

రావణుడు శూర్పణఖకు అనేకవిధములనచ్చజెప్పి, తనబలపరాక్రమములను గూర్చి బీరములు పలికెను. చింతాక్రాంతుడై అతడు తనభవనమునకు పోయెను. కాని తీవ్రమైన ఆలోచనలతో ఆతనికి ఆ రాత్రియంతయు నిద్రయే పట్టలేదు. (దో॥ 22)

రావణుడు తనమనస్సులో విచారింపసాగెను. "దేవతలు, మనుష్యులు, అసురులు, నాగులు, ఖగములు- వీరిలో ఎవ్వరును నా సేవకులతోగూడ సమానులుగారు. ఖరదూషణులు బలపరాక్రమములలో నాతో సమానులే. ఆభగవంతుడుతప్ప వారిని ఎవ్వరును వధింపజాలరు. ఒక వేళ దేవతలను ఆనందింప జేయుటకును, భూభారమును తొలగించుటకును ఆ భగవంతుడే అవతరించియుండినచో, నేను తప్పక ఆతనితో వైరమునుబూని, యుద్ధముచేసెదను. ఆతని బాణముల దెబ్బలకు అసువులను వీడి, భవసాగరమును దాటెదను. ఈ తమోమయశరీరముతో భగవంతునిసేవ సాధ్యముగాదు. త్రికరణశుద్ధిగా ఇది నా దృఢనిశ్చయము. ఒకవేళ వారు మానవమాత్రులైన రాజకుమారులేయైనచో వారిని ఇద్దఱిని యుద్ధమున ఓడించి, ఆ స్త్రీని అపహరించి తెచ్చెదను. ఈ విధముగా తనలో తాననుకొని, రావణుడు ఒంటరిగా రథమునెక్కి, సముద్రతీరమునగల మారీచనివాసమునకు వెళ్లెను. (శంకరుడు పలుకుచున్నాడు) పార్వతీ! అక్కడ శ్రీరామచంద్రుడు పన్నినయుక్తిని ఆసుందరకథను వినుము. (చౌ॥ 1-4)

లక్ష్మణుడు కందమూల ఫలములను తీసికొని వచ్చుటకై వనమునకు వెళ్లినప్పుడు కృపానిధియైన శ్రీరామచంద్రుడు నవ్వుచు జానకితో అనెను. (దో॥ 23)

"ప్రియా! పతివ్రతాశిరోమణీ! వినుము. నేనొక మనోహరమైన మానవలీలను చూపెదను. నేను రాక్షసులను అందఱిని సంహరించువఱకు నీవు అగ్నిదేవునికడ వసింపుము' శ్రీరామచంద్రుడు ఈ విధముగా అనునయవచనములను పలుకగానే సాధ్వి సీతాదేవి శ్రీరాముని చరణములను మనస్సున నిలుపుకొని, అగ్ని ప్రవేశము చేసెను. ఆమె తనప్రతిరూపమును మాత్రమును శ్రీరాముని కడనే ఉంచెను. ఆ మాయాసీత శీలస్వభావములచే రూపనమ్రతలచే సీతాదేవిని పోలియుండెను. ఈ భగవల్లీలను లక్ష్మణుడుగూడ ఎఱుగడు. స్వార్థపరుడు, నీచుడు ఐన రావణుడు మారీచుని జేరి, శిరసా నమస్కరించెను. ధూర్తుని వినయప్రదర్శనము, అంకుశము, ధనుస్సు, సర్పము, పిల్లి మొదలగు వానివలె దుఃఖదాయకము . వేళగాని వేళ పూచిన పూలవలె దుష్టునిమెత్తనిమాటలుగూడ భయంకరములు, ఉత్పాత సూచకములు. (చౌ॥ 1-4)

# రావణమారీచ సంవాదము

మారీచుడు అతనిని పూజించి, సాదరముగా అడిగెను. "నాయనా! నీ మనస్సు ఇంతగా వ్యాకుల మగుటకు కారణమేమి? నీవు ఒంటరిగా ఏల వచ్చితివి?" (దో॥ 24)

మూర్ఖుడైన రావణుడు కథనంతయు దురభిమానముతో వినిపించి, పలికెను. "నీవు మాయలేడి రూపమును ధరించుము. నేను రాజకుమారిని మాయోపాయముచే అపహరించెదను" మారీచుడు దీనికి సమాధానమునిచ్చెను. "దశకంఠా! వినుము. అతడు మానవావతారమునెత్తిన భగవంతుడు. ఈ చరాచర జగత్తునకు ఈశ్వరుడు. నాయనా! ఆతనితో వైరము వద్దు. ఆయన సంకల్పమును అనుసరించియే జీవులజననమరణములు జరుగుచుండును. ఈ రాజకుమారుడే విశ్వామిత్రుని యాగసంరక్షణకు బాల్యమున వచ్చియుండెను. ఆ చిఱు వయస్సులోనే అప్పుడతడు నన్ను ములికి లేని బాణముతో కొట్టియుండెను. ఆ దెబ్బతో ఒక్కక్షణములో నేను నూఱుయోజనముల దూరమున పడిపోయితిని. అందువలన అతనితో వైరము పెట్టుకొనుట శ్రేయస్కరము గాదు. ఇప్పటి నా స్థితి 'భ్రమరకీట న్యాయము' వలెనున్నది. నేను ఎటు చూచినను నాకు ఆ సోదరులే కన్పించు చున్నారు. వారు నిజముగా మానవమాత్రులేయైనచో సాటిలేని శూరులేయనవలెను. వారితో విరోధమునకు పూనుకొనుట ప్రమాదకరము. (చౌ॥ 1-4)

తాటకయు, సుబాహువు ఆ రాముని చేతిలోనే మడిసిరి. శివధనుర్భంగము గావించిన మహా వీరుడతడు. ఖర, దూషణ, త్రిశిరులను హతమార్చిన వాడతడే. అట్టి అపరిమితపరాక్రమశాలి మనుష్యమాత్రుడా? (దో॥ 25)

కావున నీ కుటుంబ క్షేమమునాలోచించి, ఇంటికి మఱలి పొమ్ము." ఈమాటలకు రావణుడు భగ్గున మండిపడి, మారీచుని అనేకవిధముల తిట్టెను. "ఓరీ మూర్ఖుడా! గురువువలె నాకు జ్ఞానోపదేశము చేసెదవా? ఈ జగత్తులో నాకుసాటియగు ప్రతియోధుడు ఎక్కడున్నాడో చెప్పుము"- అప్పుడు మారీచుడు తనమనస్సులో ఇట్లనుకొనెను. "శస్త్రధారి, మర్మజ్ఞుడు, సమర్థుడైన ప్రభువు (యజమాని), మూర్ఖుడు, ధనవంతుడు, వైద్యుడు, భట్రాజు, కవి, వంటవాడు- ఈ తొమ్మిది విధములగు వారితో వైరము పూనుట మంచిదికాదు"- రెండు విధములుగను 'తనకు మరణము తథ్యము'- అని తలంచి, మారీచుడు శ్రీ రఘునాథుని శరణుజొచ్చుటయే మేలని గ్రహించెను. "రావణుని మాటను కాదన్నచో ఆదుర్మార్గుడు నన్ను చంపును. కావున రఘునాథుని బాణముచేతనే ఏల చావగూడదు?"

మనసులో ఇట్లాలోచించి, అతడు రావణుని అనుసరించెను. శ్రీరామునిచరణములపై మారీచునకు అత్యంతభక్తి గలదు. నేడు రామచంద్రప్రభుదర్శనము అగును గదాయని అతనిమనస్సున హర్షము ఉప్పొంగెను. కాని రావణునియెదుట అతడు తన సంతోషమును ప్రకటింపలేదు. (చౌ॥ 1-4)

మారీచుడు తనలో ఆలోచింపసాగెను. "నాకు పరమప్రియతముడైన స్వామిని జూచి, నా నేత్రములను సఫలమొనర్చుకొని సుఖముగానుండగలను. సీతాలక్ష్మణులతో గూడియున్న కృపాళువైన శ్రీరామచంద్రునిచరణములకు నా మనస్సును అర్పించెదను. ఆ శ్రీహరి (రాముని) ఆగ్రహముగూడ మోక్షదాయకమే. అతడు స్వతంత్రుడైనను భక్తికి వశమగును. అట్టి ఆనంద సాగరుడైన శ్రీహరి స్వయముగా బాణమును సంధించి, నన్ను వధించును. (ఛం)

లేడి రూపమున ముందుకుసాగిపోవుచుండెడి నావెంట ధనుర్బాణములతో శ్రీరామచంద్ర ప్రభువు నన్ను పట్టుకొనుటకు పరుగెత్తుచు వచ్చును. అప్పుడు పదే పదే నేను వెనుకకు తిరిగి, ఆయనను దర్శించెదను. కనుక నావంటి ధన్యుడెవ్వడును ఉండడు. (దో॥ 26)

## సీతాపహరణము

రావణుడు దండకారణ్యమును సమీపింపగనే మారీచుడు తన మాయాప్రభావమున కపట మృగమాయెను. ఆ జింక మిక్కిలి విచిత్రముగా ఉండెను. దానిని వర్ణించుటకు సాధ్యముగాదు. దాని బంగారువన్నెగల దేహము మణిఖచితమైయుండెను. ప్రత్యంగము మనోహరముగా నున్న ఆ సుందరమృగమును సీతాదేవి చూచి, పలికెను. "ప్రభూ! కృపాళూ! ఈ జింకచర్మము అతి సుందరముగా ఉన్నది. ఓ సత్యధురంధరా! దీనిని చంపి, దీనిచర్మమును తీసికొనిరండు. శ్రీరామునకు విషయమంతయు తెలిసినప్పటికిని, దేవతల కార్యమును నెఱవేర్చుటకై సంతోషముతో లేచెను. అతడు మృగమును జూచి, నడుము చుట్టును వస్త్రమును కట్టుకొని, ధనువును చేతబట్టి, బాణమును ఎక్కుపెట్టెను. శ్రీరామచంద్రుడు లక్ష్మణుని ఇట్లు హెచ్చరించెను. "సోదరా! వనములో నిశాచరులు పెక్కుమంది తిరుగుచు ఉండెదరు. నీ బుద్ధివివేకములతో నీ బలమును సమయస్ఫూర్తిని ఉపయోగించి, సీతను రక్షించుచుండుము." ప్రభువునుజూచి, జింక పాఱిపోవుచుండెను. శ్రీరాముడు ధనుస్సును ఎక్కుపెట్టి దానిని వెంబడింపసాగెను. వేదములచే 'నేతి, నేతి' యని వర్ణింపబడునట్టి వాడును, శివునిచే నిరంతరము ధ్యానింపబడువాడును అగు శ్రీరాముడు మాయామృగమువెంట పరుగెత్తుచుండెను. ఎంత ఆశ్చర్యము! ఆ జింక సమీపమున ఉన్నట్లేయుండి, దూరమగును. ఒకసారి కన్పించును. ఇంతలోనే మాయమగును. ఇట్లు కన్పించుచు మాయమగుచు పెక్కువన్నాగములతో ఆ కాంచనమృగము ప్రభువును దూరముగా తీసికొని పోయెను. అప్పుడు శ్రీరాముడు గురిచూచి, ఒక తీవ్రమైన బాణమును సంధించెను. అది తగులగానే ఆ మృగము గావుకేకలు పెట్టుచు నేలకొరిగెను. అది మొదట 'హా లక్ష్మణా! అని అరచెను. పిమ్మట శ్రీరాముని స్మరించెను. ప్రాణత్యాగసమయమున మారీచుడు తన నిజరూపమును పొంది అనన్యభక్తితో శ్రీరామస్మరణ గావించెను. సర్వజ్ఞుడైన ప్రభువు అతని మనస్సునందలి భక్తిభావమును గ్రహించి, మునీశ్వరులకును దుర్లభమైన పరమగతిని అతనికి ప్రసాదించెను. (చౌ॥ 1-9)

దేవతలు పుష్పవృష్టి గురిపించిరి. ప్రభుగుణములను కొనియాడిరి. దీనబాంధవుడైన రఘునాథుడు అసురులకు పరమపదము నొసంగెను– అని స్తుతించిరి. (దో॥ 27)

ఆ మాయావియైన మారీచుని వధించి, రఘువీరుడు వెంటనే తిరిగి వచ్చుచుండెను. ఆయన చేతులలో ధనుర్బాణములును, నడుమున తూణీరమూ శోభిల్లుచుండెను. ఇచ్చట సీతాదేవి మారీచుడు పలికిన "హా లక్ష్మణా!"

అను విలాపవచనమును విని, మిక్కిలి భయపడి లక్ష్మణునితోఇట్లనెను. "నీవు వెంటనే బయలుదేటి వెళ్లుము. మీ అన్నగారు విపత్కర పరిస్థితికి లోనైనట్లున్నారు." లక్ష్మణుడు నవ్వి, పలికెను. "మాతా! వినుము. శ్రీరాముని బొమముడి సంకేతముతోనే సృష్టి లయమై పోవును. అట్టి స్వామి కలలోగూడ సంకటములకు లోనుగాడు." అంతట సీతాదేవి హృదయవిదారకములైన మాటలను పలుకగానే లక్ష్మణుడు శ్రీహరిప్రేరణవలన చలించి పోయెను. లక్ష్మణుడు సీతాదేవిరక్షణభారమును వనదేవతలకును, దిక్పాలురకును అప్పగించి, రావణుడుఅను చంద్రుని పాలిటికి రాహువైన శ్రీరాముడున్న చోటికి వెళ్లెను. ఇక్కడ అదనుకై పొంచి యున్న రావణుడు సన్యాసివేషమున సీతాదేవి ఆశ్రమమును సమీపించెను. దేవదానవులు సైతము రావణునిపేరు వినినంతనే భయకంపితులై నిద్రాహారములను మానివేయుచుందురు. అట్టి భయంకరుడైన దశకంఠుడు కుక్కవలె దొంగతనముగా ఇటునటుచూచుచువచ్చెను. (కాకభుశుండి పలుకు చున్నాడు.) గరుడుడా! చెడు త్రోవలు త్రొక్కెడి మానవునియందు తేజస్సు, బుద్ధి, బలము లేశమాత్రముగూడ ఉండవు. రావణుడు వివిధములైన కథలల్లి, సీతాదేవికి రాజనీతిని బోధించుటయే గాక, ఆమెకు భీతిగొల్పుచు, ఆమెయెడ తన ప్రేమను ప్రకటించెను. సీతాదేవి "సన్యాసీ! నీవు ఒక దుష్టునివలె మాట్లాడుచున్నావు." అని పల్కెను. అప్పుడు రావణుడు తన నిజస్వరూపమును జూపి, తనపేరును ప్రకటింపగానే సీతాదేవి భయకంపితయయ్యెను. కాని ధైర్యమును కూడగట్టుకొని పలికెను. "దుష్టుడా! ఆగుము. నా పతిదేవుడు వచ్చుచున్నాడు. ఒక కుందేలు ఆడుసింహమును ఆసించినట్లు రాక్షస రాజా! నీవు (నన్ను కోరి) కాలునికి వశమగు చున్నావు." సీతాదేవి వచనములను విని, రావణుడు క్రుద్ధుడాయెను. కాని మనస్సులో మాత్రము ఆమె పాదములకు వందనమాచరించి సంతోషించెను. (చౌ॥ 1-8)

క్రోధోన్మత్తుడైన దుష్టరావణుడు సీతాదేవిని బలవంతముగా తన రథమున కూర్చుండబెట్టుకొని, ఆతురతతో ఆకాశమార్గమున సాగిపోయెను. కాని భయవిహ్వలుడై అతడు రథమును నడుపజాలక పోయెను. (దో॥ 28)

## రావణ జటాయువుల యుద్ధము

సీతాదేవి విలపింపసాగెను. "ఓ జగద్విఖ్యాత-అద్వితీయ వీరుడా! రఘునాథా! ఆర్తిహరణా! శరణాగతవత్సలా! రఘువంశాంబుజ భాస్కరుడా! నీవు నాపై దయజూపకపోవుటకు నేను జేసిన అపరాధమేమి? ఓ లక్ష్మణా! ఇందు నీ దోషమేమియు లేదు. నా క్రోధఫలితమును నేను అనుభవించు చున్నాను." ఇట్లు సీతాదేవి పరిపరి విధముల శోకింపసాగెను. "అయ్యో! నాపై అపార ప్రేమగల నా నాథుడు చాల దూరముననున్నాడు. నా ఈ ఆపదను నా ప్రభువునకు విన్పించు వారెవ్వరు? యజ్ఞహవిస్సు (పురోడాశము)ను ఒక గాడిద(కుక్క) తినదలచినది." సీతాదేవి దుర్భరవిలాపమును విని, స్థావరజంగమప్రాణులన్నియును దుఃఖింపసాగెను. మార్గములో గృధ్రరాజైన జటాయువు శోకార్తయైన సీతాదేవివాణిని విని, "ఈమె నిజముగా రఘువంశ శ్రేష్ఠుడైన శ్రీరామునిపత్నియే" యని గుర్తించెను. కపిలగోవు ఒక కసాయివానిచేతికి చిక్కినట్లు ఆమె ఆ నీచనిశాచరునిచే అపహరింపబడుటను ఆ గృధ్రరాజు చూచెను. అంతట అతడు పలికెను. "బిడ్డా! సీతా! భయపడకుము. నేను ఈ రాక్షసాధముని నాశమొనరింతును."- అని ఆ పక్షి పర్వతము మీదికి వజ్రాయుధమువలె మిక్కిలి కోపముతో పరుగు పరుగున వచ్చెను. ఆ పక్షి రావణునితో పల్కెను. "ఓరీ! దుష్టుడా! నిలువుము. నన్ను గుర్తింపనట్లు ఏల నిర్భయముగా సాగిపోవుచుంటివి?" యమునివలె తనమీదికి వచ్చుచున్న జటాయువును జూచి, రావణుడు ఆలోచింప సాగెను. "ఇది మైనాక పర్వతమా? లేక గరుత్మంతుడా? గరుడునకును, ఆయన స్వామియైన విష్ణువునకును నా బలము తెలియును." కొంచెము దగ్గఱకు వచ్చిన పిదప అతడు జటాయువును గుర్తించెను. "ఇది వృద్ధ జటాయువు. నా చేతులనెడి తీర్థములో ప్రాణములను

అర్పింప వచ్చినది." అనియనెను. ఈ మాట వినగానే జటాయువు క్రోధావేశముతో వేగముగా ముందునకుదూకి పలికెను. "రావణా! నా హెచ్చరిక వినుము. జానకీదేవిని వీడి, క్షేమముగా ఇంటికి పొమ్ము. లేనిచో శ్రీరాముని భయానక క్రోధాగ్నిలో నీ వంశమువారందఱును శలభములవలె భస్మమగుదురు." రావణుడేమియు పలుకలేదు. అపుడు జటాయువు క్రోధముతో ముందుకు పరుగెత్తుకొని వచ్చి, రావణుని జుట్టు పట్టుకొని అతనిని రథమునుండి క్రిందికి లాగి వైచెను. రావణుడు నేలపైబడెను. సీతాదేవిని ఒక ప్రక్కన కూర్చుండ బెట్టి, గృధ్రరాజు తిరిగి వచ్చి, ముక్కుతో పొడిచి, పొడిచి, రావణుని శరీరమును విశీర్ణమొనర్చెను. దానివలన రావణుడు ఒక గడియ సేపు మూర్ఛితుడాయెను. లజ్జితుడైన రావణుడు క్రుద్ధుడై లేచి, తనకరవాలమున జటాయువుఱెక్కలను నరికెను. ఇట్లు అతి సాహసముతో, తనఅత్యద్భుత పరాక్రమముతో రావణుని ఎదుర్కొని, జటాయువు శ్రీరాముని స్మరించుచు నేలకొరిగెను. పిదప సీతాదేవిని రథముపై కూర్చుండ బెట్టుకొని, రావణుడు భయాందోళనలతో సాగిపోయెను. వలలో చిక్కిన లేడివలె సీతాదేవి విలపించుచు ఆకాశ మార్గమున పోవుచుండెను. మార్గమధ్యమున ఒక పర్వతముపై కూర్చొనియున్న వానరులను జూచి, హరినామస్మరణ చేయుచు, తనవస్త్రమును (ఆభరణముల మూటను) క్రిందికి పడవేసెను. రావణుడు సీతాదేవిని తీసికొని పోయి, అశోకవనమున ఉంచెను. (చౌ॥ 1-13)

దుష్టరావణుడు ఆమెను భయపెట్టియు, వివిధములైన ప్రీతివచనములను పలికియు, సఫలుడు కాలేకపోయెను. అపుడు ఆమెను ఒక అశోకవృక్షచ్ఛాయలో రాక్షసస్త్రీల రక్షణలో ఉంచెను. (దో॥ 29.క)

(నవాహ్నిక పారాయణము- ఆఱవ విరామము)

మాయామృగము వెంట పరుగెత్తుచున్నప్పటి శ్రీరాముని రూపమును మనసున ధ్యానించుచు సీతాదేవి హరిస్మరణ గావించుచుండెను. (దో॥ 29.ఖ)

## సీతాన్వేషణము

ఇచ్చట రఘునాథుడు తనతమ్ముడైన లక్ష్మణుడు ఎదురుగా వచ్చుటను జూచి, బాహ్యముగా చింతాక్రాంతుడైనట్లు కన్పించుచు, "సోదరా! జానకిని ఒంటరిగా వదలి, నా ఆజ్ఞను ఉల్లంఘించితివా? వనములలో రాక్షసులు సంచరించుచు ఉందురు. సీత ఆశ్రమములో లేదని నా మనసు చెప్పుచున్నది." అనెను. లక్ష్మణుడు శ్రీరామునకు పాదాభివందనమొనర్చి, చేతులు జోడించి, పలికెను. "ప్రభూ! ఇందు నా దోషమేమియు లేదు" లక్ష్మణునితో గూడి శ్రీరాముడు గోదావరీ తీరమునగల తన ఆశ్రమమునకు జేరెను. జానకి లేని శూన్యమైన ఆశ్రమమును జూచి, శ్రీరాముడు సామాన్య మానవుని వలె వ్యాకులితుడై, దైన్యముతో దుఃఖితుడాయెను. "ఓ సద్గుణఖనీ! జానకీ! రూపశీలవ్రతనియమములచే పవిత్రమైనదానా! సీతా! నీవు ఎక్కడనుంటివి?" అని విలపింపసాగెను. లక్ష్మణుడు అన్నను అనేకవిధముల ఊరడించెను. అప్పుడు ప్రభువు వృక్షలతాదులనుగూడ అడుగుచు బోయెను. "ఓ పశుపక్షులారా! భ్రమరసమూహములారా! మృగలోచనయైన సీతను మీరెక్కడనైనను చూచితిరా? పిచ్చుకలు, చిలుకలు, పావురములు, జింకలు, చేపలు, తుమ్మెదలగుంపులు, కోయిలలు, మల్లెమొగ్గలు, దానిమ్మఫలములు, మెఱుపుతీగ, కమలము, శరచ్చంద్రుడు, ఆడుత్రాచు, వరుణపాశము, మన్మథునిధనుస్సు, హంస, ఏనుగు, సింహము- ఇవియన్నియు నేడు తమ ప్రశంసలను వినుచుండెను. మారేడు పండ్లు, బంగారము, అరటి స్తంభములుగూడ సంతోషించు చుండెను. వీటి మనస్సులలో కొంచెము గూడ శంకాసంకోచములు లేవు. జానకీ! నీవు ఇచట లేనందువలన ఇవి యన్నియును నేడు రాజ్యమును పొందినంత ప్రసన్నతను సంతరించు కొన్నవి. (నీ అపూర్వరూపసంపదముందు ఇంత వఱకు అవి తమ లోపములనే వినుచుండెను. ఇపుడు నీవు లేనందువలన

తమ ప్రశంసలను వినుచున్నవి.) నీవు వీటిస్పర్ధను ఎట్లు సహించుచున్నావు? త్వరగా ఏల ప్రత్యక్షము కావు?" ఈవిధముగా శ్రీరాముడు విలపించుచు, సీతాదేవిని వెదకసాగెను. ఒక మహావిషయాసక్తుడు విరహవేదనతో తనప్రియురాలిని వెదకుచున్నట్లు అతడు కన్పట్టుచుండెను. పూర్ణకాముడు, ఆనంద స్వరూపుడు, జన్మరహితుడు శాశ్వతుడు ఐన శ్రీరాముడు సామాన్య మనుష్యులవలె ప్రవర్తించుచు సంచరించుచుండెను. మార్గమున నేలపై బడియున్న గృధ్ర రాజైన జటాయువును అతడు జూచెను. జటాయువు ధ్వజకులిశాది చిహ్నములుగల భగవంతుని పాదములను స్మరించుచుండెను. (చౌ॥ 1-9)

# జటాయువు పరమపదమును చేరుట

కృపాసింధువైన శ్రీరఘువీరుడు తనకరకమలములతో జటాయువుతలను ప్రేమతో నిమిరెను. శోభానిధానుడైన శ్రీరామునిముఖమును జూచినంతనే ఆతని (జటాయువు) బాధ మటు మాయమాయెను.

(దో॥ 30)

జటాయువు ధైర్యమును దెచ్చుకొని, పలికెను. "జనన మరణ భయమును పాఱద్రోలు స్వామీ! శ్రీరామా! వినుము. దశకంఠుడైన రావణుడు నాకు ఈస్థితిని కల్పించినాడు. ఆదుష్టుడే జానకీ దేవిని అపహరించుకొని పోయినాడు. స్వామీ! వాడు ఆమెను తీసికొని దక్షిణదిశకు పోయెను. సీతాదేవి క్రౌంచపక్షిశాబకమువలె విలపించుచుండెను. ప్రభూ! మీ దర్శనార్థమై ఇంతవఱకు నా ప్రాణములను చిక్కబట్టుకొని యుంటిని. కృపానిధీ! ఇప్పుడు అవి పోవుటకు సిద్ధముగా ఉన్నవి." శ్రీరాముడు పలికెను. "నాయనా! శరీరత్యాగము చేయవలదు." జటాయువు చిఱునవ్వుతో పలికెను. "అవసానదశయందు 'శ్రీరామనామమును' స్మరించువాడు అధముడైనను ముక్తుడగునని వేదములు పలుకుచున్నవి. అట్టి మీరే నా కనుల యెదుట నిలిచి యుండగా నేను ఏ కోరికనుతీర్చుకొనుటకై బ్రతుకవలెను?" అశ్రుపూర్ణనయనములతో శ్రీరాముడు పలికెను. "తండ్రీ! నీవు నీ సత్కర్మల చేతనే సద్గతిని పొందితివి. పరోపకారపారీణులైనవారికి ప్రపంచమున దుర్లభమైనది ఏదియును లేదు. నాయనా! శరీరమును త్యజించి, నీవు నా పరమపదమును చేరుము. నేను నీకు ఏమి ఇయ్యగలను? నీవు స్వయముగా పూర్ణకాముడవు. (చౌ॥ 1-5)

నాయనా! సీతాపహరణవృత్తాంతమును నీవు స్వర్గములో నున్న మా తండ్రిగారికి చెప్పవలదు. నేను నిజముగా రాముడనే యైనచో ఆ దశకంఠుడైన రావణుడే స్వయముగా తనకుటుంబముతో గూడ వెళ్లి, ఆయనకావిషయమును తెల్పును. (దో॥ 31)

జటాయువు తనగృధ్రరూపమును త్యజించి, శ్రీహరిరూపమును ధరించెను. అసమానమైన అనేక-ఆభరణములను, పీతాంబరములనూ దాల్చెను. శ్యామల శరీరము, నాలుగువిశాల భుజములును గలిగి, నేత్రములనుండి ఆనందాశ్రువులు స్రవించు చుండగా ఇట్లు స్తుతించెను. (చౌ॥ 1)

ఓ రామా! నీకు జయము. నీ రూపము నిరుపమానము. నీవు నిర్గుణుడవు, సగుణుడవు. నిజముగా మాయా ప్రేరకుడవు. పదితలలుగల రావణునిభుజములను ఖండించుటకు తీక్ష్ణములైన బాణములను ధరించినవాడవు. పృథ్వీభూషణా! నీలమేఘశ్యామశరీరా! కమలాస్యా! రాజీవాయతలోచనా! విశాలభుజశోభితా! భవభయముక్తి ప్రదాయకా! కృపానిధీ! రామా! నేను నీకు నిత్యము ప్రణమిల్లుచుందును. అపారబలశాలి, అనాది, అజుడు, అవ్యక్త స్వరూపుడు, అద్వితీయుడు, అగోచరుడు, గోవిందుడు, ఇంద్రియాతీతుడు, హర్షశోకాది ద్వంద్వములను హరించువాడు, విజ్ఞానఘనుడు, ధరణీధరుడు, రామనామమును జపించు సజ్జనులకును, సేవకులకును ఆత్మానందదాయకుడు, నిష్కామప్రియుడు, కామాదిదుష్టవృత్తులను రూపుమాపువాడు ఐన శ్రీరామునకు

అనుదినము నమస్కరింతును. నిరంజనుడు, పరబ్రహ్మ, సర్వవ్యాపకుడు, నిర్వికారుడు, జన్మరహితుడు- అని వేదములచే కీర్తింపబడువాడును, ధ్యాన, జ్ఞాన, వైరాగ్య, యోగాదిసాధనల ద్వారా మునులచే పొందబడువాడును, కరుణామయుడును, అందాలరాశియును ఐన శ్రీహరియే స్వయముగా రాముడుగా అవతరించి, చరాచరజగత్తును మోహింప జేయుచున్నాడు. ఆ ప్రభువే నా హృదయకమలమునకు భ్రమరము. ఆయన ప్రత్యంగమునందును మన్మథసౌందర్యము విరాజిల్లుచున్నది. అతడు ఎంతటి వారికిని దుర్లభుడు, భక్తసులభుడు, నిర్మలస్వభావుడు, విషమసమశాంతమూర్తి మనోనిగ్రహముతో ఇంద్రియములను వశపఱచు కొని, దృఢసాధనచేయు యోగులకు దర్శనమిచ్చువాడు, త్రిభువన స్వామి, లక్ష్మీ నివాసుడు ఐన శ్రీరాముడు సర్వదా తనను సేవించువారికి వశమైయుండును. ఆతని పవిత్రకీర్తి సంసారదుఃఖములను నాశమొందించును. అట్టి శ్రీరామచంద్రప్రభువు నా హృదయమున నివసించుచుండుగాక- (ఛం॥ 1-4)

అఖండ భక్తిని వరముగా పొంది, గృధ్రరాజు జటాయువు శ్రీ విష్ణుధామ (వైకుంఠ)మును చేరెను. శ్రీరాముడు అతనికి యథోచితముగ ఉత్తరక్రియలను స్వయముగా జరిపెను. (దో॥ 32)

శ్రీరామచంద్ర ప్రభువు అత్యంతకోమలహృదయుడు, దీనదయాళువు, అవ్యాజకృపాళువు. మాంసాహారియు, పక్షులలో అధముడును ఐన గృధ్రమునకును యోగులు సర్వదా ఆశించు దుర్లభమగుపరమపదమును ప్రసాదించెను. (శంకరుడు పలుకుచున్నాడు) పార్వతీ! వినుము. శ్రీహరిని స్మరింపక నిరంతరము విషయభోగములను కాంక్షించుజనులు నిజముగా దురదృష్టవంతులు. పిమ్మట సోదరులిద్దఱును సీతాదేవిని వెదకుచు ముందుకు సాగిరి. వారు దట్టమైన ఆ అడవిలో సీతను అన్వేషించుచు పోవుచుండిరి. ఆ ప్రదేశము లతలతో, వృక్షములతోగూడిన ఘనారణ్యము. అందు అనేకములైన పక్షులు, మృగములు, ఏనుగులు, సింహములు సంచరించుచుండెను. మార్గమధ్యమున శ్రీరాముడు కబంధుడను రాక్షసుని సంహరించెను. అతడు తన శాపవృత్తాంతమును రామునకు వినిపించెను. "దుర్వాసుడు నన్ను శపించెను. ఇప్పుడు మీ చరణములను దర్శించుటచే ఆ శాపమునుండి నాకు విముక్తి లభించినది"- శ్రీరాముడు ఇట్లు పలికెను. ఓ గంధర్వా! నేను వచించుమాటలను ఆలకింపుము. బ్రాహ్మణులకు శత్రువులైన వారిని నేను సహింపను. (చౌ॥ 1-4)

త్రికరణ శుద్ధిగా భూసురోత్తములను సేవించు వారికి నేనే గాదు బ్రహ్మ, శివుడు మొదలగు దేవతలు అందఱును వశులయ్యెదరు. (దో॥ 33)

కనుక 'శాపమిచ్చినను, దండించినను, కఠోరవచనములు పలికినను బ్రాహ్మణుడు పూజ్యుడే' అని సజ్జనులు పలికెదరు. శీలము, గుణము లేకున్నను బ్రాహ్మణుడు పూజనీయుడే. కాని గుణగణములున్నను, జ్ఞానియైనను శూద్రుడు పూజ్యార్హుడు కాడు" శ్రీరామచంద్ర ప్రభువు కబంధునకు భక్తి మార్గమును ఉపదేశించెను. తన చరణములపై అతనికి గల భక్తికి సంతసించెను. పిమ్మట ఆ గంధర్వుడు శ్రీరామచరణములకు శిరసా నమస్కరించి, ఆకాశమార్గమున వెళ్లి పోయెను.

## శబరి ఆతిథ్యము

ఉదారగుణములుగల శ్రీరాముడు అతనికి ముక్తిని ప్రసాదించి, శబరి ఆశ్రమమున ప్రవేశించెను. తన కడకు విచ్చేసిన శ్రీరాముని జూచిన శబరికి మతంగముని పలుకులు జ్ఞప్తికి వచ్చి, సంతోషపడెను. కమలములవంటి కన్నులు, ఆజానుబాహువులు, తలలపై జటాజూటములు, వక్షఃస్థలములపై వనమాలలు కలిగియున్న శ్యామ గౌరవర్ణ శోభితులైన ఆ సోదరులిద్దఱిని జూచి, శబరి వారిచరణములపై వ్రాలెను. ప్రభువుపై గల భక్తి పారవశ్యమున ఆమెకు

నోట మాట రాలేదు. పదే పదే వారి పాదపద్మములకు నమస్కరించి, పవిత్రజలములతో వారిపాదములను గడిగి, వారిని సుఖాసీనులను గావించెను. (చౌ॥ 1-5)

శబరి చక్కగా పక్వములైన ఫలములను, కందమూలములను శ్రీరామునకు సమర్పించెను. ప్రభువు వాటిని మెచ్చుకొనుచు తృప్తిగా ఆరగించెను. (దో॥ 34)

తదనంతరము ఆమె చేతులు జోడించి, ప్రభువునెదుట నిలబడెను. ప్రభువును చూచుచున్న కొలదియు ఆమెలో భక్తి పొంగిపొరలుచుండెను. ఆమె పలికెను. "ప్రభూ! నేనేవిధముగా మిమ్ము స్తుతింపవలెను? ఓపాపవిమోచన! నేను నిమ్నజాతిస్త్రీని. మందబుద్ధిని, అధమురాలను, అందునా అతి నికృష్టురాలను, నేను జడమతిని." శ్రీరాముడు పలికెను. "భక్తురాలా! నా మాటలను వినుము. నేను కేవలము భక్తితత్పరత్వమునే గౌరవించెదను. జాతి, కులము, ధనము, బంధుత్వము, గౌరవము, గుణము, బుద్ధికౌశలము మొదలగునవి ఎన్నియున్నను భక్తిలేనివ్యక్తి నీరులేని మేఘముతో సమానము. కనుక అట్టి వారు నాప్రేమకు పాత్రులు కారు. ఇప్పుడు నేను నీకు నవవిధ భక్తులను గూర్చి తెల్పెదను. సావధానముగా విని, వానిని మనస్సున మననము చేయుము. మొదటిది సజ్జనసాంగత్యము. రెండవది. నా కథలయందనురక్తి. (చౌ॥ 1-4)

అభిమానమును వదలి, గురుచరణములను సేవించుట మూడవది. మనస్ఫూర్తిగా నాగుణములను గానము చేయుట నాల్గవది. (దో॥ 35)

రామనామమును జపించుచు నాపై దృఢ విశ్వాసము నుంచుట ఐదవ విధమైన భక్తి. ఇది వేద ప్రసిద్ధము. ఇంద్రియనిగ్రహము, శీలము, లౌకిక కర్మలయందు విరక్తి, నిరంతరము సజ్జన యోగ్యమైన కార్యాచరణమునందు తత్పరత ఆఱవ విధమైన భక్తి. జగత్తును రామమయముగా సమానభావముతో చూచుచు సజ్జనులను (భాగవతోత్తములను) నాకంటెను అధికులుగా పరిగణించుట ఏడవ విధమైన భక్తి. ప్రాప్తించిన దానితో సంతృప్తిని జెందుచు, స్వప్నమునగూడ ఇతరులదోషములనుగూర్చి తలంపకుండుట అష్టమరీతి భక్తి. అందఱితో సరళముగా నిష్కపటముగా వ్యవహరించుచు హృదయమున నాపై విశ్వాసముంచి, హర్షవిషాదములను దఱిజేరనీయకుండుట నవమరీతిభక్తి. ఈ తొమ్మిదింటిలో ఏ ఒక్క భక్తి మార్గమును అనుసరించినను చాలును. అట్టివారు. జడమైనను, చేతనమైనను, స్త్రీయైనను, పురుషుడైనను, నా కత్యంత ప్రీతి పాత్రులు. మఱి నీలో మాత్రము ఈ నవవిధభక్తులు సంపూర్ణముగా గలవు. కావున యోగులకును దుర్లభమైనగతి నీకు అవలీలగా సిద్ధించినది.(1) నాదర్శనఫలము నిరుపమానమైనది. దానివలన జీవుడు స్వస్వరూపమును (కైవల్యమును) పొందును. ఓ తల్లీ! గజగామినియైన సీతా సమాచారమును ఎఱిగియున్నచో తెల్పుము. శబరి పల్కెను. "ఓ రఘునాథా! మీరు పంపాసరోవరమునకు పొండు. అక్కడ సుగ్రీవునితో చెలిమి యేర్పడును. అతడు మీకు సమాచారమునంతయును తెలుపగలడు. మీరు సర్వజ్ఞులయ్యును నన్నడుగు చున్నారు." ఇట్లు పలికి, ఆమె పదే పదే ప్రభు చరణములకు ప్రణమిల్లి, మతంగ మహర్షి తనకు తెల్పిన విషయమును, తాను ప్రభువు కొఱకు ఎదురుచూచిన విధమును ఆయనకు ప్రేమ పూర్వకముగా విన్పించెను. (చౌ॥ 1-7)

---

1. ఎంతనినే వర్ణింతును శబరి భాగ్యము. ॥ఎంతని॥
దాంతులు వరకాంతలు జగమంతయునిండియుండగ ॥ఎంతని॥
కనులార సేవించి, కమ్మని ఫలములనొసగి,
తనువు పులకరించి, పాదయుగమునకు మ్రొక్కి,
ఇనకుల పతి సముఖంబున పునరావృత్తి రహిత పద
మును బొందిన త్యాగరాజనుతురాలి పుణ్యంబును ॥ఎంతని॥ (త్యాగరాజ)

కథనంతయును దెల్పిన పిదప శబరి భగవంతుని దర్శించుచు ఆయనచరణకమలములను తనహృదయమున నిల్పుకొని, యోగాగ్నిలో తనతనువును త్యజించి, జీవులు మఱల తిరిగిరానట్టి హరిపదమున లీనమాయెను. తులసీదాసు పలుకుచున్నాడు. "మానవులారా! అనేకవిధములైన కర్మలను, అధర్మములను, మతములను త్యజింపుడు"ఇవి యన్నియును శోకప్రదములే. భక్తివిశ్వాసములతో శ్రీరామునిపదములపై అనురాగమును నిల్పుడు. (ఛం)

నిమ్నజాతికి (శబర జాతికి) చెందిన శబరికే భక్తకల్పతరువైన ఆ ప్రభువు దయతో ముక్తిని ప్రసాదించెను. అట్టి స్వామిని మఱచి, ఓ మూర్ఖ మనసా! తుచ్ఛ సుఖములను ఏల ఆసించెదవు? (దో॥ 36)

## శ్రీరాముని విరహము

శ్రీరామచంద్రుడు ఆ వనమునుండి ముందుకు సాగెను. సోదరులిద్దఱును అమితబల పరాక్రమములు గలవారు, పురుషసింహులు. ప్రభువు విరహాకులమనస్కుడైనవానివలె విరహపూరితములైన కరుణరసప్లావిత గాథలను లక్ష్మణునకు అనేకము చెప్పెను. "లక్ష్మణా! వనశోభను చూడుము. దీనిని చూచినచో ఎవనిమనస్సు క్షోభింపదు. పశుపక్షి సమూహములన్నియును వాటివాటి ఆడుజాతులతో గలిసి నన్ను గేలిసేయు చున్నట్లున్నవి. మనలను గాంచి, దుప్పులు పరుగెత్తుచుండగా చూచి, లేళ్లు వాటితో చెప్పుచున్నవి. 'మీరు భయపడకుడు. సాధారణ జింక జాతికి చెందిన వారు గావున మీరు సంతోషముగా ఉండవచ్చును. వీరు బంగారు జింకలను వెదకుటకు వచ్చినారు. (కనుక బంగారు జింకలు భయపడవలయును గాని మీరుగాదు) మగ ఏనుగులు ఆడు ఏనుగులతో పాటు పోవుచు (స్త్రీని ఎప్పుడైనను ఒంటరిగా విడిచివెళ్లరాదని) నాకు ఉపదేశమును ఇచ్చుచున్నట్లున్నవి. శాస్త్రములను ఎంతగా కష్టపడి నేర్చినను వాటిని నిరంతరము అధ్యయనము చేయుచు ఉండనిచో అవి మనలో మిగులవు. అంకిత భావముతో రాజును ఎంతగా మెలకువకలిగి సేవించుచున్నను, పూర్తిగా ఆయనను విశ్వసించుటకు వీలులేదు. అట్లే స్త్రీని గూడ మిక్కిలి గాఢముగా ప్రేమతో హృదయమున దాచుకొన్నప్పటికిని ఆమెను భద్రముగా రక్షించుకొనుచుండవలెను. లేనిచో ఆమె దూరమగును. నాయనా! ఈ మనోజ్ఞమైన వసంతవనశోభను చూడుము. ప్రియురాలి తోడులేని నాకు ఇది భయంకరముగా కన్పట్టుచున్నది. (చౌ॥ 1-5)

ప్రియురాలి విరహములో వ్యాకులుడను, దుర్బలుడను, ఒంటరివాడను ఐన నన్ను చూచి, మన్మథుడు వనమును, పక్షులను, భ్రమరములను, తీసికొని వచ్చి, నాపై దండెత్తుచున్నాడు. కాని నేను సోదరునితోగూడియున్నట్లు అతనిదూత తెల్పినమాటలను విని, మన్మథుడు సర్వసన్నద్ధమైన తనసేనను నిలిపి, గుడారములు వేసినాడు.

(దో॥ 37. క,ఖ)

విశాల వృక్షములకు అల్లుకొనినతీగలు అతడు పఱచిన వితానములవలె నున్నవి. అరటి, త్రాటి చెట్లు సుందరధ్వజపతాకములవలె ఒప్పుచున్నవి. వీటిని జూచి, ధీరగంభీర మనస్సు గలవాడు మాత్రమే మోహితుడుగాడు. వివిధవృక్షములు నానావిధఫలపుష్పములతో శోభిల్లుచున్నవి. అవి వేర్వేఱు వస్త్రములను ధరించి, పెక్కు వరుసలలో నిల్చిన ధనుర్ధారులవలె ఉన్నవి. అక్కడక్కడ దూరదూరముగా ఉన్న సుందరవృక్షములు సైన్యమునకు దూరముగా వేర్వేఱుగా గుడారములు వేసికొనిన యోధులవలె ఉన్నవి. కోయిలలకూజితములు ఏనుగులఘీంకారములువలె వినబడుచున్నవి. కొంగలు, అడవి కాకులు, ఒంటెలు, కంచరగాడిదలవలెనున్నవి. నెమళ్లు, చకోరములు, పావురములు, చిలుకలు, హంసలు- ఇవియన్నియును అతనికి శ్రేష్ఠమైన వాహనములు, గుఱ్ఱములు. ఇసుకటిట్టిభములు, పూరేడుపక్షులు అతనిపదాతిదళములు. వాస్తవముగా మన్మథునిసైన్యమును వర్ణింపజాలము. పర్వతశిలలే రథములు. సెలయేఱులే నగారాలు. గోరువంకలు అతనిగుణములను గానముచేయు భట్రాజులు.

భ్రమరముల గీతములు ఈ సైన్యము యొక్క భేరీలు, మేళములు. శీతలమందసుంగధితపవనము అతని దూతగా వచ్చుచున్నది. ఇట్టి చతురంగబలములతో మదనుడు అందఱిని యుద్ధమునకు ఆహ్వానించుచున్నాడు. లక్ష్మణా! మన్మథుని ఈ చతురంగబలమును చూచియు, స్థిరచిత్తుడైయుండెడి వానిప్రతిష్ఠ విశ్వములో ఇనుమడించును. ఈ మదనునకు స్త్రీయే ఒక ప్రబలశక్తి. దానిని అధిగమించినవాడే మహాయోధుడు. (చౌ॥ 1-6)

సోదరా! కామ క్రోధ లోభములు మూడును ప్రబలములైన దుష్టశక్తులు. ఇవి విజ్ఞాననిధులైన మునులనుగూడ క్షణమాత్రమున క్షోభింపజేయును. కోరికలు, దంభము లోభము కామము యొక్క ఆయుధములు. కామమునకు మౌలిక బలము స్త్రీ. క్రోధమునకు బలము కఠోర వచనములు. ఈ విధముగా మునీశ్వరులు నిగ్గుదేల్చి చెప్పినారు. (దో॥ 38. క,ఖ)

శివుడు పల్కుచున్నాడు. "ఓ ఉమా! శ్రీరామచంద్రుడు త్రిగుణాతీతుడు. ఈచరాచర జగత్తునకుకు స్వామి, సర్వాంతర్యామి. అతడు పైవిధముగా పల్కుచు కాముకులదైన్యస్థితిని వివరించెను. స్థిరచిత్తులమనస్సులలో వైరాగ్యమును దృఢతరము చేసెను. కామ, క్రోధ, లోభ, మద, మాయలు శ్రీరామునికృపగలిగిన వానినిదఱిజేరవు. ఆ లీలాపురుషోత్తముడైన రామునిచే అనుగ్రహింపబడిన మనుజుడు మాయకు లోనుగాడు. ఉమా! నీకు నాఅనుభవమును చెప్పుచున్నాను. హరిభజనయే ఏకైకసత్యము. జగత్తు స్వప్నమువలె అసత్యము"- పిమ్మట శ్రీరామచంద్రప్రభువు సుందరమైన, లోతైన పంపాసరోవరతీరమును జేరెను. దాని జలములు సజ్జనుల మనస్సులవలె నిర్మలములు. నలుదెసల కట్టబడిన మెట్లు మిక్కిలి మనోజ్ఞములు. వివిధ జాతులకు చెందిన జంతువులు అందు నీరు త్రాగుచుండెను. అవి ఔదార్యముగల దాతఇంటి ముందుచేరిన అర్థులవలెనుండెను. (చౌ॥ 1-4)

మాయచే కప్పబడిన జీవునకు నిర్గుణపరబ్రహ్మ కనబడనట్లు తామరాకులు విస్తరించి యుండుటవలన ఆ సరోవరమునందలి నీరు వెంటనే కనబడకుండెను. ధర్మమును ఆచరించు పురుషుడు సర్వదా సుఖముగా నుండునట్లు అచటి లోతైన జలములలో చేపలు నిరంతరము హాయిగా నుండెను. (దో॥ 39. క,ఖ)

అందనేకవర్ణములుగల కమలములు వికసించి యుండెను. తుమ్మెదలగుంపులు మధుర ఝంకారములను జేయుచుండెను. జల పక్షులు, హంసలు ప్రభువును కొనియాడుచున్నవా యనునట్లు మధురధ్వనులను కావించుచుండెను. అసంఖ్యాకములైన అచటి చక్రవాకములను, బకములను, ఇతరపక్షులను చూడవలెనేగాని వర్ణింప తరము గాదు. ఆ పక్షులకిలకిలారావములు బాటసారులను ఆహ్వానించుచున్నట్లు ఉండెను. ఆ పంపాసరోవరసమీపమున మునీశ్వరుల ఆశ్రమములు విస్తరించియుండెను. ఆ సరస్సునకు నలువైపుల వనవృక్షములు విలసిల్లుచుండెను. చంపక, వకుళ, కదంబ, తమాల, పాటల, పనస, పలాశ, మామిడి మొదలగు వివిధ వృక్షములు క్రొత్త ఆకులతో, పూవులతో శోభిల్లుచుండెను. వాటిపై తుమ్మెదల గుంపులు ఝంకారములు సేయుచుండెను. సహజములైన చల్లని పిల్లవాయువులు సువాసనలను వెదజల్లుచు వీచుచుండెను. కోయిలలు 'కుహూ కుహూ' రావములను వినిపించుచుండెను. వాటి మధురారావములు మునీశ్వరుల ధ్యానములనుగూడ భంగపఱచుచుండెను. (చౌ॥ 1-5)

పరోపకారియైన పురుషుడు సంపదలను కల్గియుండియు వినమ్రుడై వంగియుండునట్లు అచటి వృక్షములన్నియు ఫలభారములచే నేలను తాకుచుండెను. (దో॥ 40)

## నారదునకు శ్రీరాముని ఉపదేశము

అత్యంత సుందరమైన ఆ సరోవరమును జూచి, శ్రీరాముడు అందు స్నానమాడి సేదదీరెను. పిమ్మట ఒక చక్కని వృక్షచ్ఛాయయందు లక్ష్మణునితోగూడి విశ్రమించెను. అచ్చటికి దేవతలు మునీశ్వరులు వచ్చి, ప్రభువును స్తుతించి,

తమతమ స్థానములకు చేరుకొనిరి. దయాళువైన శ్రీరాముడు ప్రసన్నచిత్తుడై కూర్చొని, లక్ష్మణునకు రసవత్తరగాథలను వినిపింపసాగెను. భగవంతుడైన శ్రీరామచంద్రుడు విరహవ్యాకులుడగుట చూచి, నారద మహర్షి మిగుల వగచెను. "నా శాపమును స్వీకరించుటవలన గదా శ్రీరాముడు పెక్కు కష్టములను సహింపవలసి వచ్చినది! నేను ఇట్టి భక్తవత్సలుని దర్శించుకొనవలెను. మరల నాకు ఈ అవకాశము రాక పోవచ్చును." అని ఆలోచించి, 'మహతి'ని చేతబూని, నారదుడు శ్రీరామునికడకు వచ్చెను. అనేక రీతుల మధుర స్వరముతో ప్రేమానురాగములతో శ్రీరామలీలలను వర్ణించుచు గానము చేసెను. దండ ప్రణామములను ఆచరించిన నారదుని లేవనెత్తి, శ్రీరాముడు అతనినిహృదయమునకు హత్తుకొనెను. కుశల ప్రశ్నలు ముగిసిన పిదప ప్రభువు అతనిని తనయొద్ద కూర్చుండ బెట్టుకొనెను. లక్ష్మణుడు సాదరముగా అతని పాదములను కడిగెను. (చౌ॥ 1-6)

ప్రభువు ప్రసన్నచిత్తుడని గ్రహించి నారదుడు అనేకవిధముల విజ్ఞప్తిచేయుచు, అంజలిఘటించి యిట్లు పలికెను. (దో॥ 41)

"పరమోదారుడవైన రఘునాథా! సామాన్యముగా దుర్లభములైన సుఖప్రదములైన వరములను గూడ నీవు నీ భక్తులకు సులభముగా ప్రసాదించుచుందువు. స్వామీ! నీవు అంతర్యామివి. సర్వజ్ఞుడవు. ఐనను నేను నిన్నొక వరమునడిగెదను. దానిని అనుగ్రహింపుము"- శ్రీరాముడు పలికెను. "మునీశ్వరా! నీకు నా స్వభావము తెలియును. నేను ఎప్పుడైనను నా భక్తులకడ దేనినైనను దాచితినా? మహర్షీ! నీవు అడుగదగని నాకు ప్రియమైన వస్తువేది? నా భక్తులకు దేనినైనను ఇచ్చెదను. ఈ మాటను సంతతము విశ్వసింపుము"- అప్పుడు నారదుడు ప్రసన్న చిత్తుడై పలికెను. నేనుచొరవతో ఒక వరమును అడుగుచున్నాను. ప్రభునామములు అనంతములనియు, అవి ఒక దానికంటె మఱియొకటి శ్రేష్ఠములనియు వేదములు చెప్పుచున్నవి. కాని 'రామనామము' సర్వ శ్రేష్ఠము అగుగాక. ఈ వరమును ప్రసాదింపుడు. అది పాపములనెడిపక్షులను రూపుమాపుటలో వేటగాని వంటిది. (చౌ॥ 1-4)

మీ భక్తియే పున్నమరాత్రి. భక్తులనిర్మలహృదయాకాశమున 'రామనామము' పూర్ణచంద్రుడై విలసిల్లుచుండగా మిగిలిన నామములు తారకలుగా ప్రకాశించు గాక." దయా సింధువైన శ్రీరాముడు "అట్లే కానిమ్ము" అని పల్కెను. నారదుడు హర్షోల్లసితమనస్కుడై ప్రభుచరణములకు ప్రణమిల్లెను. (దో॥ 42. క,ఖ)

అంతట శ్రీ రఘువరుడు అత్యంతప్రసన్నుడని గ్రహించి, నారదుడు మృదుమధురముగా పల్కెను. "రామా! రఘునాథా! వినుము. నీవు నీ మాయను పురమాయించి, నన్ను మోహవశునిగా జేసినప్పుడు నాకు వివాహేచ్ఛ ఏర్పడెను. కాని ప్రభూ! నన్ను వివాహమాడనీయని కారణమేమి?" ప్రభువు పలికెను. "మునీశ్వరా! వినుము. నేను ప్రసన్నుడనై చెప్పుచున్నాను. సమస్తమైన ఆశలను వదలుకొని, అనన్యభక్తితో నన్ను ఆరాధించు వారిని 'తల్లి తనసంతానమునువలె' సర్వదా రక్షించెదను. శిశువు అగ్నినిగాని, సర్పమును గాని తాకుటకు ప్రయత్నించినపుడు తల్లి వానిని ఆ ప్రమాదమునుండి తప్పించును. ఆ సుతుడు పెద్దవాడైన పిమ్మటగూడ తల్లికి అతనిపై ప్రేమయుండును. కాని మునుపటి వలెగాదు. ఏలనన అతడు తల్లిపై ఆధారపడక తనను తాను రక్షించు కొనుచుండును. జ్ఞానులైన భక్తులు నాకు ప్రౌఢులైన కుమారులతో సమానులు. నీ వంటి భక్తులు నాకు శిశువులు. ఇట్టివారిభారమును నేనే వహించుచుందును. జ్ఞానులు తమబలముపైననే ఆధారపడుదురు. కామక్రోధములనెడిశత్రువులు ఇరువురికిని సమానములే. కాని ఈ శత్రువులను తుదముట్టించి, నా పరమభక్తులను రక్షించుభారము నా మీదనే యుండును. ఏలనన వారు నాపైననే భారము ఉంచుదురు. జ్ఞానులు ఆ అంతశ్శత్రువులను తామే ఎదుర్కొందురు. ఇట్లు యోచించి, విజ్ఞానులు నన్నే భజించు చుందురు. జ్ఞానమును పొందినను వారు నా భక్తిని వీడరు. (చౌ॥ 1-5)

కామ, క్రోధ, లోభ, మదములు మోహమునకు ప్రబలసైన్యములు. ఇందు అత్యంత దుఃఖమును కల్గించునది 'మాయ' అనెడి తరుణి. (దో॥ 43)

మునీశ్వరా! మోహరూపమైన వనమును పల్లవితము, పుష్పితము గావించుటకు 'స్త్రీ' వసంత ఋతువు వంటిది-అని. వేద పురాణములు, సజ్జనులు ప్రకటించి యుండుట లోకవిదితము. ఆ 'స్త్రీ'యే మఱల గ్రీష్మఋతువై జప, తపో నియమములనెడి జలాశయములను ఎండిపోవునట్లుగా చేయును. కామక్రోధ మద మాత్సర్యములనెడి కప్పలకు ఆలంబనమై హర్షమును గూర్చు వర్షరూప స్త్రీగూడ ఆ మాయయే. చెడు సంస్కారములనెడి కుముదములను పోషించు శరదృతువుగూడ ఆ స్త్రీయే. ధర్మములన్నియును కమలములు. మందబుద్ధియైన ఈ మాయ యనెడు స్త్రీయే హేమంత ఋతురూపమున వాటిని కష్టపెట్టును. మమత యనెడు యవాస (దురదగొండి) వనమున శిశిర ఋతువై హరితమొనర్చును. పాపములనెడి గుడ్లగూబలకు సుఖమును గూర్చుటలో ఈ స్త్రీ నిబిడాంధకార నిశీధమగును. బుద్ధి, బలము, శీలము, సత్యము- అను చేపలను పట్టుకొని చంపుటకు ఈ స్త్రీ-గాలము వంటిదని విద్వాంసులు నుడివెదరు. (చౌ॥ 1-4)

యౌవనములో నున్న స్త్రీ అన్ని దోషములకును మూలము. సకల బాధలకును దుఃఖములకును నిధానము. కావున మునీశ్వరా! ఇదియంతయును ఆలోచించియే నేను నిన్ను వివాహమాడనీయ లేదు- (దో॥ 44)

శ్రీరామచంద్రుని మనోజ్ఞ వచనములను విని, నారదుడు పులకిత గాత్రుడాయెను. నేత్రములలో ఆనందాశ్రువులు నిండెను. అతడు మనస్సులో ఇట్లనుకొనెను. "సేవకునిపై ఇంతటి ప్రేమాభిమానములను చూపెడి స్వామి మఱియెవ్వరునూ లేరు. సాంసారిక భ్రమలలో పడి ఈ స్వామిని భజింపని వారు అజ్ఞానులు, మందబుద్ధులు, భాగ్యహీనులు. పిమ్మట నారదమహర్షి సాదరముగా పలికెను. "ఓ విజ్ఞాననిధానా! రామా! జనన మరణ భయమును తొలగించు స్వామీ! రఘువీరా! దయచేసి సజ్జనులలక్షణములను తెల్పగలరు." శ్రీరాముడు నుడివెను. "మునీశ్వరా! వినుము. కామక్రోధలోభమోహ మదమాత్సర్యములనెడి ఆఱు అంతశ్శత్రువులను జయించిన వారు, పాపరహితులు, నిష్కాములు, స్థిరబుద్ధులు, సర్వస్వత్యాగులు, బాహ్యాంతశ్శుద్ధిగలవారు, సుఖధాములు, అపార జ్ఞానులు, ఇచ్ఛారహితులు, అల్పాహారులు, సత్యప్రతిజ్ఞులు, కవివతంసులు, యోగులు, సావధానులు, ఇతరులను గౌరవించువారు, అభిమానరహితులు, ధైర్యవంతులు, ధర్మ మార్గాచరణకుశలురు ఐన వారు సజ్జనులు. వీరికి నేను వశుడను. (చౌ॥ 1-5)

వీరు గుణనిధులు, సంసారదుఃఖరహితులు, విగతసందేహులు, ఇట్టి సజ్జనులకు నా చరణకమలములుతప్ప తమశరీరములు గాని, ఇండ్లు వాకిళ్లు గాని ప్రియములు గావు. (దో॥ 45)

వీరు తమగుణ ప్రశంసలను వినుటకు ఇష్టపడరు. కాని ఇతరుల సుగుణములను విని మిక్కిలి సంతోషపడుదురు. శత్రుభావమును చూపెడివారియందును మిత్రభావము కలిగి యుండువారియందును సమానభావముతోనుందురు, శాంతచిత్తులు, న్యాయవర్తనులు, సరళస్వభావులు, అందఱిపైనను ప్రేమ గలిగియుందురు. జపతపోవ్రతశమదమాది నియమ పాలన నిరతులు. శ్రీ మహా విష్ణువును, గురువును, బ్రాహ్మణ చరణములను భక్తితో సేవించెదరు. శ్రద్ధయు, క్షమయు, మైత్రియు, దయయు, ప్రసన్నతయు, నాచరణములయందు గాఢానురాగము వారికి సహజములు. అట్లే వైరాగ్యము, వివేకము, వినయము, విజ్ఞానము వేదపురాణయథార్థజ్ఞానము కలిగియుందురు. దంభము, అభిమానము, అహంకారము అనునవి వారిని దరిజేరవు. పొరపాటునగూడ అపమార్గమున అడుగిడరు. వారు నిరంతరము నా లీలలనే విందురు. వాటిని గానముచేయుదురు.

నిస్స్వార్థముగా ఇతరులహితమునందే తత్పరులై యుందురు. మునీశ్వరా! వినుము. సాధువులగుణములను ఆ వేదములు గాని, సరస్వతీ దేవి గాని వర్ణింప జాలరు. (చౌ॥ 1-4)

సజ్జనుల గుణములను సరస్వతీ దేవియు, శేషుడును వివరింపజాలరు." ఈ మాటలను విని నారదుడు శ్రీరామచరణములకు ప్రణమిల్లెను. దీనబంధువు, దయాళువు ఐన ప్రభువు- ఈ విధముగా భక్తుల గుణములను తాను స్వయముగా వివరించెను. నారదుడు శ్రీరామునిపాద పద్మములకు పదే పదే నమస్కరించి, బ్రహ్మ లోకమును జేరెను. తులసీదాసు చెప్పుచున్నాడు. సంసారమునందు ఆసక్తిని వీడి, కేవలము శ్రీహరిభక్తిలోనే అనురక్తులై యుండువారు ధన్యాత్ములు. (ఛం)

రావణారియైన శ్రీరాముని పవిత్రయశమునుగూర్చి, వినెడి వారును, గానము చేయువారును, జప, యోగ, వైరాగ్యములు లేకున్నను శ్రీరామునియందు దృఢమైన భక్తిని గలిగియుందురు. యువతితనువు దీపశిఖ వంటిది. ఓ మనసా! నీవు దానికి శలభము గావలదు. విషయ సుఖములపై కోరికలను, గర్వమును, త్యజించి, శ్రీరామచంద్రుని భజింపుము. సర్వదా సజ్జనసాంగత్యమును కల్గియుండుము- (దో॥ 46. క,ఖ)

(మాసపారాయణము-ఇఱువది రెండవ విరామము)

*కలియుగ పాపములను అన్నింటిని విధ్వంసమొనర్చు, శ్రీరామచరితమానసము నందలి*

మూడవ సోపానము సమాప్తము

- అరణ్యకాండము సమాప్తము -



అగ్నిసాక్షిగా శ్రీరామ సుగ్రీవుల మైత్రి

# శ్రీ రామచరిత మానసము

## చతుర్థ సోపానము - కిష్కింధాకాండము

## దైవస్తుతి

మల్లెపూలవలె గౌరవర్ణ శోభితుడు లక్ష్మణుడు. నల్లకలువలవలె శ్యామవర్ణ భూషితుడు శ్రీరామచంద్రుడు. వారు బలశాలురు, విజ్ఞానఖనులు, శోభా సంపన్నులు, శ్రేష్ఠ ధనుర్ధారులు, వేదములచే స్తుతింపబడువారు. గోబ్రాహ్మణులకు ప్రియమైనవారు, మాయామానుషవిగ్రహులు, ధర్మపరిరక్షకులు అందరికిని హితమొనర్చువారు. సీతాన్వేషణతత్పరులైపథికులైయున్న ఆ శ్రీరామలక్ష్మణులిద్దఱును మనకు (లోకమునకు) నిశ్చయముగా భక్తి ప్రపత్తులను ప్రసాదించుదురుగాక. (1)

శ్రీరామనామామృతము వేదములనెడి సముద్రమును మథించుటవలన ఉత్పన్నమైనది, కలికల్మషములను రూపుమాపునది, శాశ్వతమైనది, పరమ శివుని యొక్క అత్యంత సుందరమైన ముఖచంద్రునియందు సర్వదా శోభిల్లునది (పరమశివునిచే సతతము జపింపబడునది), భవ (జనన మరణములనెడి) రోగముల పాలిటి దివ్యౌషధము, సుఖ ప్రదము, శ్రీ జానకీదేవికి ప్రాణప్రదమైనది. అట్టి మహిమాన్వితమైన శ్రీరామనామామృతమును ఎల్లప్పుడును ఆస్వాదించునట్టి పుణ్యాత్ములు నిజముగా ధన్యులే. (2)

పార్వతీపరమేశ్వరులకు నిత్యనివాసస్థానమైన కాశీక్షేత్రము మోక్షమునకు పుట్టిల్లు, జ్ఞానమునకు గని. పాపములను హరించునట్టిది- అని ఎఱింగిన వారు ఆ క్షేత్రమును సేవింపకుండ ఎట్లుండగలరు? అనగా తప్పకసేవింతురు. సకలదేవతాగణములను దహించివేయుచున్న భయంకరవిషమును కృపాసింధువైన శంకరుడు పానముచేసి వారినికాపాడెను. ఓ మూఢమనసా! అట్టి దయామయుడైన శంకరుని నీవు ఏల భజింపవు? (సోరఠ)

## శ్రీరామహనుమత్ సమాగమము - సుగ్రీవమైత్రి

శ్రీరఘునాథుడు ఆ పంపాసరోవరతీరమున ముందునకు సాగుచు ఋష్యమూకపర్వతమును సమీపించెను. ఆ పర్వతము మీద సుగ్రీవుడు తనమంత్రులతోగూడి, నివసించుచుండెను. అతులిత బలశాలురైన శ్రీరామలక్ష్మణులరాకను గమనించి, సుగ్రీవుడు అత్యంతభయాందోళనలకు లోనై ఇట్లు పలికెను. "ఓ ఆంజనేయా! ఈ పురుషులు ఇరువురును అపూర్వరూపబలసంపన్నులు. నీవు బ్రహ్మచారి వేషమున వారికడకు పొమ్ము. వారియథార్థమనోభావములను తెలిసికొని, సంకేతము ద్వారా నాకు తెలియజేయుము. ఒకవేళ వారు మలినమనస్కులైన వాలిచే పంపబడియున్నచో వెంటనే నేను ఈ పర్వతమునువీడి పాఱిపోయెదను." హనుమంతుడు బ్రాహ్మణ వేషమును ధరించి, అచ్చటికి పోయి, వందనమాచరించి, ఈ విధముగా అడిగెను. "శ్యామ, గౌరవర్ణ తను శోభితులైన వీరులారా! మీరెవ్వరు? క్షత్రియవేషధారులై వనములలో ఏల తిరుగుచున్నారు? స్వామీ! కఠికినేలపై సుకుమారమైన పాదములతో కాలినడకన సంచరించుటకుగల కారణమేమి? మీ

కోమలమనోహరసుందరశరీరములు ఈ అడవులలో దుస్సహమైన ఎండను గాలిని ఎట్లు సహించుచున్నవి? మీరు బ్రహ్మ విష్ణు మహేశ్వరులలోనివారా? లేక నరనారాయణులా? (చౌపాఈ॥ 1-5)

మీరు జగత్తునకు మూలకారణమై, అఖిలలోకములకు ప్రభువులైన భగవత్స్వరూపులా? లోకములను భవసాగరమునుండి ఉద్ధరించుచు, పృథ్వీభారమును బాపుటకై మానవులుగా అవతరించి వచ్చినవారా?

(దోహా॥ 1)

శ్రీరామచంద్రుడు ప్రత్యుత్తరమిచ్చెను. "మేము కోసలదేశాధిపతియైన దశరథునికుమారులము. తండ్రిగారిఆజ్ఞతో వనములకు వచ్చితిమి. నా పేరు రాముడు, ఇతడు లక్ష్మణుడు. మేము సోదరులము. మాతోపాటు ఒక సుకుమారసుందరస్త్రీ యుండెడిది. ఆమె విదేహరాజైన జనకునికూతురు, నా భార్య. ఆమెను ఈ వనములో ఎవడో ఒక రాక్షసుడు అపహరించినాడు. ఓ బ్రాహ్మణోత్తమా! మేము ఆమెను వెదకుచు, తిరుగుచున్నాము. నేను మా కథను వివరించితిని. నీవు నీ వృత్తాంతమును వినిపింపుము." తన ఆరాధ్యదైవమైన శ్రీరాముని గుర్తించి, ఆంజనేయుడు ఆయనచరణములపై వ్రాలెను. (శివుడు పల్కుచున్నాడు) ఉమా! మారుతిఆనందానుభూతిని వర్ణింపజాలము. అతనితనువు పులకరించెను. నోటమాట పెగలకపోయెను. తనప్రభువు యొక్క సుందరసురుచిరరూపమును జూచుచు నిలబడిపోయెను. తన స్వామిని గుర్తింపగల్గినందున అతనిహృదయము ఆనందముతో ఉప్పొంగెను. పిమ్మట ధైర్యము వహించి, స్తుతించుచు పలికెను. "స్వామీ! నేనడుగుట న్యాయమే. ఏలనన చాలాకాలము తరువాత నాకు మీ దర్శనమైనది. అదియును మునివేషములలో- కనుక నా వానరబుద్ధి మిమ్ము గుర్తింపలేకపోయినది. కాని మీరు 'సర్వాంతర్యామి' అయ్యును మనుష్యమాత్రులవలె అడుగుచున్నారు. మీ మాయా ప్రభావమునకు లోనై నా ప్రభువును నేను గుర్తింపలేకపోయితిని. (చౌపాఈ॥ 1-5)

నేను మందబుద్ధిని, మోహవశుడను, కుటిలహృదయుడను, అజ్ఞానిని. (కావున మిమ్ము గుర్తింపనైతిని) కాని దీనబంధూ! నన్ను మీరు మఱచినారా? ప్రభూ! (దో॥ 2)

స్వామీ! నాలో పెక్కుదోషములు గలవు. మీరు యజమానులు. నేను సేవకుడను. సేవకుడు యజమానివిస్మృతికి గురికాడుగదా! ప్రభూ! మీ మాయవలన మోహితుడైన జీవుడు మీ అనుగ్రహముచేతనే తరింపగలడు. అదియును గాక ఓ రఘువీరా! 'భజన' మొదలగు సాధన రీతులను నేనెఱుగను. పుత్రుడు తనతల్లిపై విశ్వాసమును ఉంచినట్లు, సేవకుడు తనస్వామిపై విశ్వాసముంచి, నిశ్చింతగా ఉండును. సేవకుని పాలన-పోషణభారములు ప్రభువుపైననే యుండును." అని నుడివి, హనుమంతుడు వ్యాకులపాటుతో స్వామిపాదములపైబడి, నిజరూపమును ప్రకటించెను. అతని హృదయము ప్రేమతో నిండెను. రఘునాథుడు అతనిని లేవనెత్తి హృదయమునకు హత్తుకొనెను, ఆనందాశ్రువులచే తడిపి, అతనిని చల్లబఱచుచు, శ్రీరాముడు వచించెను. "ఓ వానరోత్తమా! నీవు మనస్సులో బాధపడవలదు. నాకు నీవు లక్ష్మణుని కంటెను మిక్కిలి ప్రీతిపాత్రుడవు. అందఱును నన్ను 'సమదర్శి' యందురు. కాని సేవకులే నాకు ఎక్కువ ప్రియమైనవారు. ఏలనన వారు అనన్యభక్తితో నాపైననే ఆధారపడియుందురు. (చౌ॥ 1-4)

ఓ హనుమంతుడా! 'నేను సేవకుడను. ఈ జడచేతనములన్నియును భగవంతుని రూపములే' అను నిశ్చయమును గలిగి, నిశ్చలబుద్ధితో దానిపైననే దృఢముగా నుండువానిని 'అనన్య సేవకుడు' అనియందురు.

(దో॥ 3)

స్వామి ప్రసన్నుడుగా ఉండుట చూచి, హనుమంతుడు లోలోన హర్షితుడాయెను. అతని దుఃఖము మాయమాయెను. అంతట అతడు పలికెను. "స్వామీ! ఈ పర్వతముపై సుగ్రీవుడు అను వానరరాజు ఉన్నాడు. అతడు మీకు దాసుడు. అతనితో చెలిమి చేయుడు. దీనుడైన అతనిని భయరహితుని గావింపుడు. అతడు అన్నిదిశలకును తనవానరసైన్యములను బంపి, సీతాదేవిని వెదకించును." ఈ విధముగా అన్ని విషయములను వివరించి, హనుమంతుడు రామలక్ష్మణులను తనవీపుపై ఎక్కించుకొని, సుగ్రీవునిచెంతకు జేర్చెను. సుగ్రీవుడు శ్రీరామచంద్రుని జూచి, తన జన్మ ధన్యమైనట్లు భావించెను. అతడు శ్రీరాముని సాదరముగా గలిసి, ఆయన చరణములకు నమస్కరించెను. రామలక్ష్మణులు అతనిని కౌగలించుకొనిరి. అప్పుడు కపీశ్వరుడైన సుగ్రీవుడు తన మనస్సులో "ఓ విధాతా! వీరు నాతో చెలిమి చేయుదురా?" అని యోచించెను. (చౌ॥ 1-4)

హనుమంతుడు ఇరుపక్షములవృత్తాంతములను వినిపించి, 'అగ్ని' సాక్షిగా ఆ ఉభయులమధ్య ప్రీతి పూర్వకముగా దృఢమైన మైత్రిని గూర్చెను. (దో॥ 4)

ఇద్దఱిమధ్య మైత్రి ఏర్పడిన పిదప, అరమరికలు లేని అన్యోన్యస్థితి కుదురుకొనెను. అప్పుడు లక్ష్మణుడు శ్రీరామచంద్రునిగాథను సుగ్రీవాదులకు వినిపించెను. సుగ్రీవుడు కంటనీరు పెట్టి "స్వామీ! మిథిలాధీశుని కుమార్తెయగు జానకీదేవిజాడ తప్పక దొరకగలదు" అని పలికెను. "ఒకసారి మంత్రులతోపాటు కూర్చొని నేనిచట ఒక విషయమునుగూర్చి చర్చించుచుంటిని. అప్పుడు నిస్సహాయురాలై, దీనముగా విలపించుచు ఆకాశమార్గమున సీతాదేవి పోవుచుండుటను నేను గమనించితిని ఆమె రామా! రామా! హే రామ! అని విలపించుచు మమ్ములను జూచి, ఒక వస్త్రమును పడవేసెను." శ్రీరాముని కోరికపై సుగ్రీవుడు వెంటనే (ఆభరణములు గల) ఆ వస్త్రమును తెప్పించి యిచ్చెను. దానిని తనహృదయమునకు హత్తుకొని, శ్రీరామచంద్రుడు విరహతాపమునకు లోనయ్యెను. సుగ్రీవుడు పలికెను. "రఘువీరా! చింతింపకుడు. నిబ్బరముగా నుండుడు. నేను అన్నివిధముల మీ సేవలు చేసెదను. జానకీ దేవి మిమ్ము చేరునట్లు అన్ని ఉపాయములను నడిపెదను. (చౌ॥ 1-4)

దయాసాగరుడును, అమితబలశాలియు అగు శ్రీరాముడు మిత్రుడైన సుగ్రీవుని వచనములను విని, సంతోషముతో ఇట్లనెను. "సుగ్రీవా! నీవు ఈ వనమున ఉండుటకు కారణమేమి? తెల్పుము."- (దో॥ 5)

సుగ్రీవుడు ప్రత్యుత్తరమిచ్చెను. "స్వామీ! వాలి, నేను అన్నదమ్ములము. మా అన్యోన్యానురాగములు వర్ణనాతీతములు. 'మయుడు' అను దానవుని కుమారుడైన 'మాయావి' అనువాడు ఒకసారి మా కిష్కింధా నగరమునకు వచ్చెను. వాడు అర్ధరాత్రి నగరద్వారమున నిలబడి, యుద్ధమునకు రమ్మని వాలిని పిలిచెను. శత్రుబలమును సహింపని వాలి వానితో యుద్ధము చేయుటకు వెడలెను. అతనిని జూచి మాయావి పిక్కబలము జూపెను. నేనును నా అన్నను అనుసరించితిని. ఆ మాయావి ఒక కొండగుహలో దూరెను. అంతట వాలి "సుగ్రీవా! ఒక పక్షము దినములు ఇచటనే యుండి నాకొఱకై నిరీక్షించుచుండుము. నేను తిరిగి రానిచో మృతిచెందినట్లు భావింపుము." అని ఆదేశించి, అతడు ఆ గుహలోనికి వెళ్లెను. ఓ ఖరారీ! నేనచట నెలదినములు అతనికై నిరీక్షించితిని. ఆ గుహనుండి రక్తము ప్రవాహముగా రాసాగెను. ఆ మాయావి వాలిని చంపినట్లు అప్పుడు నేను తలంచితిని. వాడు బయటికి వచ్చినచో నన్నును చంపును అని భావించితిని. కనుక గుహద్వారమునకు ఒక పెద్ద బండను అడ్డువేసి, పరుగెత్తుకొని వచ్చితిని. రాజులేని నగరమును జూచి, పట్టుబట్టి మంత్రులు నన్ను కిష్కింధకు రాజును చేసిరి. కాని వాలి ఆ మాయావిని చంపి, కొలదినముల తరువాత తిరిగి వచ్చెను. రాజ సింహాసనముపై నన్ను

జూచి, అతడు మనస్సులో నాయెడ విరోధమును పెంచుకొనెను. (రాజ్యలోభముచే అతడు గుహనుండి బయటికి రాకుండ నేను గుహద్వారమును పెద్దబండతో మూసి వచ్చి, రాజ్యాధికారమును చేజిక్కించు కొంటినని అతడు తలంచెను) అతడు నన్ను శత్రువుగా భావించి, తీవ్రముగా కొట్టెను. నా సర్వస్వమును లాగికొనెను. నా భార్యనుగూడ హరించెను. ఓ కృపాళూ! రఘువీరా! అతనికి భయపడి, అన్నిలోకములలోను వ్యాకులపాటుతో తిరిగితిని. మతంగముని శాపకారణమున అతడు ఈ గిరిపైకి రాజాలడు. ఐనను నేను ఎల్లప్పుడు భయపడుచునే యుందును." సేవకుని దుఃఖగాథను విని, దీనబాంధవుడైన శ్రీరామునియొక్క భుజములు రెండును అదిరెను. (ఇది శ్రీరాముని శూరలక్షణమును, వాలిని శిక్షించుటకై అతని నిశ్చయమును సూచించును.) (చౌ॥ 1-7)

# వాలి వధ

శ్రీరాముడిట్లు వచించెను. "సుగ్రీవా! వినుము. నేను ఒకే ఒక్కబాణముతో వాలిని వధించెదను. అతనిని బ్రహ్మరుద్రాదులుగూడ కాపాడలేరు. (దో॥ 6)

మిత్రునిదుఃఖమును గాంచి, దుఃఖింపని వానిని జూచినచో మహాపాపము అంటును. తన కొండంతదుఃఖమును ధూళివలెను, ధూళితో సమానమైన మిత్రునిదుఃఖమును మేరు పర్వతమంతగాను చూడవలెను. సహజముగా ఇట్టి లక్షణము లేని వాడు శఠుడు, అట్టివాడు పూనిక వహించి ఎవ్వరితోనైనను మైత్రి చేసి, ఏమి ప్రయోజనము? చెడుమార్గమున బోవుచున్న మిత్రుని ఆపి, మంచిమార్గమునకు మఱల్చుట మిత్రధర్మము. ఎవ్వడైనను తనమిత్రుని గుణములనే ప్రకటింప వలయును. దోషములను దాచవలెను. సంశయములకు తావీయక ఇచ్చిపుచ్చుకొను చుండవలెను. సర్వదా అతనికి తనశక్తికొలది మేలే చేయవలెను. ఆపదకాలమునందు మిత్రుని ఎక్కువగా ఆదుకొనవలెను. ఇవి మంచిమిత్రుని లక్షణములు-అని వేదములు నుడువుచున్నవి. ఎదురుగా ఇచ్చకపుమాటలాడి, పరోక్షమున కీడు తలపెట్టు వాడు కుటిలమనస్కుడు. సోదరా! అట్టి వాని మనస్సు పామునడకవలె వంకరటింకరగా నుండును. అట్టి కుటిలుని విడిచిపెట్టుటయే మంచిది. మూర్ఖుడగు సేవకుడు, కృపణుడైన రాజు, కులటయైన భార్య, కపటి యైన స్నేహితుడు- ఈ నలుగురు శూలములవలె దుఃఖములను కలిగించువారు. మిత్రమా! నీకు అండగా నేనున్నాను. నా బలమును విశ్వసింపుము. నీవు చింతింపవలదు. నేను అన్నివిధముల నీకు సహాయపడెదను."

అపుడు సుగ్రీవుడు, "రఘువీరా! వాలి మిక్కిలి బలశాలి. యుద్ధములో అత్యంతధీరుడు, వీరుడు" అని పలికి శ్రీరామునకు 'దుందుభి' అనురాక్షసుని ఎముకలను, సప్తతాళవృక్షములను జూపెను. శ్రీ రఘునాథుడు వాటిని అవలీలగనే పడగొట్టెను. అపారమైన శ్రీరామబలమును జూచి, సుగ్రీవునకు ఆయనపై ప్రేమ ఇనుమడించెను.ఆయన తప్పక వాలిని వధింపగలడను విశ్వాసము బలపడెను. శ్రీరాముని భగవంతునిగా ఎఱింగి, సుగ్రీవునిమనస్సు హర్షోల్లసితమయ్యెను. ప్రభుచరణములకు పదేపదే సాగిలపడెను. జ్ఞానోదయమైన సుగ్రీవుడు ఇట్లు పలికెను. "ప్రభూ! మీ కృపవలన నాకు చిత్తస్థైర్యము చేకూరినది. సుఖసంపదలు, పరివారము, వైభవము, అన్నింటికిని తిలాంజలులనిచ్చి, మీ సేవ చేసెదను. ఏలనన ఇవి అన్నియును శ్రీరాముని భజించుటకు ఆటంకములని మహాత్ములు పల్కుదురు. జగత్తులో శత్రుమిత్రులు, సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వములు మాయచే ఏర్పడుచుండును. వాస్తవముగ అవిలేవు. శ్రీరామా! వాలి నాకు గొప్ప మేలునే చేసినాడు. అతని కృపవలననే శోకనివారకమగు మీ దర్శనభాగ్యము కలిగినది. ఇంతటి మేలునకు కారణమైన అతనితో స్వప్నమున యుద్ధము చేసినను మేల్కొన్న పిదప నాకు 'సిగ్గు'

గల్గును. ప్రభూ! నేనన్నింటిని త్యజించి రాత్రింబవళ్లు మీ సేవలకే అంకితమగునట్లు కృపజూపుడు" సుగ్రీవుని(క్షణిక) వైరాగ్యమును జూచి,అతని వచనములను విని, ఆ కోదండరాముడు చిరునవ్వుతో ఇట్లనెను. "నీవు చెప్పినదంతయు నిజమే. కాని మిత్రమా! నామాట అసత్యముకానేరదు. (అనగా వాలి వధింపబడుట నీవు రాజగుట తథ్యము) కాకభుశుండి పల్కుచున్నాడు. "వైనతేయా! కోతులను ఆడించునట్లు, శ్రీరాముడు అందఱిని ఆడించును- అని వేదములు నుడువుచున్నవి." సుగ్రీవుని వెంటబెట్టుకొని ధనుర్బాణములను చేతధరించి, శ్రీరాముడు బయలుదేఱెను. అతడు వాలిని యుద్ధమునకు ఆహ్వానించుటకై సుగ్రీవుని పంపెను. శ్రీరాముని అండదండలను చూచుకొని, అతడు వాలికడకు వెళ్లి గర్జించెను. ఆ గర్జనను విని, వాలి క్రోధముతో వేగముగా పరుగు పరుగున వచ్చెను. అతని భార్యయైన తార అయనపాదములను పట్టుకొని ఇట్లు నచ్చజెప్పెను. "నాథా! వినుడు. సుగ్రీవునితో మైత్రి చేసిన వారిద్దఱును, అమితబలపరాక్రమశాలురు. వారు కోసలరాజైన దశరథుని పుత్రులు రామలక్ష్మణులు. యుద్ధమున వారు కాలునిగూడ జయింపగలరు. (చౌ॥ 1-15)

వాలిపలికెను "ఓ ప్రియురాలా! పిరికిదానా! వినుము. శ్రీ రఘునాథుడు సమదర్శి. ఒకవేళ నేను అతనిచే వధింపబడినను మోక్షప్రాప్తి కలుగును." (దో॥ 7)

ఇట్లు పలికి దురభిమానియైన వాలి సుగ్రీవుని గడ్డిపోచక్రింద జమకట్టి వచ్చెను. ఇద్దఱును పోరుకుదిగిరి. వాలి భయంకరములైన ముష్టి ప్రహారములతో సుగ్రీవుని శరీరమును నుగ్గునుగ్గు గావించి గర్జించెను. ఆ దెబ్బలు అతనికి వజ్రఘాతములయ్యెను. సుగ్రీవుడు వ్యాకులుడై పలాయనము చిత్తగించి, రామునిచెంతజేరి పలికెను. "కృపాళూ! రఘువీరా! వాలినాకు సోదరుడుగాడు. నా పాలిటియముడు-అని చెప్పి యుంటినిగదా!" అప్పుడు శ్రీరాముడు నుడివెను. "మీ సోదరులిరువురిరూపములు ఒకేపోలిక గలిగి యున్నవి. భ్రమకారణమున నేనతనిని సంహరింపలేదు". సుగ్రీవుని శరీరమును శ్రీరాముడు తన కరస్పర్శతో వజ్రతుల్యము గావించెను. అతని బాధయంతయు మాయమయ్యెను. అప్పుడు శ్రీరాముడు సుగ్రీవుని మెడలో ఒక పూలమాల వేసి, గొప్ప బలమునిచ్చి పంపెను. ఇద్దఱిమధ్య అనేకవిధముల ద్వంద్వ యుద్ధము కొనసాగెను. శ్రీరాముడు చెట్టుచాటుననుండి అంతయు చూచుచు ఉండెను. (చౌ॥ 1-4)

సుగ్రీవుడు అనేకమాయోపాయములను, బలమును ఉపయోగించెను. కాని కడకు ధైర్యమును కోల్పోయి, ప్రాణములపై ఆశ వదలుకొనెను. అప్పుడు శ్రీరాముడు బాణమును సంధించి, వాలి గుండెకు గురిచూచి కొట్టెను. (దో॥ 8)

బాణము తగులగానే వాలి మిక్కిలి బాధతో నేలకొఱిగెను. కాని తన యెదుట శ్రీరామచంద్ర ప్రభువును గాంచి, లేచి కూర్చుండెను. పిమ్మట నీలమేఘశ్యాముడు, జటాజూటధారి, ఎఱ్ఱని నేత్రములు గలిగి, ధనుర్బాణములను ధరించిన భగవంతుని తదేకదృష్టితో చూచుచు, వాలి తన చిత్తమును ఆయన చరణములపై చేర్చెను. ప్రభువును గుర్తించి, తనజన్మ ధన్యమైనదని తలంచెను. అతనిహృదయము భక్తిపూర్ణమయ్యెను. కాని మాటలు కఠినములయ్యెను. అతడు శ్రీరాముని గాంచి యిట్లు నుడివెను. "స్వామీ! ధర్మరక్షణకై నీవు అవతరించితివి. ఒక వేటగాని వలె చెట్టుచాటున దాగి, బాణముతో నన్ను కొట్టితివి. నేను వైరినా? సుగ్రీవుడు నీకు ప్రియుడా? స్వామీ! ఏ అపరాధము చేసినందులకు నన్ను శిక్షించితిరి?" శ్రీరాముడు సమాధాన మిచ్చెను. "మూర్ఖుడా! వినుము. తమ్ముని భార్య, సోదరి, కోడలు, వీరు కూతిరితో సమానలు. వీరిని చెడు దృష్టితో చూచినవానిని చంపుట పాపము గాదు.

మూఢుడా! నీవు చాల దురభిమానము గలవాడవు. నీ భార్య చెప్పిన హితవచనములను నీవు పెడచెవిన బెట్టితివి. సుగ్రీవుడు నా భుజబలమును ఆశ్రయించినాడని తెలిసియు, దురహంకారముతో నీవు అతనిని చంపగోరితివి.
(చౌ॥ 1-5)

వాలి పలికెను. "శ్రీరామా! వినుము. నీవంటి స్వామికడ నా తెలివితేటలు పనికిరావు. ప్రభూ! అంత్యకాలమున నీ శరణుజొచ్చిన నేను ఇప్పుడు గూడ పాపినేనా? తెలుపుము. (దో॥ 9)

వాలి పలికిన వినమ్రవచనములను విని, శ్రీరాముడు అతనితలను తనచేతితో నిమిరి ఇట్లనెను. "నేను నీ శరీరమును సజీవముగా ఉంచెదను. నీవు ప్రాణములతో ఉండుము" అందులకు వాలి "ఓ కృపానిధీ! మునులు పెక్కు జన్మలలో తీవ్ర తపస్సులొనర్చినను అవసాన దశలో వారి నోటినుండి రామనామము రాకపోవచ్చును. రామనామ ప్రభావముచే శంకరుడు కాశీ క్షేత్రమున అందఱికిని సమానముగా శాశ్వతమైన మోక్షమును ప్రసాదించుచున్నాడు. అట్టి శ్రీరఘునాథుడే నా భాగ్యవశమున నా కనులముందు స్వయముగా విరాజమానుడై యున్నాడు. ప్రభూ! ఇట్టి సంయోగము మఱలకలుగునా? (చౌ॥ 1-3)

"శ్రుతులు 'నేతినేతి' యని సర్వదా నీ గుణములను కీర్తించుచుండును. ప్రాణములను, మనస్సును వశమునందుంచుకొని, సర్వేంద్రియములను విషయసుఖములనుండి మఱల్చి, నిరంతర ధ్యానమగ్నులగు మునులకు నీ దర్శనము అరుదుగా మాత్రమే లభించును. అట్టి ప్రభువైన నీవు నా కట్టెదుట నిల్చియుంటివి. నేను మిక్కిలి అభిమానినని తెలిసియు, నీవు నా శరీరమును సజీవముగా నిలుపుకొనుమని పల్కియుంటివి. కల్ప వృక్షమును నఱికి తుమ్మచెట్ల రక్షణకై కంచెను ఏర్పాటు చేయు మూర్ఖుడెవడుండును? (అనగా పూర్ణకామునిగా చేయునట్టి నిన్ను విడిచి, నశ్వరమగు శరీరమును రక్షింపుమని నిన్నే కోరుటయా?) ప్రభూ! కరుణతో నాకొక వరమును ప్రసాదింపుము. నా కర్మననుసరించి, నేను ఏజన్మనెత్తినను శ్రీరాముని పాదములపై నాకు అనురాగము నిల్చియుండుగాక. స్వామీ! కల్యాణదాయకా! వీడే నా కుమారుడు, అంగదుడు. వినయములో బలములో నాతోసరితూగగలవాడు వీనిని అనుగ్రహింపుము. దేవతలకును, మానవులకును ప్రభువైన నీవు నీ అభయహస్తముతో ఆదరించి, వీనినినీదాసునిగా జేసికొనుము. (ఛంద్)

ఈ విధముగా శ్రీరామునిచరణకమలములయందే భక్తిభావమును దృఢముగా నిలిపి, ఏనుగు మెడలోని పూలమాల దానికి తెలియకుండగనే జాఱిపోయినట్లు వాలి అసువులు అతనికి తెలియకుండగనే అనంతాకాశములో కలిసిపోయెను. (దో॥ 10)

శ్రీరామచంద్రుడు వాలికి వైకుంఠపదమును అనుగ్రహించెను. (దానివలన అతడు వానర శరీరమును వీడి, పరమహంసలకును దుర్లభమైన పరమపదమును పొందెను) కిష్కింధా(నగర) వాసులు వాలిమృతితో వ్యాకులురై తికమకలకు లోనైరి. వాలిభార్య 'తార' అనేక విధముల విలపించెను. ఆమె శరీరము నేలపై నిల్వలేక పోయెను. కేశములు చెదరిపోయెను. శోక విహ్వలయైన తారకు శ్రీ రఘునాథుడు జ్ఞానోపదేశము చేసి, ఆమె అజ్ఞానమును తొలగించెను. "ఈనశ్వరమైన శరీరము పృథ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము- అనుపంచభూతములతో ఏర్పడినది. అదియు నీ యెదుటనే పడియున్నది. కానీ జీవుడు నిత్యుడు. నీవు ఎవరి కొఱకు ఏడ్చుచున్నావు?" ఈ మాటలతో తారకు జ్ఞానోదయమయ్యెను వెంటనే శ్రీరామునిచరణకమలములపై వ్రాలెను. ఆయననుండి పరమభక్తిని పరమముగా పొందెను. (శివుడు పల్కుచున్నాడు.) ఓ ఉమా! శ్రీరామచంద్రప్రభువు అందఱిని ఆటబొమ్మనువలె

ఆడించును. శ్రీరామునిఆజ్ఞ మేరకు సుగ్రీవుడు తన అన్నయైనవాలికి విధ్యుక్తముగా అంత్యక్రియలను జరిపించెను. అప్పుడు శ్రీరామచంద్రుడు లక్ష్మణునకు "నీవు వెళ్లి సుగ్రీవుని కిష్కింధకు రాజ్యాభిషిక్తునిగావింపుము- అని ఆదేశించెను. అందఱును శ్రీరాముని చరణములకు ప్రణమిల్లి, అతని ఆజ్ఞతో కిష్కింధకు చేరిరి. (చౌ॥ 1-5)

లక్ష్మణుడు వెంటనే నగరవాసులను, బ్రాహ్మణులను పిలిపించి, వారి అందఱియెదుట సుగ్రీవుని రాజుగాను, అంగదుని యువరాజుగాను చేసెను. (దో॥ 11)

(పరమేశ్వరుడు తెలుపుచున్నాడు) పార్వతీ! ప్రపంచమున శ్రీరామునివంటి హితకరుడైన గురువు, తండ్రి, తల్లి, సోదరుడు, స్వామి- ఎవ్వరును లేరు. దేవతలు, మునులు, మనుష్యులు సాధారణముగా స్వార్థదృష్టితోడనే ఇతరులను ప్రేమించెదరు. ఇంతవఱకును సుగ్రీవుడు వాలి భయముతో రాత్రింబవళ్లు గజగజ వణకిపోవుచుండెను. వాలికొట్టిన దెబ్బలకు అతని శరీరముపై పెక్కు గాయములుండెను. అతనిహృదయము అనవరతము చింతాగ్రస్తమైయుండెను. అట్టి సుగ్రీవుని శ్రీరాముడు కపిరాజుగా జేసెను. నిజముగా రఘువీరుడు అత్యంతదయాళువు. ఈ విషయము తెలిసియు ఇట్టి ప్రభువును విస్మరించెడి జనులు ఆపదలనెడివలలో చిక్కుపడుట ఆశ్చర్యకరము గాదు. పిమ్మట శ్రీరాముడు సుగ్రీవుని బిలిచి, అతనికి అనేకవిధముల రాజనీతిని ఉపదేశించెను. అనంతరము శ్రీరామచంద్రప్రభువు ఇట్లు పలికెను. "ఓ వానరరాజా! సుగ్రీవా! వినుము. నేను పదునాలుగు సంవత్సరములవఱకు ఏ నగరములోను ప్రవేశింపను. ఇప్పుడు గ్రీష్మఋతువు పోయి, వర్షఋతువు వచ్చినది. కావున సమీపముననే ఒక పర్వతముపై నివసించెదను. అంగదుని వెంటనిడుకొని నీవు రాజ్యపాలన చేయుచుండుము. కాని నా కార్యమును మాత్రము సర్వదా మనస్సులో ఉంచుకొనుము." పిదప సుగ్రీవుడు తనభవనమును చేరెను. శ్రీరాముడు 'ప్రవర్షణ'గిరిపై నివసింపసాగెను. (చౌ॥ 1-5)

కృపానిధియైన శ్రీరాముడు అచటికి వచ్చి, కొన్ని దినములు నివసించునని తెలియగానే దేవతలు ముందుగనే ఆ పర్వతమున ఒక గుహను నివాసయోగ్యముగా చేసియుంచిరి. (దో॥ 12)

## వర్షశరదృతువుల వర్ణనము

పూలతోనిండిన ఆ వనము మిక్కిలి మనోహరముగా నుండెను. తుమ్మెదలు మధుపానలాలసతో ఝంకారములు చేయుచుండెను. ప్రభువు వచ్చినప్పటి నుండియు, అచట కందమూలఫలములు, పత్రములు సమృద్ధములయ్యెను. మనస్సునకు ఆహ్లాదమును గూర్చు నిరుపమానమైన ఆ పర్వతమును చూచి, దేవదేవుడైన శ్రీరాముడు తనతమ్ముడైన లక్ష్మణునితో అచ్చటనే యుండసాగెను. దేవతలు, సిద్ధులు, మునులు అచ్చట తుమ్మెదల, పక్షుల, వన్యప్రాణుల రూపములను దాల్చి, ప్రభువును సేవించుచుండిరి. లక్ష్మీపతియగు శ్రీరామునిపాదస్పర్శచే ఆ స్థలము మిక్కిలి పునీతమై శుభప్రదమాయెను. అత్యంతకాంతిమంతమైన ఒక స్ఫటికశిలపై సోదరులిద్దఱును ఆసీనులై యుండిరి. శ్రీరామచంద్రుడు తమ్ముడైన లక్ష్మణునకు భక్తి వైరాగ్య రాజనీతివివేకములకు సంబంధించిన అనేకకథలను నుడువుచుండెను. వర్ష ఋతువునందు ఆకాశమున మేఘములు గర్జించుచు మిక్కిలి చూడముచ్చటగా నుండెను. (చౌ॥ 1-4)

"లక్ష్మణా! చూడుము. వైరాగ్యమునందభిలాషగల గృహస్థుడు విష్ణుభక్తుని దర్శించినంత మాత్రముననే ఎంతగానో పొంగిపోవునట్లు మేఘదర్శనమునకు త్రుళ్లింతలిడుచు నెమళ్లు ఆనందాతిరేకమున పురులువిప్పి నాట్యమాడుచున్నవి. (దో॥ 13)

ఆకాశమున మేఘములు గంభీరముగా ఘోరగర్జనలను గావించుచున్నవి. నా ప్రియమైన సీత చెంత లేనందున నామనస్సు ఆందోళనమునకు లోనగుచున్నది. మేఘములయందు విద్యుల్లత దుష్టునిమైత్రివలె క్షణకాలమే తళుక్కుమనుచున్నది. విద్యలు అబ్బిన పిమ్మట జ్ఞానులు వినమ్రులైయున్నట్లు మేఘములు పృథ్వికి సమీపముగా వచ్చి వర్షించుచున్నవి. దుష్టులమాటలను సజ్జనులు సహించునట్లు వర్షపుచినుకులదెబ్బలను పర్వతములు ఓర్చుకొనుచున్నవి. (పర్వతములు అచలములు. వర్షములతాకిడులప్రభావము వాటిపై ఏమాత్రము ఉండదు. అట్లే దుష్టుల దురాగతములకు సజ్జనులు లేశమాత్రమును చలింపరు.) కొంచెము సంపద కల్గినంతనే అధముడు గర్వముతో మిడిసిపడునట్లు చిన్నచిన్న నదులు వరదలై పొంగి తీరములను కోయుచున్నవి. బద్ధజీవుడు మాయావశుడైనట్లు నీరు నేలపై బడినంతనే మలిన మగుచున్నది. సద్గుణములు ఒక్కొక్కటిగా సజ్జనునిచేరునట్లు జలములు అన్ని దిశలనుండి వచ్చి చెఱువులను చేరుచున్నవి. జీవుడు శ్రీహరిలో లీనమై, జననమరణములనుండి ముక్తుడైనట్లు నదీజలములు సాగరమున లీనమై తద్రూపమును పొందుచున్నవి. (చౌ॥ 1-4)

గడ్డితో నిండిన భూమిపై పచ్చదనము వ్యాపించినది. పాషండుల ప్రచారమువలన ఉత్తమ గ్రంథములు మఱుగున బడినట్లు గడ్డిచే కప్పబడి, మార్గములు కన్పడకున్నవి. (దో॥ 14)

నలుదిశలయందును మండూకధ్వనులు బ్రహ్మచారులవేదఘోషలాయనునట్లు మనోహరముగా వినవచ్చుచున్నవి. జ్ఞానమును పొందిన సాధకునిమనస్సు ఉల్లాసముతో నిండినట్లుగా వృక్షములు తొడిగిన క్రొత్త చిగురుటాకులతో పచ్చదనము నిండి, అవి కమనీయములై శోభించుచున్నవి. ఉత్తమునిరాజ్యములో దుష్టులపన్నాగములు నేలపాలగునట్లు జిల్లేడు, జవాస చెట్లఆకులు రాలిపోయినవి. క్రోధముచే ధర్మము అణగారిపోయినట్లు వర్షముచే ధూళి అణగిపోయినది. పరోపకారియైన పురుషునిసంపదవలె పృథ్వి సస్యశ్యామలమై శోభిల్లుచున్నది. డాంబికజనులు కూడళ్లలో గుమిగూడినయట్లు రాత్రులయందు చీకట్లలో మిణుగురు పురుగులు. మినుకుమినుకుమనుచున్నవి. విశృంఖలప్రవృత్తిగల స్త్రీలు చెడుమార్గముల పాలైనట్లు నిరఘాటముగా సాగు కుంభ వృష్టికారణమున జలములు పంటపొలాలలో కట్టలుతెంచుకొని ప్రవహించుచున్నవి. విద్వాంసులు మదమోహ దురభిమానములను సమూలముగా రూపుమాపునట్లు తెలివైన రైతులు కలుపుమొక్కలను తీసివేయుచున్నారు. కలియుగము కాలుమోపినంతనే ధర్మము కాలికిబుద్ధిచెప్పినట్లు వర్షాకాలము ప్రారంభమైనంతనే చక్రవాకములు అదృశ్యములగుచున్నవి. హరిభక్తులమనస్సులలో కామవాసనలు ఉత్పన్నము కానట్లు ఊసరక్షేత్రములపై వర్షములుపడినను అందు గడ్డి మొలచుట లేదు. మంచి ప్రభుత్వములో ప్రజలు అన్ని విధములుగా సమృద్ధిని పొందినట్లు నానావిధ ప్రాణులతో నిండి, పృథ్వి శోభిల్లుచున్నది. జ్ఞానోదయమైనంతనే ఇంద్రియములు తమచాంచల్యమును వీడి శాంతిని పొందినట్లు, వర్ష-ఋతువు ప్రారంభముకాగానే యాత్రికులు తమప్రయాణములను మాని, తమ తమ స్థానములలో విశ్రాంతిని గైకొనుచున్నారు. (చౌ॥ 1-5)

కుపుత్రుడు జన్మించుటచే వంశమునందలి ఉత్తమధర్మములు భ్రష్టములైపోవునట్లు అప్పుడప్పుడు అతివేగముగావీచెడి గాలులచే మేఘములు ఛిన్నాభిన్నములగుచున్నవి. దుర్జనసాంగత్యమువలన జ్ఞానము అడుగునబడి, సత్సాంగత్యమువలన మఱల ఆ జ్ఞానము వెలుగులను విరజిమ్మునట్లు పగలు మేఘములు ఆవరించుటచే సూర్యుడు కప్పబడుటవలన అంధకారము అలము కొని, మేఘములు చెదరి పోయినంతనే సూర్యుడు వెలుగులను ప్రసాదించుచున్నాడు. (దో॥ 15. క,ఖ)

లక్ష్మణా! చూడుము. వర్షఋతువు గడచి పోయినది. మిక్కిలి మనోహరమైన శరదృతువు అడుగిడినది. వర్షఋతువు యొక్క వార్ధక్యమునకు సూచకమా? అనునట్లు నేలపై తెల్లని కాసగడ్డి వ్యాపించి యున్నది. తృప్తిజెందిన వెంటనే లోభము శుష్కించినట్లు అగస్త్యనామకనక్షత్రము ఉదయింపగనే మార్గమునందు జలములు ఇంకిపోయెను. అరిషడ్వర్గమును జయించిన సజ్జనుల హృదయములు స్వచ్ఛములై శోభిల్లునట్లు నదీతటాకములోని జలములు నిర్మలములై తొణకిసలాడుచున్నవి. జ్ఞానియైనవాడు క్రమక్రమముగా మమతను త్యజించునట్లు నదీతటాకములయందలి జలములు తిన్నతిన్నగా ఇంకిపోవుచున్నవి. సమయము ఆసన్నము కాగానే సత్కర్మఫలములు ప్రకటితములౌనట్లు, శరదృతువు రాగానే ఖంజన(వలస) పక్షులు వచ్చి చేరుచున్నవి. భూమిపై ఎచ్చటను బురదగాని, ధూళిగాని లేదు. అందువలన నీతికోవిదుడైన రాజు గారి పరిపాలనవలె భూమి శోభిల్లుచున్నది. మూర్ఖుడైన కుటుంబయజమాని నిర్ధనుడై వ్యాకులుడైనట్లు తటాకములలో నీరు ఇంకి పోవుటచే అందలిచేపలు వ్యాకులతనొందుచున్నవి. భగవద్భక్తుడు ఆశలను త్యజించి శోభించునట్లు మేఘములులేని నిర్మలాకాశము శోభిల్లుచున్నది. నాయనా! భక్తి గలవారు అరుదుగా లభించునట్లు శరదృతువునందు చినుకులు అక్కడక్కడ పడుచున్నవి. (చౌ॥ 1-5)

భగవద్భక్తిని పొందిన నాలుగు ఆశ్రమములవారు సాంసారికశ్రమలను వీడినట్లు శరదృతువునందు రాజు జైత్రయాత్రకై, తాపసి తపశ్చర్యకై, వ్యాపారి వ్యాపారనిమిత్తమై, విద్వాంసులు సంపాదనకొఱకై, హర్షముతో నగరమును విడిచి పోవుచుండిరి. (దో॥ 16)

భగవదాశ్రయము పొందినవారు ఎట్టి బాధలును లేకుండ సుఖశాంతులతో నుండునట్లు లోతైన నీటిలో చేపలు హాయిగా జీవించుచున్నవి. నిర్గుణబ్రహ్మ సగుణబ్రహ్మయై దర్శనానందమును గూర్చినట్లు సరోవరములు వికసితకమలములతో విలసిల్లుచు, నయనానందమును కలిగించు చున్నవి. తుమ్మెదల ఝుంకారములు, నానావిధ పక్షులకలరవములు వింతవింతలై వీనులవిందు గావించుచున్నవి. దుర్జనులు ఇతరుల సంపదలను జూచి, ఈర్ష్యతో దుఃఖితులైనట్లు, రాత్రులను జూచి, చక్రవాకములు కలతచెందుచున్నవి. శివద్రోహి తృప్తియు, సుఖమూ లేక పరితపించు చుండునట్లు చాతకములు దాహముచే నిరంతరము గోలచేయుచున్నవి. సజ్జనుల దర్శనముచే పాపములంతరించి పోవునట్లు శరచ్చంద్రుని రాకవలన రాత్రులయందు వేడి చల్లారిపోవుచున్నది. పరమభక్తులు శ్రీహరిని నిర్నిమేష నేత్రులై దర్శించునట్లు చకోరములు పూర్ణచంద్రుని రెప్పవాల్చక చూచుచున్నవి. బ్రాహ్మణద్వేషమువలన కులములు నష్టములైపోవునట్లు చలివలన దోమలు, ఈగలు నశించుచున్నవి. (చౌ॥ 1-4)

సద్గురువు లభించుటతో సందేహములు, భ్రమలు తొలగునట్లు, వర్షాకాలమున అంతటను వ్యాపించిన క్రిమికీటకాదులన్నియును శరదాగమముతో నశించి పోవుచున్నవి. (దో॥ 17)

# లక్ష్మణుని ఆగ్రహము

వర్షాకాలము గడచి పోయినది. నిర్మలమైన శరదృతువు వచ్చినది. కాని నాయనా! సీత జాడ తెలియలేదు. ఒక్కసారి జానకిఆచూకి తెలిసినచో యమునినైనను జయించి, క్షణములో ఆమెను దీసికొని వచ్చెదను. నాయనా! ఆమె ఎక్కడ ఉన్నను జీవించియున్నచో ప్రయత్నించి, అవశ్యముగా తీసికొని వచ్చెదను. సుగ్రీవుడు రాజ్యమును, కోశాగారమును, నగరమును, భార్యను పొంది నన్ను మఱచినట్లున్నాడు. వాలిని వధించినబాణముతోడనే రేపే ఆ మూఢుని తుదముట్టింపవలసి వచ్చును. (శివుడు పల్కుచున్నాడు) ఉమా! ఎవని అనుగ్రహముచే మదము, మోహము, క్రోధము పటాపంచలగునో అట్టి రాఘవునకు స్వప్నములోనైనను కోపము వచ్చునా? (ఇది లీలా విలాసము మాత్రమే.) శ్రీరామచంద్రునిచరణములపై భక్తిప్రత్తులుగల జ్ఞానులుమాత్రమే ఈ లీలారహస్యమును ఎఱుంగగలరు. ప్రభువు కుపితుడగుటను జూచి లక్ష్మణుడు ధనుర్బాణములను ధరించెను. (చౌ॥ 1-4)

కరుణాసాగరుడైన శ్రీరాముడు లక్ష్మణునితో "లక్ష్మణా! సుగ్రీవుడు మనమిత్రుడు. అతనిని కేవలము భయపెట్టి ఇక్కడికి తీసికొని రమ్ము (చంపవలదు)" అని నచ్చజెప్పి, పంపెను. (దో॥ 18)

ఇక్కడ (కిష్కింధలో) పవనపుత్రుడైన హనుమంతుడు "సుగ్రీవుడు శ్రీరాముని కార్యమును పూర్తిగా విస్మరించినాడు" అని తలంచుచుండెను. అతడు సుగ్రీవుని యొద్దకు వెళ్లి, ప్రణమిల్లి, సామ దాన భేద దండోపాయములను గుర్తుచేసి అతనికి నచ్చజెప్పెను. ఇదియంతయు విని సుగ్రీవుడు మిక్కిలి భీతిల్లి ఇట్లు పలికెను. "విషయ వాసనలు నా జ్ఞానమును హరించినవి. పావనీ! వానర సమూహములు ఉన్నస్థలములకు నీవు దూతలను బంపుము. ఒక పక్షమురోజులలో వారి నందఱిని ఇక్కడికి రమ్మని చెప్పుము. అట్లు రానిచో వారు నాచే మృత్యువాత పడెదరు" అప్పుడు హనుమంతుడు దూతలను పిలిచి, వారిని మిక్కిలి గౌరవించి, వారికి నయ, భయ, ప్రీతి వచనముల ద్వారా సుగ్రీవాజ్ఞను వినిపించెను. వారు ఆయనకు నమస్కరించి, వెళ్లి పోయిరి. ఇంతలో లక్ష్మణుడు నగరమున (కిష్కింధలో) ప్రవేశించెను. అతడు కోపముతోనున్నాడని గ్రహించి, వానరులందఱును అటు నిటు పరుగులు దీసిరి. (చౌ॥ 1-4)

అప్పుడు లక్ష్మణుడు ధనుస్సును ఎక్కుపెట్టి "ఇప్పుడే ఈ నగరమును కాల్చి, భస్మమొనర్చెదను"- అనెను. నగరమంతయు వ్యాకులపడినదని గ్రహించి, వాలి పుత్రుడైన అంగదుడు లక్ష్మణుని కడకు వచ్చెను. (దో॥ 19)

అతడు లక్ష్మణుని పాదములకు శిరసా ప్రణమిల్లి, ప్రార్థించెను. అప్పుడు లక్ష్మణుడతని భుజములను పట్టుకొని లేపి, 'భయపడకుము' అని అభయమిచ్చెను. లక్ష్మణునికోపమును గూర్చి విని, వానరరాజు సుగ్రీవుడు భయముతో వణకిపోయెను. హనుమంతుని జూచి, సుగ్రీవుడు "ఓ మారుతీ! నీవు తారను వెంటనిడుకొని పోయి, రాజకుమారుడైన లక్ష్మణునకు నా ప్రార్థనను విన్నవించి, ఆయన కోపమును చల్లార్చుము" అని పలికెను. హనుమంతుడు తారతో గూడి వెళ్లి, లక్ష్మణుని చరణములకు వందనమాచరించి, ప్రభువును కీర్తించెను. పిమ్మట మిగుల ప్రార్థించి, ఆయనను భవనములోనికి గొని వచ్చెను. ఆయన కాళ్ళు కడిగి మంచముపై కూర్చుండ బెట్టెను. పిదప సుగ్రీవుడతని చరణములకు ప్రణమిల్లెను. లక్ష్మణుడతని భుజములను పట్టుకొని లేపి, ఆలింగనమొనర్చుకొనెను. సుగ్రీవుడు పల్కెను. "ప్రభూ! విషయ భోగములతో సమానమగు మత్తు పదార్థము లెవ్వియును లేవు. ఇవి క్షణములో మునులకు సైతము మనో వికారములను గూర్చును. "(మేము వానరులము విషయసుఖలోలురము) సుగ్రీవుని వినయవచనములకు తృప్తి చెంది,

లక్ష్మణుని మనస్సు చల్లబడెను. సుగ్రీవునకు అతడు అనేకవిధముల ధైర్యమును గూర్చెను. అప్పుడు హనుమంతుడు దూతలను పంపిన సమాచారమును గూడ లక్ష్మణునకు వినిపించెను. (చౌ॥ 1-5)

లక్ష్మణుడు ముందు నడచుచుండగా సుగ్రీవుడు, అంగదాది వానరులను వెంటనిడుకొని సంతోషముతో ఆయనను అనుసరించుచు శ్రీ రఘునాథుని కడకు వచ్చెను. (దో॥ 20)

సుగ్రీవుడు శ్రీ రఘునాథునిచరణములకు శిరసా ప్రణమిల్లి, అంజలిఘటించి ఇట్లనెను. "ప్రభూ! నాదోషమేమియును లేదు. మీ మాయ అత్యంతప్రబలమైనది. రామా! మీదయ గలిగినప్పుడే ఆ మాయనుండి జీవులకు విముక్తికలుగును. స్వామీ! దేవతలు, మునులు, మనుష్యులు, అందఱును విషయసుఖములకు బానిసలే. నేనైతే పామరుడను, అంతేగాదు పశువును, అందునా అతికామియైన వానరుడను. ఓ రఘునాథ! స్త్రీల చూడ్కులనెడి శరములకు గురికానివాడు, భయంకరక్రోధమనెడి చీకటిరాత్రులయందు జాగృతి కలిగియుండెడివాడు, లోభమనెడి ఉచ్చులలో చిక్కుకొననివాడు నీతో సమానుడగును. ఈ గుణములు సాధనవలన లభ్యములు గావు. కేవలము నీ కృపవలన చాలా అరుదుగా కొందఱికిమాత్రమే లభించును." అప్పుడు శ్రీ రఘువరుడు చిఱునవ్వుతో "సోదరా! నీవు నాకు భరతునివలె ప్రీతిపాత్రుడవు. ఇపుడు సీతజాడ తెలిసికొనుటకై మనఃపూర్వకముగా యత్నింపుము" అని నుడివెను. (చౌ॥ 1-4)

ఈ సంభాషణ కొనసాగుచుండగనే వానర యూథములనేకములు వచ్చి, అచటికి చేరెను. నలుదెసలయందు ఎచ్చట జూచినను వివిధవర్ణములుగల వానరములే కన్పించుచుండెను. (దో॥ 21)

# వానరులచే సీతాన్వేషణము

(శివుడు వచించుచున్నాడు.) భవానీ! నేను ఆ వానరసేనను చూచితిని. అవి అసంఖ్యాకములుగానున్నవి. లెక్కింపనెవ్వరికిని తరముగాదు. వాటిని లెక్కింపబూనినవాడు నిజముగా మూర్ఖుడే. వానరములన్నియును శ్రీరాముని చరణములకు ప్రణమిల్లెను. అవి శ్రీరాముని దర్శనముచే కృతార్థతనొందుచుండెను. అంతటి అసంఖ్యాక సైన్యములో గూడ శ్రీరాముని కుశల ప్రశ్నలకు నోచుకొనని వానరము ఒక్కటియు లేదు. ప్రభువు ప్రతి వానరమును కుశలమడిగెను. ఆయనకిది ఒక గొప్ప విషయముగాదు. ఏలనన శ్రీరఘునాథుడు విశ్వరూపుడు, సర్వవ్యాపకుడు. సుగ్రీవుని ఆజ్ఞల మేరకు ఆ వానరములు ఎక్కడివక్కడ నిలిచి పోయెను. అప్పుడతడు సుగ్రీవుని వారినందఱిని ఇట్లాదేశించెను. "వానరులారా! ఇది శ్రీరామచంద్రుని కార్యము. నా ఆజ్ఞ. మీరన్నిదిశలకును వెళ్లి, సీతాదేవి జాడ తెలిసి కొని రండు. సోదరులారా! ఒక్క నెలలోపల తప్పక తిరిగి రావలెను. ఈ అవధి దాటిన పిదప సీతాదేవి వార్తను తెలిసి కొనకుండా వచ్చిన వారికి నా చేతిలో మరణముతప్పదు. (చౌ॥ 1-4)

సుగ్రీవాజ్ఞను విని, వానరులందఱును నలుదిశలకును వెళ్లిపోయిరి. అప్పుడు సుగ్రీవుడు అంగద, నల, హనుమదాది ప్రముఖ వీరులను పిలిచెను. (దో॥ 22)

సుగ్రీవుడు ఇట్లు వచించెను. సర్వసమర్థులైన ఓ ధీరులారా! నీల! అంగద! హనుమంత! జాంబవంత! వినుడు. మీరందఱును దక్షిణ దిశగా పొండు. కలిసిన ప్రతివ్యక్తిని 'సీతాదేవి జాడను గూర్చి' అడుగుడు. త్రికరణశుద్ధిగా ప్రయత్నింపుడు, ఆలోచింపుడు. శ్రీరామచంద్రుని కార్యమును నెరవేర్పుడు. సూర్యకిరణముల తాపమును వీపున

భరించుచు వినమ్రులై ఆయనను సేవింపవలెను. చలికి బాధపడువాడు సూర్య కిరణములకు వీపును జూపుచు సేవింపవలెను. అభిముఖులై అగ్నిని సేవింపవలెను. ప్రభువును త్రికరణశుద్ధిగా నిష్కపటముగా సేవింపవలెను. మమతాసక్తులను వీడి, పరలోక ప్రాప్తికై భగవత్సేవ చేయవలెను. దానివలన జననమరణజనిత శోకసంతాపములు అన్నియును పటాపంచలగును. సోదరులారా! మనోరథములనన్నింటిని పరిత్యజించి, శ్రీరామసేవలను కొనసాగింపవలెను. శరీరమును ధరించినందులకు శ్రీరాముని భజించుటయే గొప్పఫలము. శ్రీరామునిచరణములపై భక్తిగలవాడే గుణవంతుడు, మహాభాగ్యశాలి." ఈమాటలను శ్రద్ధగా విని, ఆజ్ఞలను గైకొని, నమస్కరించి,అంగదాదులందఱును, శ్రీరాముని స్మరించుచు, ప్రసన్నచిత్తులై దక్షిణదిశగా బయలుదేఱిరి. అందఱికంటెను చివర హనుమంతుడు శ్రీరామునకు ప్రణమిల్లెను. ఆయనద్వారా మాత్రమే తన కార్యము నెఱవేఱునని గ్రహించి, శ్రీరాముడు అతనిని తన యొద్దకు పిలిచెను. తన కరకమలములతో అతని శిరమును నిమిరెను. అతడు తనపరమభక్తుడని ఎఱింగి, తనవ్రేలిఉంగరమును తీసి అతనికి ఇచ్చి, ఇట్లు పలికెను "సీతకు ఊరట కలుగునట్లుగా అనువగు విధములనచ్చజెప్పుము. నా బలపరాక్రమములను గూర్చియు, ఆమెకై నా విరహమును గుఱించియు తెలిపి, శీఘ్రముగా తిరిగి రమ్ము." ఇది విని, హనుమంతుడు తనజన్మ సఫలమైనట్లు భావించి, కృపాళువైన ప్రభువును తనహృదయమునందే నిలుపుకొని, బయలుదేఱెను. దేవతలకును రక్షకుడైన ప్రభువు అన్నింటిని ఎఱింగియు, రాజనీతిని పాటించు చున్నాడు. (రావణుడు దేవతలను బాధించుచుండుటచే వారిని రక్షించుటకై శ్రీరాముడు అవతరించెను. యుద్ధమునకు ముందుగా దూతను పంపి, శత్రు సమాచారమును తెలిసికొనుట రాజనీతి. ప్రభువు మానవ ధర్మము ననుసరించి, రాజనీతిని పాటించుచున్నాడు.) (చౌ॥ 1-7)

అంగదాదివానరులందఱును వనములను, నదులను, చెఱువులను, పర్వతములను, లోయలను, దాటుచు 'సీతాన్వేషణ'ను కొనసాగించుచుండిరి. వారిమనస్సులు శ్రీరామకార్యసాధనయందే లగ్నమైయుండుటచే వారికి శరీరవాంఛలపైగూడ ఏ మాత్రము ధ్యాసయేలేకుండెను. (దో॥ 23)

వారు గిరులు, కాననములు, పరిపరివిధముల గాలించుచుండిరి. ఎవ్వడైన నొక రాక్షసుడు కంట బడినచో వానిని వారు ఒక్కదెబ్బతో హతమార్చుచుండిరి. మునులు కనబడినప్పుడు వారి చుట్టునుజేరి సీతాదేవిసమాచారమును అడిగి తెలిసికొనుచుండిరి. ఇంతలోనే ఆ అంగదాదులు మిక్కిలి దప్పిగొని వ్యాకులపాటునకు గురియైరి. ఎచ్చటను నీరుదొరకక వారు ఆ దట్టమైన అడవులలో దారితప్పి తిరుగుచుండిరి. దాహబాధచే వారందఱు మరణింతురేమో అని ఆందోళనపడి హనుమంతుడు ఒక పర్వతశిఖరమునెక్కి, నలుదెసల పరికించెను. నేలపై ఒక బిలము నొద్ద ఆయనకు ఆశ్చర్యకరమైన దృశ్యము కనబడెను. ఆకందరముపైన చక్రవాక పక్షులు, కొంగలు, హంసలు మొదలగునవి ఎగురుచుండెను. పెక్కుపక్షులు లోపలికి పోవుచు వచ్చుచుండెను. పవన సుతుడు పర్వతమునుండి దిగి వచ్చి, వారందఱికిని ఆ గుహను చూపించెను. హనుమంతుని ముందిడుకొని, వానరులందఱును వెంటనే ఆ కందరమున ప్రవేశించిరి. (చౌ॥ 1-4)

## స్వయంప్రభ వృత్తాంతము

వానరులందఱును ఆగుహలో ప్రవేశించి, అచట ఒక ఉపవనమును, అందొక సరోవరమును జూచిరి. వికసితసుందరకమలశోభలతో అది మనోహరముగా నుండెను. అచటనే ఒక మనోజ్ఞ మందిరము గలదు. అందొక తపస్విని కూర్చొని యుండెను. (దో॥ 24)

దూరము నుండియే అందఱును ఆమెకు నమస్కరించిరి. ఆమె అడిగిన పిమ్మట విషయము నంతయు చెప్పిరి. అప్పుడామె "ముందుగా మీరు దప్పిక తీర్చుకొనుడు. మధురములైన ఫలములను ఆరగింపుడు" అని వారితో పల్కెను. వానరులందరును స్నానములనాచరించి, తియ్యనిపండ్లను కడుపునిండా ఆరగించి, ఆమెకడకు చేరిరి. అప్పుడామె తన కథను వివరించెను. "నా పేరు స్వయంప్రభ. నేను ఇప్పుడు రఘునాథునియొద్దకు వెళ్లెదను. మీరు కన్నులను మూసికొనుడు. గుహనుండి బయటపడగలరు. సీతాదేవిని కనుగొనుటలో మీరు సఫలురయ్యెదరు. నిరాశ చెందవలదు" అని పలికెను. వారందఱును కనులు మూసికొని తెఱవగనే సముద్ర తీరమున నుండిరి. ఆ తపస్విని స్వయముగా శ్రీరాముడున్న స్థలమునకు చేరెను. ఆమె ప్రభుచరణములకు నమస్కరించి, అనేక విధముల ప్రార్థించెను. ప్రభువు ఆమెకు అచంచల భక్తిని ప్రసాదించెను. (చౌ॥ 1-4)

నిరంతరము బ్రహ్మ రుద్రాదులచేతను సేవింపబడుచుండు పరమ పవిత్రములైన శ్రీరాముని చరణయుగమును తనమనస్సున నిలుపుకొని, తపస్విని యైన ఆ స్వయంప్రభ ప్రభువు యొక్క ఆజ్ఞను శిరసావహించి, బదరికాశ్రమమునకు వెడలిపోయెను. (దో॥ 25)

ఇచ్చట సముద్రతీరమున వానరులందఱును ఇట్లు ఆలోచింపసాగిరి. ఇప్పటికే గడువు దాటినది. కాని కార్యము నెఱవేఱలేదు." అందఱును కూర్చొని పరస్పరము మాట్లాడు కొనసాగిరి. "సోదరా! సీతాదేవిసమాచారమును తెలిసికొనకుండ మనము కిష్కింధకు వెళ్లుటవలన ప్రయోజనమేమి? అంగదుడు సజలనయనుడై పలికెను." ఏ విధముగ నైనను మనకు మృత్యువేగతి. ఇక్కడ సీతాదేవిజాడ మనకు తెలియలేదు. అక్కడికి వెళ్లినచో కపిరాజు సుగ్రీవుని చేతిలో మనకు చావు తప్పదు. శ్రీరాముడే నన్ను ఆదుకొనక పోయినచో మా తండ్రిగారు మృతి చెందిన వెంటనే సుగ్రీవుడు నన్ను హతమార్చియుండెడివాడు. ఇందులో నాపై సుగ్రీవుడు చూపిన దయయేమియును లేదు. ఇకమనకు మరణమే శరణ్యము. అంగదునిమాటలను వినియు వానరవీరులు ఏమియు మాఱు పలుకకుండిరి. నిశ్శబ్దము తాండవించెను. వారినేత్రములు. అశ్రు పూర్ణములాయెను. ఒక్కక్షణ కాలము వారు శోకమగ్నులైరి. చివరకు వారందఱును "యువరాజా! మనము సీతాదేవిజాడను తెలిసికొనకుండ అచటికి ఎట్లుతిరిగి వెళ్లగలము?" అని పలికి, ఆ లవణ సముద్రతీరమున కుశాసనము పఱచుకొని, కూర్చొనిరి. (నిరశనవ్రతము ద్వారా ప్రాణత్యాగమునకు సిద్ధపడిరి.) అంగదునిదుఃఖమునుజూచి, జాంబవంతుడు ఉపదేశాత్మకములైన కథలను చెప్పసాగెను. నాయనా! శ్రీరాముని మానవమాత్రునిగా తలంపవలదు. అతడు నిర్గుణ పరబ్రహ్మము, అజేయుడు, జన్మరహితుడు- అని యెఱుంగుము. మనమందఱము ఆయనసేవకులము కనుక మిక్కిలి భాగ్యశాలురము. సగుణ బ్రహ్మయునైన ఆ శ్రీరామునియందు నిరంతరము ప్రేమ గలవారము- (చౌ॥ 1-7)

దేవతలను, భూదేవిని, గోవులను, బ్రాహ్మణులను సంరక్షించుటకై భగవంతుడు తన ఇచ్చాను సారము అవతారములను ఎత్తుచుండును. అప్పుడు సగుణోపాసకులగు భక్తులందఱును సర్వ సుఖములను త్యజించి, మోక్షమునుగూడ ఆసింపక, ఆయన సేవలలోనే నిమగ్నులైయుందురు. (దో॥ 26)

# సంపాతి సహకారము

ఈ విధముగా జాంబవంతుడు నానా విధ గాథలను తెల్పుచుండగా ఆ సమీప గుహయందున్న సంపాతియను గృధ్రరాజు (జటాయువు అన్న) వాటి నన్నింటిని వినెను. పిమ్మట అతడు బయటకి వచ్చి, ఆ వానరములను జూచి, ఇట్లు పలికెను. "భగవంతుడు నాకు ఆహారమును ఇంటికే పంపినాడు. నేను ఈనాడు వీరందఱిని భక్షించెదను.

చాలా దినములనుండి ఆహారము లేక నేను విలవిలలాడుచున్నాను. కడుపునిండా ఆహారము దొరకక చాల కాలమైనది. నేడు విధాత ఒక్కసారే చాల ఆహారమును సమకూర్చినాడు." గ్రద్ధ పలికిన మాటలను వినగానే వానరములు భయపడి, "ఇప్పుడు నిజముగానే మరణము ఆసన్నమైనది" అని పలుకసాగెను. పిదప ఆగ్రద్ధను చూచుటకు, వానరములన్నియు కొద్దిగా లేచి నిలబడెను. జాంబవంతుని మనస్సులో విచారము అధికమాయెను. అప్పుడు బాగుగా ఆలోచించి, అంగదుడు ఇట్లనెను. "ఆహా! జటాయువు వంటి పుణ్యాత్ముడు ఎవ్వడును లేడు అతడు పరమభాగ్యశాలి. శ్రీరాముని కార్యమునకై అసువులను వీడి, ఆ పరమ పదమునే పొందెను." హర్షశోకములనుగూర్చు ఈమాటలను వినగానే ఆ గృధ్రము వారిచెంతకు వచ్చెను. వానరములు మఱింతగా భయపడెను. సంపాతి వారికి ముందుగా అభయమిచ్చి, జటాయువు వృత్తాంతము నడిగెను. అపుడంగదుడు ఆ కథనంతయును వినిపించెను. సోదరుడైన జటాయువు యొక్క అద్భుతకృత్యగాథను విని, సంపాతి శ్రీరఘునాథుని మహిమను అనేక విధముల ప్రస్తుతించెను. (చౌ॥ 1-6)

సంపాతి నుడివెను "నన్ను సముద్ర తీరమునకు తీసికొని పొండు. నేను నా సోదరునకు 'తిలాంజలులను' ఇచ్చెదను. ఈ సేవలకు మాఱుగా మీకు మాటసాయము చేసెదను. మీరు వెదకుచున్న సీతాదేవి జాడను తెల్పెదను. ఆమె తప్పక లభింపగలదు. (దో॥ 27)

సంపాతి సముద్రతీరమున తనతమ్ముడైన జటాయువునకు శ్రాద్ధతర్పణాదులను ఆచరించిన పిమ్మట తనకథను వివరింపసాగెను. "ఓ వానర వీరులారా! వినుడు. జటాయువు, నేను సోదరులము. మేము మా తొలియౌవనదశలో ఆకాశమున ఎగురుచు సూర్యుని సమీపించితిమి. జటాయువు సూర్యతేజస్సునకు తాళలేక తిరిగి వచ్చెను. నేను అభిమానిని గాన సూర్యుని సమీపమునకు వెళ్లితిని సూర్యుని ప్రచండ కిరణ జ్వాలలకు నాతెక్కలు మాడి పోయినవి. అప్పుడు నేను గట్టిగా అఱచుచు 'చంద్రమా' అను మునియొక్కఆశ్రమమున నేలపై పడితిని. నా స్థితిని జూచిన పిమ్మట ఆయనకు నాపై జాలికలిగెను. అతడు నాకు పెక్కు రీతుల జ్ఞాన బోధను గావించి, నా దేహాభిమానమును తొలగించెను. పిమ్మట ఆ ముని నాతో ఇట్లు పలికెను. "త్రేతాయుగమున పరబ్రహ్మ స్వయముగా మానవావతారమును దాల్చును. రాక్షస రాజైన రావణుడు అతనిభార్యను అపహరించును. ఆమెజాడను దెలిపి కొనుటకు ప్రభువు దూతలను పంపును. వారితో గలిసినప్పుడు నీవు పావనమయ్యెదవు. అప్పుడు నీతెక్కలు తిరిగి రాగలవు. చింతింపవలదు. నీవు సీతాదేవి జాడను వారికి తెలుపుము'. ఆ ముని పలుకులు ఈనాడు సత్యములైనవి. నా మాటను విని, మీరు శ్రీరామచంద్రప్రభుకార్యమును నెఱవేర్చుడు. త్రికూట పర్వతముపై లంకానగరమున్నది. అక్కడ సహజముగా నిర్భయుడైన రావణుడున్నాడు. ఆ లంకానగరమున 'అశోకవనము' అను ఒక ఉపవనము గలదు. అందు సీతాదేవి శ్రీరామచంద్రుని స్మరించుచు శోకమగ్నురాలై కూర్చొని యున్నది. (చౌ॥ 1-6)

## కార్యసాధనకై - అంగదాదులచర్చ

ఇక్కడి నుండియే ఆమెను నేను చూచుచున్నాను. మీరు చూడజాలరు. ఏలనన గ్రద్ధ దృష్టి అపారమైనది. నేను ఇప్పుడు చాల ముదుసలిని. లేనిచో మీకు కొంత తోడ్పడగలిగి యుండెడి వాడను. (దో॥ 28)

నూఱు యోజనములవిస్తీర్ణముగల సముద్రమును లంఘింపగల్గిన మహావీరుడైన ప్రజ్ఞాశాలియే శ్రీరాముని ఈ కార్యమును సాధింపగలడు. నన్ను జూచి, మీరు ధైర్యము వహింపుడు. శ్రీరామునికృపచే నాశరీరము

అతిసుందరముగా రూపొందినది. అతని నామస్మరణముచే పాపులుగూడ అపారభవసాగరమును దాటగల్గుదురు. మీరు ఆయనదూతలు. అధైర్యమును వీడి, హృదయములలో శ్రీరామచంద్రుని నిలుపుకొని కార్యసాధనకు సిద్ధముకండు." (కాకభుశుండి పలుకుచున్నాడు) ఓ ఖగరాజా! సంపాతి ఇట్లు పలికి, క్రొత్త రెక్కలతో ఎగిరి పోయిన పిమ్మట వానరులు విస్మితులైరి. అందఱును తమతమ బలములను గూర్చి తెల్పుచు సముద్రమును దాటుటకు తమసందేహములను ప్రకటించిరి. భల్లూక రాజైన జాంబవంతుడు ఇట్లు పలికెను. "నేనిప్పుడు వృద్ధుడను. నా శరీరమున మునుపటి బలము లేశమైనను లేదు. ఖరారియైన శ్రీరాముడు వామనావతారమును దాల్చినప్పుడు నేను యువకునిగా ఉంటిని. అప్పుడు నా శరీరము బలిష్ఠమై యుండెను. (చౌ॥ 1-4)

బలిచక్రవర్తిని బంధించునప్పుడు ప్రభువు శరీరమును పెంచినప్పటి ఆ విరాట్ స్వరూపమును వర్ణించుటకు ఎవ్వరికిని శక్యము గాదు. కాని నేను రెండు గడియలలోనే ఆ విరాడ్రూపమునకు ఏడు ప్రదక్షిణములు గావించితిని." (దో॥ 29)

అపుడు అంగదుడు ఇట్లు పల్కెను "నేను సముద్రమును దాటగలను. కాని తిరిగి వచ్చు విషయములో నాకు సందేహము గలదు" జాంబవంతుడు అతనితో పల్కెను. "నీవు అన్ని విధముల యోగ్యుడవు. కాని నీవు అందఱికిని నాయకుడవు, స్వామివి. నిన్నెట్లు పంపగలము?" భల్లూక రాజు హనుమంతునితో ఇట్లనెను. "ఆంజనేయా! నీవెంతో బలవంతుడవు. మౌనముగా నుంటివేల? నీవు పవనపుత్రుడవు. బలమున ఆ పవనునితో సమానుడవు. బుద్ధి, వివేకము విజ్ఞానములకు నిధివి. నాయనా! విశ్వములో నీవు సాధింపలేని కఠినకార్యమేమున్నది? శ్రీరామచంద్రుని కార్యమునకే నీవు అవతరించితివి." ఇది వినగానే హనుమంతుడు పర్వతమంత పెఱిగెను. ఆయన శరీరము స్వర్ణ కాంతులతో విరాజిల్లుచుండెను. అది వేఱొక మేరుపర్వతమువలె భాసించుచుండెను. హనుమంతుడు సింహమువలె గర్జించుచు పల్కెను. "నేను ఈ లవణసముద్రమును అవలీలగా లంఘించెదను. రావణుని సపరివారముగా పరిమార్చి, త్రికూట పర్వతమును ఇక్కడికి పెకలించుకొని రాగలను. జాంబవంతా! నిన్నడుగుచుంటిని. సరియైన సూచనలనిమ్ము." జాంబవంతుడు నుడివెను. "నాయనా! నీవు వెళ్లి, సీతాదేవిని జూచి, ఆమె జాడను తెలిసికొని రమ్ము. నీవు చేయవలసినదింతమాత్రమే. తదనంతరము రాజీవలోచనుడు శ్రీరామచంద్రుడు తన భుజబలముచే తనలీలలను జూపుటకు వానరసైన్యమును తీసికొని పోయి, శత్రువుల పనిబట్టును. (చౌ॥ 1-6)

వానర సైన్యమును తోడుగా దీసికొని శ్రీరామచంద్రుడు రాక్షసులను సంహరించి, సీతాదేవిని తీసికొని వచ్చును. అప్పుడు దేవతలు, నారదాది మహర్షులు ముల్లోకములను పవిత్రమొనర్చు భగవంతుని వైభవమును గానము చేయుదురు. దానిని విని, గానము చేసి, మనుజులు పరమపదమును జేరెదరు. శ్రీ రఘువీరుని చరణకమలములయందు విహరించు భ్రమరమైన తులసీదాసు ఆ గుణగణములను గానము చేయును. (ఛం)

శ్రీ రఘునాథుని కీర్తి జననమరణరూపభవరోగములను రూపుమాపెడి అమోఘమైన ఔషధము. దీనిని శ్రద్ధగా వినిన స్త్రీ పురుషులందఱికిని 'త్రిశిరారి' యైన శ్రీరాముడు సర్వ మనోరథములను సిద్ధింప జేయును. (దో॥ 30.క)

నీలోత్పలసమానశ్యామసుందరగాత్రుడును, కోటిమన్మథులనుగూడ మించు మనోహరశోభామూర్తియు, పాపములనెడి పక్షులను వేటగానివలె రూపు మాపునట్టి నామప్రభావము గలవాడును అగు శ్రీరామచంద్రుని పావనగుణగణములను నిరంతరము అవశ్యము శ్రవణము చేయవలెను. (సో॥ 30.ఖ)

(మాస పారాయణము - ఇఱువది మూడవ విరామము)

సమస్త కలి కల్మషములను నాశమొనరించు శ్రీరామచరిత మానసమునందలి

చతుర్థ సోపానము సమాప్తము

- కిష్కింధకాండము సమాప్తము -

సీతాదేవి హనుమంతునకు చూడామణిని ఇచ్చుట





సీతాదేవి ఇచ్చిన చూడామణిని హనుమంతుడు శ్రీరామచంద్రునకు అర్పించుట

# శ్రీ రామచరిత మానసము

## పంచమ సోపానము - సుందరకాండము

## దైవప్రార్థన

రఘువంశశ్రేష్ఠుడు, సర్వపాపహారియగు శ్రీరాముడను పేరుగల శ్రీహరికి నేను నమస్కరించుచున్నాను. ఆయన పరమశాంత స్వరూపుడు, శాశ్వతుడు, అప్రమేయుడు, అనఘుడు, మోక్షమును- పరమశాంతిని ప్రసాదించువాడు, బ్రహ్మ శంభు ఫణీంద్రులచే నిరంతరము సేవింప బడువాడు, వేదాంతవేద్యుడు, విభుడు, జగదీశ్వరుడు, మాయామానుషవిగ్రహుడు, కరుణాకరుడు సర్వరాజశిరోమణి వేయేల? అతడు దేవాదిదేవుడు. (1)

ఓ రఘువర! నీవు సర్వాత్మ స్వరూపుడవు. నాకు నీ ప్రగాఢభక్తిని అనుగ్రహింపుము. నా మనస్సును కామాదివికార (దోష) రహితముగా జేయుము. ఓ రఘువీర! నేను నిజము వచించు చున్నాను. ఇంతకు మించి నా హృదయమున మఱియొక మనోరథమేమియును లేదు. (2)

శ్రీ రఘురామునకు పరమభక్తుడైన వాయునందనుడు నిరుపమానబలసంపదలకు నిధాన మైనవాడు, మేరుపర్వతసమానతనుశోభలుగలవాడు, దానవులనెడివనములను దహించివేయుటలో అగ్నివంటివాడు, జ్ఞానులలో సర్వశ్రేష్ఠుడు, వానరులకు ప్రభువు, అంతేగాదు అతడు సకలసద్గుణరాశి. అట్టి ఆంజనేయునకు నేను నమస్కరించు చున్నాను. (3)

## మారుతి సముద్రమును లంఘించుట

జాంబవంతుని మనోహరవచనములు హనుమంతునిహృదయమునకు మిక్కిలి ఆహ్లాదకరములాయెను. అప్పుడు అతడు పలికెను. "సోదరులారా! మీరు దుఃఖములను సహించుచు, కందమూలఫలములను భుజించుచు, నాకై నిరీక్షించుచుండుడు. నేను సీతాదేవిని చూచి, తిరిగిరాగలను. కార్యము తప్పక సఫలము కాగలదు. ఏలనన నాకు మిక్కిలి సంతోషముగా ఉన్నది." ఈ విధముగా పలికి, అందఱికిని నమస్కరించి, మనస్సున శ్రీరామచంద్రుని ధ్యానించుచు ఆంజనేయుడు ప్రసన్నచిత్తుడై బయలుదేఱెను. సముద్రతీరమున ఒక సుందర పర్వతముగలదు. మహాబలవంతుడైన హనుమంతుడు ఆటలలోవలె గంతులు వేయుచు అవలీలగా దానిపై నెక్కెను. మాటిమాటికిని శ్రీరఘువీరుని స్మరించుచు అతివేగముతో ఎగిరెను. అతడు కాలుమోపిన ఆ మహేంద్రపర్వతము వెంటనే పాతాళమునకు క్రుంగిపోయెను. శ్రీరామ చంద్రుని అమోఘమైనబాణమురీతి హనుమంతుడు మిక్కిలి వేగముగా ఆకాశమార్గమున వెళ్ళుచుండెను. సముద్రుడు ఆయనను శ్రీరామ దూతగా నెఱిగి, మైనాక పర్వతముతో పలికెను. "మైనాక! నీవు ఆతనిశ్రమను తొలగింపుము. (సముద్రమునుండి పైకి లెమ్ము నీపై ఆతనిని విశ్రమింప నిమ్ము.)

(చౌపాఈ॥ 1-5)

హనుమంతుడు ఆమైనాక పర్వతమును చేతితో తాకి, నమస్కరించి, ఇట్లు నుడివెను. "సోదరా! శ్రీరామచంద్రునికార్యము పూర్తికానిదే నాకు విశ్రాంతి యెక్కడిది?" (దోహా॥ 1)

పవనసుతుడైన హనుమంతుడు సాగిపోవుచుండుట చూచి, దేవతలు ఆతని బలమును, బుద్ధి వైశిష్ట్యములను పరీక్షింపదలచిరి. వారు 'సురస' అను నాగమాతను పంపిరి. ఆమె హనుమంతుని సమీపించి, ఇట్లు వచించెను. "దేవతలు నాకు ఈనాడు భోజనమును ప్రసాదించినారు." ఈ మాటలను వినగానే పావని పలికెను. "శ్రీరాముని కార్యమును నెఱవేర్చి, తిరిగి వచ్చి, సీతాదేవి సమాచారమును శ్రీరామునకు తెల్పిన పిదప నేను నీ నోటిలో ప్రవేశించెదను. తల్లీ! నేను సత్యమును వచించుచున్నాను. ఇప్పుడు నన్ను పోనిమ్ము". కాని ఏవిధముగను ఆమె ఆయనను పోనీయలేదు. అప్పుడు హనుమంతుడు "ఐతే నన్ను మ్రింగుము" అనెను. ఆమె తననోటిని ఒక యోజనము వెడల్పు చేసెను. అప్పుడతడు తన శరీరమును దానికి రెండింతలు విస్తరింప జేసెను. సురస తన నోటిని పదునాఱు యోజనముల వెడల్పు చేయగా ఆయన తన దేహమును ముప్పది రెండు యోజనములు పెంచెను. ఇట్లు సురసతన నోటిని వెడల్పుచేసినకొలదియు, ఆయన తన తనువును దానికి రెండింతలుగా పెంచుచువచ్చెను. చివరకు ఆమె నోటిని నూఱు యోజనముల వెడల్పుచేసి తెఱవగనే వాయుసూనుడు అతి సూక్ష్మరూపమును దాల్చి, అతివేగముగా ఆమె నోటిలో దూరి వెంటనే బయటికి వచ్చి, ఆమెకు నమస్కరించి, వెళ్ళుటకు అనుమతిని అడిగెను. ఆమె అనెను. "నేను నీ బుద్ధిబలకౌశలములను తెలిసికొంటిని. దాని కొఱకే దేవతలునన్ను పంపియుండిరి.

(చౌ॥ 1-6)

నీవు శ్రీరామచంద్రుని పనులనన్నింటిని నెఱవేర్చెదవు. నీవు బుద్ధిబలములకు పెన్నిధివి". ఇట్లాశీర్వదించి, సురస తననివాసమునకు మఱలిపోయెను. హనుమంతుడు ప్రసన్నచిత్తుడై ముందునకు సాగెను. (దో॥ 2)

సముద్రములో ఒక రాక్షసి (సింహిక) నివసించుచుండెను. అది తన మాయవలన ఆకాశములో ఎగురు పక్షులను పట్టుకొనుటకు ఉపాయములను పన్నుచుండెను. ఆకాశమున తిరుగుచున్న ప్రాణులనీడలను పట్టుకొనుచుండెను. అప్పుడవి ముందుకు సాగిపోలేకయుండగా వాటిని ఆకర్షించి భక్షించుచుండెను. అదే ఉపాయమును హనుమంతునిపైగూడ ప్రయోగించెను. అతడు వెంటనే దాని మాయోపాయములను కనిపెట్టెను. ధీరబుద్ధియు, వీరుడును ఐన మారుతి ఆ సింహికను హతమార్చి, సముద్రమును దాటెను. ఆవలితీరమును జేరి, అచటి వనశోభను తిలకించెను. మధులోభముచే మధుపములు రొదచేయుచుండెను. నానా విధములైన వృక్షములు ఫలపుష్పములచే విరాజిల్లుచుండెను. పశుపక్షి సమూహములను జూచి, ఆయన మనస్సు మిక్కిలి ప్రసన్న మాయెను. ఎదుటనున్న విశాలపర్వతమును జూచి, నిర్భయముగా దానిపైకి ఎక్కెను. (శివుడు పలుకు చున్నాడు) ఉమా! ఇందు హనుమంతుని గొప్పదనమేమియులేదు. ఇదియంతయును ఆ ప్రభు మహిమయే. ఆయన కాలునిగూడ కడతేర్చగలడు. హనుమంతుడు పర్వతముపైనుండి లంకా నగరమును జూచెను. అక్కడ వర్ణనాతీతమైన ఒక దుర్గముండెను. అది మిక్కిలి ఎత్తైనది. దానికి నాలుగువైపుల సముద్రము ఉండెను. దానిబంగారుప్రాకారములు తమతేజస్సులను వెదజల్లుచుండెను. (చౌ॥ 1-6)

చిత్రవిచిత్రములైన మణులచేపొదగబడిన ఆప్రాకారములలోపల అనేక సుందర భవనములుండెను. వీధికూడలులు, అంగళ్ళు, వీధులు, సుందరమార్గములతో అలంకరింపబడి, ఆ నగరము చూడముచ్చటగానుండెను. ఏనుగులు, గుఱ్ఱములు, రథములు, కంచరగాడిదలు, పదాతిదళములు మున్నగు వానితోగూడిన ఆ సైన్యమును ఎవరు లెక్కింపగలరు? కామరూపధారులైన రాక్షసగణములు వారిబలమైనసైన్యములు, వర్ణింపనలవిగాకున్నవి. వనములు, తోటలు, ఉపవనములు, లతానికుంజములు, తటాకములు, బావులు, సరస్సులు చూపరులకు ఆహ్లాదకరములుగా నున్నవి. మనుష్య, నాగ, దేవతా, గంధర్వ కన్యలు తమతమ రూపవిలాసవైభవములచే

మునులమనస్సులనుగూడ దోచుకొనునట్లుండిరి. అక్కడక్కడ పర్వతాకారులైన మల్లులు గర్జించుచుండిరి. వారు పరస్పరము పెక్కురీతుల రెచ్చగొట్టుకొనుచు కయ్యమునకు కాలుదువ్వుచుండిరి. మహాకాయులై భయంకరముగానున్న పెక్కుమందియోధులు ఆనగరముయొక్క నలుదిక్కులను జాగరూకతతో రక్షించుచుండిరి. దుష్టులైనకొందఱు రాక్షసులు దున్నపోతులను, మనుష్యులను, ఆవులను, గాడిదలను, మేకలను భక్షించుచుండిరి. వీరందఱును శ్రీరామచంద్రుని బాణసమూహములనెడి తీర్థములలో శరీరములను త్యజించి, తప్పక సద్గతులను పొందెడివారే. కావున తులసీదాసు వీరినిగూర్చి చాల సంక్షిప్తముగా తెల్పెను. (ఛంద్॥ 1-3)

# హనుమంతుని లంకానగర ప్రవేశము

అసంఖ్యాకులైన రక్షకభటులు నగరమును రక్షించుచుండుటను జూచి, మారుతి తనమనస్సులో ఇట్లు ఆలోచించుచుండెను. నేను మిక్కిలి సూక్ష్మరూపమును ధరించి, రాత్రియందు నగర ప్రవేశము చేయవలయును. (దో॥ 3)

మశకసమానమైన సూక్ష్మరూపమును దాల్చి, మానవావతారమునుదాల్చిన విష్ణువును (శ్రీరాముని) స్మరించుచు హనుమంతుడు లంకలో ప్రవేశించెను. లంకాద్వారముపైనున్న 'లంకిణి' అను రాక్షసి "నా అనుమతి లేకుండ లోపల ప్రవేశించిన నీవు ఎవరు?" అని ప్రశ్నించెను. "మూర్ఖుడా! నా సంగతి నీవెఱుగవా? ప్రపంచములోని చోరులందఱును నాకు ఆహారము కావలసినదే." అనెను. మహాబలశాలియైన ఆంజనేయుడు దానిపైనొక్క ముష్టిఘాతమువేయగా అదిరక్తమునుగ్రక్కుచు నేలపై బడెను. మఱల ఆ రాక్షసి తనను తాను సంబాళించుకొని, లేచి నిలబడి, వినయముతో చేతులు జోడించి పలికెను." బ్రహ్మదేవుడు రావణునకు వరములను ఇచ్చి వెళ్ళునపుడు సంకేతముగా నాకొక మాట చెప్పియుండెను. ఒక వానరము నిన్ను ముష్టి ప్రహారములచే బాధించినపుడు రాక్షససంహారకాలము సమీపించినదని ఎఱుంగుము. 'నాయనా! శ్రీరాముని దూతను కన్నులార గాంచుట నా మహద్భాగ్యముగా తలంచుచున్నాను. (చౌ॥ 1-4)

నాయనా! స్వర్గమోక్షములవలన లభించు సుఖములన్నింటిని త్రాసులో ఒక ప్రక్కన ఉంచినను అవియన్నియును ఒక క్షణమాత్రము లభించిన సాధుజనసాంగత్యసుఖముతో సమానముగావు. (దో॥ 4)

నీవు కోసలాధిపతియైన శ్రీరామచంద్రుని నీ మనస్సులో స్మరించుచు లంకలో ప్రవేశించి, నీ కార్యములనన్నింటిని నెఱవేర్చుకొనుము. (కాక భుశుండి పలుకుచున్నాడు) వైనతేయా! శ్రీరామచంద్రునికృపకుపాత్రుడైన వ్యక్తికి విషముగూడ అమృతమగును. శత్రువులు మిత్రులయ్యెదరు. సముద్రము గోష్పాదమంతయగును. అగ్ని శీతలమగును. అతనికి మేరు పర్వతముగూడ సైకతరేణుతుల్యమగును. హనుమంతుడు అతి సూక్ష్మరూపమును దాల్చి రాముని స్మరించుచు నగరమున ప్రవేశించెను. అతడు ప్రతి భవనమునందును వెదకెను. అక్కడక్కడ అసంఖ్యాకులైన యోధులుండిరి. పిదప అతివిచిత్రమై వర్ణనాతీతమైన రావణుని భవనమున అడుగిడెను. గాఢనిద్రలోనున్న రావణుని అచ్చట చూచెను. కానీ సీతాదేవిజాడ కనబడలేదు. పిదప శ్రీహరిమందిరముగల ఒక మహాభవనమును గాంచెను. (చౌ॥ 1-4)

# పావని విభీషణుని కలియుట - సీతామాతను దర్శించుట

ఆ భవనముపై శ్రీరామునిధనుర్బాణములు చెక్కబడియున్నవి. వాటిశోభలు వర్ణింపనలవికానివి. అచట నూతనములైన తులసిమొక్కలను జూచి కపివరుడు మిక్కిలి సంతసించెను. (దో॥ 5)

ఆ మారుతి తనమనమున ఇట్లాలోచింపసాగెను. "ఈ లంక రాక్షసులమూకలకు నివాస స్థానము. ఇచ్చట సజ్జనులు ఉండుట ఎట్లు?" ఈ విధముగా అతడు ఆలోచించుచుండగా విభీషణుడు నిద్రనుండి మేల్కొని రామనామస్మరణ చేసెను. అందువలన అతనిని సజ్జనునిగా గుర్తించి, హనుమంతుడు మనస్సున సంతసించెను. "ఇతనితో అవశ్యముగా పరిచయము చేసికొన వలసినదే. ఏలనన సాధుజన సాంగత్యమువలన కార్యహాని ఎన్నడును జరుగదు." అని తలంచెను. బ్రాహ్మణ రూపముధరించి, హనుమంతుడతనిని పిలిచెను. ఆ పిలుపు విని విభీషణుడు లేచి వచ్చి, ప్రణమిల్లి, కుశలమడిగి పల్కెను. "బ్రాహ్మణోత్తమా! మీ వృత్తాంతమును దెల్పుడు. మీరు హరిభక్తులలో (నారదాదులలో) ఒకరా? లేక దీనదయాళువులైన శ్రీరామచంద్రులా? నన్ను భాగ్యశాలిగా జేయుటకు విచ్చేసినారా? మిమ్ము చూచుటవలన నా హృదయమున ప్రేమ ఉప్పొంగు చున్నది. (చౌ॥ 1-4)

అపుడు హనుమంతుడు శ్రీరామునికథను పూర్తిగా తెలిపి, తన పేరును వెల్లడించెను. శ్రీరాముని గుణములను స్మరించుచు ఉభయులమనస్సులు ఆనందమున తేలియాడెను. ఇరువురితనువులు ఒక్కసారిగా పులకితములయ్యెను. (దో॥ 6)

విభీషణుడు పలికెను. ఓ పవనకుమారా! ఇచ్చట నా ఉనికినిగూర్చి వినుము. నేను దంతముల మధ్య నాలుకవలె నిస్సహాయస్థితిలో నున్నాను. నాయనా! సూర్య వంశ ప్రభువైన శ్రీరామచంద్రుడు దిక్కులేని స్థితిలోనున్న నాపై అనుగ్రహము చూపునా? నా శరీరము తామసికమైనది. భగవత్ప్రాప్తి సాధనలనునేను ఎఱుగను. శ్రీరామచంద్రుని చరణకమలములపై ప్రీతియు నా మనస్సున లేదు. కాని ఆంజనేయా! ఆ ప్రభుకృపమాత్రము నా యెడగలదని నాకు గట్టి నమ్మకము ఏర్పడినది. ఏలనన శ్రీహరి కరుణలేనిదే సాధుసమాగమము జరుగదు. శ్రీ రఘునాథుని దయయున్నది గావుననే మీరు స్వయముగా వచ్చి నాకు మీ దర్శనమును గల్గించితిరి" హనుమంతుడు వచించెను. " విభీషణా! తనసేవకులపై నిరంతరము ప్రేమను ప్రసరింపజేయుటయే ప్రభువుయొక్క స్వభావము. మీరే వచింపుడు నేను ఉన్నతకులజుడనా? చంచలస్వభావముగల వానరుడను. దీనుడను, హీనుడను. ప్రాతఃకాలమున మాపేర్లు ఉచ్చరించినవారికి ఆదినమంతయు అన్నము దొరకదు. (ఈ విధముగ పలుకుట భక్తియందలి దైన్యభావము, ఆంజనేయుని భక్తికి పరాకాష్ఠ) (చౌ॥ 1-4)

కాని మిత్రమా! "అధముడనైన నాపైగూడ శ్రీరామచంద్రుడు తనకృపను ప్రసరింపజేసెను." భగవంతునిగుణగణములను స్మరింపగానే హనుమంతునినయనములు ప్రేమాశ్రుపూరితములాయెను.

(దో॥ 7)

"ఇవి యన్నియు తెలిసియు అట్టి స్వామిని మఱచి, విషయ వాసనలయందు భ్రమించువారు దుఃఖితులుగాక యుందురా?" ఈ విధముగా శ్రీరామునిమహత్త్వమును వర్ణించుచు ఆంజనేయుడు అనిర్వచనీయపరమశాంతిని పొందెను. పిమ్మట విభీషణుడు జానకీదేవి అక్కడ (లంకలో) ఏ విధముగ నున్నదియు - విపులముగా దెలిపెను. అప్పుడు హనుమంతుడు విభీషణునితో "సోదరా! నేను జానకీ మాతను దర్శింపవలెను" అని నుడివెను. విభీషణుడు అతనికి ఉపాయములనన్నింటిని తెలిపెను. హనుమంతుడు ఆయనకడ సెలవుగైకొని, అటనుండి బయలు దేఱెను. పిదప సూక్ష్మరూపమును ధరించి, సీతాదేవియున్న అశోకవనమునకు పోయెను. ఆమెను చూడగనే మారుతి తనమనస్సులోనే ఆమెకు ప్రణామములను ఆచరించెను. రాత్రియంతయు ఆమె ఒకేవిధముగా కూర్చొనియున్నట్లు గమనించెను. ఆమెశరీరము కృశించియుండెను. తలపైనికేశములు జడలుగట్టి ఒకే కొప్పుగా ఉండెను. ఆమె నిరంతరము శ్రీ రఘునాథునినామ గుణములనే స్మరించుచుండెను. (చౌ॥ 1-4)

ఆమె తన దృష్టిని నిజపాదములపై నుంచి, మనస్సును మాత్రము శ్రీరాముని చరణకమలములపై నిలిపెను. ఖిన్నురాలైన జానకీదేవిని జూచి, పావనియు మిక్కిలి విచారపడెను. (దో॥ 8)

# రావణుని బెదరింపు - సీత హెచ్చరిక

హనుమంతుడు చెట్లఆకులమధ్య దాగుకొని కూర్చుండి "ఈమె యొక్క దుఃఖమును దొలగించుటకు నేనేమి చేయవలయును?" అని ఆలోచింపసాగెను. అదే సమయమున వివిధాలంకార భూషితులైన స్త్రీలతోపాటు రావణుడు అచటికి వచ్చెను. దుష్టరావణుడు సీతాదేవికి అనేక విధముల నచ్చజెప్ప ప్రయత్నించెను. సామ, దాన, భయ భేదోపాయములతో ఆమెను తన వైపు త్రిప్పుకొనజూచెను. ఇంకను అతడు ఇట్లు నుడివెను. " ఓ సుముఖీ, బుద్ధిమతీ! వినుము. మండోదరి మున్నగు రాణులనందఱిని నీకు దాసీలనుగా జేసెదను. ఇదియే నాప్రతిజ్ఞ. ఒక్కసారి నావైపు చూడుము." జానకీదేవి తనప్రాణేశ్వరుడైన శ్రీరాముని స్మరించి, ఒక గడ్డిపోచను ముందుంచుకొని పలికెను. "ఓ దశాననా! వినుము. మిణుగురు పురుగు ప్రకాశముతో కమలము వికసించునా? నీవు మిణుగురు పురుగుతో సమానము - అని తెలిసికొనుము. దుష్టుడా! శ్రీరఘు వీరుని బాణములశక్తి నీ వెఱుగవా? శఠుడా! ఒంటరిగా నున్న నన్ను అపహరించి తీసికొని వచ్చితివి. నీచుడా! నీకు సిగ్గులేదా! (చౌ॥ 1-5)

తనను మిణుగురుపురుగుతోడను, శ్రీరామచంద్రుని సూర్యునితోడను పోల్చుచు సీతాదేవి పలికిన కఠోరవచనములను విని, రావణుడు సిగ్గుపడుచు తనకరవాలమును గైకొని, కోపముతో పలికెను. (దో॥ 9)

"ఓ సీతా! నీవు నన్ను అవమానించితివి. ఈ కఠోర ఖడ్గముచే నీ శిరస్సును ఖండించెదను. ఓ సుముఖీ! ఇప్పటికైనను నా మాటను అంగీకరింపుము. లేనిచో ప్రాణములపై ఆశ వదలు కొనుము." సీతాదేవి నుడివెను "ఓదశకంఠా! నీలకమలములహారమువలె సుందరములై, ఏనుగు తొండమువలె బలిష్ఠములును, విశాలములునైన నాస్వామిబాహువులు నా కంఠమును అలంకరించును. లేనిచో నీ కరవాలమైనను నాకంఠమును ఖండించును. వినుము. ఇదియే నా నిజమైన ప్రతిజ్ఞ. ఓ చంద్రహాసమా! (ఖడ్గమా!) శ్రీరామవియోగాగ్నివలన కలిగిన నాసంతాపమును చల్లార్చుము. ఖడ్గమా! నీ ధార తీక్ష్ణమైనది, శీతలమైనది, తిరుగులేనిది. నా దుర్భరదుఃఖమును హరింపుము".

సీతాదేవి పలుకులను విని రావణుడామెను చంపుటకు ఉద్యుక్తుడాయెను. అపుడు మయుని పుత్రికయైన మండోదరి అతనిని వారించుచు నీతి వాక్యములతో సమాధాన పఱచెను. రావణుడు రాక్షస స్త్రీలను బిలిచి, "మీరందఱును సీతను అనేకవిధముల భయపెట్టుడు" అని ఆజ్ఞాపించెను. " ఒక మాసములోగా నామాటలను అంగీకరింపనిచో ఈమెను నా ఖడ్గమునకు బలియిచ్చెదను. (చౌ॥ 1-5)

ఈ విధముగా పలికి, రావణుడు తన భవనమునకు వెళ్లెను. ఇచట భయంకరాకారులైన రాక్షస స్త్రీలు సీతాదేవిని అనేక విధముల భయపెట్టసాగిరి. (దో॥ 10)

# త్రిజటాస్వప్నము

వారిలో 'త్రిజట' అను ఒక రాక్షస స్త్రీ యుండెను. ఆమె వివేకవతి, శ్రీరామచరణములయందు అనురాగము గలది. ఆమె వారినందఱిని పిలిచి, తన స్వప్నమును గూర్చి తెలుపుచు "సీతాదేవికి సేవచేసినచో మీకు మేలు కలుగును." అని పలికెను. "ఒక వానరము లంకను పూర్తిగా కాల్చివేయుటను నేను స్వప్నమున జూచితిని. రాక్షససేనయంతయు నశించెను. రావణుడు దిగంబరుడై గాడిదనెక్కి పోవుచుండెను. అతని శిరస్సులన్నియు

ముండనము గావింపబడినవి. ఇరువది భుజములును ఖండింపబడినవి. అతడు దక్షిణదిశగా యమపురికి పోవుచుండెను. లంకారాజ్యమునకు విభీషణుడు రాజయ్యెను. శ్రీరామచంద్రుని విజయమునుగూర్చి నగరమున చాటింపు వేయబడెను. అపుడు ప్రభువు సీతాదేవికై వార్తను పంపెను. ఈ స్వప్నము కొలది దినములలో నిజమగును. ఇది ముమ్మాటికి జరిగితీరునని నా నమ్మకము." ఆమె మాటలకు రాక్షస స్త్రీలందఱును భయపడి, జానకీ దేవి పాదములపై బడిరి. (చౌ॥ 1-4)

పిమ్మట వారందఱును వేర్వేఱు దిశలకు వెళ్లిపోయిరి. సీతాదేవి తనలో తాను ఆలోచింపసాగెను. "ఒకనెల తరువాత ఈ రాక్షసాధముడు నన్ను వధించును". (దో॥ 11)

సీతాదేవి చేతులు జోడించి, త్రిజటతో పలికెను. "మాతా! ఈ దుఃఖసమయమున నీవే నాకు తోడునీడ. ఈ నా తనువు చాలించుటకు నీవే ఏదైననొక ఉపాయమును వెంటనే దెల్పుము. ఈ విరహవేదనను ఇంక నేను భరింపజాలను. కట్టెలను దెచ్చి, చితిని బేర్చి నిప్పంటించుము. ఓ బుద్ధిమతీ! నా పతిభక్తిని నిరూపించుకొననిమ్ము. శూలములవంటి రావణుని పలుకులను నేను వినజాలను." సీతాదేవి మాటలనువిని, త్రిజట ఆమె పాదములపై బడి, ఆమెను సమాధాన పఱచెను. శ్రీరామచంద్రుని బలపరాక్రమములను, కీర్తిని కొనియాడెను. " ఓసుకుమారీ! వినుము. రాత్రివేళలలో అగ్ని లభింపదు." అని పలికి ఆమె తన నివాసమునకు వెళ్లెను. అపుడు సీతాదేవి తన మనసులో ఇట్లు ఆలోచించెను. "విధాతయే నాకు ప్రతికూలుడు ఐనాడు. ఈ స్థితిలో నేనేమి చేయగలను? నిప్పుదొరకదు. బాధ తొలగదు. ఆకాశమున నిప్పులు (తారకలు) వెలుగుచున్నవి. కాని ఒక్కటిగూడ భూమిపై బడుటలేదు. చంద్రుడు పావక (అగ్ని) మయుడైనను, నేను అభాగ్యురాలను. అని తెలిసికొని, అతడును అగ్నిని ప్రకటించుటలేదు. ఓ అశోకవృక్షమా! నీవైనను నా వినతిని ఆలకింపుము. నా శోకమును హరించి, నీ పేరును సార్థకము చేసికొనుము. నీ నూతన కోమలపల్లవములు అగ్నివలె ఎఱ్ఱగా నున్నవి. ఎట్టి సంకోచమును పెట్టుకొనక అగ్నినిమ్ము. నా విరహబాధను ఉపశమింపజేయుము." ఈ విధముగా మిక్కిలి వ్యాకులపడుచున్న సీతాదేవిని చూచిన హనుమంతుడు క్షణమొక కల్పముగా గడిపెను. (చౌ॥ 1-6)

## అంగుళీప్రదానము - హనుమత్సందేశము

అప్పుడు హనుమంతుడు కొద్దిసేపు ఆలోచించి, పైనుండి శ్రీరాముని ఉంగరమును సీతాదేవిముందు పడవేసెను. తన ప్రార్థనను ఆలకించి అశోకవృక్షము నిప్పుకణమును పడవేసినదని భావించి, సీతాదేవి ప్రసన్నచిత్తయై ఆ యుంగరమును తన చేతిలోనికి దీసికొనెను! (సోరఠ॥ 12)

శ్రీరామ నామాంకితమైన సుందరమైన ఆ ఉంగరమును ఆమె గుర్తించి, ఆశ్చర్యచకితయై తదేకదృష్టితో చూడసాగెను. హర్ష విషాదములచే హృదయమున ఆందోళన పడి ఆలోచింపసాగెను. "శ్రీ రఘునాథుడు అజేయుడు. ఆయనను ఎవ్వరూ జయింపజాలరు. ఇట్టి దివ్యమైన చిన్మయమైన అంగుళీయకమును ఎవ్వరును కల్పింపలేరు." అని ఆమె తర్కించుకొనుచుండగా ఆంజనేయుడు తనమధురవచనములతో శ్రీరామచంద్రుని గుణములను వర్ణింపసాగెను. వానిని విని, సీతాదేవి దుఃఖము మటుమాయమయ్యెను. ఆమె దానియందే మనసును లగ్నముచేసి, చెవులప్పగించి, వినసాగెను. పవనపుత్రుడు శ్రీరామగాథను ప్రారంభమునుండియు వినిపించెను. "శ్రవణామృతమైన ఈ మనోహరగాథను వినిపించినదెవరు? నా యెదుటకేలరారు?" అని సీతాదేవి నుడివెను. అప్పుడు మారుతి ఆమె సమీపమునకు వచ్చెను. అంతట సీతాదేవి భయ విస్మయములతో ముఖమును ప్రక్కకు దిప్పుకొనెను అప్పుడు హనుమంతుడు వచించెను. "మాతా! జానకీదేవీ! నేను శ్రీరామచంద్రుని దూతను. కరుణానిధియైన ఆ స్వామిపై

ఆన. ఇది సత్యము తల్లీ! ఈ యుంగరమును నేనే తెచ్చితిని. ఆ ప్రభువు మీ కొఱకై దీనిని ఆనవాలుగా నాకిచ్చి పంపినారు." సీతాదేవి నుడివెను "నరవానరులకు సమాగమము ఎట్లు జరిగినది? తెల్పుము" అప్పుడు ఆ పావని జరిగిన సంఘటనలనన్నింటిని పూర్తిగా వివరించెను. (చౌ॥ 1-6)

ఆంజనేయుని ప్రేమైక వచనములను విని, ఆమెకతనిపై సంపూర్ణ విశ్వాసము కుదురుకొనెను. కృపాళువైన శ్రీరామునకు ఇతడు త్రికరణ శుద్ధిగా నిజమైన దాసుడు". అని ఆమె తలంచెను. (దో॥ 13)

భగవంతుని సేవకుడని తెలిసిన పిమ్మట ఆతనియెడ ఆమెప్రీతి ఇనుమడించెను. నేత్రములు ఆనందాశ్రువులతో నిండెను. తనువు పులకితమయ్యెను. సీతాదేవి వచించెను. "నాయనా! మారుతీ! నేను ప్రమాణపూర్వకముగా చెప్పుచున్నాను. విరహసముద్రములో మునిగిపోవుచున్న నన్ను రక్షించుటకు నీవు నిజముగా ఓడవైతివి. ఖరారియు, సుఖనిధానము అగు శ్రీరాముని కుశలమును, ఆయనతమ్ముడగు లక్ష్మణునిక్షేమమును ఇప్పుడు వినిపింపుము. శ్రీ రఘునాథుడు కోమల స్వభావుడు, దయాళువు. ఆంజనేయా! ఇపుడు ఆయన నాయెడ నిష్ఠురత్వమును వహించుటకు కారణమేమి? తనసేవకులకు సుఖశాంతులను గూర్చుటయే ఆయనకు సహజలక్షణము. శ్రీరఘువరుడు ఎప్పుడైనను నన్ను జ్ఞాపకము చేసి కొనుచుండునా? నాయనా! నా కన్నులు వారి కోమలశ్యామలశరీరమును జూచి శాంతిని పొందునా?" సీతాదేవి ఇట్లు నుడువుచుండగనే ఆమె నేత్రములయందు విరహాశ్రువులు నిండెను. అంతట ఆమె శోకతప్త ఆయెను. "హా నాథా! మీరు నన్ను పూర్తిగా విస్మరించినారు." అని పరిపరివిధముల పరితపింపసాగెను. సీతాదేవి విరహాకులిత యగుటను జూచి, హనుమంతుడు తనవినమ్రమృదువచనములను పలికెను. "తల్లీ! అత్యంతకరుణానిధి యైన శ్రీరామచంద్రుడు సోదరుడైన లక్ష్మణునితో గూడి కుశలముగా ఉన్నాడు. కాని మీ విరహమువలన దుఃఖితుడై యున్నాడు. మీరు మీ మనస్సున చిన్నబుచ్చుకొనవలదు. శ్రీరామచంద్రునిపై మీకు గల ప్రేమకు రెండింతలప్రేమ ఆయనకు మీపై గలదు.

(చౌ॥ 1-5)

మాతా! ఇప్పుడు శ్రీరఘునాథుని సందేశమును నిబ్బరముగా వినుడు. "ఇట్లు వచించుచు మారుతి ప్రేమపరవశుడాయెను. అతని తనువున పులకలెత్తెను. కన్నుల నీరునిండెను. (దో॥ 14)

"అమ్మా ఇవి శ్రీ రఘువరుని పలుకులు ' ఓ సీతా! నీ విరహకారణమున నాకు చరాచరములన్నియును ప్రతికూలములై యొప్పుచున్నవి. వృక్షముల లేలేత కిసలయములుగూడ నిప్పుకణికలైనవి. రాత్రులు కాళరాత్రులైనవి. చంద్రుడు సూర్యునివలె తపింపజేయుచున్నాడు. కలువవనములు ఈటెలవలె బాధించుచున్నవి. మేఘములు మఱుగుచున్న తైలమును వర్షించు చున్నట్లున్నవి. నా హితకారులును నన్ను బాధించు చుండిరి. శీతల మంద సుగంధ పవనములు పాముల బుసలవలె భయంకరములై తాపకారకములగుచున్నవి. ఇతరులతో చెప్పి కొనుటవలన దుఃఖము కొంచెము ఉపశమించును. కాని ఎవరితో చెప్పికొనగలను? దీనిని ఎవ్వరును అర్థము చేసికొనలేరు. ప్రియా! మన ప్రేమతత్త్వము నా మనస్సునకే తెలియును. కాని ఆ మనస్సు నీ యొద్దనే యున్నది. ఇదియే నా ప్రేమసారము- అని యెఱుంగుము.' "అమ్మా! ఇదియే ప్రభు సందేశము" ఈ మాటలను వినగానే సీతమ్మ ప్రేమాకులితయై తనశరీరస్మృతినే కోల్పోయెను. హనుమంతుడు పలికెను. "మాతా! మనస్సును చిక్కబట్టుకొనుము. సేవకులకు సుఖప్రదాతయగు శ్రీరామచంద్రుని స్మరింపుము. స్వామిమహిమను ధ్యానింపుము. కలవర పాటును త్యజింపుము. (చౌ॥ 1-5)

ఈ రాక్షససమూహములు శలభములతో సమానములు. శ్రీరాముని బాణాగ్నికి అవి ఆహుతి కాగలవు. తల్లీ! ధైర్యము వహింపుము. ఈరాక్షసులు నశించినారనియే భావింపుము. (దో॥ 15)

శ్రీరామచంద్రుడు మీ సమాచారమును ఎఱిగియుండినట్లైతే వారు ఏమాత్రము ఆలస్యము (విలంబము) చేసియుండెడి వారుకారు. ఓ సీతమ్మ తల్లీ! శ్రీరాముని బాణములనెడి సూర్యుని కిరణముల ధాటికి ఈ రాక్షస సేన యనెడి చీకటి నిలువ గలదా? మాతా! నేనే మిమ్ములను ఇక్కడ నుండి తీసికొని పోయి ఉండెడి వాడను. కాని అందులకు ప్రభునాజ్ఞ లేదు. ఇది ముమ్మాటికి నిజము. జననీ! కొన్ని దినముల వఱకు ఓపిక పట్టుము. ప్రభువు వానరులతోగూడి త్వరలో ఇచ్చటికి రాగలడు. రాక్షసులను సంహరించి, మిమ్ము ఇక్కడినుండి తీసికొని వెళ్లగలడు. నారదాదిమహర్షులు ముల్లోకములలో ఆయనకీర్తిని గానము చేయుదురు." ఈ మాటలను విని, సీతాదేవి పలికెను. "కుమారా! వానరులందఱును నీవలె చిన్నవారై యుందురు గదా! రాక్షసులు మిగుల బలవంతులు, యోధులు, అందుచే నాకు మిక్కిలి సంశయము కలుగుచున్నది." ఇది వినగానే హనుమంతుడు తన శరీరమును పెంచెను. అది బంగారువన్నె గలిగి మేరు పర్వత సమానముగా ఉండెను. మహా బలిష్ఠమై, పరాక్రమశోభితమై అది అరివీరభయంకరమై, ఒప్పుచుండెను. సీతాదేవి మనస్సు కుదుటబడెను, విశ్వాసము బలపడెను. హనుమంతుడు మఱల లఘు రూపమును ధరించెను. (చౌ॥ 1-5)

"జననీ! వినుడు. వానరులకు ఎక్కువగా బుద్ధి బలములు ఉండవు. కాని ప్రభుమహిమవలన చిన్నపాము గూడ గరుడుని తినివేయగలదు (అనగా మిక్కిలి దుర్బలుడు గూడ గొప్ప బలవంతుని చంపివేయగలడు) (దో॥ 16)

భక్తి, ప్రతాపము, తేజస్సు, బలములతో గూడిన హనుమంతుని మాటలకు సీతాదేవి మనస్సు మిక్కిలి సంతసించెను. ఆంజనేయుడు శ్రీరామునకు అత్యంత ప్రీతిపాత్రుడని తెలిసికొని, సీతాదేవి "కుమారా! నీవు బలశీలములకు నిధివగుదువు." అని ఆశీర్వదించెను. "నాయనా! నీవు జరా మరణ ములు లేనివాడవై సద్గుణఖనివి అగుదువు గాక. శ్రీరఘునాథునకు అత్యంత ప్రేమ పాత్రుడవు కాగలవు. ప్రభువు నీపై కృప జూపుగాక." ఈ మాటలను వినగానే మారుతి పూర్తిగా భక్తి పరవశుడాయెను. సీతాదేవికి మాటిమాటికి ప్రణమిల్లి, అంజలి ఘటించి యిట్లనెను. "తల్లీ! నేనిప్పుడు సఫలమనోరథుడనైతిని. మీ ఆశీర్వాదము అమోఘము. ఇది జగమెఱిగిన సత్యము. అమ్మా! ఈ మధుర ఫలవృక్షములను జూచుటతో నాకు మిక్కిలి ఆకలిగానున్నది." సీతాదేవి పలికెను. "నాయనా! బలిష్ఠులైన రాక్షసయోధులు ఈ వనమును రక్షించుచున్నారు." పిమ్మట హనుమంతుడు "జననీ! మీరు మనః ప్రసన్నత కలిగియున్నచో నాకీ రాక్షసులవలన భయము ఏమాత్రము లేదు." అని వచించెను. (చౌ॥ 1-5)

హనుమంతుడు బుద్ధిబలవరిష్ఠుడని గ్రహించి, జానకీదేవి ఇట్లనెను. "నాయనా! వెళ్లుము. శ్రీరామచంద్రుని చరణముల యందు నీ మనస్సును లగ్నమొనర్చి, ఈ మధురఫలములను ఆరగింపుము." (దో॥ 17)

## మారుతి అశోకవనమును విధ్వంసమొనర్చుట - రావణుని సభలో ప్రవేశించుట

ఆంజనేయుడు సీతాదేవికి శిరసా ప్రణమిల్లి, వనమున ప్రవేశించెను. అక్కడ ఫలములను తినుటయే గాక వృక్షములను కూలద్రోయసాగెను. పెక్కు మంది రాక్షస యోధులు ఆ వనమునకు రక్షకులుగా ఉండిరి. వారిలో కొందఱిని అతడు హతమార్చెను. మిగిలిన వారు రావణుని యొద్దకు వెళ్లి, మొఱపెట్టుకొనిరి. "ప్రభూ! ఒక పెద్ద వానరము వచ్చి, అశోకవనమును ఛిన్నాభిన్నమొనర్చినది. పండ్లనారగించి చెట్లను నేలపాలు చేసినది. వనరక్షకులను బాగుగా మర్దించి, దూరముగా విసరి వేసినది." ఈ మాటలకు కుపితుడైన రావణుడు పెక్కుమంది యోధులను పంపెను. వారిని జూచి హనుమంతుడు గర్జించెను. రాక్షసులనందఱిని మట్టుబెట్టెను. కొందఱు చావునుండి తప్పించు

కొని, పలాయనము చిత్తగించిరి. పిమ్మట రావణుడు తనతనయుడైన అక్షకుమారుని బంపెను. అతడు సంగ్రామనిపుణులైన అసంఖ్యాకయోధులను వెంట నిడుకొని వచ్చెను. వారి రాకను చూచి, హనుమంతుడు ఒక వృక్షమును పెకలించి, వారిని రెచ్చగొట్టెను. అక్షకుమారుని వధించి, భయంకరముగా గర్జించెను. (చౌ॥ 1-4)

మారుతి రావణునిచే పంపబడిన యోధులలో కొందఱిని చంపెను, కొందఱిని మర్దించెను. మఱికొందఱిని నుగ్గునుగ్గు గావించి, మట్టిలో గలిపెను. హతశేషులు తప్పించుకొని పోయి, రావణునితో మొఱపెట్టుకొనిరి. "ప్రభూ! ఆ వానరుడు మిక్కిలి బలశాలి. (దో॥ 18)

అక్షకుమారునిమరణవార్తను విని, లంకేశుడు క్రుద్ధుడై, మండిపడెను. వెంటనే అతడు తన జ్యేష్ఠకుమారుడైన 'మేఘనాదు'ని పంపుచు, అతనితో ఇట్లనెను. "కుమారా! ఆ వానరుని చంపవలదు, బంధించి తీసికొని రమ్ము. అతడెక్కడివాడో తెలిసికొందముగాక." ఇంద్రుని జయించిన మేఘనాదుడు మిక్కిలి బలశాలి, తమ్ముని మరణమునకు మిక్కిలి క్రుద్ధుడాయెను. ఈసారి వచ్చిన యోధుడు మిక్కిలి భయంకరుడని హనుమంతుడు గ్రహించెను. పండ్లు పటపట కొఱుకుచు గర్జించుచు అతనిపై విరుచుకొని పడెను. ఒక మహావృక్షమును పెకలించి, రావణుని కుమారునిపై వేసి, అతనిని విరథునిగా జేసెను. అతనితోపాటు యుద్ధము చేయుచున్న పరాక్రమ వంతులైన యోధులు కొందఱిని పట్టుకొని, శరీర బలముతో, నలిపివేసెను. మఱికొందఱిని కాళ్లతో తన్ని, చేతులతో మర్దించి హతులను గావించెను. పిమ్మట మారుతి మేఘనాదునితో తలపడెను. ఆ ఉభయులపోరాటము రెండు మదపుటేనుగులు ద్వంద్వయుద్ధము చేయుచున్నట్లుండెను. హనుమంతుడు మేఘనాదుని ఒక ముష్టిఘాతముతో క్రింద పడవేసి, ఒక వృక్షముపై నెక్కి కూర్చుండెను. మేఘనాదుడు కొంత తడవు మూర్ఛిల్లెను. అతడు తిరిగి లేచి, పెక్కు మాయలు పన్నెను. కాని అతడు పవన పుత్రుని జయింపలేక పోయెను. (చౌ॥ 1-5)

కడకు మేఘనాదుడు బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. ఆంజనేయుడు తనమనస్సులో ఇట్లాలోచించెను. నేనీ బ్రహ్మాస్త్రమును గౌరవింపనిచో దాని అపారమహిమ వ్యర్థమగును. (దో॥ 19)

మేఘనాదుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రము తగులగానే హనుమంతుడు వృక్షమునుండి క్రింద బడెను. పడునప్పుడు ఆయన పెక్కుమందిశత్రువులను హతమొనర్చెను. వానరుడు మూర్ఛితుడగుట జూచి, మేఘనాదుడు అతనిని నాగపాశముతో బంధించి, రావణునిసభకు తీసికొని పోయెను. (శివుడు పల్కుచున్నాడు) "పార్వతీ! వినుము శ్రీరామునినామజప ప్రభావముచే మనుష్యులు సంసారబంధములనుండి విముక్తులయ్యెదరు. అట్టి రామునిబంటు బంధములలో చిక్కుపడునా? కాని తన స్వామికార్యసాఫల్యమునకై ఆంజనేయుడు బ్రహ్మాస్త్రమును గౌరవించుచు నాగ పాశములలో ఒదిగియుండెను. వానరుడు బంధింపబడినాడని విని, రాక్షసులందఱును ఆవినోదమును చూచుటకు సభకు పరుగెత్తుకొని వచ్చిరి. హనుమంతుడు దశముఖునిసభను, అతని అపారైశ్వర్యములను జూచెను. దేవతలును, దిక్పాలురును, సభలో చేతులు కట్టుకొని సవినయముగా నిలబడియుండిరి. వారు క్రూరములైన రావణునిచూపులకే వణకిపోవుచుండిరి. రావణుని ప్రతాపమును చూచియు హనుమంతుడు ఏ మాత్రమూ చలింపలేదు. సర్పములమధ్య గరుడునివలె అతడు నిర్భయుడై నిలుచుండెను. (చౌ॥ 1-4)

దశాననుడు వాయునందనుని జూచి పరుషములాడుచు పరిహసించెను. కాని తన పుత్ర మరణము జ్ఞప్తికి రాగానే అతని మనస్సునందు విషాదము పొడసూపెను. (దో॥ 20)

లంకేశ్వరుడిట్లు పలికెను. "ఓ వానరా! నీవు ఎవడవు? ఎవనిబలము చూచుకొని నీవునా వనములోని వృక్షముల నన్నింటిని నేలగూల్చితివి? నీవు ఎప్పుడైనను నా పేరును, కీర్తిని వినియుంటివా? అరే! శఠుడా! నీవు అత్యంత

నిర్భయుడవుగా కనబడుచున్నావు. ఏ అపరాధమునకై నీవు రాక్షసులను హతమార్చితివి? మూర్ఖుడా! తెలుపుము. నీకు ప్రాణములమీద తీపిలేదా? " వాయుసూనుడిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "దశాననా! రావణా! వినుము. శ్రీరాముని బలపరాక్రమములనుగూర్చి నీవు ఎఱుగవుగాబోలు ఆయనబలప్రభావములవలననే ప్రకృతి సమస్తబ్రహ్మాండములను సృష్టించుచున్నది. బ్రహ్మవిష్ణు మహేశ్వరులు జగత్సృష్టిస్థితి లయములను నెఱపుచుండుట ఆయన ప్రభావముననే. సహస్రఫణములుగల శేషుడు పర్వతములు, వనములుగల ఈ బ్రహ్మాండములభారమును మోయగల్గుట ఆయనవలననే. దేవతలను రక్షించుటకును, నీవంటి దుష్టులను శిక్షించుటకును ఆయనయే పెక్కు అవతారములను దాల్చుచుండును. ఆయన అమోఘమైన శివధనుస్సు విఱిచి, నీ అహంకారమును రూపుమాపెను. రాజన్యుల మదమణచెను. ఖరదూషణ త్రిశిరులను, వాలి మొదలగు బలశాలురను వధించినది ఆయనయే. (చౌ॥ 1-5)

మహిమాన్వితుడైన ఆయన బలములోని లవలేశ ప్రభావముననే నీవు ఈ సమస్త చరాచర జగత్తును జయింపగల్గితివి. మూర్ఖుడా! అట్టి బలపరాక్రమసంపన్నుడైన శ్రీరాముని యొక్క ధర్మపత్నిని నీవపహరించితివి. నన్ను ఆ శ్రీరామచంద్రస్వామిదూతగా ఎఱుంగుము. (దో॥ 21)

నీ సామర్థ్యము నాకు తెలియనిదిగాదు. సహస్రబాహువుతో పోరాడి యుంటివి. వాలితో యుద్ధముచేసి యశమును సంపాదించితివి. (సహస్రబాహువునేపరశురాముడోడించెను. ఆ పరశురాముడు శ్రీరామునిచే ఓడింపబడెను. వాలినిన్ను తన చంకనబెట్టుకొని తిరిగెను. బ్రహ్మ ప్రమేయముతో నీకు ఆ వాలినుండి విముక్తి లభించెను. అట్టి మహాబలశాలియైన వాలిని సంహరించినవాడు శ్రీరాముడు. నేను ఆ రామప్రభుదూతను) రావణుడు హనుమంతుని నర్మగర్భిత వచనములను వినియు, విననట్లు నటించుచు ఊరకుండెను. "ఓరాక్షసరాజా! నాకు ఆకలివేసినందున హాయిగా పండ్లు నారగించితిని. వానరస్వభావముచే చెట్లపనిబట్టితిని. దుష్టరాక్షసులు నా జోలికి రాగా తగు విధముగా వారికి బుద్ధి చెప్పితిని. శరీరము మీద ఎవరికి ప్రీతి యుండదు? నీకుమారుడు మేఘనాదుడు నన్ను బంధించెను. దానికై సిగ్గుపడుటలేదు. ఏలనన నా స్వామి కార్యమును నెఱవేర్పదలచితిని. రావణా! చేతులుజోడించి ప్రార్థించెదను. అహంకారమును వీడి, నా మాటను వినుము. నీ వంశమర్యాదను కాపాడుకొనుము. భ్రమలు పెట్టుకొనక, భక్తులభయములను పాఱద్రోలునట్టి శ్రీరామచంద్రభగవానుని భజింపుము. సురాసురులను, సమస్త చరాచర జగత్తును, లయమొనర్చు కాలుడు (యముడు) గూడ ఆయనకు భయపడును. అట్టి శ్రీరామచంద్ర ప్రభువుతో వైరము వలదు. నా పలుకులను విని, జానకీదేవిని ఆయనకు అప్పగింపుము. (చౌ॥ 1-5)

ఖరునిసంహరించిన శ్రీరఘునాథుడు శరణాగతవత్సలుడు. కరుణాసాగరుడు. శరణుజొచ్చినచో నీ అపరాధములనన్నింటిని మన్నించి, నిన్ను కాపాడును. (దో॥ 22)

శ్రీరామమూర్తి చరణకమలములను నీవు ధ్యానింపుము. లంకారాజ్యమును నిరాఘాటముగా పాలింపుము. పులస్త్యబ్రహ్మయశస్సుఅనెడి నిర్మలచంద్రునిలో నీవు కళంకముకావలదు. రామనామములేనివాణి శోభింపదు. మదమును, మోహమును వీడి, ఆలోచింపుము. వివిధాభరణభూషితయైన సర్వాంగసుందరిగూడ వస్త్రహీనయైనచో శోభింపదు. శ్రీరామునకు విముఖుడైనవారి సంపదలు, అధికారము (లోగడ ఉన్నవి ప్రస్తుతము లభించుచున్నవి, ఇకముందు లభింపనున్నవి) అన్నియును వ్యర్థములే. నిత్యజలస్రోతస్సులు లేని నదులు (వర్ష జలములపై ఆధారపడి ప్రవహించునదులు) వర్షాకాలము ముగియగానే ఎండిపోవును. దశాననా! వినుము. నేను ప్రతిజ్ఞచేసి చెప్పుచున్నాను. శ్రీరాముని ఎదిరించిన వ్యక్తిని ఎవ్వరూ రక్షింపజాలరు. కనుక ఆ ప్రభువునెడ వైరము పూనిననిన్ను వేలకొలది బ్రహ్మ విష్ణు మహేశ్వరులు గూడ కాపాడజాలరు. (చౌ॥ 1-4)

మోహజనితమైన, దుఃఖప్రదమైన, తమోగుణాత్మకమైన దురభిమానమును వీడుము. రఘువంశ ప్రభువు, కృపానిధానము ఐన శ్రీరామచంద్రమూర్తిని భజింపుము. (దో॥ 23)

# లంకాదహనము

భక్తిజ్ఞాననీతివైరాగ్యయుక్తములైన హనుమంతుని హితోక్తులను పెడచెవిని బెట్టుచు దురభిమానియైన రావణుడు వెకిలిగా నవ్వుచు, "మాకు గొప్ప జ్ఞానియైన వానరము గురువుగా లభించినది." అని పల్కెను. "మూర్ఖుడా! నీకు చావుమూడినది. అందులకే మాకు ఉపదేశములనిచ్చుచుంటివి." అని రోసముతో నుడివెను. మారుతి వచించెను. "నిజమే దీనికి వ్యతిరేకముగా జరుగును. (అనగా మృత్యువు నిన్నే కబళింపనున్నది) నీ బుద్ధి నిజముగనే వక్రించినదని నేడు ప్రత్యక్షముగా తెలిసి కొంటిని" హనుమంతుని పలుకులను విని, కుపితుడైన రావణుడు ఇట్లు వచించెను. "ఎవరక్కడ? ఈ మూర్ఖుని ప్రాణములను ఏల హరింపరు?" నిశాచరులు ఈ మాటను వినగానే ఆంజనేయుని చంపుటకు ఉద్యుక్తులైరి. అదే సమయమున మంత్రులతో పాటు విభీషణుడు అక్కడికి వచ్చెను. అతడు రావణునకు శిరసా ప్రణమిల్లి, వినయముతో పలికెను. "స్వామీ! దూతను చంపరాదు. ఇది నీతివిరుద్ధము. మఱియొక శిక్షను విధింపుము. "ఈ సూచన ఉత్తమమైనది అని అందఱును పలికిరి. అదివిని రావణుడు నవ్వి "సరే! పోనిమ్ము. ఈ వానరుని అంగభంగము గావించి పంపుడు. (చౌ॥ 1-5)

వానరములకు వాలము ప్రాణతుల్యము. కావున నూనెలో గుడ్డలను ముంచి, వీని వాలమునకు చుట్టి, నిప్పంటించుడు. (దో॥ 24)

వాలమును కోల్పోయిన ఈ వానరము తిరిగి వెళ్లి, తన స్వామిని వెంట బెట్టుకొని వచ్చును. ఇతడు తెగబొగడిన ఇతని ప్రభుసామర్థ్యమును చూచెదగాక. "రావణుని మాటలను వినగానే ఆంజనేయుడు మనస్సులోనే నవ్వుకొనుచు వాగ్దేవిప్రేరణతో రావణునకు ఇట్టిబుద్ధి కలిగినది." అని యనుకొనెను. రావణునిఆజ్ఞతో మూఢరాక్షసులమూకలు ఆయనవాలమునకు నిప్పంటించుటకు పూనుకొనినవి. మారుతిలీలగా తన వాలమును అపరిమితముగా పెంచెను. నగరములోని బట్టలు, నేతులు, నూనెలు మిగులలేదు. నగరవాసులు ఈ వినోదమును చూచుటకు వచ్చిరి. వారు హనుమంతుని తమ కాళ్లతో తన్నుచు గేలిసేయసాగిరి. డోళ్లు మ్రోగించుచు, చప్పట్లు గొట్టుచూ వారు ఆయనను నగరమంతయున ఊరేగించి, వాలమునకు నిప్పంటించిరి. అగ్నిజ్వాలలను జూచి, హనుమంతుడు వెంటనే లఘురూపమును దాల్చెను. బంధములను త్రెంచుకొని, ఆయన బంగారు ప్రాకారముల పై దుముకుచుపోసాగెను. అదృశ్యమును గాంచి, రాక్షస స్త్రీలందఱును భయపడిరి. (చౌ॥ 1-5)

ఆ సమయముననే భగవత్ప్రేరణచే నలుబది తొమ్మిది వాయువులును ప్రచండముగా వీవసాగెను. వాయుసుతుడు అట్టహాసము చేయుచు, గర్జించుచు ఆకాశమును తాకునంతగా పెఱిగెను. (దో॥ 25)

శరీరము దీర్ఘమైనను మిక్కిలి లాఘవముతో మారుతి ఆయా భవనముల పైన ఒక దానినుండి మఱియొక దానిమీదికి దుముకుచు పోసాగెను. నగరమంతయు మంటలలో చిక్కుకొనెను. పౌరులు వ్యాకులురైరి. అగ్నికరాళజ్వాలలు అన్ని దెసలకును వ్యాపించెను. అందఱును 'అయ్యో! అమ్మా! నాయనా!' అని విలపించుచు ఈ సమయమున మమ్ము రక్షించువారెవ్వరు? అని బిగ్గరగా ఆక్రందనలు చేయసాగిరి. "ఇతడు వానరుడు గాడు. వానరరూపమున వచ్చిన ఒక దివ్య పురుషుడని మేము ముందే దెల్పితిమి. సాధుపుంగవులను అవహేళన చేసినచో ఫలితము ఇట్లే యుండును. నగరమంతయు దిక్కులేనిదై తగులబడిపోవుచున్నది." వాయుసూనుడు నగరమునంతయును ఒక్క క్షణములో అగ్నికి ఆహుతి గావించెను. ఒక్క విభీషణునిభవనమును మాత్రము

తాకలేదు. (శివుడు పలుకుచున్నాడు) పార్వతీ! అగ్నిని సృజించిన భగవంతునకు హనుమంతుడు దూత. కావున పరమభక్తుడైన మారుతికి ఆ అగ్ని ఏమాత్రము హాని కలిగింపలేదు. అటునిటు తిరుగుచు లంకనంతయును కాల్చి, చివరకు ఎగిరి సముద్రమున దూకెను. (చౌ॥ 1-4)

# చూడామణి ప్రదానము

వాలమును ఆశ్రయించిన అగ్ని చల్లారగా ఆంజనేయుడు అలసట దీర్చుకొని లఘురూపమును ధరించి, మఱల సీతాదేవి సమ్ముఖమునకు వచ్చి, చేతులు కట్టుకొని నిలబడెను. (దో॥ 26)

పిమ్మట ఆయన సీతాదేవితో పలికెను. "అమ్మా! శ్రీ రఘునాథునివలె మీరును ఒక ఆనవాలును దయచేయుడు." అప్పుడు సీతాదేవి తనచూడామణిని తీసి యిచ్చెను. హనుమంతుడు దానిని పరమానందముతో గైకొనెను. సీతామాత నుడివెను. "నాయనా! ప్రభువునకు నా ప్రణామములను అర్పించి, ఈ విధముగా నా వచనములను వినిపింపుము. 'ప్రభూ! మీరు పూర్ణకాములు. ఐనను దీనులయెడను, దుఃఖితులమీదను దయచూపుటయే మీ సహజ స్వభావము. నేను దీనురాలను. నా సంకటములను దూరము చేయుడు.' నాయనా! నీవు ఇంద్రపుత్రుడైన జయంతునికథను స్వామికి వినిపింపుము. ప్రభువునకు తనబాణముల ప్రతాపమును జ్ఞప్తికి దెమ్ము. ప్రభువు ఒక నెలలోపల ఇచటికి రానిచో నేను జీవించియుండను. కుమారా! నేను ప్రాణములను నిలుపుకొనుచున్న రీతిని దెల్పుము. నీవు తిరిగి వెళ్లుటకై అడుగు చున్నావు. నిన్ను జూచుటవలన నా మనస్సు కొంత స్తిమిత పడినది. ఇక మీదట మఱల నాకు అదే పగలు, అదే రాత్రి." (చౌ॥ 1-4)

హనుమంతుడు సీతాదేవిని అనేకవిధముల ఊరడించెను. ఆమెచరణములకు శిరసా ప్రణమిల్లి, శ్రీరాముని దర్శించుటకై బయలుదేఱెను. (దో॥ 27)

మఱలి వెళ్ళునప్పుడు మారుతి మహాధ్వనితో గర్జించెను. ఆ గర్జనను వినిన రాక్షసస్త్రీలకు గర్భపాతములయ్యెను. సముద్రమును దాటి ఈవలి తీరమునకు చేరిన ఆంజనేయుడు వానరులను గాంచి, గొప్పగా హర్షధ్వనులను గావించెను. హనుమంతుని జూచిన వానరులందఱును ప్రసన్నచిత్తులై మఱల జన్మించినంతగా సంతసించిరి. హనుమంతుని ముఖము ప్రసన్నమై శరీరము తేజోమహితమై యుండెను. ఇది చూచి, రామకార్యము నెఱవేఱినదని అందఱును గ్రహించిరి. నీరులేక గిలగిలలాడు చేపలకు నీరు లభించినట్లు వాయుసుతుని దర్శనముతో వానరులందఱును అమితానందములనందిరి. సీతాన్వేషణమునుగూర్చి పరస్పరము సంభాషించుకొనుచు వారు శ్రీరామునికడకు బయలు దేఱిరి. త్రోవలో మధువనమున ప్రవేశించి, అంగదుని అనుజ్ఞతో అమృతఫలములను తనివితీర ఆరగించిరి. వనరక్షకులు వారిని ఆపుటకు ప్రయత్నింపగా ముష్టి ఘాతములతో వారిని తఱిమివేసిరి.

(చౌ॥ 1-4)

(దధిముఖుడు, ఇతర) వనపాలకులు వెళ్లి, "యువరాజు అంగదుడు మొదలగువారు మధువనమును ధ్వంసము చేసినారు" అని సుగ్రీవునితో మొఱపెట్టుకొనిరి. ఇది వినిన సుగ్రీవుడు 'వానరులు ప్రభుకార్యమును సాధించుకొని వచ్చినారు' అని తలంచి ఆనందభరితుడయ్యెను. (దో॥ 28)

"వారు సీతాదేవి జాడను తెలిసికొని రానిచో మధువనమున స్వేచ్ఛగా కేరింతలు కొట్టగలరా? ఫలములను ఆరగింపగలరా?" అని సుగ్రీవుడు ఆలోచించుచుండగనే అంగదాదులందఱును అచ్చటికి విచ్చేసిరి. వారు సుగ్రీవునిపాదములకు నమస్కరించిరి. కపిరాజు సుగ్రీవుడు వారిని ప్రేమతో ఆలింగన మొనర్చుకొని, వారికుశలసమాచారములనడిగెను. వారు ఇట్లు నుడివిరి. "మీ చరణ దర్శనముచే మేమందఱము కుశలమే.

శ్రీరాముని అనుగ్రహముచే వెళ్ళిన విశేషకార్యము సఫలమైనది." జాంబవంతుడు పలికెను. "స్వామీ! హనుమంతుడే ఈ కార్యమును సాధించి, వానరులందఱి ప్రాణములను కాపాడెను." ఈ మాటలువినగానే సుగ్రీవుడు మఱియొకసారి హనుమంతుని కౌగిలించుకొని, వానరులందఱితో గూడి శ్రీరఘురాముని యొద్దకు చేరెను. తన కార్యమును నెఱవేర్చుకొని వచ్చిన కపులను గాంచి, శ్రీరాముడు మిక్కిలి సంతసించెను. గుహనుండి బయటికి వచ్చి, రామలక్ష్మణులు స్ఫటికశిలపై ఆసీనులైరి. వానరులందఱును వారికి పాదాభివందనముల నాచరించిరి. (చౌ॥ 1-4)

## హనుమదాదులు శ్రీరామునకు సీతాసందేశమును వినిపించుట

కరుణానిధియైన శ్రీరఘునాథుడు ప్రేమపూర్వకముగా వారినందఱిని ఆలింగనములతో ఆదరించి, కుశలసమాచారములనడిగెను. వారిట్లు పలికిరి. "ప్రభూ! మీ పాదపద్మముల దర్శనమైనది గావున మేమందఱము కుశలమే. (దో॥ 29)

జాంబవంతుడు పలికెను. "రఘునాథా! ప్రభూ! మీరు కృపజూపినవానికి తప్పక శుభములు చేకూరును. ఆతనియెడ దేవతలు, మునులు, మనుష్యులుగూడ ప్రసన్నులైయుందురు. అతడు విజయుడు, వినయశీలి, సద్గుణసంపన్నుడు అగును. అతనికీర్తి ముల్లోకములలో విరాజిల్లును. ప్రభుకృపాప్రభావమున సర్వకార్యములు సిద్ధించినవి. నేడు మా జన్మలు ధన్యములైనవి. ప్రభూ! పవనసుతుడు నెఱవేర్చిన కార్యములను వర్ణించుటకు సహస్రముఖములుగూడ చాలవు." పిమ్మట జాంబవంతుడు హనుమంతుని అద్భుతచరితమును స్వామికి వినిపించెను. అది విని కృపానిధియైన శ్రీరాముడు మిక్కిలి సంతోషించి, హనుమంతుని మఱల మఱల హృదయమునకు హత్తుకొనెను. ఇంకను ఇట్లనెను. "నాయనా! జానకి ఎట్లున్నది? ఎట్లు తనప్రాణములను రక్షించుకొనుచున్నది? తెలుపుము." (చౌ॥ 1-4)

పావని పలికెను. "ప్రభూ! రాత్రింబవళ్లు మీ పవిత్రనామమే ఆమె ప్రాణ పంజరమునకు కాపలాదారుడు. మీ ధ్యానమే ప్రాణములను నిలుపు కవాటము. ఆమె తన నేత్రములను (చూపులను) సర్వదా తనపాదములపై నిలుపును. అదియేకవాటపుతాళము. మఱి ఆమె ప్రాణములు పోవుటకు దారియేది? (దో॥ 30)

"నేను మఱలివచ్చునపుడు జానకీమాత. ఆనవాలుగా తనచూడామణిని ఇచ్చినది." శ్రీరఘురాముడు దానిని తీసికొని తనహృదయమునకు హత్తుకొనెను. హనుమంతుడు మఱలపలికెను. "ప్రభూ! జానకీదేవి అశ్రుపూర్ణనయనయై నాతో కొన్ని మాటలు పల్కినది. 'సోదర సహితుడైన ప్రభుపాదములకు నమస్కరించి, ఇట్లనుము. 'మీరు దీనబాంధవులు శరణుజొచ్చినవారి దుఃఖములను బాపుదురు. నేను త్రికరణ శుద్ధిగా మీ చరణములయందనురక్తురాలను ప్రభూ! మీరునన్ను విస్మరించుటకు నేజేసిన అపరాధమేమి? నా దోషము మాత్రము ఒక్కటి గలదు. మీకు దూరమైన తత్ క్షణముననే నేను అసువులను వీడలేదు. ఆ దోషమును నేను ఒప్పుకొందును. కాని ప్రభూ! ఈ దోషము నేత్రములది. అవి మీ దర్శనకాంక్షతో ఈ ప్రాణములు పోకుండ గట్టిగా అడ్డుపడుచున్నవి. విరహము అగ్నివంటిది. నా శరీరము ప్రత్తితో సమానము. నాశ్వాస వాయుతుల్యము. విరహాగ్నిలో నా శరీరము ఒక్క క్షణములో కాలిపోగలదు. కాని మిమ్ములనుజూచి ఆనందింపవలెనను కోరికతో నేత్రములు సంతతధారగా అశ్రువులను ప్రవహింపజేయుచున్నవి. అగ్నికి గాలి తోడైనను ఈ అశ్రుజల ప్రభావమున ఈ శరీరము దహింపబడుటలేదు' - సీతాదేవికి వచ్చిన ఆపదలు దుర్భరములైనవి. ఓ దీన దయాళూ! వాటిని గూర్చి చెప్పకుండుటయే మంచిది. చెప్పినచో వాటికి మీరు తట్టుకొనలేరు. (చౌ॥ 1-5)

ఓ దయానిధీ! ఆమె అక్కడ క్షణమొక యుగముగా గడుపుచున్నది. వెంటనే వెళ్లి, మీ భుజబలముచే ఆ దుష్టరాక్షసులను తునుమాడి సీతాదేవిని తోడ్కొని రండు"- (దో॥ 31)

సీతామాతకు వచ్చిన ఆపదలనువిని, సుఖనిధానములైన శ్రీరామునినేత్రములు అశ్రుపూర్ణములాయెను. "మనోవాక్కాయములను నాకర్పించిన వారికి కలలోనైనను ఆపదలు వచ్చునా?" అని శ్రీరాముడు నుడివెను. అందులకు హనుమంతుడు, "ప్రభూ! మీ స్మరణను, భజనను మఱచుటకంటెను వేఱొక ఆపదయేముండును? రాక్షసులు మీకొక లెక్కయా? శత్రువులను పరిమార్చి, జానకీ దేవిని శీఘ్రముగా తోడ్కొని రండు." శ్రీరామచంద్రుడు వచించెను. "హనుమా! వినుము. నాకు నీ వంటి ఉపకారి దేవతలలో గాని, మునీశ్వరులలో గాని, మానవులలో గాని లేనేలేడు. నేను నీకేమి ప్రత్యుపకారము చేయగలను? నా మనస్సుగూడ నీ ముందుకు వచ్చుటకు జంకుచున్నది. ఆలోచింపగా నీ ఋణమునుండి విముక్తుడనుకాలేనని తోచుచున్నది." దేవతారక్షకుడైన శ్రీరామచంద్రుడు మాటి మాటికిని హనుమంతుని వైపుచూచుచుండెను. అతని నేత్రములు సజలములై, శరీరము పులకితమగు చుండెను.

(చౌ॥ 1-4)

ప్రభువచనములను విని, ఆయనప్రసన్న ముఖమును జూచి, హనుమంతుని హృదయము ఆనంద కందళితమయ్యెను, తనువు పులకితమయ్యెను, భక్తి పారవశ్యమున అతడు 'దేవా! నన్ను రక్షింపుము, రక్షింపుము' అనుచు స్వామి చరణములపై బడెను. (దో॥ 32)

ప్రభువు అతనిని లేవనెత్తుటకు మాటి మాటికిని ప్రయత్నించెను. కాని ప్రేమపరవశుడైన హనుమంతుడు లేవలేక పోయెను. ప్రభుకరకమలములు ఆయన శిరస్సుపై నుండెను. ఆ స్థితిని స్మరించినంతనే శివుడును ప్రేమవిహ్వలుడయ్యెను. శ్రీరాముని సేవించుటకై శివుడే ఆంజనేయుడుగా అవతరించి యుండెను గదా!" మఱల తనమనస్సును కుదుటపఱచుకొని, శంకరుడు అత్యంత మనోజ్ఞమైన శ్రీరామగాథను వినిపింపసాగెను. మిక్కిలి ప్రయాసతో హనుమంతుని లేవనెత్తి ప్రభువు ఆతనిని తనఅక్కున జేర్చుకొనెను. చేయూతనిచ్చి తనకు అతి సమీపమున గూర్చుండ బెట్టుకొని ఇట్లనెను. "హనుమ! రావణపాలితలంకను, అభేద్యమైన ఆతని కోటను నీవు ఎట్లు దహించి వేసితివి? తెలుపుము" ప్రభువు అతి ప్రసన్నుడని గ్రహించి, హనుమంతుడభిమానరహితుడై పల్కెను. "ఒక కొమ్మ నుండి మఱియొక కొమ్మపైకి ఎగురుట, దుముకుట వానరులకు సహజమే. కాని సముద్రమును లంఘించుటయు, స్వర్ణమయ లంకను దహించి వేయుటయు, దుష్టరాక్షసులను వధించుటయు, అశోకవనమును ధ్వంసము గావించుటయు మీ అనుగ్రహప్రభావముననే. స్వామీ! ఇందు నా గొప్పదనము ఏమియును లేదు.

(చౌ॥ 1-5)

ప్రభూ! మీ కృపకు పాత్రులైన వారికి సాధ్యము కానిది ఏదియును ఉండదు. మీ ప్రభావముచే ప్రత్తిగూడ సముద్రమునందలి బడబాగ్నిని కాల్చగలదు. (అసంభవము గూడ సంభవమే కాగలదు.) (దో॥ 33)

"స్వామీ! మీపై నాకు అత్యంత సుఖదాయినియైన నిశ్చల భక్తిని దయతో ప్రసాదింపుడు." భవానీ! వాయు సుతుని అత్యంత వినమ్రమైన వచనములను విని, రామచంద్ర ప్రభువు "అట్లే కానిమ్ము" అనెను. ఉమా! శ్రీరాముని స్వభావమును ఎఱిగిన వారికి ఆయనను భజించుట తప్ప మఱియొకటి ఏమియు రుచింపదు. ఈ స్వామిసేవకుల సంభాషణమును స్మరించిన వారికి, ప్రభు చరణములపై తప్పక భక్తి గలుగును. ప్రభువచనములను వినిన వానరగణము పలికెను. కృపాళువు, ఆనందకందుడు, ఐన శ్రీరామచంద్రునకు "జయము, జయము, జయము"- అప్పుడు శ్రీరాముడు రాజైన సుగ్రీవునిబిల్చి వచించెను. "ఇంక ఆలస్యమేల? లంకకు వెళ్లుటకు ఏర్పాట్లుగావింపుము.

వెంటనే వానరులకు ఆజ్ఞల నిమ్ము." భగవంతుని లీలలను జూచి, దేవతలు హర్షితులై, పుష్పవృష్టిని గురిపించిరి. వారు ఆకాశ మార్గమున తమతమ స్థానములకు చేరిరి. (చౌ॥ 1-4)

# సమరసన్నాహములు

వెంటనే కపిరాజు సుగ్రీవుడు తనసేనాపతులను పిలిపించెను. వివిధవర్ణములు గలిగి అపార బలసంపన్నములైన వానరభల్లూక సమూహములు వచ్చినవి. (దో॥ 34)

ఆ వానర భల్లూకసైన్యములు శ్రీరామచంద్రుని చరణ కమలములకు నమస్కరించి, గర్జించినవి. శ్రీరాముడు ఆ వానరసేనను జూచి, తన కృపాదృష్టిని దానిపై ప్రసరింపజేసెను. శ్రీరాముని అనుగ్రహబలమును పొంది, వానరులు ఱెక్కలు వచ్చిన మహా పర్వతములవలె విజృంభించిరి. ప్రసన్నుడైన శ్రీరామచంద్రుడు బయలుదేఱెను. అనేకశుభశకునములు ఎదురయ్యెను. సర్వ శుభములకును ఆలవాలమైన ప్రభువు బయలుదేఱునపుడు శుభశకునములు కల్గుట సహజము. జానకీదేవికి వామపార్శ్వము అదరెను. ఆ శుభశకునమును శ్రీరాముని సమర ప్రస్థాన సూచకముగా భావించెను. అవి రావణునిపాలిటి అపశకునములు. ఆ సేనలకదలికలు వర్ణనాతీతములు. లెక్కింప సాధ్యముగాని వానరములు, భల్లూకములు గర్జనలు చేయసాగెను. నఖాయుధులై వానరులు, భల్లూక రాజులు పర్వతములను, పెకలించిన వృక్షములను మోసికొనుచు నేలపై కొన్ని, ఆకాశమున మఱికొన్ని పోవుచుండెను. వాటి సింహగర్జనలను విని, దిగ్గజములు వణకుచు ఘీంకరించెను. (చౌ॥ 1-5)

దిగ్గజములు ఘీంకారములు సల్పెను. భూమి కంపించెను. పర్వతములు చలించెను. సాగరములు అల్లకల్లోలములాయెను. గంధర్వులు, దేవతలు, మునులు, నాగులు, కిన్నరులు మొదలగు వారందఱును తమ దుఃఖములు తొలగిపోవునని పొంగిపోవుచుండిరి. కోట్లకొలది వానర యోధులు పండ్లు పటపట కొఱుకుచు పరుగెత్తుచుండిరి. "బల శాలియు, ప్రతాపవంతుడును ఐన శ్రీరామచంద్రునకు జయమగుగాక" అనుచు అందఱును 'జయ జయ' ధ్వానములు చేసిరి. శ్రీరామునిగుణగణములను కీర్తించిరి. సర్వ శ్రేష్ఠుడు సర్వాధిపతియైన ఆదిశేషుడుగూడ ఆ సైన్యభారమును మోయలేక మోహితుడై తడవతడవకు ఆదికూర్మమువీపును తనపండ్లతో గట్టిగా పట్టుకొనుచుండెను. అతి మనోహరమైన శ్రీరామచంద్రుని ప్రస్థానయాత్రగాథను ఆదికూర్మము వీపుపై వ్రాయుచున్నాడాయనునట్లు ఆదిశేషుడు ఆ సమయమున ఒప్పుచుండెను. (ఛం॥ 1-2)

ఈ విధముగా కృపానిధియైన శ్రీరాముడు సముద్రతీరమునకు చేరెను. అసంఖ్యాకవానర భల్లూకరాజులు అక్కడక్కడ ఫలములను ఆరగించు చుండిరి. (దో॥ 35)

# మండోదరి హితము పల్కుట

హనుమంతుడు లంకను కాల్చివెళ్లినప్పటినుండియు లంకావాసులైన రాక్షసులు భయముతో వణకుచు తమ యిండ్లలోనే దాగుకొని, ఆలోచించుచుండిరి. "ఇపుడు రాక్షసజాతిని రక్షింపగల్గిన వారెవ్వరును లేరు. దూత బలమునకే మనము తట్టుకొనలేనప్పుడు ఇక స్వామియే స్వయముగా వచ్చినచో మనగతి యేమగును?" నగరవాసులమాటలను దూతలద్వారా విని మండోదరి మిక్కిలి వ్యాకులపడెను. ఆమె ఏకాంతమున రావణుని పాదములపై బడి, వేడుకొనుచు నీతి వచనములను పల్కెను. "ప్రాణేశ్వరా! శ్రీహరితో ద్వేషమును మానుడు. అత్యంత హితకరమైన నా మాటలను ఆలకింపుడు. అతనిదూతకృత్యములను దలచినంతనే రాక్షసస్త్రీలకు గర్భపాతములు గల్గుచున్నవి. నిజముగా మీ క్షేమమును మీరు కోరుకొనుచున్నచో మీ మంత్రి ద్వారా శ్రీరాముని ధర్మపత్నిని ఆయన కడకు చేర్చుడు. రాక్షసకులమనెడి కమలవనమును నాశమొనర్చు మంచు రాత్రి వలె సీత ఇచటికి చేరినది. నాథా! వినుడు సీతను తిరిగి అప్పగింపనిచో బ్రహ్మరుద్రాదులు గూడ మిమ్ము రక్షింపజాలరు. (చౌ॥ 1-5)

శ్రీరామునిబాణములు సర్పములతో సమానము. రాక్షసుల మూకలు కప్పలతో సమానము. ఆ పాములు ఈ కప్పలను కబళింపకముందే మీ పట్టుదలలు మాని, మంచిపని చేయుడు." (దో॥ 36)

మూర్ఖుడు, దురహంకారి, గర్విష్ఠుడు ఐన రావణుడు ఈ మాటలను విని, బిగ్గరగా నవ్వి, పరిహాసము చేయసాగెను. "స్త్రీలు స్వభావసిద్ధముగా పిఱికివారనుమాట నిజము. శుభ సమయములయందును భయపడుదురు. వీరి హృదయములు మిక్కిలి దుర్బలములు. వానర సైన్యమే వచ్చినచో వారిని భక్షించి, రాక్షసులు జీవించెదరు. లోకపాలురుగూడ నన్ను జూచి భయముతో వణకెదరు. ఇట్టి స్థితిలో నా భార్యవైన నీవు భయపడుట మిక్కిలి హాస్యాస్పదము" ఈ విధముగా పలికి, రావణుడు అతిప్రేమతో ఆమెను కౌగిలించుకొని, సభకు వెళ్ళి పోయెను. మండోదరి "ఈ సమయమున విధాత ప్రతికూలముగా ఉన్నాడు" అని మనస్సులో చింతింప సాగెను. రావణుడు సభలో ఆసీనుడగుచుండగనే శత్రుసైన్యములు సముద్రపు ఆవలతీరమునకు చేరినవి- అను వార్త వచ్చెను. అతడు "ఇప్పుడు మన కర్తవ్యమేమో తెల్పుడు" అని మంత్రులనడిగెను. వారు నవ్వుచు వచించిరి. "ఇందులో విశేషమేమున్నది? దీనికై చింతింపవలసిన పనియే లేదు. మీరు దేవతలను రాక్షసులను జయించునప్పుడుగూడ మీకు ఏ మాత్రము శ్రమయే అనిపింపలేదు గదా! ఇప్పుడు ఈ అల్పులైన నరవానరులను లెక్కచేయుట యెందులకు?" (చౌ॥ 1-5)

మంత్రిగాని, వైద్యుడు గాని, గురువుగాని, ప్రభువు అప్రసన్నుడగుననెడి భయముతో, లేక ఏదైన నొక పారితోషికముపైగల ఆశతో ప్రియవాక్యములు, ఇచ్చకములు పల్కుచు వాస్తవములను దాచినచో క్రమముగా ఆ ప్రభువు యొక్క రాజ్యము, శరీరము, ధర్మము శీఘ్రముగా పతనమగుట తథ్యము. (దో॥ 37)

## విభీషణుని నీతివచనములు

రావణుడుగూడ ఇప్పుడా స్థితిలోనే యుండెను. మంత్రులతనికడ ముఖస్తుతిని జేయుచుండిరి. అదే సమయమున విభీషణుడు అచటికివచ్చి, అన్నకు పాదాభివందనమాచరించెను. అతడు తలవంచుకొని, సుఖాసీనుడై రావణుని అనుజ్ఞతో పల్కెను. "ఓ కృపాళూ! మీరు నా అభిప్రాయమును అడిగితిరి. కావున మీకు హితకరముగా నాకు తోచినంత వఱకు విన్నవించెదను. తనశుభములను, సుయశమును, సుబుద్ధిని, సద్గతిని, బహుముఖ సుఖములను కోరుకొనువాడు చవితి చంద్రునివలె పరస్త్రీ ముఖమును త్యజింప వలెను. (అనగా జనులు చవితి చంద్రుని చూడనట్లు పరస్త్రీముఖమునుగూడ చూడరాదు.) చతుర్దశభువనములకు ప్రభువైన వాడును జీవులయెడ శత్రుత్వమును పూనినచో అతడు తప్పక నశించును. సద్గుణనిధియైనను సర్వ సమర్థుడైనను అతడు ఏ మాత్రముగనూ లోభియైనచో వానిని ఎవ్వరును మెచ్చరు. (చౌ॥ 1-4)

ప్రభూ! కామము, క్రోధము, లోభము, మదము-ఇవియన్నియును నరకమునకు మార్గములు. కావున వీనిని త్యజించి, సజ్జన సేవ్యుడైన శ్రీరాముని భజింపుము. (దో॥ 38)

సోదరా! శ్రీరాముడు కేవలము నరేంద్రుడు గాడు. అతడు సమస్త లోకములకును, బ్రహ్మాండములకును ప్రభువు, కాలునకు మహాకాలుడు, అతడే షడ్గుణైశ్వర్యసంపన్నుడైన భగవంతుడు. వికారరహితుడు, జన్మలేనివాడు, సర్వవ్యాపకుడు, అజేయుడు, అనాది, అనంతుడు ఐన పరబ్రహ్మ, పరమాత్మ. కృపాళువైన ఆభగవంతుడు పృథ్విని, బ్రాహ్మణులను, గోవులను, దేవతలను రక్షించుటకు మానవుడై అవతరించెను. సోదరా! వినుము. అతడు తనసేవకులకు ఆనంద దాయకుడు. దుష్టులను నశింపజేయువాడు. వేదములను, ధర్మములను పరిరక్షించువాడు. అతనితో వైరముమాని, శరణువేడుము. శ్రీరఘునాథుడు శరణాగతుల దుఃఖములను రూపు మాపువాడు. స్వామీ!

జానకీ దేవిని ఆ సర్వేశ్వరునకు అప్పగింపుడు. అవ్యాజకరుణాళువైన శ్రీరాముని భజింపుడు. సమస్త విశ్వమునకును ద్రోహముచేసిన పాపాత్ముడుగూడ శరణన్నచో ప్రభువాతనిని క్షమించి, రక్షించును. అతనినామమే తాపత్రయములను హరించివేయును. అట్టి భగవంతుడే మనుష్య రూపమును దాల్చి ఇట్లు వచ్చెను. ఈ విషయములను శ్రద్ధగా ఆలకింపుము. (చౌ॥ 1-4)

ఓ దశాననా! పదేపదే మీ పాదములనంటి విన్నవించుచున్నాను. అభిమానమునూ, మోహమునూ, మదమునూ త్యజించి, కోసలాధీశుడైన శ్రీరామచంద్రప్రభువును సేవింపుము. పులస్త్యముని తన శిష్యునిద్వారా ఈ సందేశమును పంపెను. సదవకాశము చిక్కినందున నేను ఈ మాటలను మీకు విన్నవించితిని. (దో॥ 39. క,ఖ)

మాల్యవంతుడను పేరుగల బుద్ధిమంతుడైన మంత్రి విభీషణుని వచనములకు ఎంతయు సంతోషించి పలికెను. "నాయనా! నీతిమంతుడైన మీ అనుజుడు విభీషణుడు నుడివిన మాటలను హృదయమున నిలుపుకొనుము." అప్పుడు రావణుడు భగ్గున మండిపడుచు ఇట్లనెను. " ఈ మూర్ఖులిద్దఱును శత్రుమహిమలను పొగడుచున్నారు. వీరిని నా యెదుటనుండి బయటికి పంపుటకు ఎవ్వరును లేరా?" అప్పుడు మాల్యవంతుడు తన ఇంటికి వెళ్లెను. విభీషణుడు మాత్రము చేతులు జోడించి, మఱల పలుక సాగెను. "ప్రభూ! అందఱిలోను సుబుద్ధి, దుర్బుద్ధి రెండును ఉండునని, వేద, పురాణములు వెల్లడించుచున్నవి. సుబుద్ధి ప్రబలముగా ఉన్నచోట సంపదలు సమృద్ధములై యుండును. దుర్బుద్ధి ప్రబలియున్నచోట ఆపదలు కోకొల్లలు. మీ హృదయమున కేవలము దుర్బుద్ధియే నిండియున్నది. కనుక మీరు హితుని అహితునిగా, శత్రువును మిత్రునిగా భావించు చున్నారు. (పులస్త్యుడు, మాల్యవంతుడు, నేను మీకు హితమునే పలుకుచున్నాము. మీరు మమ్ము శత్రువులుగా పరిగణించుచున్నారు. ముఖస్తుతులతో ఇచ్చకములాడు ఈ మంత్రులు నిజముగా మీకు కీడు చేయువారు, శత్రువులు. వారిని మిత్రులుగా భావించుచున్నారు) రాక్షసజాతిని నాశము చేయుటకు కాళరాత్రియైన సీతాదేవిపై ఎక్కువ ప్రీతి గల్గియున్నారు.

(చౌ॥ 1-4)

సోదరా! దయచేసి నా మాటలను పాటింపుడని సవినయముగా మీ పాదములకు ప్రణమిల్లి ప్రార్థించుచున్నాను. సీతాదేవిని శ్రీరామునకు అప్పగింపుడు. ప్రేమతో నేనుపలికిన మాటలను ఆలకింపుడు. దీనివలన మీ కెట్టి అశుభమూ కలుగదు. పైగా మేలే జరుగును. (దో॥ 40)

పండితులకు సమ్మతములైన వేదపురాణోక్త నీతివాక్యములను విభీషణుడు పలికెను. రావణుడు ఆ మాటలు వినగానే రెచ్చిపోయి "ఓరీ దుష్టుడా! నీకీనాడు చావుమూడినది" అనెను. "శఠుడా! నీవు నా ఉప్పు, పులుసు తిని బ్రతుకు చున్నావు. కాని కృతఘ్నుడవై శత్రువును పొగడు చుంటివి. దుష్టుడా! ప్రపంచమున నా భుజబలముచే ఓడింపబడని వాడెవ్వడో తెలుపుము. నీవు నా నగరములో నివసించుచు తాపసులను ప్రేమించెదవు. మూర్ఖుడా! నా యెదుటనుండి తొలగిపొమ్ము. ఈ నీతులను వారికడనే వల్లింపుము" అని పలుకుచు రావణుడు ఆతనిని కాలితో తన్నెను. కాని విభీషణుడు మాత్రము పదే పదే ఆయన పాదములను పట్టుకొన సాగెను. (శివుడు పల్కుచున్నాడు) ఉమా! అపకారికిగూడ ఉపకారము చేయుట సజ్జనుల స్వభావము. విభీషణుడు పలికెను. "మీరు నాకు తండ్రివంటివారు. కనుక మీరు నన్ను తన్నినందులకు విచారము లేదు. కాని ప్రభూ! శ్రీరాముని భజించుటలోనే మీకు హితమున్నది" అని వచించి, విభీషణుడు తన మంత్రులను వెంట బెట్టుకొని ఆకాశ మార్గమున బోవుచు అందఱికిని వినబడునట్లు పలికెను. (చౌ॥ 1-5)

# విభీషణశరణాగతి

"రావణా! శ్రీరాముడు సత్యసంకల్పుడు, సర్వశక్తిసంపన్నుడైన ప్రభువు. నీ సభ మృత్యుముఖమున నున్నది. నేను శ్రీరామచంద్రుని శరణు వేడుటకై వెళ్లుచున్నాను. నన్ను దూషింప వలదు." (దో॥ 41)

ఈ విధముగా పలికి రామభక్తుడైన విభీషణుడు వెళ్లగానే రాక్షసులందఱి ప్రాణములును అతని వెంటనే పోయినవి. (శివుడు నుడువుచున్నాడు) భవానీ! సజ్జనులను నిరాదరించినచో వెంటనే అశుభములు కలుగును. రావణుడు విభీషణుని త్యజించిన మఱుక్షణముననే ఆ దౌర్భాగ్యుని వైభవము తిరోముఖము పట్టినది. విభీషణుడు పెక్కు మనోభీష్టములతో రఘునాథుని సన్నిధికి సంతోషముతో బయలు దేఱెను. అతడు మనసులో ఇట్లు ఆలోచించుచుండెను. "ఇప్పుడే వెళ్లి, కెందామరలవలె మృదుమనోహరములైన శ్రీరాముని పవిత్ర పాదములను దర్శించెదను. ఆ చరణ కమలములు సేవకులకు సుఖ ప్రదములు. వాటి స్పర్శ మాత్రమున మునిపత్ని అహల్య తరించినది. అవి దండకారణ్యభూములను పవిత్రమొనర్చినవి. వాటినే జానకీదేవి సర్వదా ధ్యానించుచుండును. కపటమృగమును పట్టుకొనుటకై పరుగెత్తినవియు ఆ పాదములే. శివుని మానస సరోవరమున నిరంతరము విహరించునట్టివియు ఆ పాదపద్మములే. వేయేల! మహామహిమాన్వితములైన ఆ ప్రభుచరణకమలములను కనులార నేడే చూచెదను. నేడు నా భాగ్యమును ఏమని వర్ణింతును? (చౌ॥ 1-4)

రామభక్తివాహినిలో మునకలు వేయుచు పరమపునీతుడైన భరతుడు నిరంతరము తన మనస్సులో ధ్యానించునది ఈ చరణపాదుకలనే గదా! అట్టి చరణములను నేడు నేను ప్రత్యక్షముగా చూడగలను.

(దో॥ 42)

ఇట్లు భక్తి తత్పరుడై ఆలోచించుచు విభీషణుడు సముద్రము యొక్క ఆవలి తీరమును జేరెను. అతనిని జూచిన వానరులు అతడు శత్రుపక్షమునుండి వచ్చిన విశిష్ట దూతయని తలంచిరి. అతనికి ఒక కాపరిని ఉంచి, వారు సుగ్రీవుని యొద్దకు వెళ్లి, విషయమును తెల్పిరి. సుగ్రీవుడు శ్రీరాముని యొద్దకు వెళ్లి, "రఘునాథా! రావణుని సోదరుడైన విభీషణుడు మిమ్ము కలిసికొనుటకై వచ్చినాడు" అని తెలిపెను. ప్రభువు అతనితో "మిత్రమా! నీ అభిప్రాయమేమి?" అని యడిగెను. వానరరాజు సుగ్రీవుడు ఇట్లు తెలిపెను. "మహారాజా! అవధరింపుడు. నిశాచరులు మాయావులు. వారినిజస్వరూపములను తెలిసికొనుట కష్టము. వారు కామరూపధారులు. అతనిరాక యొక్క ఆంతర్యమేమో తెలియదు. ఈ దుష్టుడు మనరహస్యములను తెలిసికొనుటకై వచ్చినాడని నా అభిప్రాయము. ఇతనిని బంధించియుంచుట మంచిదని తోచుచున్నది" అప్పుడు శ్రీరాముడు పల్కెను. మిత్రమా! నీవు తెలిపిన రాజనీతి ఒప్పు కొనదగినదే, కాని శరణుజొచ్చిన వానికి అభయమిచ్చి, కాపాడుట నా ప్రతిజ్ఞ". శ్రీరామచంద్రప్రభువచనములను విని, హనుమంతుడు మిక్కిలి సంతసించెను. భక్తవత్సలుడైన భగవంతుడు తండ్రివలె శరణాగతుని రక్షించును. (చౌ॥ 1-5)

శ్రీరాముడు మఱల పలికెను. "తనకు హాని జరుగునేమోయని శంకించి, శరణాగతుని త్యజించు నట్టి వాడు నీచుడు, పాపి, అతనిని చూచుటయే మహా పాపము. (దో॥ 43)

కోటి బ్రహ్మ హత్యలు చేసిన వాడైనను నన్ను శరణుజొచ్చినచో నేను అతనికి అభయమిచ్చెదను. నా సమ్ముఖమునకు వచ్చి "శరణు" అన్న ప్రాణియొక్క కోటిజన్మలపాపములుగూడ నశించి పోవును. నా భజనయందు ఆసక్తి లేకపోవుట పాపికి 'జన్మతః' వచ్చిన స్వభావము. నిర్మల హృదయుడైన భక్తుడే నన్ను సమీపించును.

విభీషణుడు దుష్టహృదయుడేయైనచో అతడు నన్ను ఆశ్రయించెడి వాడు కాడు. కపటులు, మోసకారులు అనినచో నాకు అసహ్యము. వానరరాజా! ఒక వేళ రావణుడు అతనిని మన రహస్యములను తెలిసికొనుటకే పంపినను మనము భయపడవలసిన పనియేలేదు. మనకు ఎట్టిహానియు జేరుగదు. ఏలనన మిత్రమా! ప్రపంచములోని నిశాచరులందఱిని ఈ లక్ష్మణుడు ఒకే ఒక్క క్షణములో మట్టు పెట్టగలడు. కాని భయ విహ్వాలుడై నన్ను శరణు గోరిన వానిని నేను నా ప్రాణముల వలె కాపాడుదును." (చౌ॥ 1-4)

కృపానిధియైన శ్రీరాముడు దరహాసముతో ఇట్లనెను. "అతడే స్థితిలోనున్నను, ఏ ఉద్దేశ్యముతో వచ్చినను వెంటనే అతనిని ఇక్కడకు తీసికొని రండు." అంగద హనుమదాదులతోగూడి వానరులు 'కృపాళువైన శ్రీరామునకు జయమగు గాక' అనుచు వెళ్లిరి. (దో॥ 44)

వానరులు సాదరముగా విభీషణుని ముందుంచుకొని, శ్రీరామునికడకు వచ్చిరి. చూడ ముచ్చటగొలుపుచున్న సోదరులిద్దఱిని విభీషణుడు దూరమునుండియే చూచెను. అతడు అత్యంత సౌందర్యనిధానమైన శ్రీరామచంద్రుని రెప్పవాల్చక చూచుచు నిశ్చేష్టుడై నిలుచుండెను. ఆస్వామి ఆజానుబాహుశోభితుడు. కంజారుణలోచనుడు, కనులపండువు గావించు శ్యామసుందరుడు. శరణాగతులకు అభయప్రదాత, సింహస్కంధుడు, విశాలవక్షః స్థలశోభితుడు ఐన ఆ ప్రభువు కోటి మన్మథసుందరాకారుడు. భగవంతుని స్వరూపమును దర్శించిన విభీషణునినయనములు ఆనందాశ్రుపూర్ణములాయెను, తనువు పులకించెను. అతడు మనస్సును పదిలపఱచుకొని, మృదు మధురముగా ఇట్లనెను. "ప్రభూ! నేను దశాననుని తమ్ముడను. ఓ సురత్రాణ పరాయణా! నేను రాక్షసవంశసంజాతుడను. నా శరీరము తామసికమైనది. గ్రుడ్లగూబకు చీకటి ప్రియమైనట్లు పాపకృత్యములు మాకు ప్రీతిపాత్రములు. (చౌ॥ 1-4)

'జనన మరణ భయములను రూపుమాపు వారు' -అనెడి మీ కీర్తిని విని, మిమ్ము శరణుజొచ్చుటకై వచ్చినాను. దుఃఖార్తులను ఆదుకొనెడి రఘువీరా! నన్ను రక్షింపుము. శరణాగతులకు మీరు సుఖ ప్రదాతలు, నన్ను కాపాడుడు." (దో॥ 45)

ఈ విధముగా పలుకుచు తనముందు సాగిలపడిన విభీషణుని గాంచి, ప్రభువు మిక్కిలి హర్షముతో అతనిని లేవనెత్తెను. అతని దైన్య వచనములు ప్రభువునకు మిక్కిలి జాలి గొల్పెను. తన విశాల భుజములతో అతనిని అక్కున జేర్చుకొనెను. లక్ష్మణుడు గూడ అతనిని ఆలింగనమొనర్చుకొనెను. పిదప, విభీషణుని, సరసన గూర్చుండ బెట్టుకొని ఇట్లు అభయవచనములను పల్కెను. "ఓ లంకేశ్వరా! నీవు, నీ పరివారము, కుశలమా? నీవు నివసించు స్థానము సరియైనది కాదు. అహర్నిశలు దుష్టుల మధ్యనే నివసించు చుంటివి. మిత్రమా! ఇట్టి స్థితిలో నీవు ధర్మమును ఎట్లవలంబించెదవు? నీ ఆచార వ్యవహారములను నేనెఱుగుదును. నీవు నయకోవిదుడవు. అనీతి అనిన నీకు ఏమాత్రము గిట్టదు. నాయనా! దుష్టుల సహవాసము కంటెను నరకవాసము మంచిది. కాని విధాత ఎవ్వరికిని దుష్ట సాంగత్యమును కలిగింపకుండుగాక." విభీషణుడు నుడివెను. "ఓ రఘునాథా! మీ చరణకమలదర్శనభాగ్యముచే ఇప్పుడు నేను క్షేమముగా ఉన్నాను. నన్ను మీ భక్తునిగానెఱింగి కనికరించితిరి. (చౌ॥ 1-4)

జీవుడు శోక ధామములైన విషయ వాసనలను, కోరికలను త్యజించి, శ్రీరాముని భజింపనంత వఱకును అతనికి శుభములు చేకూరవు. స్వప్నములోగూడ మనశ్శాంతి లభింపదు. (దో॥ 46)

ధనుర్బాణములను, తూణీరమును ధరించిన శ్రీరఘునాథుడు హృదయములో నిలిచియుండనంత వఱకును లోభము, మోహము, మదము, మత్సరము, అభిమానము మున్నగు అవగుణములు తొలగిపోవు. మమకారమనెడి చీకటిరాత్రి రాగద్వేషములనెడి గ్రుడ్లగూబలకు ఆలంబనమై నిల్చును. ప్రభువుయొక్క ప్రతాపసూర్యుడు ఉదయించువఱకును ఆ మమతాంధకారము జీవుని మనస్సున ఆవరించియే యుండును. శ్రీరామా! మీపాదపద్మముల దర్శన ప్రభావమున నేనిపుడు క్షేమముగా ఉన్నాను. నా మహాభయమంతయును దూరమైనది. ఓ

కృపాళూ! మీ దయకు పాత్రులైనవారిని తాపత్రయములు వెంటాడజాలవు. నేను అధమ స్వభావముగల రాక్షసుడను. నేనెన్నడును పుణ్యకార్యములను ఆచరింపలేదు. మీ రూపము మునీశ్వరులుకును, సామాన్యముగా ధ్యానగోచరము గాదు. అట్టి మీరు స్వయముగా ప్రసన్నులై నాకు ఆలింగన సుఖానందములను అనుగ్రహించితిరి. (చౌ॥ 1-4)

శ్రీరామా! కృపాసుఖస్వరూపా! నా భాగ్యమును ఎంతని కొనియాడెదను? బ్రహ్మ, మహేశ్వరులచే సేవింపబడు మీ చరణకమలద్వయమును దర్శించితిని. (దో॥ 47)

శ్రీరామచంద్రుడు ఇట్లనెను. "మిత్రమా! వినుము. కాకభుశుండి, ఉమా మహేశ్వరులెఱిగిన నా స్వభావమును నీకు తెల్పెదను. చరాచర జగత్తునకు ద్రోహము చేసియు, భయకంపితుడై నా శరణు జొచ్చి, మదము, మోహము, మోసము, కపటము మొదలగు అవగుణములను త్యజించిన వాడు నా అనుగ్రహమున సజ్జనుడు అగును. తల్లిదండ్రులు, సోదరులు, పుత్రులు, భార్య, శరీరము, సంపదలు, మిత్రులు, పరివారములు, గృహములు మున్నగు వానిపైగల మమకారములను ఒకే త్రాడుగా పేని నాచరణములకు బంధించు వాడును (అనగా వాటన్నింటిపై గల ప్రేమను నాకు సమర్పించు వాడును) సమదర్శియు, హర్ష, శోక, భయ, వాంఛలు లేనివాడును ఐన సజ్జనుడు-లోభివాని మనస్సున ధనమువలె నా హృదయమున వసించును. నీ వంటి సజ్జనులే నాకు ప్రాణ ప్రియులు. సజ్జనుల రక్షణమునకే నేను అవతరించుచుందును. నేను అవతారములను ఎత్తుటకు మఱియొక కారణము ఏదియును లేదు. (చౌ॥ 1-4)

సగుణబ్రహ్మను ఉపాసించువారును, పరహితమునకై పాటుపడువారును, నీతి నియమములను దృఢముగా పాటించు వారును, బ్రాహ్మణ పాదములను సేవించు వారును నాకు ప్రాణతుల్యులు. (దో॥ 48)

ఓ లంకేశ్వరా! వినుము. నీలో అన్నియును సద్గుణములే గలవు. కనుక నీవు నాకు అత్యంత ప్రీతిపాత్రుడవు." శ్రీరాముని మృదుమధురవచనములను వినినవానరులు "కృపాసాగరుడైన శ్రీరామచంద్రప్రభువునకు జయమగుగాక" అని పలికిరి. కర్ణ రసాయనములైన ప్రభు వచనములను ఎంతగా వినినను విభీషణునకు తనివి తీరలేదు. అతడు మాటిమాటికి ప్రభుపాదములను పట్టుకొనుచుండెను. అపారమైనప్రేమతో అతనిహృదయము నిండిపోయెను. అప్పుడతడు ఇట్లనెను. " దేవా! చరాచరజగత్ప్రభూ! శరణాగత రక్షకా! అందఱి హృదయములను ఎఱిగిన వాడా! ఇంత వఱకును నాలోనున్న విషయవాసనలన్నియును ప్రభు చరణములపై గల భక్తి ప్రవాహమున కొట్టుకొనిపోయినవి. ఓ కృపాళూ! సదాశివుని మనస్సునందుగల అనన్యభక్తిని నాకు అనుగ్రహింపుము. శ్రీరామచంద్రప్రభువు "ఏవమస్తు" (అట్లే కానిమ్ము) అని పల్కుచు, రణధీరుడైన ప్రభువు వెంటనే సముద్రజలములను తీసికొని రమ్మని లక్ష్మణుని ఆజ్ఞాపించెను. పిమ్మట విభీషణునితో ఇట్లనెను. "జగత్తులో నా దర్శనము అమోఘము. అది యెన్నడును నిష్ఫలము గాదు. నీకు కోరిక లేకున్నను నిన్ను 'రాజ్యాభిషిక్తుని చేయుచున్నాను." అనియనుచు శ్రీరాముడు అతనిని లంకారాజ్యమునకు రాజునుగా జేసెను. అంతరిక్షమునుండి అపారముగా పుష్పవర్షము గురిసెను.(1) (చౌ॥ 1-5)

(1) మున్ను రావణ బాధలోర్వక విభీషణుడు మొఱపెట్టగ రామచంద్ర! ॥మున్ను॥
మన్నింతువనుచు కులబిరుదులను పొగడిన
మాటమఱచితివో? శ్రీరామచంద్ర! ॥మున్ను॥

చరణము. రాజ రాజ! విరాజవాహ! రవి కుల జలధి
రాజ! రాఘవ! రామచంద్ర!
రాజీవ నేత్ర! భవస్తుతత! త్యాగ
రాజ వందిత! రామచంద్ర! ॥మున్ను॥ (త్యాగరాజ)

రావణునిక్రోధము అగ్నివంటిది. విభీషణునిహితవచనములు చల్లనిగాలులవంటివి. అయినను ఆ వచనవాయువులచే రావణుని క్రోధాగ్ని ప్రచండమాయెను. ఆ అగ్నిజ్వాలలకు లోనైన విభీషణునితాపములను తనవచనామృతధారలచే చల్లార్చి, కరుణామూర్తియైన శ్రీరామచంద్రప్రభువు ఆతనిని రక్షించెను. అఖండరాజ్యమును అనుగ్రహించెను. తనదశ శిరస్సులను బలిదానము గావించిన రావణునకు పరమశివుడు అనుగ్రహించిన సంపదను రఘునాథుడు విభీషణునకు ఇప్పుడు సంకోచపడుచు ఇచ్చెను. ( తానేమియు ఇయ్యలేదని తలచెను.)(దో॥ 49. క,ఖ)

ఇట్టి కృపాళువైన ప్రభువును విస్మరించి, ఇతరులను భజించువారు కొమ్ములు, తోకలు లేని పశువులు. విభీషణుడు తనభక్తుడని యెఱింగి, అతనిని తనఆత్మీయునిగా జేసికొనెను. ప్రభుస్వభావము వానరులనందఱిని సంతోషపఱచెను. పిమ్మట సర్వజ్ఞుడును, సర్వ హృదయాంతర్యామియు, సమస్తరూపములలో ప్రకటితమగువాడును, సర్వరహితుడును (దేనిచేతనులిప్తుడు కానివాడును) ఉదాసీనుడును, భక్తులను అనుగ్రహించుటకై మానవశరీరమును ధరించినవాడును, రాక్షసజాతిని నిర్మూలించి, నీతిని నిలుపువాడును ఐన శ్రీరామచంద్రుడు ఇట్లనెను. "ఓ కపీశ్వరా! సుగ్రీవా! ఓలంకేశ్వరా! విభీషణా! ఈగంభీరజలధిని దాటుటయెట్లు? అనేకజాతుల మొసళ్ళు, సర్పములు, మత్స్యములు మున్నగు వానితో నిండి, అపారమైన అగాధమైన ఈ సముద్రమును దాటుట ఎంతేని కష్టము" లంకాధిపతి విభీషణుడు ఇట్లు నుడివెను. "ఓ రఘునాయకా! మీ బాణమొక్కటియే కోటి సముద్రములనైనను శుష్కింప జేయును. ఐనను మొట్టమొదట సముద్రుని ప్రార్థించుటయే నీతి. (చౌ॥ 1-4)

ప్రభూ! మీ పూర్వజులలో 'పెద్ద'యైన సముద్రుడు ఏదేని ఒక ఉపాయమును చెప్పకపోడు. దాని వలన ఈ వానర భల్లూక సైన్యములు ఎట్టి ప్రయాసయు లేకుండ జలధిని దాటగలవు. (దో॥ 50)

విభీషణునిసూచనను విని, శ్రీరాముడు వచించెను. "మిత్రమా! నీవు చక్కని ఉపాయమును తెల్పితివి. దైవము తోడ్పడునేమో చూచెదను. ఈ సూచన లక్ష్మణునకు రుచింప లేదు. శ్రీరాముని మాటలను విని, అతడు మిగుల వగచి, పలికెను. "ప్రభూ! దైవము దైవము-అని అనుట ఎందుకు? మనస్సున రోషమును నింపి, జలనిధిని ఇంకిపోవునట్లు చేయుడు. పిఱికి వారే దైవమును అడ్డు పెట్టుకొందురు. సోమరులే 'దైవము, దైవము' అని గగ్గోలు చేయుదురు." ఈ మాటలకు శ్రీరాముడు దరహాసము చేయుచు, "అట్లే చేసెదము, కొంచెము ఓపికపట్టుము" అని లక్ష్మణునకు సైగ చేసెను. శ్రీరాముడు ఉదధిని సమీపించి, సముద్రునకు శిరసా ప్రణమిల్లెను. పిదప తీరమున దర్భలు పఱచుకొని, కూర్చుండెను. విభీషణుడు శ్రీరాముని ఆశ్రయించుటకు లంకను వీడగనే రావణుడు అతనిని వెంబడించుటకై తనదూతలను పంపెను. (చౌ॥ 1-4)

## శుకసారణుల వృత్తాంతము

ఆ దూతలు కపటవానరరూపములను ధరించి, జరిగినవృత్తాంతము నంతయును గమనించిరి. వారు తమమనస్సులలో ప్రభుగుణములను, శరణు జొచ్చినవారిపై ఆయన అపార ప్రేమను ప్రశంసించిరి.

(దో॥ 51)

భక్తిభావనిమగ్నులగుటవలన వారు ఛద్మవేషములను మఱచి, నిజరూపములలోనే రామచంద్రుని స్వభావములను ప్రీతితో కీర్తింపసాగిరి. అప్పుడు వానరులు వారిని శత్రుదూతలుగా గుర్తించి, బంధించి, సుగ్రీవుని యొద్దకు తీసికొనిపోయిరి. సుగ్రీవుడు "వానరులారా! ఈ రాక్షసులను 'అంగభంగము గావించి' పంపుడు- అని ఆదేశించెను. సుగ్రీవుని మాటలను వినగానే వానరులు వారిని బంధించి, సేనలచుట్టును త్రిప్పిరి. పెక్కురీతుల శిక్షించిరి. వారు

గట్టిగా అరచుచున్నను వానరులు వారిని వదలిపెట్టలేదు. అప్పుడాదూతలు బిగ్గరగా 'శ్రీరామునిపై ఆన. మా ముక్కుచెవులను కొఱుకవలదు' అని అఱచిరి. వారి అరపులను విని, లక్ష్మణుడు అందఱిని తన యొద్దకు పిలిచెను. నవ్వుచు జాలిపడి ఆ దూతలను విడిపించెను. పిమ్మట పలికెను. "కులఘాతకుడైన రావణునకు ఈ ఉత్తరమును అందించి, చదువుడని తెల్పుడు. (చౌ॥ 1-4)

ఆ మూర్ఖరావణునకు దయతో గూడిన నా ఈ మౌఖిక సందేశమును వినిపింపుడు "సీతాదేవిని అప్పగించి, శ్రీరామునితో సంధి చేసికొనుము. లేనిచో నీకు ఈ నేలమీద నూకలుచెల్లినట్లు భావింపుము" (దో॥ 52)

లక్ష్మణుని చరణములకు ప్రణమిల్లి, శ్రీరాముని గుణములను కీర్తించుచు ఆ రాక్షసదూతలు వెంటనే వెళ్లి పోయిరి. శ్రీరాముని కీర్తిని కొనియాడుచు వారు లంకను జేరి, రావణునకు ప్రణమిల్లిరి. దశముఖుడు ఆ శుకసారణులను పరిహసించుచు, ఇట్లనెను. ఓరీ! శుకా! నీ కుశల సమాచారమును ఏల తెల్పవు? మృత్యువునకు చేరువగా నున్న ఆవిభీషణుని విషయమును వినిపింపుము. ఆమూర్ఖుడు రాజ్యపాలనాధికారములను పోగొట్టుకొని పోయెను. ఇప్పుడు ఆ అభాగ్యుడు యవలలోని పురుగులవలె ఐనాడు. యవలను తిరుగలిలో పోసి త్రిప్పునప్పుడు వాటితో పాటు పురుగులుగూడ నశించును. అట్లే నరవానరులతోపాటు విభీషణుడుగూడ నశించును. కాలునిచే ప్రేరితులై వచ్చిన ఆ వానరభల్లూకసైన్యములను గూర్చి తెల్పుము. సముద్రుడే దయాహృదయుడై వారిని రక్షింపకున్నచో (అడ్డులేకున్నచో) ఆ వానరభల్లూకములను మన రాక్షసులే చంపి, భక్షించియుండెడివారు. నా భయముచే విహ్వలహృదయులైన ఆ తాపసుల గూర్చి తెలుపుము. (చౌ॥ 1-4)

మీరు వారిని కలిసినారా? లేక వారు నాయశోవైభవములను గూర్చి విని, మఱలి వెళ్లినారా! శత్రు సేనలతేజోబలములను గుఱించి ఏల తెల్పరు? ఓరీ శుకా! నీవు చకితునిగా కన్పించు చున్నావు." (దో॥ 53)

దూత వచించెను. "ప్రభూ! మీరు దయతో ప్రశ్నించిన రీతిగనే నేను తెలిపెడి విషయమును గూడ కోపపడక ఆలకింపుడు. మీ సోదరుడు విభీషణుడు శ్రీరాముని కలియుగనే అతనిని శ్రీరాముడు లంకారాజ్యపట్టాభిషిక్తునిగా జేసెను. మేము మీ దూతలమని తెలియగనే వానరులు మమ్ము బంధించి, మిక్కిలి బాధించిరి. వారు మా ముక్కు చెవులను కొఱుకుటకు సిద్ధపడిరి. శ్రీరామునిపై ప్రమాణము చేయుటచే వారు మమ్ము వదలిరి. మీరు శ్రీరాముని సేనను గూర్చి అడిగితిరి. ప్రభూ! వారి సేనలను వర్ణింపనెవ్వరికిని తరముగాదు. ఆ సేనయందలి వివిధ వర్ణములుగల వానరములు, భల్లూకములు అసంఖ్యాకములు. వారి ముఖములు భయంకరములు, శరీరములు దీర్ఘములు, అతిభయానకములు, మన నగరమునకు వచ్చి, అక్షకుమారుని హతమార్చి లంకను గాల్చిన వానరుని బలము మిగిలిన (అక్కడి)వారితో పోల్చినప్పుడు చాలా తక్కువ. వారు కఠినాత్ములు, అసమానయోధులు, అజేయులు, వారి బలము అపరిమితగజబలములతో సమానము. (చౌ॥ 1-4)

ద్వివిదుడు, మైందుడు, నీలుడు, నలుడు, అంగదుడు, గదుడు, వికటాస్యుడు, దధిముఖుడు, కేసరి, నిశరుడు, శరుడు, జాంబవంతుడు మున్నగు వారందఱును సాటిలేని పరాక్రమశాలురు. (దో॥ 54)

ఈ వానరులందరును బలములో సుగ్రీవునితో సమానులు. ఇట్టివారు ఒకరిద్దఱుగాదు కోట్లకొలది గలరు. వారిని లెక్కించుట అసాధ్యము. అపారబలపరాక్రమములను గలిగి, శ్రీరామునికృపకు పాత్రులైనట్టి ఆ మహాయోధులు

ముల్లోకములనుగూడ తృణప్రాయముగా చూతురు. దశాననా! వారి సేనలకు సేనానాయకులే 18,000కోట్ల మందియున్నట్లు నేను అచటి వారి నోట వింటిని. ఆసేనలోని ప్రతియోధుడును మిమ్ము జయింపగలవాడే. వారు అందఱును క్రుద్ధులై మనతో కయ్యమునకు కాలుదువ్వుచున్నారు. కాని శ్రీరాముడు వారికి ఆజ్ఞలనొసగలేదు. వారు ఇట్లు పలుకుచుండిరి. "ప్రమాదకరమైన మత్స్యములతో భయంకరసర్పములతో నిండియున్న ఈ మహాసముద్రమును ఒక్క దెబ్బతో శుష్కింపజేయుదుము. లేదా దీనిని పర్వతములతో నింపెదము. దశాననుని అణచివేసి, మట్టిలో కలిపెదము" వారందఱును సహజముగా కఠినాత్ములు. లంకానగరమును మ్రింగి వేయునట్లు వారు గర్జించెదరు, ఫీంకరించెదరు. (చౌ॥ 1-4)

ఆ వానరులు, భల్లూకములు సహజముగా శౌర్య పరాక్రమములకు నిధులు, మహా సమర వీరులు, పైగా వారికి నాయకుడు శ్రీరామచంద్రప్రభువు. రావణా! వారితో తలపడినచో కోట్ల కొలది యములుగూడ పరాజితులు కావలసినదే. (దో॥ 55)

శ్రీరామచంద్రునితేజోబలపరాక్రమములు అసమానములు, బుద్ధి వైభవములు అద్భుతములు- వాటిని సహస్రముఖములుగల శేషుడు గూడ వర్ణింపజాలడు. ఒక్క బాణము తోడనే అతడు వందల కొలది సముద్రములను నిర్జలములుగా జేయగలడు. ఐనను నీతికుశలుడైన శ్రీరాముడు మీ సోదరుని ఉపాయమునడిగెను. విభీషణునిసూచన మేఱకు ఆయన దారియిమ్మని సముద్రుని ప్రార్థించుచున్నాడు. ఏలనన రాముడు దయాళువు. (కావున సముద్రుని దండించుటకు పూనుకొనలేదు) దూత పలికిన ఈ మాటలను విని, రావణుడు పరిహసించుచు బిగ్గరగా నవ్వుచూ పలికెను. "ఇంతటి బుద్ధిహీనుడగుటచేతనే అతడు వానరులను తనకు సహాయకులుగా చేసికొనెను. సహజముగా పిఱికివాడు. కావుననే విభీషణుని మాటలను విశ్వసించి, అతడు బాలునివలె సముద్రుని వేడుకొనుచున్నాడు. ఓరీ! మూర్ఖుడా! అతని గొప్పదనమునుగూర్చి ఊరక తెగపొగడుచున్నావేల? చాలుచాలు. అతనిశక్తిబలముల స్థాయి ఎట్టిదో ఇప్పుడు నాకు తెలిసినది. విభీషణుని వంటి భీరువు అతనికి సలహాలను ఇచ్చెడి వాడైనప్పుడు విజయవైభవములు ఎట్లు ప్రాప్తించును?" దుష్ట రావణుని మాటలు వినగానే దూతకు కోపము అధికమయ్యెను. ఇదే సరియైన సమయమని భావించి, అతడు లక్ష్మణుడిచ్చిన లేఖను రావణునకు ఇచ్చుచు, "శ్రీరాముని సోదరుడు లక్ష్మణుడు మీకొఱకై ఈ పత్రమును ఇచ్చినాడు. ప్రభూ! దీనిని చదివినచో మీ మనస్సు శాంతించును." అని పలికెను. మూర్ఖుడైన రావణుడు నవ్వి, దానిని ఎడమచేతితో తీసుకొని, 'చదువుము' అని మంత్రికి ఇచ్చెను. (చౌ॥ 1-5)

(అతడు చదివెను) "ఓరీ! శఠుడా! కేవలము బీరములతోడనే నీ మనస్సును సంతృప్తి పఱచుకొనుచు, నీవంశనాశనమును కొనితెచ్చుకొనవలదు. శ్రీరామునితో వైరమును పెంచుకొని, నీవు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను శరణుజొచ్చినను వారెవ్వరును నిన్ను రక్షింపజాలరు. అభిమానమును వీడి, నీ సోదరుడైన విభీషణునివలె ప్రభుచరణకమలములకు భ్రమరము కమ్ము. లేనిచో దుష్టుడా! నీవు సపరివారముగా శ్రీరాముని బాణాగ్నికి శలభమయ్యెదవు." (దో॥ 56. క,ఖ)

లక్ష్మణునిలేఖాంశములను విని, రావణునిమనస్సులో భయాందోళనలు కల్గెను. కాని పైకి నవ్వుచు అందఱును వినునట్లు పలికెను. "నేలపైబడినవ్యక్తి ఆకసమునందుకొనుటకు ప్రయత్నించునట్లు ఈ లఘుతాపసి తనవాచాలతను

చాటుకొనినాడు" అపుడు శుకుడు(దూత) పలికెను. "ప్రభూ! మీ అభిమానమునువీడి లక్ష్మణునిమాటలను సత్యములుగా తలంపుడు. క్రోధమును త్యజించి నా పలుకులను వినుడు. శ్రీరామునితో విరోధము మానుడు. అతడు సమస్త లోకములకు అధిపతియైనను శ్రీ రఘువీరుని స్వభావము మిక్కిలి కోమలము మీరు ఆయన కడకు వెళ్లినంతనే ఆ ప్రభువు మీపై కృప జూపును. మీ అపరాధములలో ఏ ఒక్కదానినిగూడ ఆయన తనమనస్సులో తలపడు. జానకీదేవిని శ్రీ రఘునాథునకు అప్పగింపుడు. ప్రభూ! నా ఈ విన్నపమును ఆలకింపుడు." ఇట్లు పలికిన ఆ దూతను దుష్ట రావణుడు కాలితో ఒక్క తన్ను తన్నెను. విభీషణునివలె ఆతడును రావణునకు ఒక్క దండముపెట్టి 'మహాప్రసాదము' అనుచూ కరుణాళువువైన శ్రీరాముని యొద్దకు వెళ్లి, ప్రణమిల్లి, అతడు తన కథను వినిపించెను. ప్రభుకృపవలన అతనికి నిజస్వరూపము (మునిరూపము) ప్రాప్తించెను. (శంకరుడు పలుకుచున్నాడు) భవానీ! ఆ శుకుడు మొదట జ్ఞానియైన ఒక ముని. అగస్త్యుని శాపమున రాక్షసుడయ్యెను. ఇట్లు మునిరూపము లభించుటచే శ్రీరాముని చరణకమలములకు మాటి మాటికిని నమస్కరించి, తన ఆశ్రమమునకు వెళ్లెను. (చౌ॥ 1-6)

# సముద్రుని విన్నపము

మూడు దినములు గడిచినప్పటికిని జడుడైన సముద్రుడు ప్రభుప్రార్థనకు స్పందింపలేదు. అప్పుడు శ్రీరాముడు కినుకవహించి ఇట్లనెను. సామోపాయముతో ఈతడు దారికిరాడు. భయపెట్టనిదే మాటవినడు. (దో॥ 57)

లక్ష్మణా! నా ధనుర్బాణములను తెమ్ము. అగ్ని బాణమును ప్రయోగించి, ఈ సముద్రము ఎండిపోవునట్లు చేసెదను. మూర్ఖునకు విన్నవించుటయు, కుటిలుని యెడ ప్రీతి కనబఱచుటయు, సహజలోభికి ఔదార్యమునుగూర్చి ఉపదేశించుటయు, మమతాసక్తునకు జ్ఞానబోధ చేయుటయు, అత్యాశాపరునకు వైరాగ్యమునుగూర్చి వర్ణించి చెప్పుటయు, ముక్కోపికి మనోనిగ్రహమును గుఱించి నూరిపోయుటయు, కాముకునకు శ్రీహరికథలను వినిపించుటయు- ఊసర క్షేత్రమున విత్తనములు చల్లినట్లు నిష్ఫలములగును." ఈవిధముగా పలికిన శ్రీ రఘువీరుడు తన ధనువును ఎక్కు పెట్టెను. శ్రీరాముని చర్య లక్ష్మణునకు ఎంతయు ప్రీతి కరమయ్యెను. ప్రభువు భయానకమైన అగ్నిబాణమును సంధించెను. సముద్రుని హృదయమున అగ్నిజ్వాలలు చెలరేగెను. అగ్ని బాణముచే మంటలు ప్రజ్వరిల్లినసముద్రమునందలి మొసళ్ళు, సర్పములు, చేపలు క్షోభకు లోనయ్యెను. జలచరములన్నియును మంటలలో మాడిపోవు చుండుట చూచి, సముద్రుడు బంగరు పళ్లెములో మణులను నింపుకొని, అభిమానమును వీడి, బ్రాహ్మణ వేషముతో వచ్చెను. (చౌ॥ 1-4)

కాకభుశుండి పలుకుచున్నాడు. గరుడా! కదళీ వృక్షమును ఎన్నెన్ని శ్రమలకోర్చి నీరు పోసి పెంచినను, కోసినప్పుడే ఆది ఫలములనిచ్చును. అట్లే నీచుడు వినయపూర్వకప్రార్థనలకంటెను, భయపెట్టినప్పుడే మాటవినును. (దో॥ 58)

సముద్రుడు భయముతో వణకుచు ప్రభుపాదములను పట్టుకొని వేడుకొనెను. "నాథా! నా అపరాధములను మన్నింపుడు. ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి- ఇవియన్నియును సహజముగా జడములు. నీ ప్రేరణచే మాయ వీటినన్నింటిని సృష్టించినదని. ప్రామాణిక గ్రంథములు పేర్కొను చున్నవి. ప్రభునాజ్ఞను పాలించుటచే సుఖశాంతులు సమకూరును. నాకు ఈ శిక్షనిచ్చి, ప్రభువు మేలే చేసెను. కానీ జీవులస్వభావమును, పరిమితులను

ఏర్పటిచినది మీరేగదా అనుచూ ఇంకనూ సముద్రుడు పల్కెను! డోలు, అనాగరికుడు, శూద్రుడు, పశువు, స్త్రీ వీరందఱును శిక్షార్హులు. ప్రభు ప్రతాపము చేత నేను శుష్కించెదను. ఈ సైన్యము ఆవలి తీరము చేరగలదు. కాని దీని వలన నాఔన్నత్యము ప్రకటితము కాదు. (నాకు మర్యాద (పరిమితి) యుండదు) మీ ఆజ్ఞ 'అనుల్లంఘనీయము' అని వేదములు తెలుపుచున్నవి. కావున మీకు ఉచితమైన దానిని నేను చేయగలను. (చౌ॥ 1-4)

సముద్రుని వినమ్రవాక్యములను విని, కృపాళువు ఐన శ్రీరామచంద్రుడు చిఱునవ్వుతో పలికెను. "నాయనా! ఈ వానర సైన్యము ఆవలి తీరమును చేరుటకు ఉపాయమును తెల్పుము"- (దో॥ 59)

(సముద్రుడు ప్రత్యుత్తరమిచ్చెను. "దేవా! నీలుడు, నలుడు-అను వానరసోదరుల్దిఱికిని బాల్యమున ఒక మహర్షి 'వరము' నిచ్చెను. వారు తాకిన గొప్ప గొప్ప శైలములు గూడ మీ మహిమ వలన సముద్రముపై తేలియాడును. ప్రభు మహత్త్వమును నేను హృదయమున పదిల పఱచుకొని, నా శక్తికొలది సహాయపడుదును. ప్రభూ! ముల్లోకములలో మీ కీర్తిని అందఱూ గానము చేయునట్లు సముద్రముపై 'వారధి'ని నిర్మింపుడు. ఆ బాణముచే నా ఉత్తరతీరమున గల ('ద్రుమకుల్యము' అను స్థానమున నివసించు అభీరులు-అను) పాపాత్ములను రూపుమాపుడు" కృపాళువు, రణధీరుడును ఐన శ్రీరాముడు సముద్రుని వినతిని ఆలకించి, అతనిని బాధావిముక్తుని గావించెను. శ్రీరామచంద్రునిబలపరాక్రమములకు సముద్రుడు పొంగి పోయెను. ఆ దుష్టుల (ద్రుమకుల్య వాసుల) చరిత్రను ప్రభువునకు వివరించెను.) (1)

సముద్రమునకు ఉత్తరతీరమున 'ద్రుమకుల్య' అను పవిత్ర ప్రసిద్ధ స్థానము గలదు. అచ్చట ఆ భీరజాతివారు నివసించుచుందురు. వారు ఉగ్రదర్శనులు, ఉగ్రకర్ములు, మిక్కిలి పాపాత్ములు. వారు సముద్ర జలములను త్రాగుచుందురు. వారి సంస్పర్శను సముద్రుడు సహింపలేకుండెను. సముద్రునికోరికమేరకు శ్రీరాముడు తనబాణమును వారిపై ప్రయోగించి, ఆ పాపాత్ములను హతమార్చెను. పిమ్మట శ్రీరాముని అనుగ్రహమువలన ఆ ప్రదేశమంతయును పుష్ప ఫలభరితమై 'మరుకాంతారము' అను పేర ప్రసిద్ధి వహించెను.

శ్రీరామునకు పాదాభివందన మొనర్చి, సముద్రుడు వెళ్లి పోయెను. (చౌ॥ 1-4)

---

ఉత్తరేణావకాశోస్తి కశ్చిత్ పుణ్యతమోమమ ।
'ద్రుమకుల్య' ఇతిఖ్యాతో లోకే ఖ్యాతో యథా భవాన్॥
ఉగ్రదర్శన కర్మాణో బహవస్తత్ర దస్యవః
ఆభీర ప్రముఖాః పాపాః పిబన్తి సలిలం మమ॥
తై స్తుసంస్పర్శనం పాపైః, న సహే పాప కర్మభిః
అమోఘః క్రియతాం రామ తత్ర తేషు శరోత్తమః॥
శ్రీమద్రామాయణము యుద్ధ- సర్గ 22
శ్లోక - 31,32,33 ॥

సముద్రుడు తన భవనమునకు వెళ్లెను. శ్రీరఘునాథునకు ఆతని సూచన నచ్చెను. కలియుగ పాపములను దూరమొనర్చు ఈ కథను తులసీదాసు తన బుద్ధిననుసరించి, గానము జేసెను. శ్రీ రఘునాథుని గుణగణములు సుఖధామములు. అవి సందేహములను తొలగించును. విషాదములను రూపుమాపును. ఓ మూఢమనసా! నీవు సాంసారికములైన ఆశలను, విశ్వాసములను వీడి, నిరంతరము భగవంతుని గుణములశ్రవణకీర్తనములయందే నిమగ్నమగుము. (ఛం)

శ్రీ రఘునాథుని గుణగానమే సర్వశుభప్రదాయకము. ఆదరానురాగములతో చేయబడు దీని శ్రవణమే అగాధభవసాగరమును దాటించు నౌక. (దో॥ 60)

(మాస పారాయణము-ఇరువది నాల్గవ విరామము)
కలియుగమునందలి సమస్త పాపములను నశింపజేయు
శ్రీరామచరితమానసమునందలి పంచమ సోపానము సమాప్తము

- సుందరకాండము సమాప్తము -




సేతు బంధనము